ద్రావిడి

PRASAARAANGA

PRASARANGA

ద్రావిడ విశ్వవిద్యాలయం

శ్రీనివాసవనం, కుప్పం - 517 426

ద్రావిడి

సంపుటి - 5

జూలై-డిసెంబర్ 2025

సంచిక-1

ISSN: 2319-3905

ద్రావిడి

(Peer Reviewed Journal)

అర్ధవార్షిక తెలుగు పరిశోధన పత్రిక

సంపుటి - 5 | జూలై - డిసెంబర్ 2025 | సంచిక-1

i/c

గౌరవ సంపాదకులు

ఆచార్య ఎం.దొరస్వామి, ఉపాధ్యక్షులు

సంపాదకులు

ఆచార్య డి.వి.శ్రవణ్ కుమార్, సంచాలకులు, ప్రచురణలు

ద్రావిడ విశ్వవిద్యాలయం

ద్రావిడి

(Peer Reviewed Journal)

(అర్ధవార్షిక తెలుగు పరిశోధన పత్రిక)

సంపుటి - 5 **జూలై-డిసెంబర్ 2025** **సంచిక - 1**

గౌరవ సంపాదకులు

ఆచార్య యం.దొరస్వామి, *ఉపాధ్యక్షులు* i/c

సంపాదకులు

ఆచార్య డి.వి.శ్రవణ్ కుమార్

సంచాలకులు, ప్రచురణలు

సంపాదక మండలి సభ్యులు

ఆచార్య కె.శ్రీదేవి, *ద్రా.వి.వి.*

ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, *హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం.*

ఆచార్య విస్తాలి శంకరరావు, *మద్రాసు విశ్వవిద్యాలయం.*

డా.డి.ఉదయ కుమారి, *ద్రా.వి.వి.*

డా.వి.పళని, *ద్రా.వి.వి.*

డా.యం.హరికృష్ణ, *ద్రా.వి.వి.*

ద్రావిడ విశ్వవిద్యాలయం

శ్రీనివాసవనం, కుప్పం - 517 426

Dravidi (Peer Reviewed Journal)
HALF-YEARLY RESEARCH JOURNEL IN TELUGU
July - December 2025, Vol.V, Issue No.1

© Dravidian University

Editorial Board

Editor

Prof. D.V.Sravan Kumar

Members

Porf. K.Sridevi
Prof. Darla Venkateswara Rao
Prof. Vistali Shankara Rao
Dr. D.Udaya Kumari
Dr. V.Palani
Dr. M.Harikrishna

Published by
Director
Department of Publications
Dravidian University
Kuppam - 517 426

For Copies
The Registrar
Dravidian University
Srinivasavanam
Kuppam – 517 426

ISSN No.2319-3905

Printed at
Omkar Offset Printers
No.3/3, 1st Main Road, New Tharagupet, Bangalore - 560 002

సందేశం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం త్రిభాషా ప్రాంతమైన కుప్పంలో 1997వ సంవత్సరం ద్రావిడ విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పింది. ద్రావిడ విశ్వవిద్యాలయం భావసమైక్యతను సాధించడానికి ఎంతగానో కృషి చేస్తోంది. ప్రచురణలు విభాగం (ప్రసారాంగ) ఐదు ప్రధాన దాక్షిణాత్య భాషలతో పాటు ఆంగ్ల భాషలో సైతం రచనల్ని వెలువరించింది. ఏ విశ్వవిద్యాలయమూ ఇన్ని భాషల్లో ప్రచురణల్ని చేపట్టిన దాఖలా లేదు. స్వతంత్ర గ్రంథాలతో పాటు అనువాదాలను, నిఘంటువులను పరిశోధనా గ్రంథాలను, భాషాశాస్త్ర గ్రంథాలను ప్రసారాంగ ప్రచురించింది. వీటితో పాటు "ద్రావిడి" వెలువడుతూ వుండడం ఎంతైనా ముదావహం.

"ద్రావిడి" పత్రిక తెలుగు సాహిత్యాభిమానులకు ఒకవరం. సాహిత్యప్రియుల విజ్ఞానకాంక్షకు సమాధానం. పరిశోధకులు ఉన్నత ప్రమాణాలతో కూడిన వ్యాసాలను ప్రచురించడానికి ద్రావిడి పత్రిక వేదికగా అలరారుతున్నది. ఈ విషయాన్ని గుర్తించిన నేపథ్యంగా వచ్చిన "ద్రావిడి" పత్రిక పాఠకులను అలరిస్తుందనేది అక్షరసత్యం.

"ద్రావిడి" అర్ధవార్షిక తెలుగు పరిశోధన పత్రికను ఆదరించి, ఉత్తమ పరిశోధనా పత్రాలను పంపి, సాహిత్యాభిమానులు పత్రిక ప్రామాణికతను ద్విగుణీకృతం చేయగలరని విశ్వసిస్తున్నాను.

ఆచార్య ఎం.దొరస్వామి
ఉపాధ్యక్షులు i/c

సంపాదకీయం

ద్రావిడ భాషల అధ్యయనం, ద్రావిడ సంస్కృతిని గూర్చిన పరిశోధన, ఆ భాషల్లోని విశిష్ట సాహిత్య పరిశీలన ధ్యేయంగా ద్రావిడ విశ్వవిద్యాలయం ఏర్పడింది. విశ్వవిద్యాలయాలు చేపట్టవలసిన మూడు బాధ్యతలు బోధన, పరిశోధన, ప్రచురణ. ఈ మూడింటి వల్ల జ్ఞాన ప్రసారం సుగమమవుతుంది. ద్రావిడ విశ్వవిద్యాలయం ఈ మూడింటినీ నిర్వహిస్తోంది. ముఖ్యంగా ప్రచురణల విభాగం ఏ విశ్వవిద్యాలయమూ చేపట్టని విధంగా ఆరు భాషలలో గ్రంథాలను ప్రచురిస్తోంది. ఇలా ప్రధాన ద్రావిడ భాషలలో, ఆంగ్లంలో పుస్తక ప్రచురణ చేస్తున్న మరో విశ్వవిద్యాలయం ఏదీ లేదు. అదేవిధంగా తెలుగులో 'ద్రావిడి' పరిశోధనా పత్రికను తీసుకువస్తోంది.

ప్రస్తుతం పరిశోధనకు సంబంధించిన కొత్త విషయాలను చెప్పాలంటే సరైన వేదికగా 'ద్రావిడి' నిలుస్తోంది. వేలమంది తెలుగులో పరిశోధనలు జరుపుతున్నా ఉన్నత ప్రమాణాలను అనుసరించటం లేదనే ఆరోపణ ఉంది. పరిశోధన చెయ్యాల్సిన విషయాలకు కొదువ లేదు. కాని కష్టపడకుండా పరిశోధన పట్టం పుచ్చుకోవాలనే తపన పరిశోధకులలో ఎక్కువవుతూ ఉంది. అలా కాకుండా తెలుగులో ఉత్తమ పరిశోధనకు ఆకరంగా వ్యవహరించాలని, ద్రావిడ భాషల తులనాత్మక పరిశీలనకు ఒక వేదిక కావాలని ఈ పత్రికను తీసుకురావడం జరుగుతోంది.

'ద్రావిడి'ని నిరంతరాయంగా తీసుకురావటానికి కారకులైన ప్రస్తుత ఉపాధ్యక్షులు (ఇంఛార్జి) ఆచార్య ఎం.దొరస్వామి గారికి, రిజిస్ట్రారు (ఇంఛార్జి) ఆచార్య వి.కిరణ్ కుమార్ గారికి ధన్యవాదాలు. ఈ సంచికలో మంచి పరిశోధనాత్మక వ్యాసాలు వున్నాయి. సంపాదక మండలి సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ ముద్రణా బాధ్యతలో పాలుపంచుకున్న ప్రసారాంగ బోధన, బోధనేతర ఉద్యోగులందరికీ కృతజ్ఞతలు.

ఈ మా ప్రయత్నాన్ని హర్షించి పరిశోధకులు ఉత్తమ వ్యాసాలను ప్రచురణకు పంపి 'ద్రావిడి' పత్రికను నిరంతరాయంగా తీసుకురావడంలో సహకారం అందిస్తారని ఆశిస్తున్నాను.

ఆచార్య డి.వి.శ్రవణ్ కుమార్
సంపాదకులు

విషయ సూచిక

సందేశం iiii

సంపాదకీయం v

1. సన్నపురెడ్డిగారి "ఒంటరి" నవల: పర్యావరణ స్పృహ 01
– ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

2. తెలుగు భాష పరివ్యాప్తి – పరిరక్షణ 13
– డా. ఎన్. ఈశ్వర రెడ్డి

3. తెలుగు – కన్నడ రామాయణ తులనాత్మక సమీక్ష 22
– ఆచార్య డి.వి.శ్రవణ్‌కుమార్

4. గజ్జెల మల్లారెడ్డి కవిత్వం – సామాజికత 33
– ఆచార్య పి.సి.వెంకటేశ్వర్లు

5. మారిషస్ దేశంలో తెలుగు భాషా సంస్కృతుల వికాసానికి కృషి చేస్తున్న సంస్థలు 40
– డా. శ్రీమతి రాజ్వంతి దాలయ్య

6. ఆత్మగౌరవ ప్రతీకకు పునాది – నెమలికన్నులు 47
–ఆచార్య త్రివేణి వంగరి

7. తెలుగు భాషా ప్రయోగ రంగాలు – ఆధునీకరణ 59
– డా.పి.విజయ్ కుమార్

8. తెలుగు భాషా పరిరక్షణ ఉద్యమం – కార్యాచరణ 67
– డా.వి.గోపాల్

9. రైతు కష్టాలను కళ్ళ ముందు పరిచిన సింగమనేని నారాయణ 'ఒక పయనం' కథ 71
– డా.యమ్.ఆదిశేషయ్య

10. దాశరథి శతకము – పరిశీలన 76
– డా॥ తోట వెంకటస్వామి

11. డా. బోయి భీమన్న – గుడిసెలు కాలిపోతున్నై సామాజిక సందేశం 84
–మరపట్ల రాజు

12. నాలుగు దశాబ్దాల రాయలసీమ సాహిత్యం **90**

- ఆచార్య కె.శ్రీదేవి & పి.శివశంకర్

13. సాంప్రదాయిక - ఆధునిక కవితా రూప సమ్మేళనం "మణిపూసలు" **104**

- డా.ఎం.మంజుశ్రీ

14. శ్రీకైవారం యోగినారేయణ తాత మహిమలు **118**

- డా.ఎల్.కస్తూరి

15.రాయలసీమ కథా పరిణామం- పరిశీలన **123**

- డా.ఎం.హరికృష్ణ

రచయితల చిరునామాలు 133

శైలీ పత్రం 134

"ద్రావిడి" పత్రికలో ప్రచురితమవుతున్న వ్యాసాలలోని విషయాలకు, వివరాలకు ఆయా రచయితలే బాధ్యులు. విశ్వవిద్యాలయం బాధ్యత వహించదు.

1

సన్నపురెడ్డిగారి "ఒంటరి" నవల: పర్యావరణ స్పృహ

– ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

1. ఉపోద్ఘాతం

ఆధునిక ప్రపంచంలో మానవుడు సాధించిన సాంకేతిక ప్రగతి, పారిశ్రామికాభివృద్ధి పర్యావరణ సమతుల్యతను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. మనిషి తన మితిమీరిన స్వార్థంతో ప్రకృతిని కేవలం ఒక వనరుగా భావించి 'వికృతి'గా మారుస్తున్న తరుణంలో, తెలుగు సాహిత్యం ఒక సామాజిక ఆయుధంగా మారి పర్యావరణ స్పృహను కలిగిస్తోంది. కేవలం మనుషుల సమస్యల చుట్టూనే కాకుండా, సర్వ జీవరాశుల మనుగడను కాంక్షించే జీవావరణ కేంద్రీకృత దృక్పథం (Ecocentrism) నేడు ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రధాన ఇతివృత్తంగా ఆవిష్కృతమవుతోంది. తెలుగు నవలా ప్రస్థానంలో పర్యావరణ స్పృహ అనేది దశాబ్దాల క్రితమే కనిపిస్తుంది. ఎనభై ఏళ్ల క్రితమే విశ్వనాథ సత్యనారాయణ గారు తన 'వేయిపడగలు' నవలలో 'పసిరిక' పాత్ర ద్వారా ప్రకృతి పవిత్రతను, నాగరికత వల్ల కలిగే వినాశనాన్ని హెచ్చరించారు. ఆ తర్వాత కాలంలో చంద్రలత గారి '*దృశ్యాదృశ్యం*' ఆనకట్టల వల్ల కలిగే జలావరణ విధ్వంసాన్ని ప్రశ్నించగా, సలీమ్ గారి '*గుర్రపు డెక్క*' రోడ్ల విస్తరణ పేరుతో సాగే అడవుల నరికివేతను ఎండగట్టింది. అలాగే, డా. కేశవరెడ్డి గారి '*మూగవాని పిల్లనగ్రోవి*' వర్షాభావం వల్ల రైతు పడే వేదనను, డా. దిలావర్ గారి '*అడవి బతుకులు*' యురేనియం తవ్వకాల వల్ల ఆదివాసీ ప్రాంతాల్లో కలిగే పర్యావరణ నష్టాన్ని శక్తిమంతంగా చిత్రించాయి. కవిత్వం, కథలు, నవలల్లో కూడా ఇలాంటి పర్యావరణ పరిరక్షణ ప్రేరిత రచనలు వస్తున్నాయి.

ఈ పరంపరలో సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి గారి '*ఒంటరి*' నవల అత్యంత విశిష్టమైనది. ఇది కేవలం ఒక వ్యక్తి ఆరోగ్య అన్వేషణ మాత్రమే కాదు, అంతరించిపోతున్న దేశీ విత్తనాల (అరికెలు) పునరుద్ధరణ ద్వారా ప్రకృతితో మమేకమైన తాత్త్విక జీవనవిధానాన్ని ప్రబోధిస్తుంది. "ప్రకృతిలో మనిషి కూడా ఒక భాగమే" అనే డీప్ ఎకాలజీ (Deep Ecology) సూత్రాన్ని నర్సయ్య వంటి పాత్రల ద్వారా రచయిత సజీవంగా చిత్రించారు. అభివృద్ధి పేరుతో సాగుతున్న

ప్రకృతి విధ్వంసాన్ని, మానవ సంబంధాల క్షీణతను పర్యావరణ క్షీణతతో అనుసంధానిస్తూ సాగిన 'ఒంటరి' నవల, సమకాలీన సాహిత్యంలో పర్యావరణ చైతన్యానికి ఒక గొప్ప దిక్సూచిగా నిలుస్తుంది. ఈ అంశాలను ఈ పత్రంలోచర్చించే ప్రయత్నం చేస్తాను.

1.2. పర్యావరణ స్పృహ - పర్యావరణ కేంద్రిత విమర్శ:

ఇరవై ఒకటో శతాబ్దపు తెలుగు సాహిత్యంలో పర్యావరణ కేంద్రిత విమర్శ (Eco-criticism), మానవ మనుగడ మధ్య ఉన్న అంతర్లీన సంబంధాన్ని శాస్త్రీయంగా విశ్లేషించిన విశిష్ట రచన *'ఒంటరి'.* ఆధునిక పారిశ్రామిక నాగరికత సృష్టించిన జీవనశైలి వ్యాధులు, పర్యావరణ విచ్ఛిన్నతను ఎదుర్కోవడానికి 'ప్రకృతి వైపు మళ్ళడం' (Back to Nature) ఒక్కటే మార్గమని ఈ నవల ప్రతిపాదిస్తుంది. రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి, నర్సయ్య అనే పాత్ర ద్వారా పర్యావరణ హితమైన జీవన తాత్త్వికతను, డాక్టర్ రాఘవ పాత్ర ద్వారా ఆధునిక విద్యావంతుని అంతర్మథనాన్ని ముఖాముఖి నిలబెట్టారు. ఈ నవలలో గ్రామీణ నేపథ్య చిత్రణ ఉన్నా, అది పట్టణీకరణ, నగరీకరణ ప్రభావంతోఅంతరించిపోతున్న గ్రామీణ సంస్కృతినీ, దేశీ విత్తన సంపద (Bio-diversity), సుస్థిర వ్యవసాయం (Sustainable Agriculture), ప్రకృతితో మానవ చైతన్య అనుసంధానత (Quantum Connection) వంటి లోతైన అంశాలను సైద్ధాంతికంగా చర్చిస్తుంది. వృక్షాలను దత్తత తీసుకోవడం, అరికెలు వంటి చిరుధాన్యాల పునరుద్ధరణ వంటి చర్యల ద్వారా పర్యావరణ పరిరక్షణ అనేది ఒక సామాజిక బాధ్యతగా ఈ నవల రూపుదిద్దుకుంది. క్షేత్రస్థాయిలో పల్లెలు ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని పరామర్శిస్తూనే, మనిషి తన మౌలిక అస్తిత్వాన్ని ప్రకృతిలో ఎలా వెతుక్కోవాలో ఈ నవల ఒక క్రియాశీలక మార్గాన్ని సూచిస్తుంది. పర్యావరణ స్పృహను ఒక ఆచరణాత్మక జీవన విధానంగా మలిచిన ఈ రచన, సమకాలీన పర్యావరణ సాహిత్య అన్వేషణలో ఒక మైలురాయిగా నిలుస్తుంది. '

'ఒంటరి' నవల, దేశీ విత్తన సంపద పరిరక్షణను, సుస్థిర జీవనశైలిని ప్రతిపాదించడమే కాకుండా, మానవ మేధస్సు (డాక్టర్ రాఘవ), ప్రకృతి సహజాత జ్ఞానం (నర్సయ్య) కలిసి పనిచేసినప్పుడే పల్లెల పునరుజ్జీవనం, పర్యావరణ సమతుల్యత సాధ్యమని తెలియజేస్తుంది. పర్యావరణ స్పృహ (Environmental Consciousness) అనేది మనిషికి, ప్రకృతికి మధ్య ఉన్న సంబంధాన్ని కేవలం భౌతిక అవసరాల కోణంలో కాకుండా, ఒక నైతిక బాధ్యతగా గుర్తించడంగా చూడాలి. మనిషి ప్రకృతికంటే వేరు కాదని, భూమిపై ఉన్న సమస్త జీవకోటిలో తానూ ఒక భాగమని గుర్తించాలి. ప్రకృతి వనరులను నేటి అవసరాలకు వాడుకుంటూనే, భవిష్యత్ తరాల కోసం వాటిని సంరక్షించాలనే స్పృహ కలిగి ఉండటం, గాలీ నీరు, నేల కలుషితం కాకుండా చూడటం ఒక సామాజిక బాధ్యతగా భావించడం అన్నీ పర్యావరణ స్పృహలో భాగమే. సాహిత్యంలో పర్యావరణ స్పృహ (Ecocriticism)ను సమన్వయించి విశ్లేషించే సాహిత్య విమర్శలో

దీన్ని 'పర్యావరణ కేంద్రిత విమర్శ' (Ecocriticism) అని పిలుస్తారు. సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి గారి *'కొండపొలం'* లేదా *'ఒంటరి'* నవలల్లో చూసినట్లు, ప్రకృతి కేవలం నేపథ్యంగా (Setting) మాత్రమే ఉండదు. అది ఒక సజీవ పాత్రలా, మనిషి ఆలోచనలను ప్రభావితం చేసే శక్తిలా కనిపిస్తుంది. కాబట్టి ప్రకృతిని ఒక పాత్రగా చిత్రించడం పర్యావరణ సాహిత్యంలో భాగమవుతుంది. సాధారణంగా సాహిత్యం మనిషి సమస్యల చుట్టూ తిరుగుతుంది. కానీ పర్యావరణ స్పృహ కలిగిన రచనలు జంతువులు, పక్షులు, చెట్లు, చివరకు అదృశ్యమవుతున్న విత్తనాల (ఉదాహరణకు: *'ఒంటరి'* లోని అరికె విత్తనాలు) సమస్యలను కూడా చర్చిస్తాయి. దీన్ని జీవావరణ కేంద్రిత దృక్పథం (Ecocentrism) అంటారు. సాహిత్యం కేవలం సమాజాన్ని ప్రతిబింబించడమే కాకుండా, ఆ సమాజంలో పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను మనసుపై ఒక బలమైన ముద్రవేస్తూ, అది మనందరి బాధ్యతగా మన గుండెలకు హత్తుకునేలా చేస్తుంది. మనిషి ప్రకృతికి దూరమైతే చివరికి 'ఒంటరి' అయిపోతాడనే సత్యాన్ని మనకు బోధిస్తుంది.

కీలక పదాలు (Keywords)

(పర్యావరణ స్పృహ, సుస్థిర వ్యవసాయం, దేశీ విత్తన పరిరక్షణ, చిరుధాన్యాల పునరుద్ధరణ, పర్యావరణ కేంద్రిత విమర్శ (Eco-criticism), సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి - ఒంటరి నవల.)

1.3. సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డిగారి పరిచయం:

సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి గారు సమకాలీన తెలుగు సాహిత్యంలో గ్రామీణ నేపథ్యం, రైతుల కష్టాలను ఇతివృత్తంగా స్వీకరించిన విశిష్ట రచయిత. 1963లో కడప జిల్లాలోని ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన వీరు, వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైనప్పటికీ, ప్రవృత్తిగా అక్షర సేద్యం చేస్తూ మూడు దశాబ్దాలకు పైగా కథలు, నవలలు, కవితలు రచిస్తున్నారు. వీరి కలం నుండి జారిన *కాడి (1998), పాండవబీడు (2002), పాలెగత్తె (2007), తోలుబొమ్మలాట (2007), చినుకుల సవ్వడి (2007), ఒక్కవాన చాలు (2013), మబ్బులు వాలని నేల (2015), ఒంటరి (2017), కొండపొలం (2019)* వంటి నవలలు ఆటా, తానా, స్వాతి, చతుర వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల నుండి ప్రథమ, ద్వితీయ బహుమతులను అందుకున్నాయి. ముఖ్యంగా వీరి 'కొండపొలం' నవల చలనచిత్రంగా రూపొందడమే కాకుండా *Tiger Lessons* పేరుతో ఆంగ్లంలోకి అనువదించబడి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందింది. వీరి సాహిత్య ప్రస్థానంలో నవలలతో పాటు *కొత్త దుప్పటి, బతుకు సేద్యం* వంటి కథా సంపుటులు, *బడి* అనే కవితా సంపుటి ప్రధానమైనవి. పల్లె ప్రజల జీవన పోరాటాన్ని, మట్టి వాసనను తన రచనల్లో ప్రతిబింబించే సన్నపురెడ్డి గారు, తన రచనల్లో ప్రాంతీయ భాషా సౌందర్యాన్ని కాపాడుతూనే విశ్వజనీనమైన ఇతివృత్తాలను స్వీకరించారు. ఒంటరి నవలకు తానా పురస్కారం రావడంతో ఈ నవలపై ఎంతోమంది చర్చలు చేశారు.

1.4. ఒంటరి నవల నేపథ్యం, పర్యావరణ సంక్షోభం:

ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు పర్యావరణ సంక్షోభం. ఇది కేవలం కాలుష్యానికే పరిమితం కాకుండా, మనిషి అంతర్గత ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతోంది. నవలలోని డాక్టర్ రాఘవ పాత్ర ఈ సంక్షోభానికి ఒక ప్రతీక. నగర జీవితం, విపరీతమైన పని ఒత్తిడి, కృత్రిమ ఆహారం వల్ల కలిగే అనారోగ్యం. మనిషి తన మూలాల నుండి వేరుపడటాన్ని (Alienation from Nature) సూచిస్తాయి. ఈ నేపథ్యం నుండే నవల పర్యావరణ పునరుద్ధరణ వైపు అడుగులు వేస్తుంది. ఆధునిక కాలంలో అనేక రోగాలకు మందులు కారణమవుతుంటే, వాటిని తగ్గించుకునే విధానాలు పకృతిలోనే ఉన్నాయని నిరూపించేదిశగా ఈ నవలా రచన కొనసాగింది.

1.5. పరిశోధన పద్ధతి:

ఈ పరిశోధన వ్యాసం ప్రధానంగా గుణాత్మక పరిశోధన పద్ధతిని (Qualitative Research Method) అనుసరిస్తుంది. ఇందులో సాహిత్యానికి, భౌతిక పర్యావరణానికి మధ్య గల సంబంధాన్ని విశ్లేషించే 'పర్యావరణ కేంద్రిత విమర్శ' (Eco-critical Approach) ప్రధాన భూమిక పోషిస్తుంది. నవలలోని నర్సయ్య, రాఘవ పాత్రల ప్రవర్తనను, వారి సంభాషణలను విశ్లేషణాత్మక పద్ధతిలో (Analytical Method) పరిశీలిస్తూ, సంప్రదాయ వ్యవసాయ జ్ఞానాన్ని ఆధునిక 'క్వాంటమ్ లివింగ్' సిద్ధాంతాలతో సమన్వయం చేయడం జరుగుతుంది. కేవలం పాఠ్య ఆధారిత విశ్లేషణకే (Textual Analysis) పరిమితం కాకుండా, సామాజిక-సాంస్కృతిక అధ్యయనం ద్వారా పల్లెల విచ్ఛిన్నతను, దేశీ విత్తన సంపద ప్రాముఖ్యతను ఈ పద్ధతి శాస్త్రీయంగా నిరూపించేప్రయత్నం చేస్తుంది.

1.6. ఒంటరి నవల సారాంశం:

సున్నపురెడ్డి వెంకటరామిరెడ్డి గారి 'ఒంటరి' నవల ప్రధానంగా ఆధునిక యాంత్రిక జీవనశైలికి, ప్రకృతితో ముడిపడిన గ్రామీణ జీవన తత్వానికి మధ్య ఉన్న అంతరాన్ని ఆవిష్కరిస్తుంది. వృత్తిరీత్యా అత్యంత విజయవంతమైన హృద్రోగ నిపుణుడు డాక్టర్ రాఘవ, పేరును, సంపదను ఆర్జించినప్పటికీ.. ఆ క్రమంలో తన ఆరోగ్యాన్ని, మానసిక ప్రశాంతతను కోల్పోతాడు. మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులతో సతమతమవుతున్న తరుణంలో, ఆధ్యాత్మిక అన్వేషణలో భాగంగా కొందరు సాధువులను కలుస్తాడు. ప్రకృతితో సహజీవనం చేయడం, అరికెలు వంటి చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం ద్వారానే ఆరోగ్యం సిద్ధిస్తుందని వారు సూచిస్తారు. ఈ అన్వేషణ డాక్టర్ రాఘవను నర్సయ్య అనే ఒక తాత్త్విక రైతు వద్దకు చేరుస్తుంది. నర్సయ్య కేవలం వ్యవసాయదారుడు మాత్రమే కాదు, రామాయణ పరమార్థాన్ని ఔపోసన పట్టిన జ్ఞాని. అంతరించిపోతున్న అరికె విత్తనాలను తన ఇంట్లోని సొరకాయ బుర్రలో భద్రపరిచిన నర్సయ్య, ప్రకృతి పట్ల అపారమైన

గౌరవం కలవాడు. రాఘవ తన అనారోగ్యాన్ని నయం చేసుకునేందుకు నర్సయ్య పొలంలోనే ఒక చిన్న గుడిసె వేసుకుని, ఆ రైతు కుటుంబంతో కలిసి ఆరు నెలల పాటు గడపాలని నిర్ణయించుకుంటాడు. నర్సయ్య కుటుంబంలో భార్య ఓబులమ్మ, విడాకులు తీసుకుని పుట్టింటికి చేరిన కూతురు రాములమ్మ, పడకకే పరిమితమైన వృద్ధురాలు ఉంటారు. అక్కడ గడిపే సమయంలో రాఘవ కేవలం శారీరక ఆరోగ్యాన్నే కాక, జీవన సత్యాన్ని కూడా గ్రహిస్తాడు. గొర్రెలు పంటను మేసినప్పుడు నర్సయ్య వాటిని నిందించక, కరువును నిందించడం అతని సహజాత తాత్త్వికతకు నిదర్శనం.

నాగరికత పేరుతో గ్రామంలోని పురాతన వృక్షాలను నరికివేయాలని చూస్తున్న యువతను అడ్డుకుని, రాఘవ ఆ చెట్లను దత్తత తీసుకోవడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వామి అవుతాడు. తన వైద్య పరిజ్ఞానంతో గ్రామస్తులకు సేవలందిస్తూ, ఆధునిక వైద్యానికి, గ్రామీణ అవసరాలకు మధ్య వారధిగా నిలుస్తాడు. పంట చేతికి వచ్చిన తరుణంలో, తనను కోరుకోమన్న రాఘవతో నర్సయ్య తనకు కేవలం 'రంగనాథ రామాయణం' గ్రంథం కావాలని అడగడం అతని నిరాడంబరతను చాటుతుంది. రాములమ్మతో ఏర్పడిన ఆత్మీయ అనుబంధం, ఆ వాతావరణంతో పెనవేసుకున్న మమకారం రాఘవను తిరిగి నగరానికి వెళ్లనీయకుండా చేస్తాయి. చివరికి రాములమ్మ సూచన మేరకు, ఆ సాధువును కూడా అక్కడికే ఆహ్వానించి, ఆ పల్లెలోనే ఒక ఆసుపత్రిని నిర్మించి గ్రామస్తులకు సేవ చేయాలని రాఘవ నిశ్చయించుకుంటాడు. కెరీర్, వేగం, డబ్బు వెనుక పరుగులు తీస్తూ మనిషి తన మౌలిక అస్తిత్వాన్ని కోల్పోతున్నాడని ఈ కథ హెచ్చరిస్తుంది. నగరాల్లో స్థిరపడిన విద్యావంతులు, ధనవంతులు తిరిగి పల్లెలకు చేరుకుని, శిథిలావస్థలో ఉన్న గ్రామీణ వ్యవస్థలను, ప్రకృతిని కాపాడాలనే ఉన్నతమైన సందేశంతో ఈ నవల ముగుస్తుంది. సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డిగారి ఈ నవలలో పర్యావరణ స్పృహను (Environmental Consciousness) జీవన విధానంగా మలిచిన తీరు అద్భుతం. నవలలోని ఈ కథలో పర్యావరణ అంశాలను సైద్ధాంతిక కోణంలో విశ్లేషిస్తే మనకు కొన్ని కీలకమైన అంశాలు గోచరిస్తాయి.

1.7. జీవావరణ కేంద్రీకృత దృక్పథం (Ecocentrism):

సాధారణంగా మనిషి తన అవసరాల కోసమే ప్రకృతిని వాడుకోవాలనుకుంటాడు. దీన్ని Anthropocentrism అంటారు. కానీ, ఈ నవలలో నర్సయ్య పాత్ర 'జీవావరణ కేంద్రీకృత' (Ecocentrism) దృక్పథాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రకృతిలోని ప్రతి జీవికి, వస్తువుకు స్వతహాగా విలువ ఉంటుందని నమ్మే ఉన్నతమైన తాత్త్వికత ను జీవావరణ కేంద్రీకృత వాదం (Ecocentrism) అంటారు. అంతరించిపోతున్న అరికె విత్తనాలను రక్షించడం, అది 'జీవ వైవిధ్య' (Biodiversity) పరిరక్షణలో భాగం. సొరకాయ బుర్రలో విత్తనాలను దాచడం అనేది ఒక విత్తన భాండాగారంగా

(Seed Bank) పనిచేసి, సంప్రదాయ వ్యవసాయ జ్ఞానాన్ని తరతరాలకు అందించే వంతెనగా కనిపిస్తుంది.

1.7.1. ప్రకృతితో సహజీవనం (Deep Ecology):

ప్రకృతిలో మనిషి కూడా ఒక భాగమేనని, ప్రకృతి రక్షణ కోసం మనిషి జీవనశైలిలో సమూలమైన మార్పులు రావాలని కోరుకునే సిద్ధాంతం 'లోతైన జీవావరణ శాస్త్రం (Deep Ecology) అంటారు. రాఘవ నగరాన్ని వదిలి పల్లెకు రావడం, నర్సయ్య వేసిన గుడిసెలో నివసించడం 'డీప్ ఎకాలజీ' సిద్ధాంతాన్ని గుర్తుచేస్తుంది. మధుమేహం, ఇతర వ్యాధులతో సతమతమయ్యే రాఘవకు ప్రకృతి ఒక ఔషధంగా మారుతుంది. ఇక్కడ ప్రకృతి కేవలం వనరుగా మాత్రమే కాకుండా ఒక వైద్యుడుగా ఉపయోగించుకోవచ్చునని తెలుస్తుంది. నర్సయ్య రామాయణాన్ని, వ్యవసాయాన్ని విడదీసి చూడడు. ప్రకృతిలోని క్రమశిక్షణను, సహనాన్ని అతను ధర్మంగా భావిస్తాడు. ఈ నవలకు ముందుమాట రాసిన ప్రసిద్ధ పర్యావరణ శాస్త్రవేత్త, రచయిత డా. తల్లావజల పతంజలిశాస్త్రిగారు కూడా ఇదే విషయాన్నిలా వ్యాఖ్యానించారు. "*ప్రధానమైన ప్రాచీన నాగరికతా సంస్కృతులన్నీ వ్యావసాయిక సంస్కృతులే. వ్యవసాయపు మిగులు సంపద వల్ల సంస్కృతి ఏర్పడింది. మనిషి నిర్మించు కున్న అద్భుతమైన జీవావరణ వ్యవస్థ వ్యవసాయం. భూమినీ, పంటల్నీ, చెట్లనీ, వాటిని కాపాడే సమస్త ప్రాకృతిక శక్తుల్ని మన పూర్వజులు సవినయంగా దైవీకరించుకున్నారు. భారతీయులు భూమి తన యాజమాన్యం కింద ఉందని భావించలేదు. ఈ సృష్టికి మనిషి కేంద్రబిందువని భావించ లేదు. సమస్త ప్రాణికోటిలో మనిషి కూడా ఒకటని విశ్వసించారు.*" ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న పరిస్థితి ఇదే.

1.7.3. పర్యావరణ పరిరక్షణ – నైతిక బాధ్యత:

నవల కథలో చెట్లు నరికివేసే సందర్భం పర్యావరణ విలువల ఘర్షణను చూపిస్తుంది. గ్రామ యువత చెట్లను కేవలం కట్టెలుగా (డబ్బుగా) చూస్తే, నర్సయ్య వాటిని ప్రాణవాయువు ఇచ్చే దేవతలుగా చూస్తాడు. రాఘవ ఆ చెట్లను దత్తత తీసుకోవడం ద్వారా పర్యావరణానికి ఒక 'డిజిటల్ కన్జర్వేషన్' (Digital Conservation) గుర్తింపును కల్పిస్తాడు. డిజిటల్ కన్జర్వేషన్ అనేది పర్యావరణ పరిరక్షణలో అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించే ఒక వినూత్న విధానం. ప్రకృతిని, వన్యప్రాణులను కాపాడటానికి డిజిటల్ పరికరాలు మరియు డేటా అనలిటిక్స్ ఎలా సహాయపడతాయో ఈ ప్రక్రియ వివరిస్తుంది. ఫేస్‌బుక్ ద్వారా ప్రచారం చేయడం ద్వారా పర్యావరణ స్పృహను సామాజిక బాధ్యతగా మారుస్తాడు. రాఘవ అనే డాక్టర్ పాత్ర తన వద్ద ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఫోటోగ్రఫీని ఉపయోగించి చెట్ల గొప్పతనాన్ని లోకానికి చాటుతాడు. నేడు మనం వాడే సోషల్ మీడియా, డిజిటల్ మ్యాపింగ్ కూడా పర్యావరణం పట్ల అవగాహన కల్పించడంలో 'డిజిటల్ కన్జర్వేషన్'లో భాగమే. పైరును గొర్రెలు తినేసినప్పుడు నర్సయ్య వాటిని నిందించకుండా,

ఆ ఆకలిని 'కరువు' రూపంగా చూడటం ఆయనలోని ఉన్నతమైన జీవావరణ కేంద్రీకృత దృక్పథానికి (Ecocentrism) నిదర్శనం. ఆకలి అనేది మనిషికైనా, జంతువుకైనా ఒక్కటేనని, ప్రకృతి వైపరీత్యాల ముందు అందరూ బాధితులేనని రచయిత ఇక్కడ స్పష్టం చేశాడు. ప్రకృతి క్షీణత కేవలం పర్యావరణ సమస్య మాత్రమే కాదు, అది మానవ సంబంధాల క్షీణతకు కూడా దారితీస్తుందని ఈ నవల హెచ్చరిస్తోంది. మనిషి తన స్వార్థం కోసం ప్రకృతిని దూరం చేసుకున్నప్పుడే, తన తోటి మనుషుల పట్ల కూడా సంవేదనను కోల్పోతాడనే సత్యాన్ని రచయిత తార్కికంగా నిరూపించాడు

1.7.4. సుస్థిర జీవనశైలి (Sustainable Living):

నర్సయ్య జీవన విధానం ప్రకృతికి హాని చేయని సుస్థిరమైనది. అరికె పంటను గొర్రెలు తిన్నా, నర్సయ్య వాటిని నిందించకుండా 'కరువు' కారణమని అనడం.. ప్రకృతిలో భాగమైన జంతువుల ఆకలిని కూడా గౌరవించడమే. స్థిరమైన జీవనవిధానం అనేది ప్రకృతి వనరులను అమితంగా వాడకుండా, పర్యావరణానికి హాని కలిగించని రీతిలో జీవించే ఒక పద్ధతి. మనం ఇప్పుడు అనుభవిస్తున్న ప్రకృతిని, వనరులను అలాగే భవిష్యత్తు తరాలకు కూడా అందించాలనేదే దీని ప్రధాన ఉద్దేశం. ప్రకృతి మన అవసరాలను తీరుస్తుంది, కానీ మన అత్యాశను కాదు. అవసరానికి మించి వనరులను వాడకపోవడం, వస్తువులను తిరిగి వాడటం (Reuse), రీసైక్లింగ్ చేయడం దీనిలో భాగం. నర్సయ్య పండించే అరికెలు దీనికి ఒక గొప్ప ఉదాహరణ. తక్కువ నీటితో, ఎటువంటి పురుగుమందులు అవసరం లేకుండా పండే పంటలు పర్యావరణాన్ని రక్షించడమే కాకుండా, భూమి సారాన్ని కాపాడతాయి. ఇదే నిజమైన స్థిరమైన జీవనం. దూర ప్రాంతాల నుండి వచ్చే వస్తువుల కంటే, స్థానికంగా లభించే పండ్లు, కూరగాయలు, ధాన్యాలను వాడటం వల్ల రవాణా ఖర్చు, కాలుష్యం తగ్గుతాయి. నర్సయ్య ఇచ్చే అడవి పండ్లు, అక్కడి సహజ ఆహారం రాఘవ ఆరోగ్యాన్ని మెరుగుపరచడం మనం గమనించవచ్చు. మనిషి తన కోసం మాత్రమే కాకుండా, పక్షులు, జంతువుల కోసం కూడా కొంత వదిలేయడం. ఉదాహరణకు: పంటలో పిట్టల కోసం గూళ్లు వదిలేయడం. దీనివల్ల జీవవైవిధ్యం దెబ్బతినకుండా ఉంటుంది.

1.8. గ్రామీణ పునరుజ్జీవనం (Rural Revivalism):

గ్రామీణ పునరుజ్జీవనం అనేది నగరాల వైపు పరుగులు తీస్తున్న ఆధునిక సమాజాన్ని తిరిగి తన మూలాలైన పల్లెల వైపు, ప్రకృతి వైపు మళ్లించే ఒక సామాజిక మరియు సాంస్కృతిక ఉద్యమం. పారిశ్రామికీకరణ, పట్టణీకరణ వల్ల చితికిపోతున్న గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, సంస్కృతిని, పర్యావరణాన్ని తిరిగి చైతన్యపరచడమే దీని ప్రధాన లక్ష్యం. రసాయన ఎరువులు, హైబ్రిడ్ విత్తనాల వల్ల దెబ్బతిన్న భూమిని తిరిగి రక్షించుకోవడానికి సంప్రదాయ విత్తనాలను (అరికెలు వంటి తృణధాన్యాలు) వాడటం. 'ఒంటరి' నవలలో నర్సయ్య ఆరిక విత్తనాల జాతిని భూమ్మీద నిలబెట్టాలని పడే తపన గ్రామీణ పునరుజ్జీవనానికి ఒక నిలువుటద్దం. గ్రామాల్లో ఉన్న

ISSN No.2319-3905

వనరులను (చెట్లు, పశుసంపద, దేశీ విత్తనాలు) కాపాడుకుంటూ, బయటి మార్కెట్లపై ఆధారపడకుండా ఉండటం. డాక్టర్ రాఘవ వంటి నాగరికులు కూడా నగర విలాసాలను వదిలి పల్లెల్లోని ఆరోగ్యకరమైన ఆహారం వైపు మొగ్గు చూపడం దీనికి సంకేతం. పల్లెటూరి పండుగలు, పద్ధతులు కేవలం నమ్మకాలు మాత్రమే కాదు, అవి ప్రకృతితో మనిషికి ఉన్న సంబంధాన్ని గుర్తుచేసే వేదికలు. చిత్తకార్తె వంటి ప్రకృతి కాలచక్రాల పట్ల నర్సయ్యకు ఉన్న అవగాహన, పల్లెల్లో అంతరించిపోతున్న ఆ ప్రాచీన జ్ఞానాన్ని పునరుద్ధరించాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తుంది."ఒక మొక్క అడవిని చేయగలదు" అనే సూత్రంతో రాఘవ చెట్లను దత్తత తీసుకోవడం, ఊరి ప్రజలు తమ ఆర్థిక ఇబ్బందుల కోసం చెట్లను నరకుండా ఆపడం ఒక విప్లవాత్మక మార్పు. నగరాల కాలుష్యం నుండి తప్పించుకోవడానికి పల్లెలే చివరి ఆశ్రయాలని ఈ నవలలు స్పష్టం చేస్తాయి. ఒంటరి' నవలలో రచయిత చూపిన పరిష్కారం కేవలం గతంలోకి వెళ్లడం కాదు, గతంలోని విలువైన జ్ఞానాన్ని (Traditional Wisdom) ఆధునిక అవసరాలకు అనుగుణంగా మల్చుకోవడం. ఇది కేవలం పల్లెలను బతికించడం మాత్రమే కాదు, మానవత్వాన్ని మరియు ప్రకృతిని కూడా పునరుద్ధరించడం.నవల ముగింపులో రాఘవ పల్లెలోనే ఉండాలని నిర్ణయించుకోవడం 'పట్టణీకరణ' (Urbanization) వల్ల కలిగే వినాశనాన్ని అడ్డుకునే ప్రయత్నం.పట్టణాలకు తరలిపోయిన మేధోశక్తి తిరిగి పల్లెలకు వచ్చి, అక్కడి మౌలిక జీవనాన్ని కాపాడాలనే అభ్యర్థన ఇందులో ఉంది. ఇది పర్యావరణ పరిరక్షణతో పాటు సామాజిక సమతుల్యతను కూడా సాధిస్తుంది. ఈ నవల ద్వారా రచయిత చెప్పేది ఏమిటంటే, మనిషి తన మూలాలను (ప్రకృతిని) కాపాడుకున్నప్పుడే తనకు ఆరోగ్యం, ఆనందం లభిస్తాయి. అరికెలు కేవలం ఆహారం కాదు, అవి మనిషికి, భూమికి మధ్య ఉన్న విడదీయరాని బంధానికి చిహ్నాలు.

1.9. క్వాంటమ్ లివింగ్, క్వాంటమ్ లైఫ్?

"నర్సయ్య వానని నిలదీయడం"

"నర్సయ్య ఒంటి మీద నుండి పాము పాకి వెళ్ళిపోవడం" ఇత్యాది అంశాలను ఎవరైనా చర్చిస్తే తెలుసుకోవాలని ఉందని *ఈమాట* (అంతర్జాల పత్రిక, మే, 2018లో శ్రీకాంత్ గడ్డిపాటిగారు ఒక ప్రతిపాదన చేశారు. నిజానికి ఆ దృష్టితో చూడాలనుకోవడంలోనే అది ఆయనకు తెలిసినా, ఆ కోణాన్ని చూడాల్సిన అవసరం ఉందని సూచించారనుకుంటున్నాను. ఈ నవలలో డాక్టర్ రాఘవ వంటి హేతువాదులకు, ఆధునిక శాస్త్రవేత్తలకు ఇవి అద్భుతాలుగా లేదా కాకతాళీయాలుగా అనిపించవచ్చు. కానీ, వీటిని 'క్వాంటమ్ లివింగ్' (Quantum Living) లేదా 'క్వాంటమ్ ఎంటాంగిల్మెంట్' (Quantum Entanglement) కోణంలో విశ్లేషిస్తే వీటి వెనుక ఉన్న లోతైన వైజ్ఞానిక, ఆధ్యాత్మిక సత్యం అర్థమవుతుంది. *The Biology of Belief:Unleashing the power of consciousness, matter & miracles* గ్రంథంలో

ఈ భావన, సిద్ధాంతాలను వివరించారు. క్వాంటమ్ ఎంటాంగిల్మెంట్ (Quantum Entanglement) అనేది భౌతికశాస్త్రంలోని ఒక విలక్షణమైన దృగ్విషయం. రెండు పరమాణు రేణువులు (Particles) ఒకదానితో ఒకటి ఎంతగా పెనవేసుకుపోతాయంటే, వాటి మధ్య ఎంత దూరం ఉన్నప్పటికీ (వేల మైళ్ళ దూరంలో ఉన్నా), ఒక రేణువు స్థితిలో మార్పు వస్తే క్షణకాలంలో రెండో రేణువు కూడా దానికి అనుగుణంగా స్పందిస్తుంది. ఉదాహరణకు, భూమిపై ఉన్న ఒక రేణువును మనం కుడివైపునకు తిప్పితే, అంతరిక్షంలో ఎక్కడో ఉన్న దాని జంట రేణువు కూడా అదే క్షణంలో ఎటువంటి వైర్లు లేదా సిగ్నల్స్ లేకుండానే స్పందిస్తుంది. దీనినే ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ 'దూరం నుండి జరిగే వింత చర్య' (Spooky action at a distance) అని అభివర్ణించారు. ఇది విశ్వంలోని వస్తువులన్నీ కంటికి తెలియని ఒకే శక్తి క్షేత్రంతో అనుసంధానమై ఉన్నాయని నిరూపిస్తుంది.క్వాంటమ్ లివింగ్ (Quantum Living) అనేది ఈ శాస్త్రీయ సూత్రాన్ని మన దైనందిన జీవితానికి, చైతన్యానికి వర్తింపజేయడం. మన ఆలోచనలు, భావోద్వేగాలు కేవలం మన మెదడుకే పరిమితం కాకుండా విశ్వవ్యాప్తమైన శక్తి క్షేత్రాన్ని (Quantum Field) ప్రభావితం చేస్తాయని ఇది చెబుతుంది. ఉదాహరణకు, నర్సయ్య వానని నిలదీయడం లేదా పాము అతనిపై నుండి పాకినా భయం చెందకపోవడం క్వాంటమ్ లివింగ్‌కు నిదర్శనాలు. అక్కడ నర్సయ్య తనను తాను ప్రకృతి కంటే వేరైన వ్యక్తిగా కాకుండా, ప్రకృతిలో ఒక భాగంగా భావిస్తాడు. అతని అంతరంగ తరంగాలు (Internal Frequencies) ప్రకృతి తరంగాలతో ఒకే శృతిలో (Resonance) ఉన్నప్పుడు, బాహ్య ప్రపంచం అతని సంకల్పానికి అనుగుణంగా స్పందిస్తుంది. క్లుప్తంగా చెప్పాలంటే, మన చైతన్యాన్ని ఉన్నత స్థితికి తీసుకెళ్లి విశ్వశక్తితో మమేకమై జీవించడమే క్వాంటమ్ లివింగ్. నర్సయ్య పాత్ర ద్వారా రచయిత చూపిన ఈ రెండు సన్నివేశాలను ఈ క్రింది విధంగా విశ్లేషించవచ్చు:

1.9.1. నర్సయ్య వానని నిలదీయడం (Conscious Interaction with Nature)

క్వాంటమ్ ఫిజిక్స్ ప్రకారం, గమనించే వ్యక్తి (Observer) ఆలోచనలు, గమనించబడే వస్తువు (Observed) మీద ప్రభావం చూపుతాయి. దీనినే 'అబ్సర్వర్ ఎఫెక్ట్' అంటారు. నర్సయ్య వానని నిలదీయడం అనేది కేవలం ఒక రైతు ఆవేదన కాదు, అది ప్రకృతితో అతను ఏర్పరుచుకున్న ఒక 'క్వాంటమ్ కనెక్షన్'. పర్యావరణ వ్యవస్థతో మనిషి చైతన్యం ఏకమైనప్పుడు, సంకల్పం ప్రకృతిని ప్రభావితం చేయగలదనే సిద్ధాంతాన్ని ఇది సూచిస్తుంది.నర్సయ్య ప్రకృతిని తనకంటే వేరైనదిగా చూడడు. గాలి, నీరు, వాన అన్నీ తనలో భాగమేనని నమ్ముతాడు. ఈ 'వన్నెస్' (Oneness) స్థితిలో ఉన్నప్పుడు, అతను ప్రకృతితో చేసే సంభాషణ ప్రతిధ్వనిస్తుంది.

1.9.2. పాము ఒంటి మీద నుండి పాకి వెళ్ళిపోవడం (Vibrational Frequency)

క్వాంటమ్ లైఫ్ సిద్ధాంతం ప్రకారం, ప్రతి జీవి ఒక నిర్దిష్టమైన కంపన తరంగదైర్ఘ్యం (Frequency) కలిగి ఉంటుంది. భయం, క్రోధం వంటివి తక్కువ స్థాయి ఫ్రీక్వెన్సీని విడుదల

ISSN No.2319-3905

చేస్తాయి.నర్సయ్య మనసులో భయం గానీ, ఆ పామును చంపాలనే హింసాత్మక ఆలోచన గానీ లేవు. అతని శరీరం ప్రశాంతమైన, అత్యున్నతమైన తరంగాలను విడుదల చేస్తుంది. పాము వంటి జీవులు మనిషి విడుదల చేసే 'ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ ఫీల్డ్'ను త్వరగా పసిగడతాయి. నర్సయ్య చైతన్యం ప్రకృతితో మమేకమై ఉండటం వల్ల, ఆ పాము అతడిని ఒక శత్రువుగా కాకుండా, ఒక చెట్టునో లేదా రాయినో చూసినట్టుగా 'సహజ వస్తువు'గా భావించి వెళ్ళిపోతుంది. దీనినే క్వాంటమ్ లివింగ్‌లో 'హార్మోనిక్ రెజోనెన్స్' అంటారు.

1.9.3. క్వాంటమ్ లివింగ్ వర్సెస్ నర్సయ్య తాత్త్వికత

(Quantum Living vs. Narsaiah'sPhilosophy):

పాశ్చాత్యులు ఇప్పుడు చెబుతున్న 'క్వాంటమ్ లివింగ్' మనిషి ఆలోచనలకు, భౌతిక జగత్తుకు మధ్య ఉన్న సంబంధాన్ని వివరిస్తుంది. సైంటిస్టులు దీనిని ప్రయోగశాలల ద్వారా, గణిత సూత్రాల ద్వారా వివరిస్తుంటే, నర్సయ్య వంటి వారు దీనిని తన అనుభవం ద్వారా, రామాయణ పరమార్థం ద్వారా ఆచరించి చూపిస్తున్నారు.అరికె విత్తనాలను భద్రపరచడం, నశించిపోతున్న పంటను తిరిగి బ్రతికించడం వంటివి.. నమ్మకం ద్వారా శూన్యం నుండి ఫలితాన్ని సాధించే క్వాంటమ్ ప్రక్రియలుగానే భావించాలి. పతంజలి శాస్త్రిగారు తన ముందుమాటలో కొత్త వరివంగడాలను సృష్టించడం అవసరమే అయినా, దానిలోని ఆధిపత్యాన్ని, పెత్తనాన్ని గుర్తించాలనీ, రైతులకు వచ్చే విపత్కర పరిస్థితులను తట్టుకొని నిలబడే విధంగా విత్తనాలను భద్రపరిచే ప్రాచీనుల తెలివితేటలు గురించి ఇలా వ్యాఖ్యానించారు. *"ఆధునిక వ్యవసాయ విజ్ఞానం రైతులకి అందజెయ్యడం అవసరం. కొత్త వంగడాల అవసరాన్ని కూడా కాదనలేం. కానీ అటువంటి నిర్ణయాలు విదేశీ కంపెనీలు మనకోసం చెయ్యడం అంగీకరించడానికి వీల్లేదు. బీరకాయనీ, వంకాయనీ జన్యుమార్పిడి చెయ్యడం అనవసరం. పంటభూముల సంరక్షణ, భూసంరక్షణ అవసరం. వ్యవసాయ జీవావరణ వ్యవస్థల రక్షణ అత్యవసరం."* ఈ నవల ప్రకృతి వైద్యం గురించి, మనిషి చైతన్యం ప్రకృతి చైతన్యంతో కలిసినప్పుడు జరిగే 'క్వాంటమ్ అద్భుతాల' గురించి కూడా చెబుతుంది.

ఇటువంటి శాస్త్రీయమైన విషయాలను సామాన్య ప్రజలకు అర్థం కావడం కోసమే రచయిత ఇలా రాసుంటారని చెబుతూ, భారతీయ ఆధ్యాత్మిక దృష్టితో ఈ.గజేంద్రనాథ్ రెడ్డి అదే పత్రిక (ఈమాట)లో ఇలా రాశారు.*"ఒంటరి నవల తనను చదివిన ప్రతీ ఒకరికీ అనేక భావాలను కలుగజేయటం%ొ% ఆ అభిప్రాయాలపై ఇంత అద్భుతమైన చర్చ జరగటం ఆ నవలకు మరింత సమగ్రతను చేకూర్చింది. పాత్రల విషయానికొస్తే సరసయ్య పాత్ర ఉండిఉండేదా అన్న అనుమానం సమకాలీన పాఠక సమాజానికి కలుగడం సహజమే. ఐతే గతంలో ఇలాంటి వారు ఉండేవారు అనడంలో సందేహం లేదు. ఆయన పాత్ర చిత్రణలో రాజయోగి ప్రభావం ఉంది. అవధూత శ్రీ*

కాశీనాయనను అనుసరించే భక్తునిగా పంచభూతాల నియంత్రణనూ సాధించగలిగాడు. ఇక్కడ హేతుబద్ధత లేదు అనిపించినా, కొంతమంది సిద్ధపురుషుల లీలలు మన పెద్దల ద్వారా మనకు ఎరుకే. ఇక పాము నర్సయ్య ఒంటిపై పాకడం రాఘవ ఆ సన్నివేశంలో ఉండటం జీవవైవిధ్యం పట్ల సానుభూతిని పెంచే విధంగా%ొ% విషపురుగైనా ప్రేమించగలిగితే హాని చేయదు%ొ% అనే భావన సృష్టించబడటం కోసం రచయిత రాసి ఉండవచ్చు" రచయిత ఈ నవల గురించి చెప్పుకున్న నేపథ్యంలో పర్యావరణాన్ని మాత్రమే కాదు. తన్ను తాను కాల్చి బూడిద చేసుకునే దిశగా మనిషి గమనం చూస్తున్నాను కాబట్టే ఈ నవల రాయాల్సి వచ్చింది. రోడ్డుకు దూరంగా, మారుమూల పల్లెల్లో బతుకుతూ వున్న పాత కాలపు వ్యవసాయదారుల జీవన మూలాల్ని అంటుగట్టి తెచ్చి, నగరీకరణ దిశగా అడుగులేస్తోన్న పల్లెవీధి కూడళ్లలో నాటగలిగితే ఈ రోగానికి కొంతైనా ఉప శమనపు మందు తయారవుతుందేమోనన్న ఆశతో ఈ నవల రాశాను." అని చెప్పుకున్నారు. అంతే కాదు దానిలోని ప్రధాన పాత్ర గురించి ప్రస్తావిస్తూ "రాఘవనూ నేనే! రైతు నర్సయ్యనూ నేనే!!" అని చెప్పారు. దీన్నే ఈ నవలకు ముందుమాట రాసిన పతంజలిశాస్త్రిగారు కూడా ధ్రువీకరిస్తున్నట్లు "బహుశా నర్సయ్య అనే రైతు ప్రాచీన వ్యావసాయిక జీవనవిధానానికీ విలువలకీ ఆఖరి ప్రతినిధి అనుకుంటాను. రచయిత రైతు కథకుడిగా ప్రసిద్ధుడు. ఈ నవల కూడా సన్నపురెడ్డి బాధ. అంటే, అన్నిరకాల వ్యవసాయాన్నీ ఇష్టపడి గౌరవించే మన లాంటి వాళ్లందరి బాధ." అని వ్యాఖ్యానించారు.

1.10. ముగింపు (Conclusion):

సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి గారి *'ఒంటరి'* నవలలో పర్యావరణ స్పృహ అనేది కేవలం అడవులనో, చెట్లనో కాపాడాలనే ప్రచారంలా కాకుండా, మనిషి తన ఉనికిని కాపాడుకోవడానికి ప్రకృతితో మమేకం కావాలనే జీవావరణ కేంద్రీకృత దృక్పథం (Ecocentrism) తో కనిపిస్తుంది. ఆధునిక యాంత్రిక జీవనంలో 'లార్డ్ మ్యాన్'గా విర్రవీగుతూ ప్రకృతిని కేవలం వనరుగా చూస్తున్న మనిషి, తన మూలాలను కోల్పోయి మానసిక, శారీరక రోగాల బారిన పడుతున్నాడని రచయిత డాక్టర్ రాఘవ పాత్ర ద్వారా హెచ్చరించారు. దీనికి భిన్నంగా, రైతు నర్సయ్య పాత్ర ద్వారా ప్రకృతిలోని ప్రతి అంశానికి అది అంతరించిపోతున్న అరికె విత్తనం కావచ్చు లేదా పంటను మేసే గొర్రె కావచ్చుస్వతహాగా ఒక విలువ ఉంటుందనే డీప్ ఎకాలజీ (Deep Ecology) తాత్త్వికతను ఆవిష్కరించారు. *'ఒంటరి'* నవలలో పర్యావరణ స్పృహను ఒక ఆచరణాత్మక జీవన విధానంగా మలిచాడు రచయిత. నశించిపోతున్న పల్లెలను, మసిబారుతున్న ప్రకృతిని కాపాడుకోవడం అంటే మనిషి తనను తాను కాపాడుకోవడమేనని ఈ రచన చాటిచెబుతోంది. విద్యావంతులు తిరిగి పల్లెలకు చేరుకోవడమే (Reverse Migration) పర్యావరణ సంక్షోభానికి అసలైన పరిష్కారం.ఈ నవలలో ప్రకృతి మనిషి చైతన్యాన్ని ప్రభావితం చేసే ఒక సజీవ శక్తి.

పర్యావరణ విధ్వంసాన్ని (రోడ్డు ఊరిని మింగేయడం వంటివి) ఎండగడుతూనే, ప్రకృతితో మమేకమైన మనిషికి, విశ్వానికి మధ్య ఉండే క్వాంటమ్ అనుసంధానతను రచయిత అద్భుతంగా చిత్రించారు. స్త్రీ శక్తిని, భూమిని సంరక్షకులుగా చూపే జీవావరణ స్త్రీవాద (Ecofeminism) ఛాయలు కూడా రాములమ్మ వంటి పాత్రలలో మనకు గోచరిస్తాయి. చివరగా, ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తే మనిషి ఈ విశ్వంలో 'ఒంటరి' అయిపోతాడనే సత్యాన్ని బోధిస్తూ, పర్యావరణ పరిరక్షణ అనేది ఒక సామాజిక, నైతిక బాధ్యత అని ఈ నవల చాటిచెబుతుంది.

1.11. ఆధార గ్రంథ పట్టిక (Bibliography)

1 .సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి. (2017) *ఒంటరి (నవల).* తానా ప్రచురణలు., %ఖూూ

2. శ్రీకాంత్ గడ్డిపాటి., ఒంటరి నవల: కొన్ని ఆలోచనలు, కొన్ని ప్రశ్నలు (వ్యాసం), ఈమాట అంతర్జాల పత్రిక, మే, 2018. https://eemaata.com/em/issues/201805/15918.html

3. వై.సుభాషిణి, & కె. అశ్విని. *ఆధునిక తెలుగు నవల : పర్యావరణ స్పృహ* (వ్యాసం).ఔచిత్యం అంతర్జాల తెలుగు పరిశోధన మాసపత్రిక, Volume-06 | Issue-08 | July 2025 | Peer-Reviewed | ISSN: 2583-4797

4 .Glotfelty, Cheryll. (1996). *The Ecocriticism Reader: Landmarks in Literary Ecology*. University of Georgia Press.

5. Garrard,Greg. (2004). *ECOCRITICISM*.Routledge Publishers. New York

6. Lipton, Bruce H. (2005). *The Biology of Belief:Unleashing the power of consciousness, matter & miracles*. Hay House, Incorporated,(2015.,10th Anniversary Edition)

7. Shiva,Vandana. (2015). Who Really Feeds the World?. North Atlantic Books (2016 edition.)

8. E Gajendra Nath Reddy.,https://www.thehansindia.com/posts/index/Sunday-Hans/2018-04-01/*Penning-the-essence-and-issues-of-villages*/370924.

2

తెలుగు భాష పరివ్యాప్తి - పరిరక్షణ

- డా.ఎన్.ఈశ్వర రెడ్డి

పరిచయం:

తెలుగు భాష భారతదేశంలోని ప్రధాన ద్రావిడ భాషలలో ఒకటి. తెలుగు రాష్ట్రాలతో పాటు, దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా దాదాపు 15 కోట్ల మందికి పైగా తెలుగు మాట్లాడేవారు ఉన్నారు. తెలుగు భాషను"తూర్పు ఇటాలియన్" గా గుర్తించారు. క్రీస్తుపూర్వం నుండి దేశి భాషగా వెలుగొందిన తెలుగు భాష, వెయ్యేళ్ళకు పైగా సాహిత్య భాషగా అలరారుతోంది. అయితే, ఆధునికీకరణ, ప్రపంచీకరణ, ఇంగ్లీషు ఆధిపత్యం వంటి సవాళ్లు ఎదుర్కొంటోంది. ఆంగ్ల విద్యతోనే ప్రపంచాన్ని సాధించవచ్చు అని, అన్ని అభివృద్ధులకు మూలం ఆంగ్లమేనని, కాబట్టి స్థానిక భాష అయిన తెలుగు భాషలో మాట్లాడడం, నేర్చుకోవడం, సృజించడం అనే పనుల వల్ల పెద్దగా ఒరిగేదేమీ లేదు అనే ఒక తప్పుడు భావనను ప్రజల్లోకి చొప్పించారు. రష్యా, చైనా, జపాన్, జర్మనీ,కొరియా మొదలైన అభివృద్ధి చెందిన దేశాలు తమ మాతృభాషలోనే శాస్త్ర సాంకేతికతను అభివృద్ధి చేసుకున్నాయి అంటే వారు చాలా మంది నమ్మరు. దీని కారణంగానే భారతదేశంలో 1961 నుంచి ఇప్పటి దాకా 220 స్థానిక భాషలు అంతరించాయి. 191 భాషలు ప్రమాదపు అంచున ఉన్నాయి అని గణాంకాలు చెబుతున్నాయి. ఇది సాంస్కృతిక వారసత్వాన్ని కోల్పోయే ప్రమాదాన్ని సూచిస్తోంది.

తెలుగు భాష వినియోగం, వ్యాప్తి:

ఆంగ్లం మోజులో పడి తెలుగు భాషా వినియోగం తగ్గిపోతున్న విషయం కొంతవరకు నిజమే అయినా, తెలుగు వాడకం విభిన్న రంగాలలో పెరుగుతోంది. పత్రికలు టెలివిజన్ లు రేడియోలు బ్లాగులు మొదలైన వాటితో పాటు సామాజిక మాధ్యమాల ద్వారా తెలుగు విస్తృత ప్రచారానికి ఉపయోగపడుతోంది. స్వయంగా నిర్వహించుకోగలిగే సామాజిక మాధ్యమాలకు,అవసరమైన విషయాన్ని(కంటెంట్) తయారు చేసుకోవడంలో తెలుగు భాష పోటీ పడుతోంది. వివిధ రకాల సాఫ్ట్వేర్లు, విభిన్న యాప్లు తెలుగు భాష వినియోగంలో సహాయపడుతున్నాయి.

ISSN No.2319-3905

ప్రజా వ్యవహారం: తెలుగు భాష ప్రజా బాహుళ్యంలో వ్యవహార భాషగా కొనసాగుతోంది. ముఖ్యంగా గ్రామీణులు, పై చదువులు చదువుకోని వారు అందరూ తెలుగు భాషను సర్వ అవసరాలకు ప్రధాన భాషగా ఉపయోగించు కుంటున్నారు. ఆంగ్ల మాధ్యమం చదువులు, విదేశీ ఉద్యోగాల ఆశలు పెరుగుతున్నచోట తెలుగును ఇంటి భాషగా వాడుకుంటున్నారు. విదేశాలలో స్థిరపడ్డ తెలుగువారు తమ ఇళ్లల్లో తెలుగు భాషా సంస్కృతులకు పీఠం వేస్తున్నారు. మొత్తానికి మొత్తంగా చూసుకుంటే శ్రమ జీవులు మాతృభాషలకు పునాదుల్లాంటి వాళ్ళు అంటే అతిశయోక్తి కాదు. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు,కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిస్సా , పశ్చిమ బెంగాల్, అండమాన్ అండ్ నికోబార్ దీవుల్లో తెలుగు వ్యవహర్తలు అధికంగా ఉన్నారు. అమెరికా,యునైటెడ్ ఎమిరేట్స్, మలేషియా, సింగపూర్, కెనడా, యునైటెడ్ కింగ్డమ్, ఆస్ట్రేలియా, మయన్మార్, బహ్రెయిన్, ఒమాన్, ఫిజి, మారిషష్, న్యూజిలాండ్ మొదలైన దేశాలలో తెలుగు మాట్లాడుతున్నవారు ఉన్నారు. భాషను బాగా ఉపయోగించుకోవడానికి అవసరమైన సాంకేతిక ఉపకరణాలు అందుబాటులోకి వచ్చిన తరువాత, అవి అనువాదం కూడా చేసి ఇవ్వడానికి అనుకూలంగా మారిన కారణంగా తెలుగు భాష వినియోగం విస్తరించబడుతోంది. భాషా పునాదులు గట్టిగా ఉన్నంతకాలం దానిపై నిర్మించే ప్రయోగ భవనాలు కూడా గట్టిగానే ఉంటాయి.

పాలనా వ్యవహారాలు:

పరిపాలనా రంగంలో మాతృభాష అవసరం అవశ్యం. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు వెనుక స్థానిక భాషలో పరిపాలన అనే లక్ష్యం కుడా ఉంది. అందుకే ప్రతి రాష్ట్రం, ఆయా రాష్ట్రాల ప్రజల మాతృభాషలోనే పరిపాలన సాగిస్తూ ఉంటాయి, సాగించాలి కూడా. ఆంధ్ర రాష్ట్రాలు కూడా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రచారం చేయడం, ప్రభుత్వం చేసే చట్టాలపై అవగాహన కల్పించడం మొదలైన అనేక కార్యక్రమాలకు తెలుగు భాషను ఉపయోగిస్తున్నాయి. గతంలో కొన్ని జిల్లా కోర్టులు తీర్పులను కూడా తెలుగులో ఇచ్చాయి. నిజామాబాద్ జిల్లా కోర్టు తొలుతగా తీర్పును తెలుగులో ఇచ్చి ఒక రికార్డు సృష్టించింది. ఆ తర్వాత కొన్ని కోర్టులు తెలుగులో తీర్పులను వెలువరించాయి. నామఫలకాలు, రహదారి సూచికలు, కార్యాలయాల పేర్లు తదితరాలు తెలుగులో ఉండాల్సిన అవసరం ఉంది. చాలాచోట్ల ఉన్నా, ఇంకా పూర్తి స్థాయిలో లేవు. ఇంగ్లీషు వస్తే అన్నీ వచ్చేస్తాయి అని సందేశాలు ఇచ్చిన కొంతమంది నాయకులు, తమ ఎన్నికల ప్రచారాన్నిఆంగ్లంలో ఎందుకు చేసుకోలేదు? అని ఎగతాళి చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. గ్రామీణ భారతానికి మాతృభాష ప్రాణవాయువు లాంటిదని గుర్తిస్తే, శ్రామిక జీవుల దాకా అధికార భాషగా తెలుగును మరింత సన్నిహితం చేయవచ్చు. మరింత మందిని చైతన్య పరచవచ్చు. మాతృభాషలో ప్రావీణ్యం సాధించగలిగితే పర భాషలను చాలా సులభంగా నేర్చుకోవచ్చని అనేక నివేదికలు వెల్లడిస్తూనే ఉన్నాయి. అయితే మనం మాత్రం దాన్ని పెడచెవిన పెడుతూనే ఉన్నాం.

వ్యాపార వాణిజ్య సంస్థలు:

తెలుగు రాష్ట్రాల్లో ఉండే వాణిజ్య సంస్థలు ఎక్కువ శాతం నామఫలకాలపై కార్యాలయాల పేర్లు ఆంగ్ల భాషలో రాసుకుంటున్నాయి. కొన్ని సందర్భాలలో తెలుగు అక్షరం కనబడకుండా జాగ్రత్త పడుతున్నాయి. వాణిజ్య ఉత్పత్తులు, వాటి పేర్లు, అమ్మకాలకు సంబంధించిన సాహిత్యం అంతా ఆంగ్లంలోనే ఇవ్వడానికి ఇష్టపడుతున్నాయి. ఆంగ్లంలో ఉంటే ఆయా కంపెనీల బ్రాండ్లు ఉన్నతమైనవిగా భావిస్తారనే భావనలో ఉన్నాయి.

సంతలు, బజార్లు, చిన్న చిన్న అంగళ్లు ఉన్న ప్రాంతాల్లో తెలుగు భాషలోనే వ్యవహారాలు సాగిస్తున్నారు. తెలుగులోనే బేరసారాలు ఆడుతున్నారు. తెలుగు భాషలోనే అమ్మకాలు జరుపుతున్నారు. కానీ, తెలుగు భాషలో సంస్థల పేర్లు రాయడానికి నామోషీగా భావిస్తున్నారు. అధికార భాష సంఘం ఏర్పడిన తర్వాత ప్రతి సంస్థ కూడా ఆయా సంస్థల పేర్లను తప్పనిసరిగా తెలుగులోనే ప్రదర్శించాలని, ఆంగ్లభాషలో నామఫలకం తప్పనిసరి అనుకుంటే, నామఫలకం తెలుగులో కూడా తప్పక ఉండాలని చట్టం తీసుకొచ్చింది. దాన్ని అమలు చేస్తే బాధ్యత కార్మిక శాఖకు అప్పగించింది. అయితే దీని అమలు విషయంలో ఇటు అధికార భాషా సంఘం అటు కార్మిక శాఖ రెండూ చేతులెత్తేశాయి. తెలుగు భాష పట్ల ఉన్న ఉదాసీన వైఖరి ఇందుకు ప్రధాన కారణం. చట్టం కొరడా ఝుళిపిస్తే వ్యాపార సంస్థల బోర్డులు ఒక రోజులు తెలుగులోకి మారిపోతాయి.

విద్యాసంస్థలు:

భాషా సాహిత్యాలపై అభిరుచిని కలిగించి, భాష భాష ద్వారా సాంస్కృతిక విజ్ఞానం మానసిక వికాసం వైపు భవిష్యత్తు తరాన్ని తీసుకెళ్ళాల్సిన బాధ్యత విద్యాసంస్థలపై అధికంగా ఉంటుంది. కేజీ స్థాయి నుండి పీజీ స్థాయి దాకా విద్యాసంస్థల్లో బోధించే పాఠాలతో పాటు, బోధించే మాధ్యమం కూడా ప్రముఖ పాత్ర పోషిస్తుంది. అ ఆ లు నేర్చుకునే స్థాయి నుండి పోటీ పరీక్షలు దాకా భాష అనుసరణ, అమలు, అభివృద్ధి అనే అంశాలు ముడిపడి ఉంటాయి. మాతృభాషలో సామర్థ్యం సాధించినవారు ఏ భాషనైనా సులభంగా నేర్చుకోగలరు. సృజనాత్మకంగా ఆలోచించగలరు అని అనేక పరిశోధనాత్మక నివేదికలు వెల్లడిస్తున్నప్పటికీ మన అత్యాశలత, పమన పిల్లల్ని గటి కలలకు బలి చేస్తున్న విషయం గుర్తు చేసుకోక తప్పదు. బిడ్డ పుట్టక ముందే ఐఐటీలు అమెరికా చదువులు అంటూ అదృశ్య కలలను దృష్టిలో పెట్టుకొని మాతృభాష ద్వారా అందాల్సిన జ్ఞానాన్ని, పొందాల్సిన సాంస్కృతిక వారసత్వాన్ని పిల్లలకు దూరం చేస్తున్నారు. అట్లని ఆంగ్ల మాధ్యమాన్ని వ్యతిరేకించడం కాదు. మాతృభాషలో బోధన నిర్దిష్ట ప్రామాణిక స్థాయిల్లో జరిగితే,అమ్మ భాషకు, కన్నబిడ్డకు మధ్య ఏర్పడాల్సిన బంధం బలపడుతుందని భావిస్తున్నాం. ఆంధ్ర దేశంలో తెలుగు భాషను నేర్చుకోకుండా, తెలుగులో పరీక్ష రాయకుండా డిగ్రీ, పీజీ కూడా చేసేయవచ్చు. దాన్ని చాలామంది

గొప్పగా భావిస్తున్నారు. మాకు తెలుగు చదవడం, రాయడం రాదు అని చెప్పడం ఒక ఫ్యాషన్ గా మారిపోయిందంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. మరాఠీ భాషను కనీసం ఒక అంశంగా అభ్యసించకుండా పదవ తరగతి పాస్ కావడం మహారాష్ట్రలో సాధ్యపడదు. మన పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రంలో ఇంజనీరింగ్, మెడిసిన్ విద్య కూడా కన్నడ మాధ్యమంలో అందుబాటులో ఉంది. బోధనా భాషగా తెలుగును ప్రాథమిక పాఠశాల దశ నుండి పీజీ దాకా బోధించడానికి అవసరమైన ప్రణాళికలను తయారు చేసుకోవచ్చని నూతన విద్యా విధానం 2020 సూచించింది. ప్రాథమిక విద్య పూర్తిగా మాతృభాషలో ఉండాలని, మాధ్యమిక విద్య మాతృభాషతోపాటు మరో భాషలో కూడా బోధించుకోవచ్చని, అవసరమైతే మాతృభాషలో బోధన యూజీ,పిజీ దాకా కొనసాగించుకోవచ్చని నూతన విద్యా విధానం తెలియజేస్తుంది. అందుకు అనుగుణంగా ప్రభుత్వ చర్యలు ఉండాలి. తెలుగు మాట్లాడితే అనేక రకాలుగా అవమానించే కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకునే పరిస్థితి ఇక్కడ లేదు అంటే మన ఆలోచనలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

సృజనాత్మక రచనలు:

ఏ భాష అయినా తన ప్రత్యేకతలను, వ్యక్తీకరణ సామర్థ్యాన్ని ప్రదర్శించుకోవడానికి ఉపయోగపడే ప్రధాన వేదిక సృజనా రంగం. నిత్య వ్యవహారంలో ఉన్న భాష అనేక ప్రభావాలతో తన రూపాన్ని ఎప్పటికప్పుడు మార్చుకుంటూ ఉంటుంది. కొన్ని సందర్భాలలో ఆ మార్పు తెలుగు భాషకు నష్టం కలిగించేది కూడా అయి ఉంటుంది. తన చుట్టూ ఉన్న ఇతర భాషల ప్రభావం, మాండలిక ఉచ్చారణ, వ్యవహర్తల అనుభవం వంటి వాటి నేపథ్యంలో వ్యవహార భాష నిత్యం మార్పులకు గురవుతూ ఉంటుంది. అదే సమయంలో వ్యవహార భాషలో మౌఖిక పద సృజన, వాటి వినియోగం చాలా తక్కువగా ఉంటుంది. సృజనాత్మకమైన రచనల ద్వారా భాషా ప్రయోగం, నూతనపద సృష్టి, ప్రత్యేక వ్యక్తీకరణ, విభిన్న శైలులు గ్రంథ రూపంలోకి వచ్చేస్తాయి. భాషా ప్రయోగాల వెనక జానపద జీవితంతో పాటు ఆయా ప్రాంతాల సాంస్కృతిక నేపథ్యాలు,ఇతర భాషల ప్రభావాలు అన్నీ కనిపిస్తాయి. విస్తృతమైన పర సంపదను ఉపయోగించుకునే అవకాశం సృజన రంగానికి ఉంది. తెలుగు సాహిత్యంలో ఉన్న విభిన్న సాహిత్య ప్రక్రియలే అందుకు ఉదాహరణ. ప్రస్తుత కాలంలో తెలుగు అధ్యయనకారులు పెరుగుతున్నారో లేదో తెలియదు. కానీ, తెలుగు రచయితలు పెరుగుతున్నారు, రచనలు పెరుగుతున్నాయి, సందేహపడనక్కర్లేదు. కవిత్వం, గేయం, కథ, నవల, నాటకం మొదలైన ప్రక్రియలు సాపేక్షంగా విస్తరిస్తున్నాయి. సృజనాత్మక రంగాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర సాహిత్య అకాడమీ నుండి రాష్ట్రస్థాయి అకాడమీల దాకా అనేక సంస్థలు తమ వంతు కృషిని చేస్తున్నాయి. తెలుగు ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్రం నుండి విశ్వవిద్యాలయాల దాకా సృజనలపై పరిశోధనలకు ఊతమిస్తున్నాయి.

మాధ్యమాలు:

1. పత్రికలు; తెలుగు పత్రికలు ప్రారంభమై రెండు శతాబ్దాలు పూర్తి కావస్తుంది. సత్యదూత వృత్తాంతిని, వర్తమాన తరంగణి, ఆంధ్ర పత్రిక, కృష్ణా పత్రిక, గోలకొండ, తెనుగు పత్రిక, ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తర్వాత వచ్చిన ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతి, ఈనాడు, వార్త, సాక్షి వరకు పత్రికలు తెలుగు భాషకు జీవం పోస్తున్నాయి. భాష నవీకరణలో పత్రికలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. విభిన్న ప్రాంతాల నుండి భిన్న నేపథ్యాల నుండి వస్తున్న వార్తలను అనువదించే క్రమంలో కొత్త పదాలకు పురుడు పోస్తున్నాయి. పత్రికలు ప్రామాణిక భాషకు చిరునామాగా నిలుస్తున్నాయి. సరికొత్త ప్రయోగాలతో నిరంతరం కొత్త కొత్త పదాలకు ఊపిరి పోస్తున్నాయి. పాఠకులకు వార్తలను అందించడమే కాకుండా తెలుగు భాషను నిరంతరం వెలిగిస్తున్నాయి. వింజమూరి కృష్ణమాచార్యులు,బహుజనపల్లి సీతారామాచార్యులు,కారుమంచి సుబ్బారాయుడు సంపాదకులుగా ఉండిన సుజనరంజని,కొక్కండ వెంకటరత్నం పంతులు నడిపిన ఆంధ్రభాషా సంజీవిని,కందుకూరి వీరేశలింగం నడిపిన వివేకవర్ధిని, సతీహితబోధిని, కాశీనాథుని నాగేశ్వరరావు నడిపిన భారతి నుండి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న వాఙ్మయి, ద్రావిడ విశ్వవిద్యాలయం నడుపుతున్న ద్రావిడి, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం నడుపుతున్న భాష పత్రికతో పాటు సాహిత్య ప్రస్థానం, భావ వీణ, ప్రకాశిక, మూసీ,మిసిమి, పాలపిట్ట, నడుస్తున్నచరిత్ర, విశాలాక్షి మొదలైన పత్రికలు భాషా సాహిత్యాలకు అండగా నిలుస్తున్నాయి. అనేక సాహిత్య ప్రక్రియలను ప్రచురించి ప్రోత్సహిస్తున్నాయి.

2. టెలివిజన్లు; టెలివిజన్లు పత్రికల కన్నా భిన్నమైనవి. దృశ్య శ్రవణ మాధ్యమంగా ఇంటింటికి చేరి గిలిగింతలు పెడుతున్న టెలివిజన్ సమాచార వ్యవస్థను సమూలంగా మార్చేసింది. ప్రపంచ నలుమూలల నుండి వార్తలను క్షణాల్లో మన ముందు ప్రత్యక్షీకరిస్తోంది. నిమిష నిమిషానికి మారిపోతున్న పరిణామాలను యథాతథంగా కళ్ళ ముందు నిలపగలుగుతుంది. అయితే, టెలివిజన్ లో వార్తలు చదువుతున్నవారు, ప్రత్యేక కార్యకమాలు నిర్వహిస్తున్న వారు ఆంగ్లాంధ్ర పోకడలు పోతున్నారని, విమర్శలు ఉన్నాయి. తెలుగు పదాలను సక్రమంగా ఉచ్చరించకపోవడం, ఇతర భాషా పదాలను అవసరం లేకున్నా వాడడం, ఇంగ్లీషు హిందీ కలిపిన తెలుగుతో కథనాలను ప్రసారం చేయడం వంటివి తారస పడుతున్నాయి.

ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న సంప్రదాయ రేడియోలు తెలుగు భాషను ఉపయోగించడంలో నిబద్ధతతో వ్యవహరిస్తున్నాయి . ప్రైవేట్ యాజమాన్యం కింద నడుస్తున్న ఎఫ్ఎం రేడియోలు తెలుగు భాషను సంకరీకరిస్తున్నాయి అనే విమర్శ ఉండనే ఉంది. యువత కూడా అలాంటి భాషకు అలవాటు పడుతోంది.

3. బ్లాగులు; కొంతమంది తెలుగు రచయితలు, కవులు, కథకులు విమర్శకులు, అంతర్జాలంలో తమకు అనుకూలమైన విధంగా బ్లాగులు ఏర్పాటు చేసుకొని పాఠకులతో నిత్యం

అభిప్రాయాలు పంచుకుంటున్నారు. సినిమాలు, వార్తలు, సాంకేతికత, ఆరోగ్యం మరియు కవిత్వం వంటి విభిన్న అంశాలను బ్లాగుల్లోరాస్తున్నారు. సినిమా వార్తలు,సినిమా సమీక్షల కోసం 123తెలుగు.కామ్, సాధారణ వార్తల కోసం తెలుగు బులెట్, వివిధ అంశాలపై విస్తృత శ్రేణి బ్లాగులను తెలుసుకోవడానికి ఇండియా బ్లాగ్ లాంటి బ్లాగులు ఉన్నాయి. సినిమాలు మరియు వినోదం కోసం: 123తెలుగు.కామ్, టైమ్స్ ఆఫ్ ఇండియా నుండి తెలుగు సినిమా వార్తలు, దేశీపుడ్డా మొదైలైన బ్లాగులు ఉన్నాయి. వార్తలు మరియు ప్రస్తుత సంఘటనల కోసం: తెలుగు బుల్లెట్, ఈనాడు.యుఎస్,హాదీచీ తెలుగు వంటి బ్లాగులు పనిచేస్తున్నాయి.

సాంకేతికత కోసం: Computerera.co.in/blog, ఐటిగురు99, ఆరోగ్యం కోసం: సహజారోగ్యం, సాహిత్యం మరియు కవిత్వం కోసం: యదలోనిభావాలు, తెలుగుకవితలు88, ఇతర అంశాలైన ఆహారం: తెలుగు ఆహార ప్రియులు, చదువు కోసం : ఈనాడు ప్రతిభ, జనరల్: మానస సంచారము వంటి బ్లాగులు ఉన్నాయి. వ-తెలుగు, జాబిల్లి, లోగిలి, పల్లెప్రపంచం, Avakaaya.com, TELUGUEBOOKS, vuyyurutimes, కినిగె బ్లాగు, కొత్తపల్లి, పుస్తకం, వసంతం, వాకిలి, సాక్ష్యం సంచలన పత్రిక, సృజన, నవతరంగం, విహంగ, ప్రాణహిత, కౌముది వెబ్ మాసపత్రిక, పొద్దు, జన విజయం, ఈమాట, భూమిక తెలుగు స్త్రీవాద పత్రిక, లోకహితం, మామాట, బ్లాగిల్లు కబుర్లు మొదలైన బ్లాగులు తెలుగు భాషా సాహిత్యాలకు సేవ చేస్తున్నాయి.

సామాజిక మాధ్యమాలు: ఈరోజుల్లో పత్రికలు, టీవీల కన్నా సామాజిక మాధ్యమాలు ఎక్కువ ప్రభావం చూపిస్తున్నాయి. స్మార్ట్ ఫోను ఉన్న ప్రతి ఒక్కరూ సామాజిక మాధ్యమాలకు దగ్గరై పోతున్నారు. తెలుగులో పోస్టులు(స్క్రిప్ట్,ఆడియో,వీడియో,బొమ్మలు) తయారుచేసి పెట్టడం, చదవడం వంటి వాటిలో తలమునకలు అవుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో కంటెంట్ తయారుచేయడానికి కొత్త సాంకేతిక నైపుణ్యాలను నేర్చుకుంటున్నారు. వివిధ కంపెనీలు అందిస్తున్న తెలుగు క్రతులను అందిపుచ్చుకుంటున్నారు. ముఖ్యంగా

యూట్యూబ్, వాట్సాప్ , ఫేస్బుక్ , ఇన్ స్టా గ్రామ్ మొదలైన వాటిలో తెలుగు కథలు, కవితలు, గేయాలు, వ్యాసాలు మొదలైన అనేక భాషా సాహిత్య అంశాలు ప్రచారం అవుతున్నాయి. వివిధ రకాల సృజనాత్మక వీడియోలు తెలుగులో తయారవుతున్నాయి. తెలుగు ఫాంట్లు, కీ బోర్డులు, తెలుగు ఆన్లైన్ నిఘంటువులు, తెలుగు పాడ్ కాస్ట్ లు , కృత్రిమ మేథ- వంటివి తెలుగు భాష వినియోగానికి బాగా ఉపయోగ పడుతున్నాయి. SUNO లాంటి AI ఆధారిత మ్యూజిక్ యాప్లు తెలుగు పాటలకు కృత్రిమ మేథతో గాత్రం, సంగీతం అందిస్తున్నాయి. కొంతమంది సామాజిక మాధ్యామాల ద్వారా డబ్బు సంపాదిస్తున్నారు. ఈ రకంగా చూస్తే సామాజిక మాధ్యమాల్లో తెలుగు బాగా వాడకంలో పెరిగింది. అయితే, సెల్లులకు అతుక్కుపోతున్న నేటి కాలక్షేప తరం తెలుగు

పద స్వరూపం, ప్రయోగ శీలతలను తెలుసుకునే పరిస్థితి తగ్గిపోతుంది. రచనలో సృజన దెబ్బతినే అవకాశం లేకపోలేదు. .

వివిధ రంగాలలో తెలుగును మాధ్యమంగా ఉపయోగించేటప్పుడు ఇతర భాషా పదాలు వచ్చి చేరుతుండడాన్ని ఆహ్వానించాల్సిన విషయం. కొంతమంది పనిగట్టుకుని అన్ని ఆదాన పదాలు తెలుగులోనే ఉండాలని వాదించడం కూడా సరైనది కాదు. ఏ భాషా పదం అయినా సరే, నిర్దిష్ట అర్థంతో వ్యవహర్తలకు సులభంగా అర్థమయిపోతున్నప్పుడు, అలాంటి పదాన్ని పనిగట్టుకుని కృత్రిమంగా అనువదించనక్కర్లేదు. కలెక్టరు, కమీషనర్, బస్సు, రోడ్డు, రైలు, చలానా, సినిమా, టీవీ, రేడియో, కంప్యూటర్, పానీ పూరి, దస్తావేజు, పేపరు, పెన్ను...ఇలా కొన్ని వందల ఇతర భాషా పదాలు తెలుగు భాషలో ఇమిడిపోయాయి. ఏ భాష అయినా సరే కాలానుగుణమైన మార్పుకు లోను కావాల్సిందే. ఒకవేళ ఆ మార్పులను తనలో కలుపుకోవడానికి లేదా మారడానికి ఇష్టపడిన భాషలు లేదా అవకాశం లేని భాషలు కార్యక్రమంలో నిర్జీవమైపోతాయి. సామాన్య వ్యవహారం నుండి జారిపోయిన భాషలు కేవలం పుస్తకాలలో మాత్రమే బతికి ఉంటాయి. అవి కొంత కాలానికి మ్యూజియంలో లభించే పురా సంస్కృతిలో భాగమైపోతాయి. కాబట్టి భాషను ఆధునిక అవసరాలకు తగ్గట్టుగా, ఏ భాషతోనైనా కలిసి ప్రయాణం చేయడానికి అనువుగా తెలుగును తీర్చిదిద్దుకోవడంలోనే భాషాభివృద్ధి వేత్తల పాత్ర కీలకం కానుంది.

పరిరక్షణ చర్యలు: స్థానిక అవసరాలను తీర్చుకోవడానికి పరిపాలన సంస్థలు, వాణిజ్య సంస్థలు, న్యాయ వ్యవస్థలు తెలుగు భాషలో నిత్య వ్యవహారాలు నిర్వహించుకోవడానికి అవకాశాలు ఉన్నాయి. అయితే వాటిపై సరైన దృష్టి పెట్టడం లేదని మనం అర్థం చేసుకోవచ్చు.

చట్టాలను, కోర్టు తీర్పులను తెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కృత్రిమ మేథ, అనువాద యంత్రాలు ఈ అనువాదకులకు సహాయకారులుగా ఉంటాయి. అయితే వాటిని సక్రమంగా ఉపయోగించుకొని, తెలుగు నుడికారం చెడిపోకుండా అనువదించుకోవాల్సిన బాధ్యత విజ్ఞులపై ఉంది.

తెలుగు పరిరక్షణలో విద్యా వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుంది. పాఠశాలల్లో తెలుగును పాఠ్యాంశాలలో చేర్చడం ఒక ఎత్తైతే, విభిన్న శైలుల్లో బోధనా విధానాలు అనుసరించడం మరో ఎత్తు. ఉదాహరణకు, తెలుగు పదాలకు ఇంగ్లీషు అర్థాలు అందించడం, ఉచ్చారణలపై ప్రత్యేక తర్ఫీదు ఇవ్వడం, మాతృభాషలోని భావ వినిమయ సౌలభ్యాన్ని ఆట పాటల ద్వారా నేర్పించడం, పద స్వరూపంలోని అంతరార్థాన్నివిశద పరచడం, విభిన్నసాహిత్య ప్రక్రియలలోని ప్రత్యేకతలను వివరించి వాటిపై అభిరుచి కలిగించాలి. ఆధునిక తెలుగు నిఘంటువును తయారుచేయాలి. ప్రతి విద్యార్థికి 'పెద్ద బాలశిక్ష' వంటి పుస్తకాలు అందుబాటులో ఉంచాలి. ఇంట్లో చిన్న వయసు నుంచి తెలుగు మాట్లాడటం, విభిన్న మాండలికాల (ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ) తియ్యదనాన్నిఅర్థం అయ్యేటట్లు చెప్పడం ద్వారా భాషా నైపుణ్యం పెంచవచ్చు.

మారిషస్?లో తెలుగును పూర్వీక భాషగా నిలబెట్టడంలో వారి విద్యా విధానాలు విజయవంతమయ్యాయని చెప్పవచ్చు. ప్రాథమిక విద్య నుంచి మాధ్యమిక స్థాయి వరకు ఐచ్ఛిక విషయంగా బోధించడం, మహాత్మా గాంధీ ఇన్స్టిట్యూట్ (వీ+×) ద్వారా ఉపాధ్యాయ శిక్షణ ఇవ్వడం, తెలుగు పాఠ్యపుస్తకాల రూపకల్పన చేయడం వంటివి వారికి తెలుగుపై ఉన్న మమకారాన్ని తెలియజేస్తాయి. మారిషస్‌లో అనేక సంస్కృతిక కార్యక్రమాలను, పండగలను, తెలుగు భాషకు సింబాలిక్ గా నిలబెడుతున్నారు. ఈ చర్యలు ఇది తెలుగు భాషా స్థితిని గౌరవప్రదం చేసి, గుర్తింపు భావనను పెంపొందిస్తున్నాయి.

తెలుగు మాధ్యమంలో చదువుకొని ఉన్నత స్థానాలు సంపాదించిన చాలా మంది తెలుగు భాష అభివృద్ధికి అనేక సూచనలు చేస్తున్నారు.వారిలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు గారు పాఠశాలల్లో, దేవాలయాల్లో, ఇళ్లలో తెలుగు వినియోగం పెంచాలని పిలుపునిచ్చారు. ఇంగ్లీషు మోజును తగ్గించి, తెలుగు పదాలు (అమ్మ, నాన్న, తాత, మామ్మ) ఉపయోగించాలని సూచించారు. తెలుగు మాట్లాడే నాయకులకు మాత్రమే ఓటు వేయాలని వెంకయ్య నాయుడు సూచించారు, పాలనకు సంబంధిన పత్రాలు , న్యాయస్థాన తీర్పులు తెలుగులో ఉండాలని చెప్పారు.

సుప్రీం కోర్ట్ పూర్వ ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి. రమణ గారు తెలుగులో చదువుకోవడం ఉద్యోగాలకు అడ్డు కాదని, దక్షిణ కొరియా, జపాన్ వంటి దేశాలను ఉదాహరణగా చూపారు.

ప్రపంచ తెలుగు రచయితల సమ్మేళనం సాధారణ కార్యదర్శి డా. జి.వి. పూర్ణచందు AI వంటి ఆధునిక సాధనాలు ఉపయోగించి భాషను ప్రపంచవ్యాప్తంగా పరిరక్షించాలని సూచించారు. grok:render ఇంటర్నెట్ ద్వారా భాష నేర్చుకోవడం డెమోక్రటైజ్ చేయాలి అని సూచించారు.

ముగింపు:

తెలుగు భాష పరిరక్షణకు ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యల్లో ప్రాథమిక పాఠశాల దశలో తప్పనిసరిగా తెలుగు మాధ్యమంలో బోధన,మాధ్యమిక పాఠశాల స్థాయి నుండి,ఇంటర్, డిగ్రీ స్థాయిల వరకు ప్రథమ/ద్వితీయ భాషగా తెలుగు తప్పని సరిగా చదవాల్సిన పరిస్థితి కల్పించాలి. అవసరమనుకుంటే పీజీ కూడా తెలుగు మాధ్యమంలో చదువుకునే, పరీక్షలు రాసుకునే వెసులుబాటు కల్పించాలి. సాంకేతిక విద్య, వైద్య విద్య,శాస్త్ర విద్యలను తెలుగు మాధ్యమంలో చదువుకోవడానికి వీలుగా పాఠ్య గ్రంథాల రూపకల్పన,అనువాదాలు చేయించాలి. ప్రభుత్వ ఉద్యోగాల్లో తెలుగు మాధ్యమంలో చదువుకున్న వారికి అదనపు మార్కులు ఇవ్వడం లేదా ప్రత్యేక కోటా ఇవ్వడం, ప్రతి ప్రభుత్వ,ప్రయివేటు కార్యాలయంలో భాషా నిపుణున్ని తప్పనిసరిగా నియమించుకోవాలనే ఆదేశాలు ఇవ్వడం,తెలుగు అధ్యాపక ఉద్యోగాల్లో క్రమం తప్పకుండా నియామకాలు జరపడం వంటివి చేయాలి, చేయించాలి. డిజిటల్ మాధ్యమాల ద్వారా తెలుగు భాషతో సాధించగలిగే

ప్రయోజనాలను తెల్పి, ఏ తెలుగు విద్యార్థి కూడా జీవన భృతి కోసం ఎదురుచూసే పరిస్థితి లేకుండా చూడడం వంటివి చేయగలిగితే భాషా సాంస్కృతిక గుర్తింపును కాపాడుకోగలం. భవిష్యత్ తరాలకు వారసత్వంగా భాషను అందించగలం.

ఆధారాలు

1. ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు:తెలుగు భాష ఆధునీకరణకు ప్రసార మాధ్యమాల పాత్ర – – భావ వీణ (జనవరి–2024)
2. డా. ఎన్.ఈశ్వర రెడ్డి: బోధనా మాధ్యమంగా తెలుగు, వాఙ్మయి (జూన్ –2018)
3. Preserving Telugu language in the modern era - The Hindu. (2024).
4. A Special Focus On Telugu Language by Dr Kottireddy - SSRN. (2025).
5. Telugu Pride Soars Beyond Borders: Community Fighting All Odds - ETV Bharat. (2024).
6. Venkaiah Naidu calls for preservation of Telugu language - Times of India. (2025).
7. Maintenance of Telugu as an ancestral language in multilingual Mauritius - - ResearchGate. (2024).
8. Former CJI N.V. Ramana calls for concerted effort to preserve Telugu language - The Hindu. (2024)

ISSN No.2319-3905

3

తెలుగు – కన్నడ రామాయణ తులనాత్మక సమీక్ష

– *ఆచార్య డి.వి.శ్రవణ్‌కుమార్*

సారాంశం:

దక్షిణ భారత సాహిత్య సంస్కృతి రామకథను తన సామాజిక, భాష, భక్తి, రాజకీయ అవసరాలకు అనుగుణంగా పునర్నిర్మించుకుంటూ వచ్చింది. తెలుగు మరియు కన్నడ భాషలలో రామాయణం మహత్తర గ్రంథాల, ప్రజా కళారూపాల, భక్తి ప్రవాహాల, ఆధునిక పునర్వ్యాఖ్యానాల రూపంలో సమృద్ధిగా అభివృద్ధి చెందింది. ఈ పరిశోధనా వ్యాసం రెండు భాషా–ప్రాంతాలలోని ప్రముఖ సంకలనాలు– తెలుగులో రంగనాథ రామాయణము, మొల్ల రామాయణము, వావిలికొలను సుబ్బారావు "మాండారం', విశ్వనాథ సత్యనారాయణ యొక్క శ్రీమద్రామాయణ కల్పవృక్షము మరియు కన్నడలో జైన సంప్రదాయానికి చెందిన నాగచంద్ర రామచంద్ర చరిత పురాణం, వైష్ణవ భక్తి ప్రవాహాన్ని ప్రతిబింబించే తోరవే రామయణం, ఆధునిక దృక్పథంతో కూడిన కువెంపు యొక్క శ్రీ రామాయణ దర్శనం వంటి రచనలు కేంద్రంగా తీసుకుని తులన చేస్తుంది. ఛందస్సు, శైలి, పాత్ర నిర్మాణం (ప్రత్యేకించి సీత, మంత్ర, రాక్షస పాత్రలు), ధర్మ భక్తి భావనల మార్పులు, స్థానిక నాటక రూపాలు (యక్షగాన, హరికథ, బుర్రకథ, తోలు బొమ్మలాట) ద్వారా రామకథ ప్రజాబోధలోకి ఎలా ప్రవేశించిందో పరిశీలించబడింది. కుల, జాతి, లింగ పరమైన పునర్వ్యాఖ్యానాలు– మొల్ల వంటి మహిళా కవయిత్రి, దళిత & స్త్రీవాద పఠనాలు – తదితర సమకాలీన విమర్శాత్మక దృక్పథాలను కూడా ఈ అధ్యయనం విశదీకరిస్తుంది.

కీలక పదాలు: రామాయణం; తులనాత్మక సాహిత్యం; తెలుగు సాహిత్యం; కన్నడ సాహిత్యం; భక్తి ఉద్యమం; యక్షగాన; హరికథ; కువెంపు;

1. పరిచయం

భారతీయ సాంస్కృతిక స్మృతిలో రామాయణం కేవలం ఒక ఇతిహాసకథ కాదు: అది అనేక శతాబ్దాలుగా మళ్లీమళ్లీ చెప్పబడుతున్న సాంఘిక–నైతిక ప్రతీక వ్యవస్థ, వాల్మీకి సంస్కృత

రామాయణం ఆదిపాఠ్యంగా నిలిచినా, ప్రాంతీయ భాషా సంప్రదాయాలు దాని కథరేఖను తమ సాంస్కృతిక అవసరాలకు అనుగుణంగా తిరిగి రాసుకున్నాయి. దక్షిణ భారతదేశంలో ప్రత్యేకించి తెలుగు, కన్నడ ప్రాంతాలలో– రామకథ స్థానిక ఛందోబద్ధత, భక్తి మార్గాలు, రాజసభలు, ప్రజాప్రదర్శనల కలయికలో విస్తరించి, ప్రతి కాలపు సామాజిక చైతన్యాన్ని ప్రతిబింబించింది.

ఈ వ్యాసం ఉద్దేశం: (1) తెలుగు మరియు కన్నడ రామాయణ గ్రంథాల మధ్య చారిత్రక సంబంధాలు & భిన్నతలను చర్చించడం (2) పాత్రల పునర్నిర్మాణం, దైవత్వం– మానవత్వం మధ్య మారే మజిలీలు, ధర్మ చింతన, లింగ & సామాజిక కోణాలను విశ్లేషించడం; (3) ప్రజా ప్రదర్శనల ద్వారా రామకథ ప్రజల్లో నిలిచిన విధానాన్ని సమీక్షించడం; (4) ఆధునిక విమర్శా పార్శ్వాలు (దళిత, స్త్రీవాద, ఆధునిక సాహిత్య ఉద్యమాలు) ఎలా కొత్త పఠనాలను ప్రతిపాదించాయో చూపడం.

1.1 అధ్యయన అవసరం

రామాయణంపై విస్తృత గ్రంథసూచిక ఉన్నప్పటికీ, తెలుగు–కన్నడ తులన విషయంలో శాస్త్రీయ స్థాయిలో సంక్షిప్త మరియు సమగ్ర అధ్యయనం తెలుగు భాషలో సులభంగా అందుబాటులో ఉండడం అరుదు. ప్రత్యేకించి విద్యార్థులకు, పరిశోధకులకు, ప్రజా కళాకారులకు ఒకే వ్యాసంలో మూల గ్రంథాల పరిచయం, శైలి విశ్లేషణ, సామాజిక సందర్భం, ఆధునిక విమర్శ కలిసిన ఆధార గ్రంథం అవసరమైంది. ఈ వ్యాసం ఆ ఖాళీని కొంత మేర నింపే ప్రయత్నం.

1.2 పరిధి & పరిమితులు

- × కేవలం ప్రధాన మరియు ప్రభావశీల ప్రాంతీయ రామాయణ రచనలపైనే దృష్టి. చిన్న ప్రాదేశిక రామకథలు కేవలం సూచనలకే.
- × మూల సంస్కృత వాల్మీకి రామాయణం సంక్షిప్త పునరావలోకనం మాత్రమే ప్రధాన దృష్టి ప్రాంతీయ అనుకరణల మీద.
- × తేదీలలో ఉన్న శాస్త్రీయ విభేదాలు (ఉదా: తోరవే రామాయణం 15వ కానీ 16వ శతాబ్దం?) ఉన్నచోట వ్యాసం పలు అభిప్రాయాలను గమనికల రూపంలో నమోదు చేస్తుంది.

2. 1. దక్షిణ భారత రామకథా ప్రసరణ: చారిత్రాత్మక నేపథ్యం

వాల్మీకి రామాయణం (సాంప్రదాయంగా 24,000 శ్లోకాలు) ఉత్తర నుండి దక్షిణ దిక్కుకు మౌఖిక–లిఖిత మార్గాల ద్వారా క్రమంగా వ్యాపించింది. భక్తి ఉద్యమాల పెరుగుదలతో ప్రాంతీయ భాషలలో దేవకథల అనువాద, రూపాంతరీకరణ అవసరం ఏర్పడింది. తమిళంలో కంబన్ (ఇరామావతారం) దక్షిణంలో రామకథా పునర్నిర్మాణానికి ప్రేరణ. ఆ తరువాతి శతాబ్దాలలో తెలుగు, కన్నడ, మలయాళం, ఇతర భాషలు తమ సమూహ సాంస్కృతిక విలువలకు అనుగుణంగా

రామాయణ కథనాన్ని మలిచాయి. ప్రాచీన శాసనాధారాలు, రాజాశ్రయం, మతపరంపరలు, జైన & వైష్ణవ పర్ఫర ప్రభావాలు ఈ ప్రసరణను నిర్ణయించాయి.

దక్షిణంలో జైన సంప్రదాయాలు రామకథను హింసాహీన, తపోమయ ముగింపులతో పునర్రచిస్తూ వచ్చాయి: వైష్ణవ సంప్రదాయాలు రాముడి దైవత్వాన్ని బలపరుస్తూ భక్తి పార్శ్వాన్ని విస్తరించాయి. ఈ రెండు ధ్రువాల మధ్య ప్రాంతీయ ప్రజాకళారూపాలు విలీనమై రామకథను సామూహికంగాచేసాయి.

3 4. తెలుగులో రామాయణ సంప్రదాయం: ప్రధాన గ్రంథాలు

తెలుగు భాషా సాహిత్య చరిత్రలో రామకథ అనేక రూపాలలో దర్శనమిస్తుంది. ఇక్కడ ముఖ్యమైన నాలుగు సంపూర్ణ సంప్రదాయ పరిపక్వ గ్రంథాలపై (రంగనాథ, భాస్కర, మొల్ల, కల్పవృక్షం) అలాగే అనువాద–వ్యాఖ్యాన పరంపర (మాండారం) పై దృష్టి పెడుతున్నాము.

3.1 శ్రీ రంగనాథ రామాయణము (గోన బుద్దా రెడ్డి / రంగనాథ)

కాల నిర్ధారణ: సుమారు క్రీ.శ. 1300–1310 మధ్య. కొన్ని అధ్యయనాలు కొద్దిగా ముందో/తరువాతో సూచించవచ్చు.

రచయిత నేపథ్యం: గోన బుద్దా రెడ్డి (స్థానిక పాలక వర్గానికి చెందిన యోధ– ఫ్యూడేటరీ క్షత్రియ కుటుంబం) ప్రజలకు సంస్కృత ఇతిహాసాన్ని సులభ భాషలో అందించాలనే తపనతో రచన ప్రారంభించినట్లు సంప్రదాయం.

రూపకల్పన: దాదాపు 17,000 పైగా ద్విపదలు: 7 కాండాల నిర్మాణం వాల్మీకి అనుసరణ ద్విపద ఛందస్సు వల్ల శ్రావ్యత & గేయనీయత.

సాంస్కృతిక లక్ష్యం: రాజాధీన గ్రామీణ సమాజంలో ధర్మకథ ప్రసారం: స్థానిక భాషా స్వరాలు: యజ్ఞ, రాజధర్మ అంశాల ప్రసంగ బలం.

పాత్ర దృక్పథం: రాముడు ఆదర్శ రాజు ధర్మపాలనపై కేంద్రీకరణ కొన్ని సందర్భాలలో స్థానిక ఆచారాల ప్రతిబింబం. ప్రభావం: ఆంధ్ర ప్రాంతంలో మౌఖిక గానం, హరికథ పాఠ్యంలో అనేక శ్లోకాల వినియోగం తరువాతి తెలుగుభక్త కవులకు మార్గదర్శక గ్రంథం.

3.1.1 ఛందస్సు & శైలి

ద్విపద (dwipada) నిర్మాణం తెలుగు కవిత్వంలో కథా రేఖల ప్రసారం కోసం విస్తృతంగా ఉపయోగించిన రూపం. సులభపఠనం, పందిరి గానం, గ్రామీణ పండుగలలో అనుకూలం. భాషలో ప్రాచీన తాడభాకులు, తక్కువ సంస్కృత గాఢత గల పదవ్యవహారం.

3.1.2 ధర్మ ఆవిష్కరణ

రాజధర్మ, పితృ వాక్య పరిరక్షణ, భార్యపుత్ర అనురక్తి వంటి వాల్మీకి మూలతత్త్వాలను స్థానిక సామాజిక బంధాలతో అనుసంధానించే ప్రసంగాలు గోన బుద్దా రెడ్డి శైలీలో సుగమీకరించబడ్డాయి.

3.2 మొల్ల రామాయణము (అట్టుకూరి మొల్ల)

కాల నిర్ధారణ: సాధారణంగా 15వ శతాబ్దం చివర 16వ శతాబ్దం ఆరంభం: విజయనగర కాల సన్నివేశంతో మేళవింపు.

రచయిత్రి స్వరూపం: తక్కువ వర్ణ (కుమ్మరి కులం) కి చెందిన మహిళ కవి తెలుగు సాహిత్యంలో ప్రాధాన్యమైన ఆది మహిళా స్వరాలలో ఒకరు.

ప్రాధాన్యత: సాదాసీదా తెలుగు; ప్రజలకు అర్థమయ్యే భాష: సంక్షిప్తీకరణ సుమారు 800–900 పద్యాల పరిమితి: అందుకే “కంద రామాయణం” అనే sobriquet.

భక్తి సమానత్వ భావన: రాజారాధనను నిరాకరించి స్వతంత్ర భక్తి “పండిత జడొట్టు పద్యమైతే బద్దిరుడి మాటల మాదిరే” అంటూ అర్థస్పష్టతను ప్రతిపాదించడం (ప్రసిద్ధ ఆరంభ భావం),

స్త్రీపర్వర దృష్టి: సీత భావోద్వేగాల సున్నిత చిత్రణ: స్త్రీ పాత్రల అంతర్గత వేదన మీద దృష్టి: ప్రజాభిమానాన్ని గెలుచుకున్న మూల కారణం.

3.3 భాస్కర రామాయణం ఇతర మధ్యయుగ తెలుగు రూపాలు

మధ్యయుగ తెలుగు సాహిత్యంలో పలు భాగిక రామకథలు, ఉతర రామాయణం వంటి అనుబంధ గ్రంథాలు (తిక్కన?–ప్రధానంగా మహాభారత రచయిత: కొన్ని రామాయణ పద్యాలు అతనితో తప్పుగా అన్వయించబడిన సందర్భాలు), ఎర్రాప్రగడ, అయ్యలరాజు రామభద్రుడు రచనలు మొదలై రామాభ్యుదయం వంటి కవితా కృతులు కనిపిస్తాయి. వీటిలో క్షత్రియపోషణ, కౌరవోపమానాల కంటే భక్తి–నీతిశాస్త్ర బోధ ప్రాధాన్యం పొందింది.

3.4 ఆధునిక & అనంతర కాలం: మాందారం (వావిలికొలను సుబ్బారావు), శ్రీమద్రామాయణ కల్పవృక్షము (విశ్వనాథ సత్యనారాయణ)

3.4.1 మాందారం: వావిలికొలను సుబ్బారావు (1902–1908)

సంస్కృత వాల్మీకి గ్రంథానికి యథావల్మీక అనువాదం చేయాలని నిశ్చయించిన విద్యావంతుడు; మంత్రిక సిలబుల సమానత్వాన్ని పునర్నిర్మించాలన్న సంకల్పం; విశద వ్యాఖ్యాన సహిత బహుభాగ సంపుటాలు. భాషలో **సంస్కృత నిఘంటు సౌరభం:** శాస్త్రీయ అనువాద సూత్రాల మొదటి పెద్ద ప్రయత్నాలలో ఒకటిగా గుర్తింపు.

3.4.2 శ్రీమద్రామాయణ కల్పవృక్షము (విశ్వనాథ సత్యనారాయణ, జ్ఞానపీఠ 1970)

20వ శతాబ్దపు తెలుగు సాహిత్యంలో "తెలుగు రామాయణం" అనే నేటివిటీ గుట్టుగా నిలిచిన గ్రంథం. విశ్వనాథ రాముడిని భగవంత స్వరూపంగా, ఆంధ్రజాతి సాంస్కృతిక అనుబంధాలతో కూడిన ప్రపంచంలో ప్రతిష్ఠించాడు. భాషా వైదుష్యం, సంస్కృత గ్రంథ సంపర్కం, స్థానిక ఆచార చిత్రణ ఈ గ్రంథాన్ని క్లిష్టమైనా మహత్తరమైన రచనగా నిలబెట్టాయి. ఆధునికత–సాంప్రదాయ మధ్య సంభాషణకు ఉదాహరణ.

3.5 మహిళల మౌఖిక రామకథ (తెలుగు)

వేల్చేరు నారాయణరావు వంటి పరిశోధకులు తెలుగు మహిళల గృహపూజా సందర్భాలలో, జన్మదిన, వ్రతకథల పఠనంలో, లల్లబీల్లో (ఒయి–పాటలు) రామకథ పరంపర నిలిచి ఉన్నట్లు సూచిస్తారు. ఇక్కడ సీత కేంద్ర పాత్ర: మాతృత్వం, కుటుంబ రక్షణ, దాంపత్య సద్వర్తన ప్రధాన బోధ. ఈ మౌఖిక సంప్రదాయం లిఖిత గ్రంథాల కన్నా భిన్నమైన రసాన్ని కలిగి ఉంది.

4.5. కన్నడలో రామాయణ సంప్రదాయం: జైన నుండి ఆధునిక దిశలు

కన్నడ రామకథ రెండు బలమైన ధారల్లో పరిమళిస్తుంది: (1) జైన– సంభూత తపోమయ రామకథ) (2) వైష్ణవ భక్తి–కేంద్రీకృత హిందూ పునరావృతాలు: తరువాతి కాలంలో ఆధునిక సాహిత్య ప్రయోగాలు.

4.1.1 జైన సంప్రదాయం: నాగచంద్ర (రామచంద్ర చరిత పురాణం)

కాలం: సాంప్రదాయకంగా 12వ శతాబ్దం.

స్వరూపం: జైన దృక్పథంలో రాముడు చివరికి జైన దీక్ష స్వీకరించి నిర్వాణం పొందుతాడు; రాక్షసుల చిత్రణ హింసాత్మక అద్భుతాలకు బదులుగా నైతిక దుర్బలతలుగా లక్ష్మణుడే రావణవధ చేసే భిన్నత,

సాంస్కృతిక పన్నీరు: జైన రాజపోషక వాతావరణంలో అహింసా ధర్మంతో ఇతిహాసాన్ని మళ్లీ రాయడం; హిందూ పాఠ్యాలకు ప్రతిస్పందన.

4.2 వైష్ణవ–హిందూ ధారా: తొరవే రామాయణం (నరహరి / కుమార వాల్మీకి)

కాల నిర్ధారణ: 15వ శతాబ్దం (కొన్ని మూలాలు ఆలస్యంగా 16వ శతాబ్దం పేర్కొంటాయి). ఛందస్సు: భామినీ షట్పది (Bhamini Shatpadi)– కన్నడ కథాకవిత్వంలో ప్రసిద్ధ రూపం.

నిర్మాణం: సుమారు 112 సంధులు (~5,000 పద్యాలు).

పాత్ర దృష్టి: అన్ని పాత్రలను రామభక్తి కణజాలంలో చూసే ధోరణి మంత్రను మాయా ప్రతినిధిగా, రావణుని చివరికి భక్తుడిగా, ఆటికాయ వంటి పాత్రల విస్తరణ: వైష్ణవ ధర్మ ప్రాధాన్యం.

శైలీ: అలంకారాల కంటే కథా ప్రవాహం: పండిత ఛాయ తక్కువ: భక్తి బలం అధికం.

4.3 ఆధునిక మహాకావ్యం: కువెంపు యొక్క శ్రీ రామాయణ దర్శనం

ప్రచురణ: భాగం 1 – 1949; భాగం 2 – 1957; జ్ఞానపీఠ పురస్కారం 1967 (అధికారిక ప్రకటన), సమర్పణ తదుపరి సంవత్సరంలో.

రూపం: స్వేచ్ఛా వృత్తం, రూపక శ్లేషాలు, హెరీమెరిక్ ఉపమాన విన్యాసం: వల్మీకి కథ రేఖను విశ్వదృష్టితో పునరాలోచన,

తత్త్వం: సమస్త జీవి పరిణామ ప్రస్థానం: పాపాత్మక రాక్షసులకూ మోక్షావకాశం: సీత అగ్నిప్రవేశ దశలో రాముని సాహచర్య అగ్నిప్రవేశం – సమాన ధర్మబద్ధత సంకేతం.

సామాజిక ప్రతిధ్వని: ఆధునిక కన్నడ ఆత్మబోధ, జాతీయత, సెక్యులర్ మానవతా భావాల సంగమ గ్రంథం.

భాషా ప్రభావం: కన్నడ కవిత్వంలో విశాల ఉపమాన ప్రపంచాన్ని తెరిచిన రచనగా విమర్శకుల ప్రశంస.

4.4 ప్రజా నాట్యపరంపర: యక్షగాన & తాళమద్దలె

కన్నడ సంస్కృతిలో రామకథ యక్షగాన ప్రదర్శనల ద్వారా గ్రామీణ జనజీవనంలో గాఢంగా నిలిచింది. వాలి మోక్ష వంటి ప్రసిద్ధ ప్రవాహ ప్రదర్శనలు: అర్ధరాత్రి నుండి తెల్లవారుజాము దాకా సాగు వేదికా సంప్రదాయం, సంగీతం, నృత్యరస, రంగుల వేషధారణలతో పౌరాణిక ఘట్టాల విశిష్ట ఆవిష్కరణ. తాళమద్దలే (స్వల్ప నృత్యరహిత వాచిక రూపం)లో సంభాషణాత్మక రీతిలో కథా సాంకేతికతలు అభివృద్ధి. యక్షగాన మేళాలలో రామకథ అధ్యాయాలు క్రమంగా చేర్చబడుతూ ప్రజామోదాన్ని నిలిపాయి.

5. తులనాత్మక విశ్లేషణ

ఈ విభాగం తెలుగు–కన్నడ రామాయణ గ్రంథాలు %ఒ% ప్రజా రూపాల మధ్య ప్రధాన సమానతలు. భేదాలు పలు భావరంగాలలో విశ్లేషిస్తుంది.

5.1 దైవత్వం VS మానవత్వం

తెలుగు: రంగనాథలో రాముడు ఆదర్శ రాజనీతి నాయకుడిగా, ధర్మపరుడిగా, దైవత్వం ఉన్నా కథలో మానవ ధర్మ సంక్లిష్టతలపై దృష్టి మొల్లలో రామ సన్నిహిత భక్తి మానవ అనుభూతి, కుటుంబ భావన ప్రధాన. కల్పవృక్షంలో రాముడు స్పష్ట భగవంత స్వరూపం: ఆంధ్రీయ నాగరికత బలపరచడం.

కన్నడ ధారా: నాగచంద్రలో రాముడు మోక్షకాంక్షి జైన తపస్వి, హిందూ దైవత్వం తగ్గింపు.

తోరవేలో రామభక్తి కేంద్రీకృత్త భగవత్ సంకల్పం సమస్త పాత్రలు భక్త చక్రంలో: కువెంపులో విశ్వాత్మక దైవతత్త్వం– రాముడు కాస్మిక్ మైండ్‌కి ప్రతీక.

5.2 ధర్మ నిర్మాణాలు

తెలుగులో రాజధర్మ, పితృఋణ, కుటుంబ నీతి ప్రసంగాలు ఎక్కువగా సామాజిక బోధ కార్యక్రమాలకు అనుకూలమయ్యాయి కన్నడలో భక్తి ధర్మ & తత్త్వ చింతన (ఆధ్యాత్మిక పరిణామ) గంభీర స్థాయికి ఎదిగింది– ప్రత్యేకించి కువెంపు వద్ద.

5.3 పాత్ర స్వరూపం: సీత

మొల్ల సీతకు భావోద్వేగ, భక్తి దృశ్య బలం: స్త్రీ గాఢత,

కువెంపు సీత అగ్నిప్రవేశ ఘట్టంలో రామునితో సమాన ధర్మబద్ధత లింగ సమానత్వ సంకేతాత్మక పునర్నిర్మాణం.

తొరవేలో సీత పట్ల దృక్పథం భక్తిమయమైనా నియమబద్ధ మంత్ర కుట్ర వల్ల అగ్ని పరీక్షా సందర్భాలు ధర్మపరీక్షలుగా,

5.4 మంత్ర, శూర్పణఖ, ఇతర స్త్రీ ప్రతినాయకులు

కన్నడ తోరవేలో మంత్రను మాయకు ప్రతీకగా (రావణుని వినాశానికి ఉపకరణం) నిర్మించారు. తెలుగులో రంగనాథ సంప్రదాయ దృక్పథం, మొల్లలో మంత్ర పాత్ర తగ్గింపుబీ ఆధునిక పఠనాల్లో (స్త్రీవాద, దళిత చర్చలు) మంత్ర సామాజికంగా స్థాన చలనం చేసే శక్తిగా పునర్వ్యాఖ్యాన మేధోప్రవాహం.

5.5 రాక్షసుల రూపకల్పన

- × నాగచంద్రలో రావణుడు దోషపరుడు అయినా తపోబలం కలిగిన వీరుడు హింసాత్మక మానవీకరణ: చివరికి రామ మోక్ష మార్గం.
- × తోరవేలో రావణుడు & అనుచరులు రామభక్తులుగా మారే పథం ద్వేషం–భక్తి పరివర్తన.
- × తెలుగులో సాధారణంగా రావణుని అధర్మబల ప్రతీకగా, కానీ కల్పవృక్షంలో తత్త్వ చర్చల వేదిక.

5.6 ఛందస్సు, కవితాశైలీ

గ్రంథం	భాష	ఛందస్సు వాల్మీకి సారూప్యాలు	ప్రజాగానం సామర్థ్యం
రంగనాథ	తెలుగు ద్విపద	కథా నిర్మాణం 7 కాండాలు	అధికం (పందిరి గానం)
మొల్ల	తెలుగు కంద (వివిధ స్థానిక గీత రూపాలు)	సంక్షిప్త రేఖ	అత్యధికం (సులభ భాష)

	వివిధ సంప్రదాయ ఛందోబద్ధతలు	మూలకథ అనుసరణ + స్వేచ్ఛ	తక్కువ (పండిత శైలి)
నాగచంద్ర	కన్నడ జైన కవితా రూపం (చంపూ /పురాణ శైలి)	కథాత్మక కానీ ముగింపు భేదం	మధ్యస్థ
తోరవే	కన్నడ భామినీ షట్పది	వివరణాత్మక, భక్తి పునర్రచన	మధ్యస్థ / శ్రావ్య
రామాయణ	కన్నడ స్వేచ్ఛా వృత్తం	కథారేఖ ఆధారంగా తత్త్వ విస్తరణ	వాచిక పఠనం; గేయత తక్కువ

5.7. సామాజిక ఆధారాలు & ప్రేక్షక వర్గాలు

రాజసభలు (విజయనగర, ప్రాంతీయ పాలక వర్గాలు) పండిత/పండుగ గానం: గ్రామీణ సంప్రదాయం మౌఖిక గానం (మొల్ల, రంగనాథ); మఠపరంపరలు జైన, వైష్ణవ పాఠ్య పరిరక్షణ (నాగచంద్ర, తోరవే): ఆధునిక విద్యాసంస్థలు – కువెంపు, సుబ్బారావు అనువాదాలు; సాహిత్య వేదికలు – విశ్వనాథ మహాకావ్యం,

5.8. లింగం, కులం, మరియు ప్రజాతంత్ర పఠనాలు

మొల్ల కేస్లో కులాధిష్ఠిత అడ్డంకులను దాటుతూ స్త్రీ–దళిత స్వరం: ఈ స్వరాన్ని ఆధారంగా చేసుకొని సమకాలీన దళిత స్త్రీవాద రచనలు మొల్లను పూర్వగామిగా చూస్తున్నాయి. కన్నడలో యక్షగాన మహిళా ప్రదర్శకులు, ఆంధ్రాలో హరికథ పాఠశాలల్లో యువతీ శిక్షణ (ఉదా: ఆంధ్ర గోదావరి పాఠశాల) లింగ వసుధను విస్తరించాయి.

6.1. రామకథ ప్రజా కళారూపాలలో: తెలుగు–కన్నడ సంస్కరణలు

రామాయణం గ్రంథాల గదుల్లో మాత్రమేగాక పల్లె వేదికలపై కూడా జీవిస్తుంది. ఈ విభాగం ప్రజా రూపాల తులన.

6.1 ఆంధ్ర–తెలుగు ప్రాంతం

హరికథ: కథ, గానం, నృత్య, సంగీత కలయిక; నరసింహ దాస్, ఆడిభట్ల నారాయణదాస్ ప్రభావం; రామకథ ప్రధాన ఇతివృత్తాలలో ఒకటి; నేటికీ శిక్షణా పాఠశాలలు (ఉదా: గోదావరి తీరంలోని కపిలేశ్వరపురం) జీవించి ఉంచుతున్నాయి.

బుర్రకథ / జంగం కథ: తంబుర ఆధారిత మూడు సభ్యుల బృందం: యక్షగాన మూలం

ఉన్నదని స్థానిక వాదనలు: రామకథ ఘట్టాలు ప్రజాసంగ్రామ, సామాజిక చైతన్య ప్రసంగాలకు పునాది.

తోలు బొమ్మలాట: నీడవుప్పెట్స్ ద్వారా రామకథ రాత్రంతా: గ్రామీణ భక్తి-వినోద సమ్మేళనం: పురాతన శిల్పకళ.

6.2 కర్ణాటక-కన్నడ ప్రాంతం

యక్షగాన: సంగీత-నృత్య- నాట్య ఘనావిష్కరణ; వాలి మోక్ష, శ్రీరామ కారుణ్య వంటి ప్రసిద్ధ ప్రయోగాలు: తెన్కు తేటు & బడగుతట్టు శైలులలో రామకథ ఎంపికలు: సుదీర్ఘ రాత్రి ప్రదర్శన సంప్రదాయం.

తాళమద్దలే: వాచిక సంభాషణాత్మక రూపం: రామాయణ ఘట్టాల దార్శనిక చర్చలకు వేదిక: కళాకారుల తత్త్వ నైపుణ్య పరీక్ష.

6.3 అంతరప్రాంత పరస్పర ప్రభావాలు

బుర్రకథలో యక్షగాన మూలం ఉందన్న స్థానిక విమర్శ: హరికథ పాఠశాలల్లో కన్నడ విద్యార్థుల శిక్షణ (సాంస్కృతిక మార్పిడి); యక్షగాన మేళాలలో తెలుగు పాటల గ్రహణ. రామకథ ఈ ఆప్యాయ పరస్పర మార్పిడికి మాధ్యమం.

7. ఆధునిక పునర్వ్యాఖ్యలు మరియు విమర్శనాత్మక చర్చలు

ఆధునిక ముద్రణ, కాలనీయ విద్య, జాతీయతా ఆందోళనలు, దళిత - స్త్రీవాద సమూహాల ఆలోచనలు రామకథ పఠనాన్ని గణనీయంగా మార్చాయి.

7.1 కాలనీయానంతర తెలుగు విమర్శ

వెల్చేరు నారాయణరావు వంటి పండితులు రామకథను వర్గ-జాతి పరిప్రమాణంతో పునర్నిర్వచిస్తారు; విశ్వనాథ సత్యనారాయణ యొక్క పౌరాణిక పునరుద్ధరణపై ఆధునికులు/మార్క్సిస్టు విమర్శకుల తీవ్ర చర్చలు: ముద్రణసంస్కృతితో బహుళ పాఠ్యాల ప్రాచుర్యం.

7.2 దళిత-స్త్రీ పఠనాలు

మొల్లను తొలి దళిత మహిళా కవిగా ప్రతిపాదించిన సమకాలీన వ్యాసాలు: ఆమె భాషా సౌలభ్యం ప్రజాస్వామ్య సాహిత్య రాజకీయ సూచికగా, సీత బాధను కుల-లింగ నిర్బంధానికి ప్రతీకగా చదవడం,

7.3 కన్నడ ఆధునిక దృష్టులు

కువెంపు సమానత్వ దృక్పథం; రామ-సీతల అగ్నిప్రవేశం ద్వారా లింగ సమాన ధర్మదృక్పథం: రావణునికి మోక్షావకాశం-శత్రుత్వ వర్గాలను సమన్వయించే జాతీయ మానవతా

సంకేతం.

8. విద్య, డిజిటలైజేషన్, భవిష్యత్ పరిశోధన

ఇంటర్నెట్ ఆర్కైవ్లలో టోరవే రామాయణ సంచికలు, తెరవెనుక సంస్కరణ గ్రంథాల డిజిటల్ స్కాన్లు; యూనివర్శిటీలకు ఓపెన్ యాక్సెస్ పాఠ్య గణాంక విశ్లేషణ (NLP) ద్వారా ఛందోపరమైన పరస్పర ప్రభావాల అధ్యయనం సాధ్యం. బహుభాషా సమలేఖనం కోసం యూనికోడ్ ప్రమాణీకరణ, TEIXML ఎడిషన్ అవసరం. భవిష్యత్ పరిశోధనలో ప్రజా కళారూపల మల్టీమీడియా ఆర్కైవ్ నిర్మాణం కీలకం.

9. ముగింపు

తెలుగు మరియు కన్నడ రామాయణాలు భారతీయ ఇతిహాసం స్థానికీకరణలో పరస్పరపూరక పాత్రలు పోషించాయి. తెలుగు రామాయణాలు ప్రజాసంబంధిత భాష, భక్తి, కుటుంబ భావనలతో కథను సులభీకరించగా, కన్నడ సంప్రదాయాలు జైన తత్త్వ నిగర్భత నుండి విశ్వదృష్టి ఆధునికత వరకు విస్తరించాయి. రెండు భాషలు రామకథను కేవలం ధర్మగాథగా కాక, సామాజిక చర్చల వేదికగా కూడా మలిచాయి కుల, లింగ, రాజకీయ పరివర్తనల కాలి ముద్రలు వాటి పాఠ్యాల్లో ప్రతిభావంతో కనిపిస్తాయి. ప్రజా నాట్య రూపాల ద్వారా కథ ప్రజామెమరీలో నిలిచింది: డిజిటల్ యుగంలో ఈ సంపదను అంతరపాఠ్య, అంతరమాధ్య మాధ్యూల్సుగా విద్యకు అందించడం కొత్త అవకాశాలను తెరుస్తుంది.

గ్రంథసూచిక

* Hindu Blog (Abhilash Rajendran). 2022, "Difference Between Kannada Torave Ramayana and Valmiki Ramayana".
* Kundalia, Nidhi Dugar. 2013. The Lost Generation: Chronicling India's Dying Professions, ర్యాండమ్ హౌస్ ఇండియా. (బుర్రకథ సూచనలు).
* Narayana Rao, Velcheru, 2001 (essay date). "The Politics of Telugu Ramayanas: Colonialism, Print Culture, and Literary Movements." In Ramayana: Criticism.
* Narayana Rao, Velcheru. 2008. "A Ramayana of Thier Own: Women's Oral Tradition in Telugu." In Paula Richman (ed.) Ramayana Stories in Modern South India: An Anthology. బ్లూమింగ్టన్: ఇండియానా యూనివర్శిటీ ప్రెస్.
* Naidu, T.Appala. 2022. "Where girls are breathing life into Abibhatla's Harikatha." The Hindu.
* Paula Richman (ed.). 2023 (నూతన ముద్రణ; ముసాయిదా 1991 మొదటి ప్రచురణ)

Many Ramayana. యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా ప్రెస్.

* Paula Richman (ed.). 2008. Ramayana Stories in Modern South India; An Anthology. ఇండియానా యూనివర్శిటీ ప్రెస్

* Satyanarayana, Viswanatha. Srimad Ramayana Kalpavrukshamu. వివిధ సంపుట ముద్రణలు.

* Subbarao, Vavikolanu. 1902-1908. Mandaram (Telugu tranlation of Valmiki Ramayana). విభినన సంపుట ప్రచురణలు; వ్యాఖ్యానంతో.

4

గజ్జెల మల్లారెడ్డి కవిత్వం - సామాజికత

- ఆచార్య పి.సి.వెంకటేశ్వర్లు

తెలుగు సాహిత్య చరిత్రను పరిశీలించినప్పుడు అన్నమయ్య, ధూర్జటి, వేమన, వీరబ్రహ్మం వంటి ఒక ప్రత్యేక తరహాకు చెందిన కవులు, ఒక ప్రాంతం నుండి ఒక్కోకాలంలో ప్రత్యేక గొంతుకతో కవిత్వాన్ని చెప్పడం మనం గమనిస్తాం. అలాగే ఆధునికకాలంలో విమర్శను ఒక విలక్షణమైన పంథాలో నడిపించిన కట్టమంచి, రారా, రాచపాళెం వంటివారు ఒకే ప్రాంతం నుండి రావడాన్ని గమనిస్తాం. ఆ కవులు, ఈ విమర్శకులు ఒక ప్రాంతం నుండి రావడం యాదృచ్ఛికం కాదు. ఆ ప్రాంతపు ప్రజల జీవన సరళిలో నుంచి ఆలోచనా విధానంలో నుంచి వారు తమ వాక్యాలను మలచుకుంటూ వచ్చారు. అలాంటి కవిత్వం, విమర్శ సామాజికతకు అగ్రతాంబూలం ఇచ్చాయి. వారి వారసత్వాన్ని కొనసాగించిన వారిలో గజ్జెల మల్లారెడ్డి ఒకరు. అయితే కవిత్వాన్ని, విమర్శను కలబోసి విమర్శనాత్మక కవిత్వాన్ని చెప్పిన మల్లారెడ్డి మాట, బాట, ఆచరణ మూడు ఏకమార్గంలో సాగాయి. ఆయన జీవితంలో మొదటి రెండు దశాబ్దాలు, చివరి దశాబ్దం మినహాయిస్తే మిగిలిన నాలుగు దశాబ్దాలు సమసమాజ నిర్మాణంకోసం అనుక్షణం తపించాడనడంలో ఎలాంటి సందేహం లేదు. వారి గేయాలు, శంఖారావం, చంద్రహాసం వంటివి ఆయన కవితా దృక్పథాన్ని తెలియపరుస్తాయి. తెరిచిన పుస్తకంలాంటి ఆయన జీవితపుటలను 'అంత:సాక్షి' ఆత్మకథ తెలియపరుస్తుంది. గజ్జెలవారు అనువదించిన మఖ్దుం సాహిత్యం మనల్ని ఆలోచింపజేస్తుంది. యతిగీతం, ధమ్మపదం, సుహృల్లేఖ, రత్నావళి వంటి గ్రంథాలు వారి చివరి దశలోని తాత్త్విక మార్గాన్ని పట్టి చూపిస్తాయి. సవ్యసాచి, వీచిక, విశాలాంధ్ర, ఈనాడు, ఆంధ్రభూమి, ఉదయం వంటి పత్రికల్లో రాసిన సంపాదకీయాలు, కవితా కాలమ్స్ మల్లారెడ్డిని చిరస్మరణీయుణ్ణి చేస్తాయి.

శ్రీశ్రీ అన్నట్లు చెప్పినట్లు ఆయన కమ్యూనిస్ట్ అయ్యాక కవితాశిఖరాలను అందుకున్నాడు. కేతు విశ్వనాథరెడ్డి చెప్పినట్లు "బుద్ధి చెప్పేవాడు గుద్దితేనేమయా" అనే వేమన మాటలను ఆచరణలో

పెట్టి, దుర్మార్గాన్ని గుద్దిమరీ కవిత్వం చెప్పడం ఆయన నైజం. బహుశా ఇదేమార్గం దిగంబర కవులకు ఉపకరించి ఉండవచ్చు.

వర్తమాన సామాజిక కవులు ప్రపంచీకరణ, ట్రాన్స్‌జెండర్, మానవీయత వంటి వస్తువులపై కవిత్వం రాస్తున్నారు. ఈ మార్గానికి ద్వారం తెరిచింది గజ్జెలవారు. నాటి సమకాలీన జీవితంలో ప్రారంభమైన సంక్లిష్టతను, ఊపిరాడని ఉక్కపోతను దగ్గర నుండి గమనించాడు. అలాంటి పరిస్థితుల్లో చిన్న రంధ్రం నుండి స్వేచ్ఛావాయువుని పంపడానికి మల్లారెడ్డి కవిత్వాన్ని సాధనంగా ఎంచుకున్నాడు. ఎడ్లబండ్లపై వేలకొలద్దీ జనాలను తన ఉపన్యాసాలకు రప్పించుకో గలిగిన ఆ మహావక్త, ఈ కవితల ద్వారా వాళ్ళ దగ్గరకు వెళ్ళగలిగాడు. కుందుర్తిలాంటి వాళ్ళు 'నీతిని సజీవంగా పట్టించినవారికి పెద్ద బహుమానం ప్రకటించడం' వెనుక నీతికి, అవినీతికి మధ్య తేడా కనిపించేది. శ్రీశ్రీ తన మిత్రుడి గురించి చెబుతూ 'ధూర్తలోకంలో ఉండలేక వెళ్ళిపోయావా నేస్తం' అనడంలో రెండు లోకాలు కనిపిస్తాయి. అయితే 1960 నాటికి మల్లారెడ్డికి ఈ తేడాల మధ్య రేఖ చెరిగిపోయినట్లు కనిపించింది. ఆనాడు అవినీతి గద్దెనెక్కి రాజనీతిగా మారి, అవినీతిని అంతం చేస్తానంటోంది. మొత్తం లోకమంతా ఒకే విధంగా కలగలసినట్లు అనిపించింది. దాని గురించి మాట్లాడాల్సిన కవులు తమలోకాల్లో తాము మునిగిపోయారు. తిమిరంతో సమరం చేస్తానన్న దాశరథి, పదండి ముందుకు అన్న శ్రీశ్రీ, త్వమేవాహం అన్న ఆరుద్ర, సినిమా రంగంలో తీరికలేకుండా రాతలు రాస్తున్నారు. మిగిలిన అభ్యుదయ కవులేమో ఏమి చేయాలో పాలుపోక ఆకాశం వంక చూస్తున్నారు. ఈ స్తబ్ధతలో గజ్జెల మల్లారెడ్డి మిట్టమధ్యాహ్నపు సూర్యుడిలా, చంద్రగొడ్డలి లాంటి కవితలతో అస్తవ్యస్తమైపోతున్న వ్యవస్థ సరిచేయడానికి నడుం బిగించాడు.

వర్తమానంలో నడుస్తూ భూతకాలాన్ని కలలుగంటున్న వారు సామాజిక కవులుకారు. వర్తమానంలో నడుస్తూ భవిష్యత్తును స్వప్నించేవారు, ఆ స్వప్నాలను సాకారం చేయడానికి కార్యాచరణ చేసేవారు ఆధునిక కవులవుతారు. నేటి జీవన విధానాలతో సాగుతూ మనువుకాలం కబుర్లు చెప్పడం ఈ రోజు మనం చూస్తున్నాం. ఆరు శతాబ్దాల కిందటే ఇలాంటి కబుర్లు కట్టిపెట్టమని గజ్జెలవారు సూటిగా చెప్పారు. **'మనువు పుట్టిన దేశం'** ఖండికలో స్త్రీని ఆటబొమ్మగా చేసి ఆడుకొన్న వ్యవస్థలోకి మళ్ళీ మమ్మల్ని లాక్కెళతారా అని ప్రశ్నిస్తాడు.

"తల్లిగా చెల్లిగా తనువులో సగముగా
మగవారికండగా మసలు స్త్రీజాతిని
ఆటబొమ్మను చేసి ఆడుకొన్నారిచట" అనడంలో మనుస్మృతి కాలపు సమాజ దుస్థితిని ఎండగట్టడమే. ఆధునిక కవిత్వమంటే నేటి మనిషి గురించి రాయాలి. సమస్య గురించి చెప్పాలి. దానికి పరిష్కారాన్ని సూచించాలి. అలా కాకుండా పెద్ద పెద్ద ప్రబంధకావ్యాలు రాసి కడియాలు, కంకణాలు, గండపెండేరాలు తొడిగించుకునే వారు స్వార్థపరులంటాడు.

"కట్టెదుట నిరుపేద / పట్టెడన్నము లేక
ఆకలోయని చావు / కేకలేస్తుండగా
భూరి కావ్యము రాసి / పొంగిపోతావా
గండపెండారాల / గంతులేస్తావా" అని నిలదీస్తారు. కవులు, రచయితలు తమ కృతుల్ని, గ్రంథాల్ని అంకితం పేరుతో అమ్ముకోవడాన్ని చూసి భరించలేకపోయాడు గజ్జెల. ఆ రోజు కాటుక కంటినీరు పెట్టిన సరస్వతిని చూసిన పోతన చలించిపోయి, ఆమెను ప్రభువులకు ఇవ్వనని ప్రతిజ్ఞ చేశాడని, ఆ పోతనకున్న సామాజిక నీతి నేడు అభ్యుదయ కవులమని చెప్పుకుంటున్న వారికి లేదని ఎద్దేవాచేశాడు. ఎందుకంటే కవిత, కవిత్వం, కళ వంటివి శ్రామికుల కోసం సామాన్యులకోసం అర్పిస్తామని చెప్పిన మేటి కవులు.

"సిని విరటుని కూటములో / సీట్ల సిగపట్లు బట్టి
సరసకళా కీచకులకు / నర్మసచివులైనార" ని విమర్శించాడు. అందుకే తన ఆవేదనకు గుద్ది మరీ చెప్పాడు.

గజ్జెల మల్లారెడ్డి దేవుణ్ణి, ఆధ్యాత్మికతను విమర్శించాడని అంటారు. కానీ, ఆయన కవిత్వాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే స్వార్థ భక్తుల్ని, అవినీతిలో వాటాలు పంచే భక్తాగ్రేసరుల్ని, ముక్కెరల్ని మొక్కులుగా చెల్లించే మోసపూరిత నాయకుల్ని విమర్శించారు. సులభంగా గొప్పవాటిని సొంతం చేసుకోవాలనే కపటబుద్ధి కలిగినవారిని కనిపెట్టమని భగవంతుడికి వ్యంగ్యంగా వర్తమానం పంపడం ఆయన ఉద్దేశం.

"చదవకుండా పాసయ్యే / షార్ట్‌కట్ దొరకాలని
ఉద్యోగాల్ ప్రమోషన్లు / వద్దన్నా రావాలని
టెంకాయల లంచంతో / దేవునికి పిటీషన్లు
తలనీలాలిస్తామని / తిరిగిలేని అగ్రిమెంట్లు" భారీ వ్యాపారంతో దోపిడీ చేస్తూ, వచ్చిన ఆదాయంలో దేవుడికి సగం సగం వాటావేసే అవినీతి పరుల విషయంలో జాగ్రత్తగా ఉండమని చెబుతాడు. ఇలాంటి వారికి గుండు చేయించుకొనే సమయంలో నెత్తిపై గాట్లు పెట్టమని కోరడంలో ఆయనలోని నాస్తికత్వం కంటే వాస్తవికత్వం స్పష్టంగా కనిపిస్తుంది.

పదమూడు సంవత్సరాల స్వతంత్రభారతంలో రోజురోజుకి పెరిగిపోతున్న అవినీతివృక్షాన్ని చూసి సామ్యవాదకవిగా గజ్జెల సహించలేకపోయాడు. ప్రభుత్వ ఉద్యోగాల్లో, కాంట్రాక్టర్లలో హెచ్చుమీరిన అవినీతిని, నిమ్మళంగా చూస్తున్న ప్రభుత్వాన్ని నేరుగా మందలించ దలచుకున్నాడు. రాజకీయనాయకుడి పైరవీ, పచ్చనోట్ల లంచం ఇస్తే ఉద్యోగం ఇచ్చేస్తున్న సమితి విధానాన్ని, పరిషత్ పోకడలను విమర్శించాడు. ప్రాజెక్టులు కట్టిన కొన్నాళ్ళకే కూలిపోవడాన్ని కళ్లారా చూసి తమాయించుకోలేకపోయాడు గజ్జెల.

ISSN No.2319-3905

“సిమెంటు బదులు ఇసుక / జొరబడటం చూడలేక
కడుపుమండి ప్రాజెక్టులు / గంగలోన దూకెనంట” వంటి వాక్యాలు ఊహతో,

అతిశయోక్తితో రాసినవి కావు. నాడు కొన్ని ప్రాజెక్టుల పరిస్థితి ఇదే. అలాగే నాయకులు లక్షల రూపాయలు కాంట్రాక్టర్ల దగ్గర, నిరుద్యోగుల దగ్గర వసూలుచేసి సంపన్నులైపోతున్న తీరును గజ్జెల చూశాడు. అయినా, తాము ఏమీ సంపాదించలేదని బుకాయించే నాయకుల మోసపూరితమైన వ్యాఖ్యలను వ్యంగ్యంగా విమర్శించాడు. **‘అద్వైతం’** ఖండికలో చెప్పిన

“సొంతలాభం కొంత ఎందుకు? / సొంతమే మానేసినామోయ్
ఆలుపిల్లల పేరరాసిన / ఆస్తి వివరాలెందుకోయ్” అనడంలో నాయకులు

చేస్తున్న కొత్తరకం వాదనలను చిత్రికపట్టి చూపించాడు.

మల్లారెడ్డి పత్రికారంగంలో ఎక్కువకాలం ఉన్నాడు. అయితే తాను ఉన్న రంగాన్ని నెత్తికెత్తుకునే సంకుచిత తత్వం ఆయనలో లేదు. కపటత్వం, అన్యాయం, అసమానత, అవినీతి వంటివి ఎక్కడవున్నా కుండబద్దలు కొట్టినట్లు విమర్శించడం ఆయన నైజం. పత్రికారంగపు వింత పోకడలను, రేడియో ప్రభుత్వ పక్షగొంతుకగా మారడాన్ని సందర్భం వచ్చినప్పుడల్లా విమర్శించేవాడు. ఈరోజు మనం చూస్తున్న సామాజిక మాధ్యమాల గొంతుకలకు మూలం మల్లారెడ్డి వారసత్వం అని చెప్పక తప్పదు. గొంగడిలో తింటూ వెంట్రుకలున్నాయి అని అసంతృప్తి వ్యక్తం చేసే వ్యక్తిత్వం కాదు ఆయనది. వెంట్రుక రాలే గొంగడిని విసిరిపారేసి పస్తులుండడానికైనా సిద్ధమంటాడు ఆయన. అంత తెగింపు ఉండబట్టే తానున్న పత్రికారంగంలోని కొన్ని పత్రికల పోకడలను

“పెట్టుబడికి కట్టుకథకు / పుట్టిన మన పత్రికలు
పాతబడిన పురాణాల / పాతర్లను త్రవ్వితోడి
చేటలతో చేదస్తం / చెరగడమే బ్రతుగు దెరువు” అని తూర్పారా పట్టాడు.

అవాస్తవాలను వాస్తవాలుగా మార్చి కథనాలు రాస్తున్న నాటి కొన్ని పత్రికలకు చెంపదెబ్బలాంటి వాక్యాలను విసిరాడు మల్లారెడ్డి. ఆకాశవాణిని ‘అవకాశవాణి’ అనడం వారిలోని ధైర్యానికి నిదర్శనం. పత్రికల సంపాదకులు వ్యసనాలకు లొంగిపోయి, ప్రభువుల అడుగులకు మడుగులొత్తుతున్న పద్ధతిని కళ్ళారా చూసిన ఆయన

“అమృతరసం చవిచూసే / వార్తా పత్రికల వాళ్ళు
వాటంగా మార్చి కూర్చి / బ్యానర్ హెడ్‌లైన్స్ ఇచ్చి
వుంచుకున్న ప్రభువులపై / పెంచుతారు విశ్వాసం” అనడంలో ఆయన

నిజాయితీ కనిపిస్తుంది.

తెలుగు ప్రాంతాల్లో, కేంద్రంలో కాంగ్రెస్ చేస్తున్న రాజకీయాలను కవిత్వంతో పత్రికాముఖంగా బాహాటంగా ఎండగట్టిన కవి గజ్జెల. ‘రాజుల్మత్తులు’ అని చెప్పిన ధూర్జటి, ‘నరుల నుతింపగ నోపదు జిహ్వ’ అన్న అన్నమయ్య నేలనుండి వచ్చిన ఈ కవి ఆధునిక రాజరికాన్ని, నాటి కాంగ్రెసు బూర్జువా పాలనను అక్షరాలతో, ఉపన్యాసాలతో గద్దించి ప్రశ్నించాడు. ఈరోజు ఆయన వుండి అలాంటి కవిత్వం రాసి ఉంటే కలుబుర్గి, గౌరీలంకేష్ లాగా అసువులు బాసుండేవాడు. లేదంటే సాయిబాబా, వరవరరావు ల్లాగా జైల్లో మగ్గిపోయివుండేవాడు. ఆ రోజు నీలం సంజీవరెడ్డి కాంగ్రెస్ అధిష్టానాన్ని ధిక్కరించడాన్ని గజ్జెల హర్షించాడు. కేంద్రానికి గులాంగిరీ చేసే ఆంధ్రుడు కాదని నీలంవారికి కితాబిచ్చాడు. ఎన్నికల సమయంలో కులమతాల ఉన్మాదాన్ని రెచ్చగొడుతున్న రాజకీయ పార్టీలను నిలబెట్టి ప్రశ్నించాడు.

“కులమతాల ఉన్మాదం / కూడదంచు పాడుకో
అవకాశాన్ననుసరించి / అన్నిటినీవాడుకో” అనడం కుహనా రాజకీయ

నాయకుల తత్వాన్ని వెక్కిరించడమే. నాయకులు తమ గెలుపుకోసం దేవుడికి ఎన్నిరకాల విన్నపాలు చేసుకొంటున్నారో, **‘ఆపదమొక్కులు’** ఖండికలో హాస్యాన్ని కలిగించేలా తెలియజేశాడు. ఏడుకొండలవాడి సతీమణి ద్వారా ఈ కపటనాయకులు తమ విన్నపాలను శ్రీనివాసుడికి పంపుతున్నారని తెలియజేస్తూ, స్వామిని కాస్త జాగ్రత్తగా ఆలోచించమంటాడు. ఎన్నికలు దాటిస్తే నిలువుదోపిడీ ఇస్తామని మొక్కుకునేవారు, పరమనాస్తికుడైన ప్రత్యర్థిని ఓడించమని పూజచేసేవారు, సొంతపార్టీలో వెన్నుపోటుదార్లను అంతం చేయమని అభ్యర్థించేవారు, గెలిచాక మంత్రిపదవి కూడా మంజూరు చేయించమని విన్నపాలు చేసేవారు ఎక్కువైపోయారని, ఓ కంట కనిపెట్టమని అలివేలు మంగమ్మతో అంటాడు మల్లారెడ్డి.

1960 నాటికే రాయలసీమ ప్రాంతీయ అస్తిత్వంపై గజ్జెలవారికి స్పష్టమైన అవగాహన ఉంది. అప్పటికే కె.సభా లాంటివారు ‘పాతాళగంగ’ లాంటి కథలద్వారా స్పందిస్తున్నారు. మల్లారెడ్డి తన ఆవేదనను

“కరువు పిశాచం / కరాళ నృత్యం
చేసెను రాయల / సీమను జూడర” అంటాడు.

తాను పుట్టి పెరిగిన ప్రాంతీయ సామెతలను కూడా కవితల్లో శక్తివంతంగా ఉపయోగించడం కూడా ప్రాంతీయ అస్తిత్వ వేదనే.

“ఎద్దు చచ్చిననేమి / ఎంతచక్కని వాత
వెలసెనో తిలకించి / పులకించవలెనంట” అనడం సమకాలీన సీమప్రజల

దుస్థితిని పరోక్షంగా చెప్పడమే. దారిద్ర్యాన్ని అనుభవిస్తూ, పైకి బింకంగా నటించడం మల్లారెడ్డికి చేతకాదు. పాలిస్తున్నది రెడ్లే కదా! ప్రభుత్వాన్ని ఏమి అనకూడదనే సంకుచిత స్వభావికాదు ఆయన. తను ఉంటున్న నేలలోని దారిద్ర్యాన్ని చూసికూడా పొగడుకోవడం ఆయనికిష్టం లేదు. అందుకే **‘వందేమాతరం’** ఖండికలో

 ISSN No.2319-3905

"కరువు కడుపున పుట్టిన / పరమ దరిద్రుణ్ణి నేను
తాగేందుకు మంచినీళ్ళు / దొరకని ప్రాంతాల వాణ్ణి
సుజల అనలేను నిన్ను / సుఫల అనబోను నిన్ను" అనడంలో ఆయన ఆర్ద్రత, ఆవేదన అర్థమవుతాయి.

మల్లారెడ్డి కవితల్లో ఆంధ్రప్రబోధం, అద్వైతం, యక్షప్రశ్నలు వంటివి పేరడి కవితలు. అయినా, అవి సమకాలీన జీవన సత్యాలు. రా.రా. "జీవితమే పేరడిగా మారినపుడు దాని గురించి రాసిన కవిత్వం పేరడీ ఎలా అవుతుంది." అనడం నూటికి నూరుశాతం నిజం. అవి పేరడీలయినా, ఆనాటి సామాజిక వ్యవస్థలోని అసమానతలను కళ్ళముందు చూపించేవి. వేములపల్లి శ్రీకృష్ణ రాసిన 'చేయెత్తి జైకొట్టు తెలుగోడా' బాణీలో వ్యంగ్యాన్ని జోడించి నాటి సమజానికి అన్వయిస్తూ 'గతకీర్తి తలపొగరు కలవాడా' అనడం ఆయనలోని స్పష్టమైన వైఖరికి నిదర్శనం. ఎంతో గొప్పవాడనే తలబిరుసు తెలుగువారికి ఎక్కువని, ఇతరుల్లో ఉన్నంత సమైక్యత భావన కనిపించదని ఆయన ఆలోచన. గురజాడ దేశచరిత్రల నమూనాగా ఎంచుకొని రాసిన కవితలో కూడా ప్రజల్ని మౌనంగా ఉండకుండా తిరగబడమనే ధోరణి కనిపిస్తుంది. నాయకులకు తొడపాశం పెట్టమని ప్రజలను హెచ్చరిస్తాడు. "ధనికులింకా ధనికులైరని / మనసు మాడ్చుక బాధపడకోయ్

పరులకలిమికి పొరలియేడ్చే / పాపులకు సుఖమబ్బదోయ్"

మహాభారతంలో యక్షుడడిగిన ప్రశ్నలకు ధర్మరాజు సమాధానం చెబుతాడు. గజ్జెలవారు గురుశిష్యుల మధ్య ఈ సంవాదాన్ని కల్పిస్తాడు. గురువు ప్రశ్నలకు శిష్యుడు మార్గాలు చూపిస్తుంటాడు వ్యంగ్యంగా.

"ఆహార సమస్యకు మా / ర్గాంతరమొకటున్నదా
వారానికొక్కపూట / ఉపవాసం చాలు గురూ" అంటూ నాయకులు చూపిస్తున్న పరిష్కార మార్గాలను హేళన చేస్తాడు. ఈరోజు కూడా మన సచివుల్ని రూపాయి విలువ పడిపోతుందని అడిగితే, డాలరు విలువ పెరిగిందని సమాధానం చెబుతూ తమ తెలివి తేటలను ప్రదర్శిస్తున్నారు. ఈ చావు తెలివి ఆ రోజు మల్లారెడ్డి పసిగట్టి ప్రశ్నించాడు.

గజ్జెల మల్లారెడ్డి ముక్కుసూటి మనిషి. కమ్యూనిజాన్ని ఇష్టపడి ఆ పార్టీలో పనిచేసినా, తన ఆస్తిపాసుల్ని పార్టీకి రాసినా, మావో నాయకత్వాన్ని ఆయన సిద్ధాంతంతో నడుస్తున్న చైనా దేశాన్ని విమర్శిస్తూ వచ్చాడు. వినయం, ఓర్పు వంటివి సామాన్య మనుషుల లక్షణమని, ధిషణాహంకారంతో దిమ్మెక్కిన తనలాంటి వారికి సాధారణ నీతి నియమాలు పనికిరావని అంటాడు. ఆయన చలంను విమర్శించినా, చివరిదశలో రామకృష్ణ పరమహంస తత్వాన్ని, బుద్ధుని ధర్మాన్ని అనుసరించాడు. ఇది కొంతమందికి నచ్చని విషయమైనప్పటికీ, మనిషిని కేంద్రబిందువుగా చేసుకొని సామాన్యుని బ్రతుకు చక్కబడాలని నడక సాగించాడు. ఆ నడకలో చివరగా తన

మనస్తత్వానికి సరిపోయే తాత్వికతవైపు పయనించాడు. ధైర్యంగల కవి సాహిత్యంలో ఎప్పుడూ చిరస్మరణీయుడే. వారి కవితా వాక్యాలు వర్తమాన సమాజానికి కూడా చైతన్య స్ఫోరకాలే.

"అమ్మా నీ ఘనత గూర్చి / అబద్దాలు చెప్పలేను
అమ్మా స్వాతంత్ర్యేందిర / ఏ కాంట్రాక్టరు ఇంటిలో
అంట్లు తోముతున్నావే /......................" అంటూ దిక్కులు పిక్కటిల్లేలా వేసిన కేక ఈనాటికీ వినబడుతూనే ఉంది. ఆ కేక ఆయన స్వాతంత్ర్య మొచ్చిన 14 సంవత్సరాలకు వేస్తే, నేడు 'ఆజాదికా అమృతమహోత్సవ్' సందర్భంలో కూడా ఆ కేకల ప్రతిధ్వనుల వినిపిస్తూనే వున్నాయి. కార్పోరేట్ శక్తుల చేతుల్లో దేశసంపద ఒదిగిపోతుంటే, దేశం అద్భుతమైన ప్రగతి సాధించిందని చప్పట్లు తడుతున్న పాలకుల తీరును ప్రశ్నించడానికి ఎందరో గజ్జెల మల్లారెడ్డిలు గళం విప్పుతున్నారు. అయినా, మన పాలకుల పూలు చల్లించుకుంటూ, వాటిని తొక్కుకుంటూ విజయగర్వంతో వెళుతూనే వున్నారు.

ఆధారగ్రంథాలు :

1. శంఖారావం – గజ్జెల మల్లారెడ్డి
2. మల్లారెడ్డి గేయాలు – గజ్జెల మల్లారెడ్డి
3. సత్యంవధ ధర్మం చర – గజ్జెల మల్లారెడ్డి
4. తెలుగులో కవితా విప్లవాల స్వరూపం – వేల్చేరు నారాయణరావు
5. తెలుగు కవితా వికాసం – కడియాల రామ్మోహనరాయ్

(గజ్జల మల్లారెడ్డి శతజయంతి సందర్భంగా)

ISSN No.2319-3905

5

మారిషస్ దేశంలో తెలుగు భాషా సంస్కృతుల వికాసానికి కృషి చేస్తున్న సంస్థలు

– డా. శ్రీమతి రాజ్వంతి దాలయ్య

తెలుగు విభాగం, మహాత్మా గాంధీ సంస్థ, మారిషస్

మారిషస్ దేశం భిన్న జాతులకు, విభిన్న సంస్కృతులకు, బహు భాషలకు, అనేక మతాలకు నిలయం. మారిషస్ దేశపు సౌందర్యాన్ని వర్ణిస్తూ, శ్రీ ఆనందమూర్తిగారు (1990: పు. 56) ఇలా అన్నారు.

“మారిషస్ దేశం పచ్చని దీవి; పగడాల దీవి. అందాల హరివిల్లుకి నెలవు. సింధుజలధి ప్రసరించిన ముక్తాఫలము. హిందూ మహాసాగర తీరదేశాల వారిళ్ల తెరవడానికి వీలు గూర్చిన తాళపు చెవి. దిగంతాలకు దారి చూపిన వెలుగు రెక్క.”

పోర్చుగీసువారు, ఆంగ్లేయులు, ఫ్రెంచీవారితోపాటు, భారతదేశం, ఆఫ్రికా, చైనా మొదలైన దేశాలనుంచి వచ్చిన వారు మారిషస్ దేశాన్ని ఆక్రమించినందువల్ల ఇక్కడ బహుభాషీయత ఏర్పడింది.

“మారిషస్ దేశం బహు భాషల కూడలి, విభిన్న సంస్కృతీ సంప్రదాయాలకు నిలయం”

(రెడ్డి లక్షకుడు, 2013: . 15).

దాదాపు 12 లక్షల కన్న ఎక్కువ జనులున్న 720 చదరపు మీటర్ల విస్తీర్ణంగల ఈ చిన్న ద్వీపంలో, మొరిష్యన్ క్రియోల్, ఆంగ్లం, ఫ్రెంచి, హిందీ, తమిళం, తెలుగు, మరాఠీ, ఉర్దూ, భోజ్పురీ, గుజరాతి, మాండరిన్, అరబ్బీ మొదలైన పన్నెండు భాషలు వాడుకలో ఉండటం మారిషస్ దేశంలోని బహు భాషీయతకు నిదర్శనం.

రాళ్ల కింద బంగారం దొరుకుతుందని ఏజెంట్ల మాటలను నమ్మి, భారతదేశం నుంచి ఇక్కడికి వచ్చి స్థిరపడిన ప్రవాసులలో తెలుగువారు కూడా ఉన్నారు. చారిత్రక ఆధారాలనుబట్టి తెలుగువారు ముఖ్యంగా రాజమండ్రి, విశాఖపట్నం, గంజాం, చిత్తూరు, నెల్లూరు, శ్రీకాకుళం,

మచిలీపట్నం మొదలైన ప్రాంతాలనుంచి వచ్చారనీ; చాలా మంది కాకినాడ, కోరంగీ ఓడరేవులనుంచి వచ్చారనీ తెలుస్తుంది (Indian Immigration Archives). ఆ కాలంలో తెలుగువారిని “కోరంగీలు” అనీ; వారి భాషను “కోరంగి భాష” అనీ; వారి పండుగలను “కోరంగీ పండగలు” అనీ వ్యవహరించేవారు. ఇక్కడ వచ్చినప్పుడు తెలుగువారిని “కోరింగలు, జెంటులు, తెలింగలు, కలింగలు” మొదలైన నామాల కింద నమోదు చేయటం జరిగింది (Bhaskar, 2015)..

మారిషస్ దేశానికి కొత్తగా వచ్చినప్పుడు, తమ భాషా సంస్కృతులను పరిరక్షించే ఉద్దేశంతో, (ఆ కాలంలో బడికి వెళ్లే సౌకర్యం లేకపోవటంవల్ల) తెలుగు వలసదారులు ఇసక మీద తెలుగు అక్షరాలు రాసి తమ పిల్లలకు తెలుగు నేర్పించేవారు. కాని క్రమంగా గుళ్ళు నిర్మించి, పూజలు జరపటంతోపాటు అక్కడ పిల్లలకు తెలుగు భాష, తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను కూడా నేర్పించటం మొదలుపెట్టారు. ఈ “బళ్ళ”ను “బైఠ్కా” అని వ్యవహరించేవారు. ఇప్పటి వరకు మారిషస్ దేశం నలు మూలల్లోనున్న దేవాలయాల్లో ఇటువంటి “సాయంత్రపు బళ్ళ”ను స్థాపించి, తెలుగు భాషోపాధ్యాయులు పిల్లలకు తెలుగు భాషా సంస్కృతులు బోధిస్తున్నారు. బడిలో తెలుగు భాష నేర్చుకొనే అవకాశం లభించకపోయినా, కొంత మంది విద్యార్థులు ఈ సాయంత్రపు బళ్లకు వెళ్లి తెలుగు భాషనభ్యసిస్తారు.

మా పూర్వీకులు ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చినప్పుడు ముఖ్యంగా చెరకు తోటలలో పని చేసేవారు. వారు తమ పనిముట్లతోపాటు రామాయణం, మహాభారతం వంటి ఉద్గ్రంథాలను, భద్రాచల రామదాసు, త్యాగరాజ స్వామి, తాళ్ళపాక అన్నమాచార్యులు మొదలైనవారు రచించిన సంకీర్తనలను కూడా తీసుకుని వచ్చారు. దినమంతా తోటలలో పని చేసి, వీలున్నప్పుడల్లా తమ సంస్కృతీ సంప్రదాయాలను ఆచరించేవారు.

మారిషస్ దేశంలో తెలుగు భాషా సంస్కృతుల వికాసానికి కృషి చేస్తున్న సంస్థల్లో మారిషస్ తెలుగు మహా సభ, మారిషస్ తెలుగు సాంస్కృతిక కేంద్రం, తెలుగు భాషా సంఘం వంటి ప్రభుత్వ సంస్థలు, మారిషస్ విశ్వవిద్యాలయం, మహాత్మా గాంధీ పేర్కొనదగినవి. జాతీయ సమైక్యతకు దోహదం చేయటం, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించుకుంటూనే ఆధునిక అవసరాలకు అనుగుణంగా తెలుగు భాషా సంస్కృతులను అభివృద్ధి పరచటం ఈ సంస్థల ప్రధాన ధ్యేయం.

మారిషస్ తెలుగు మహా సభ, మారిషస్ తెలుగు సాంస్కృతిక కేంద్రం, తెలుగు భాషా సంఘం మొదలైన సంస్థలు కళా సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోనే నడుస్తాయని గుర్తించాలి. వీటితోపాటు దక్షిణ ప్రాంతంలో ఉన్న ఆనంద పరమేశ్వరీ నిలయం ఆశ్రమం; తెలుగు సాంస్కృతిక నిలయం వంటి అనేక సంస్థలు కూడా తెలుగు భాషా సంస్కృతులను పెంపొందించటానికి అన్ని విధాలా పాటుపడుతున్నాయి.

మారిషస్ దేశంలో తెలుగు సాంస్కృతిక సంస్థల స్థాపనతో తెలుగువారి స్థితిగతులలో చాలా మార్పులు సంభవించాయని తెలుస్తుంది. ప్రారంభ దశలో తెలుగు భాషను నేర్చుకోటానికి పుస్తకాలు ఉండేవి కావు. అప్పటికి ఆంధ్ర దేశంలాగే, ఇక్కడ కూడా "పెద్ద బాలశిక్ష" అనే గ్రంథాన్ని వాడి పిల్లలకు చదువు చెప్పేవారు. పగటి పూట పనివల్ల వీలుకాక, రాత్రి పూట పాఠశాలలు ఏర్పాటు చేసి తెలుగు బోధించేవారు. పెద్ద బాలశిక్షతో బోధన పూర్తయ్యాక, వేరే తెలుగు పుస్తకాలు లేక, రాత్రి పాఠశాలలను మూసివేయటం జరిగింది.

తర్వాతి కాలంలో ఆర్థికంగా ముందంజ వేయలేని గ్రామప్రజలు చిన్న చిన్న పందిర్లు ఏర్పాటు చేసి, వాటిలోనే ఉత్సవాలను జరుపుకొనేవారు. తమకు తెలిసిన తెలుగు పద్యాలు, గేయాలు మాత్రమే కాక, భారత భాగవత రామాయణాలకు సంబంధించిన పాటలు కూడా పాడేవారు. ఈ సాంస్కృతిక సమావేశమే తర్వాత "బైట్కా" అనే సాంఘిక సంస్థ స్థాపనకు నాంది పలికింది. ఇటువంటి సంస్థలు తెలుగువారు అనేక గ్రామాల్లో మొదలు పెట్టి నడిపించేవారు. ఇవి తెలుగువారికి తమ సంస్కృతీ సంప్రదాయాలను తెలియజేయటంలో ప్రధాన పాత్ర వహించాయి (రెడ్డీ లక్ష్మయ్య, 2013).

భారతదేశంనుంచి తెలుగువారు మారిషస్ ద్వీపానికి వలస వచ్చినప్పుడు, తెలుగువారికి తెలుగు మాతృభాషగా ఉండేది. కాని వేరే భాషీయులతో కలసి ఉండటంవల్ల వారు హిందీ, ఫ్రెంచి, క్రియోల్ భాషల్లో వ్యవహరించటం మొదలెట్టారు (Bhat & Bhaskar, 2007). తత్ఫలితంగా తర్వాతి తరాలకు తెలుగు భాష మాతృభాష కాక, ద్వితీయ భాషగా మిగిలిపోయింది.

ఇరవైయవ శతాబ్దం తర్వాతనే ఇక్కడ ద్వితీయ భాషగా తెలుగు భాషా బోధనకు శాస్త్రీయమైన విధానం కల్పించటానికి కృషి మొదలైంది. దానితో కొంత మంది తెలుగువారు ఆంధ్ర దేశంనుంచి తెలుగు వాచకాలు తెప్పించి, ఇక్కడ పంచిపెట్టారు. గ్రామాల్లో "బైట్కా" వంటి సంస్థలు బాగా అభివృద్ధి చెందాక, జాతీయ స్థాయిలో ఐకమత్యంకోసం తెలుగువారు పునరుత్తేజితులయ్యారు. తత్ఫలితంగా 1947వ సంవత్సరంలో జులై 30వ తేదీన మారిషస్ ఆంధ్ర మహా సభను నెలకొల్పారు (దీని పేరు 'మారిషస్ తెలుగు మహా సభ'గా మారిపోయిందని గమనించవలసిన విషయం). తెలుగు భాష ప్రచారం చేయటమూ; తెలుగు బళ్లు నిర్వహించే శాఖలను మొదలుపెట్టాలనే ఉద్దేశాలతోనూ, తెలుగు భాష పట్ల ఆసక్తిని రేకెత్తించటానికి అనేక కార్యక్రమాలు ఏర్పాటు చేయటమనే ఉద్దేశాలతో మారిషస్ ఆంధ్ర మహా సభను స్థాపంచటం జరిగింది (Bhaskar, 2015).

1947వ సంవత్సరంలో మారిషస్ ఆంధ్ర మహా సభ స్థాపనతోనే, మారిషస్ దేశంలో తెలుగు భాషా బోధన ఒక క్రమమైన రూపుదాల్చింది. దేశం నలుదిక్కులలో మారిషస్ ఆంధ్ర మహా సభ శాఖలు స్థాపింపబడ్డాయి. వీటి ఆధ్వర్యంలోనే సాయంత్రపు బళ్లలో తెలుగు భాషా

బోధన మొదలైంది. దేశంలో తెలుగు భాషా ప్రయోగంకోసం పాటుబడిన వారిలో పండితులైన శ్రీ గున్నయ్య ఒత్తుగారు, శ్రీ రామమూర్తి అప్పన్నగారు మొదలైన మహానుభావులు అగ్రగణ్యులు (Bhat & Bhaskar, 2007). వీరితోపాటు ఇంకా కొంత మంది ఆంధ్రప్రదేశ్ నుంచి తెలుగు వాచకాలు తెప్పించి తెలుగు భాషా బోధనకు తోడ్పడ్డారు. వారు తెప్పించిన పుస్తకాల్లో "పెద్ద బాలశిక్ష, బాల రామాయణం, బాల నాగమ్మ కథ, రామదాసు చరిత్ర, నృసింహ శతకం, బొబ్బిలి కథ, రుక్మిణీ కల్యాణం" ముఖ్యమైనవి. ఈ విధంగా ఆ కాలంలో తెలుగు భాషతోపాటు తెలుగు సంస్కృతి, నైతిక విలువలు కూడా బోధించబడేవి. ఆ తర్వాత "భాస్కర శతకం, వేమన శతకం, సుమతీ శతకం" వంటివి కూడా విద్యార్థుల పాఠ్య ప్రణాళికలో చోటుచేసుకున్నాయి.

భాషకూ సంస్కృతికీ మధ్య విడదీయరాని సంబంధం ఉంది. భాష పోతే సంస్కృతి పోతుందని చాలా మంది అంటూనే ఉంటారు. మారిషస్ దేశంలోని తెలుగువారు తమ భాషకన్న సంస్కృతికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారని చెప్పవచ్చు. ఇక్కడ చాలా మందికి తెలుగు భాష రాకపోయినా, సంస్కృతి పేరిట దాన్ని భద్రపరుస్తున్నారని చెప్పటం సమంజసం. చాలా మంది దేవుడి పట్ల తమకున్న అపారమైన భక్తిని చూపించటానికి కీర్తనలూ భజనలూ పాటలూ పాడుతూ ఉంటారు.

ప్రస్తుతం మారిషస్ దేశమంతటా మొరిషస్ తెలుగు మహా సభకు ఎనభై శాఖలున్నాయి. ఇవి తెలుగు భాషా సంస్కృతులను పెంపొందించటానికి ఎక్కువగా తోడ్పడుతున్నాయి. తెలుగు భాషా సంస్కృతులను పెంపొందించే ఉద్దేశంతో మారిషస్ తెలుగు మహా సభ సభ్యులు, మారిషస్ తెలుగు సాంస్కృతిక కేంద్రం (Mauritius Telugu Cultural Centre Trust) సభ్యులు, తెలుగు భాషా సంఘం (Telugu Speaking Union) సభ్యులు సంయుక్తంగా జాతీయ స్థాయిలో ప్రతి ఏటా ఉగాది పండగ, సంక్రాంతి, ఆంధ్రావతరణ దినోత్సవం, తెలంగాణ అవతరణ దినోత్సవం, శ్రీ రామభజనం, శ్రీ వేంకటేశ్వర స్వామి నలభై రోజుల వ్రత మహోత్సవం మొదలైన ఉత్సవాలనూ పూజలనూ ఎంతో ఘనంగా జరుపుకొంటారు.

మొరిషస్ తెలుగు మహా సభ "తెలుగు మహిళా మండలి", "తెలుగు యూత్ వింగ్" అనే కమిటీలు కూడా నడుపుతున్నది. ఈ కమిటీల్లో ఉన్న సభ్యులు అనేక సాంస్కృతిక కార్యక్రమాలు, సంఘ సంస్కరణ చర్యలతోపాటు, "ముగ్గుల పోటీలు", "చక్కటి తెలుగు అమ్మాయి" వంటి పోటీలు కూడా ఏర్పాటు చేస్తూ ఉంటారు. తెలుగు భాషా బోధనను పెంపొందించటానికి మారిషస్ తెలుగు మహా సభ ఒక ఎడ్యుకేషన్ కమిటీ కూడా స్థాపించింది. దీనిలోనున్న సభ్యులు ముఖ్యంగా తెలుగు అధ్యాపకులే. దేశమంతటా తొలి తరగతినుంచి పదకొండో తరగతివరకు తెలుగు భాషనభ్యసించే విద్యార్థులకు ఈ కమిటీవారు వార్షిక పరీక్షలు ఏర్పాటుచేస్తారు.

ప్రత్యేకంగా తెలుగు కళా సంస్కృతులను పెంపొందించే ఉద్దేశంతో కళా సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2001వ సంవత్సరంలో మారిషస్ తెలుగు సాంస్కృతిక కేంద్రాన్ని స్థాపించటం

ISSN No.2319-3905

జరిగింది. భిన్నత్వంతో కూడిన మారిషస్ సంస్కృతిలో తెలుగు కళా సంస్కృతులకు అనుకూలమైన స్థానాన్ని కల్పించటానికి ఈ సంస్థ పాటుపడుతోంది. దీని లక్ష్యాల్లో – తెలుగు కళా సంస్కృతులను పరిరక్షించటం, పెంపొందించటం; తెలుగు భాషాధ్యయనాన్ని పెంపొందించటం; తెలుగు కళా సంస్కృతులకు సంబంధించిన విషయాలను సేకరించి, ప్రచురించటం; తెలుగు కళా సంస్కృతుల అవగాహనకు తోడ్పడే సమావేశాలూ వస్తుప్రదర్శనలూ శిక్షణలూ ఏర్పాటు చేయటం; తెలుగు కళా సంస్కృతులను గురించి పరిశోధనలు జరపటానికి అనుకూలమైన సౌకర్యాలను సృష్టించటం; జాతీయ అంతర్జాతీయ స్థాయిల్లో ఈ రంగంలో పాటుపడుతున్న సంస్థలతో సంబంధాలు ఏర్పరచటం మొదలైనవి ముఖ్యమైనవి. ఈ సంస్థ ముఖ్యంగా దేశంలో తెలుగు జాతికి సంబంధించిన కళలతోపాటు సంస్కృతిని (Mauritius Telugu Cultural Center Trust Act, 2001).

ప్రస్తుతం తెలుగు సాంస్కృతిక కేంద్రంవారు దేశంలోని నలుమూలల్లో అనేక మందిరాల్లో తెలుగువారికి కూచిపుడి నృత్యం, కర్ణాటక సంగీతం మొదలైనవాటిలో ఉచితంగా శిక్షణ పొందే సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇంతేకాకుండా సంగీత దినోత్సవం, త్యాగరాజ జయంతి మొదలైన విశేష సందర్భాల్లో కూడా ఈ సంస్థ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుంది. ఈ సంస్థ ఆధ్వర్యంలో 2011వ సంవత్సరంలో ఒక అంతర్జాతీయ సమావేశం కూడా ఏర్పాటు చేయటం జరిగింది.

మారిషస్ తెలుగు మహా సభ, మొరిషస్ తెలుగు సాంస్కృతిక కేంద్రం అనే సంస్థలు ప్రత్యేకంగా తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించటానికి కృషి చేస్తే, తెలుగు భాషా సంఘం ప్రత్యేకంగా మౌఖికంగా తెలుగు భాషను ప్రచారం చేయటానికి పాటుపడుతుంది. మారిషస్ దేశంలో పూర్వీకుల భాషలను పరిరక్షించాలనే ఉద్దేశంతో కళా సాంస్కృతిక మంత్రిత్వశాఖ ఈ భాషలకు స్పీకింగ్ యూనియన్లు స్థాపించింది. మారిషస్ దేశపు బహుభాషీయ సంస్కృతిని మెరుగుపరచటానికి గానీ; తెలుగు భాషా వ్యవహారంలో ఉత్కృష్టత పెంపొందించే ఉద్దేశంతో 2008లో తెలుగు స్పీకింగ్ యూనియన్ (తెలుగు భాషా సంఘం) అనే సంస్థను స్థాపించటం జరిగింది. మౌఖిక, లిఖిత రూపాల్లో ఉన్న తెలుగు భాషను పెంపొందించటం; ప్రపంచంలో నలు మూలలలోనున్న తెలుగు భాషీయులతో మిత్రుత్వాన్ని, సామరస్యాన్ని పెంపొందించటం; తెలుగు భాషీయుల మధ్య ఉన్న సంబంధాలను గురించిగాని, వారు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి, తెలుగు భాషా వికాసాన్ని, అభివృద్ధిని గురించి అభిప్రాయాల వినిమయం జరిగేటట్లు అనుకూలమైన సౌకర్యాలు కల్పించటం; జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో ఉన్న సంస్థలకూ, మారిషస్ తెలుగు భాషా సంఘానికి మధ్య మార్పిడి కార్యక్రమాలు, ఉపకారవేతనాలు, సాంఘిక సంబంధాల వినిమయానికి అనుకూలమైన సదుపాయాలు కల్పించటం; మారిషస్ దేశంలో మాత్రమే కాక, మారిషసేతర దేశాల్లో తెలుగు భాషకు సంబంధించిన సమావేశాలు, కార్యశాలలు, సాహితీ చర్చలు, శిక్షణలు, పోటీలు మొదలైన

కార్యక్రమాలను ఏర్పాటు చేయటం (Telugu Speaking Union Act, 2008) మొదలైనవి ఈ సంస్థకున్న లక్ష్యాలు.

మారిషస్ దేశంలో తెలుగు భాషా బోధనలో మహాత్మా గాంధీ సంస్థ పాత్ర గమనార్హం. భారతీయ భాషలకు, సంగీత నృత్యాలు వంటి లలిత కళలకు కాణాచిగా 1970 జూన్ నెల 3న మహాత్మా గాంధీ సంస్థకు శంకుస్థాపన జరిగింది. మారిషస్, భారతదేశాలు సంయుక్తంగా, ముఖ్యంగా భారతీయ భాషా సంస్కృతుల్లో అధ్యయనం చేయటానికి ఈ సంస్థ స్థాపింపబడింది. మారిషస్ విశ్వవిద్యాలయం, మహాత్మా గాంధీ సంస్థ సంయుక్తంగా తెలుగు భాషలో డిప్లొమా, డిగ్రీ, ఎం.ఏ. పట్టాలతోపాటు అనేక కోర్సులు చదివే అవకాశాలు కూడా ఇస్తాయి. భాషతోపాటు సంస్కృతులను పెంపొందించే ఉద్దేశంతో ఈ సంస్థ హిందూస్తానీ, కర్ణాటక సంగీత విధానాల్లోను, భరతనాట్యం, కూచిపూడి, కథక్, మణిపురి నృత్య విధానాల్లోనూ శిక్షణనిచ్చే కోర్సులు కూడా నడుపుతోంది. వీటితోపాటు సంగీత, నృత్య కచ్చేరీలు కూడా తరచుగా ఏర్పాటు చేస్తుంది. ఇంతేకాకుండా మహాత్మా గాంధీ సంస్థ అధ్యాపకులకు శిక్షణ కోర్సులు కూడా కల్పిస్తుంది. ప్రాథమికనుంచి మాధ్యమిక స్థాయివరకు తెలుగు భాషా బోధనకు కావలసిన తెలుగు పాఠ్యపుస్తకాలు, టెక్నో- పెడగాజికల్ వనరులు మొదలైనవన్నీ మహాత్మా గాంధీ సంస్థ చేతనే తయారుచేయటం జరుగుతుంది.

తెలుగు భాషా సంస్కృతుల వికాసానికి ఇన్ని సంస్థలు కృషి చేస్తున్నా మన తెలుగు భాష చిక్కులో ఉందని గుర్తించవలసినది. మారిషస్ జనాభా క్షీణత; ఈ సాంకేతిక యుగంలో చాలా మంది విద్యార్థులు తెలుగు భాషాభ్యసనపట్ల ఎక్కువ ఆసక్తి చూపించకపోవటం మొదలైనవి దీనికి ముఖ్య కారణాలుగా పేర్కొనవచ్చు. కాబట్టి ఈ సంస్థలతోపాటు, అధ్యాపకులు, తల్లిదండ్రులు అందరూ తెలుగువారుగా తమ బాధ్యతను వహించాలి. మారిషస్ దేశంలో తెలుగు భాషా పరిస్థితిని పరిశీలిస్తే, తెలుగు భాష మౌఖికంగా కొన్ని సందర్భాల్లో మాత్రమే వ్యవహారంలో ఉందని తెలుస్తుంది. దీనికి ముఖ్యమైన కారణం -- మారిషస్ దేశస్థుల మాతృభాష క్రియోల్ కాబట్టి చాలా మంది తమలో తాము క్రియోల్ భాషలోనే వ్యవహరిస్తారు. తెలుగు భాషను పరిరక్షించాలంటే తెలుగు భాషను లిఖిత రూపంలో మాత్రమే కాకుండా అది మౌఖిక రూపంలో కూడా వ్యవహారంలో ఉండాలి. ఇంట్లో, బడిలో, భాష తెలిసిన వాళ్ళతో తెలుగులోనే వ్యవహరిస్తే తెలుగు భాష తప్పకుండా అభివృద్ధి చెందుతుంది. తేనె వంటి తెలుగు భాషను కాపాడటానికి అందరూ కలసి కృషి చేస్తేనే తెలుగు భాషా పరిస్థితి బాగుపడుతుంది.

ఉపయుక్త గ్రంథాల సూచి:

ఆనందమూర్తి, వి. (1990). మారిషస్లో మనవాళ్ళు. ×అ: తెలుగువాణి (వ.సం.) మూడవ ప్రపంచ తెలుగు మహాసభల held in Mauritius on 10th -13th December 1990.

రెడ్డి లక్ష్ముడు, జి. (2013). మారిషస్లో తెలుగు భాషా బోధన- మూల్యాంకనం -- Teaching

of Telugu in Mauritius -- An Evaluation. New Delhi: Star Publications Pvt. Ltd.

BHASKAR, T.L.S. (2015). Telugu Language in Mauritius. Available at: https://mauritiantelugu.wordpress.com/2015/06/16/18/ [Accessed on: 07.12.2024, 02:21]

BHAT, C. & BHASKAR, T.L.S. (2007). Contextualising Diasporic Identity -- Implications of Time and Space on Telugu Immigrants. In OONK, G. (ed.). Global Indian Diasporas Migration and Theory. IIAS -- Amsterdam University Press. Would you like me to summarize the main points of this text for you?

6

ఆత్మగౌరవ ప్రతీకకు పునాది – నెమలికన్నులు

–ఆచార్య త్రివేణి వంగరి

సాహిత్య వ్యక్తిత్వ జీవన పయనానికి సింహావలోకనం తప్పనిసరి. ఆ సింహావలోకనమే ఆత్మకథ రచనా నిర్దేశం. అందులోని బాల్యపు జ్ఞాపకాల ఊట వర్తమానాన్ని అధిగమించి, భావితరాలకు స్వయం సమృద్ధిని, సమగ్ర సౌష్టవ నిర్మాణాన్ని ఏర్పరుస్తుంది. చాలా మంది ఆత్మకథా రచయితలు తమ జీవితాలలో ఆత్మసౌందర్యాన్ని అభిలషిస్తారు. కొంత మంది ఆత్మాభిమానాన్ని స్పర్శిస్తారు. ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు గారు మాత్రం తన 'నెమలికన్నులు' ఆత్మకథలో ఆత్మగౌరవాన్ని ప్రదర్శించారు. ఇందులో నలుభై ఉపశీర్షికలలో 'మా ఊరి పేరు అగ్రహారం' మొదలుకొని 'యుద్ధం మొదలైంది' వరకు నెలకొని ఉన్న బాల్యపు జీవన ఛాయలను ఒక దట్టమైన సాంద్రపు రేఖగా చిత్రించారు. వారి ఆత్మకథలో నిర్దేశించిన కొన్ని ఉపశీర్షికలు అత్యంత ఆసక్తికరంగా ఉన్నాయి. కొన్ని ఘట్టాలు జీవితాన్ని మలుపు తిప్పాయి. మరి కొన్ని ఘట్టాలు అటు కష్టనష్టాలను, ఇటు ఆనంద సందర్భాలను తేటతెల్లం చేశాయి. దార్ల జీవితంపై ప్రగాఢమైన ముద్ర వేసినవి ఇల్లు – ఇంటిలోని అనురాగాలు, ఊరు – ఊరిలోని అనుబంధాలు, బడి – బడిలోని తోటి విద్యార్థుల ఆత్మీయత, మాస్టార్ల ఆప్యాయతలు. వెరసి దార్లను మమకారాలతో గుదిగుచ్చి ముడివేశాయి. ఒక నిండైన ఆవరణం నుంచి పొరలు విచ్చుకొని వచ్చిన జ్ఞాపకాల ప్రోది ఈ పుస్తకం. సమగ్ర గ్రామ వైజ్ఞానిక సాంస్కృతిక వ్యక్తిత్వ చిత్రికకు ఇదొక నిదర్శనం.

ఈ పుస్తకం మొదటి పేజీలో ఆకర్షణీయంగా కనిపించే చిత్రం "దళిత తాత్త్వికుడు". అందులో విశేషం ఏమిటంటే అది దార్ల వేంకటేశ్వర రావు తండ్రి గారి ఛాయాచిత్రం. చూపరులందరికి అదొక ఆప్యాయతను, అభిమానాన్ని, ఆత్మ విశ్వాసాన్ని, ఆత్మ గౌరవాన్ని తప్పక కలిగిస్తుంది. ఇక భూమిపుత్ర దినపత్రిక సంపాదకులు శ్రీ సాకే శ్రీహరి మూర్తి గారి ప్రోత్సాహం వల్ల ఈ పుస్తకం రూపు దిద్దుకుందని ఆరంభంలో దార్ల చెప్పుకోవడంలో వారిద్దరి మధ్య గల సాన్నిహిత్యం స్పష్టమవుతుంది. ఈ 'నెమలికన్నులు' పుస్తకాన్ని రచయిత దార్ల తన తల్లిదండ్రులైన శ్రీమతి దార్ల పెద్ద నాగమ్మ, కీర్తిశేషులు దార్ల లంకయ్య గార్లకు భక్తి పూర్వకంగా అంకితం చేశారు.

అంతేగాక ఈ ఆత్మకథలో తన జీవన గాథను వినిపించే సందర్భంలో ఆయా ప్రాంత నిర్దేశిత పదాలు కొన్నింటికి వివరణ ఇచ్చారు. ముఖ్యంగా ఆత్మకథల్లో విషయసూచిక అనేది కనిపించదు. కానీ ఈ పుస్తకంలోని విషయసూచిక దార్ల సమగ్ర జీవన చిత్రాన్ని ప్రతిబింబిస్తుంది. 'నెమలికన్నులు' ఆత్మకథకు పగడాల చంద్రశేఖర్ గారు, విస్తాలి శంకర్ రావు గారు, దుగ్గినపల్లి ఎజ్రా శాస్త్రి గారు, సాకే శ్రీహరి మూర్తి గారు, గురజాల రామశేషయ్య గారు, జె. వి. చలపతిరావు గారు, గోవిందు గోవర్ధన్ గారు తదితరులు తమ సందేశాలను ముందుమాటల రూపంలో అందించారు. "నెమలి కన్నులు – ఆలంకారిక వన్నెలు" అనే శీర్షికతో ఆచార్య పగడాల చంద్రశేఖర్ గారు వెల్లడించిన అభిప్రాయం ఈ పుస్తకానికి అమూల్యంగా నిలిచింది. ఉపశీర్షికలను కూడా నిర్ణయిస్తూ 'నెమలికన్నులు' ప్రబోధించిన ఉపదేశం, ప్రయోగించిన భాషా అలంకారాలు, ప్రాచీన సాహిత్య ప్రభావం, వైయక్తిక శైలి, పద/శబ్ద ప్రయోగం వంటివి చేర్చారు. ఇవి ఆత్మకథకు ప్రామాణికతను చేకూర్చాయి.

దార్ల – నామ సార్థక్యం:

దార్ల వేంకటేశ్వర రావు గారి గ్రామం అగ్రహారానికి బ్రాహ్మణ చెరువు ఒక ఆభరణం. పూర్వకాలం నుంచి ప్రసిద్ధి గాంచింది. క్రమేపీ దట్టమైన చెట్లుచేమలతో, విష క్రిమి కీటకాలు, క్రూర మృగాలు సంచరిస్తూ భయాన్ని పుట్టించేదిగా బ్రాహ్మణ చెరువు పరిసర ప్రదేశం మిగిలిపోయింది. దార్ల వంశ పూర్వీకులు దారి వేసి చదును చేసుకొని నివసించడం వల్ల వారి ఇంటి పేరు దార్లగా పరిణామం చెందిందట. నేడు అనేక కుటుంబాలతో సజీవ చిత్రంగా కళకళలాడుతుంది. పాడువడిన ప్రదేశానికి దారి చూపినవారిగా దార్ల కుటుంబం కొనియాడబడింది. శ్రమార్థం, సాయార్థం ఈ రెండు ఇంటి పేరులో కలిగి ఉన్నాయని రచయిత సగౌరవంగా వర్ణించారు. ఆ ప్రాంతమే ప్రస్తుతం ఊరి నడిబొడ్డయిందట. విద్యావంతులు, ఉద్యోగస్తులు ఆయా కుటుంబాల నుంచి ఎదిగి వచ్చిన క్రమాన్ని వివరంగా ఈ పుస్తకంలో తెలియజేశారు. అందులో "మా ఊళ్లో మొట్టమొదటి పిహెచ్. డి. చేసింది నేనే. యూనివర్సిటీలో అధ్యాపకుడిగా ఉద్యోగం పొందింది నేనే. రేడియో, టీవీలలో మాట్లాడింది కూడా నేనే... ఇది అహంకారంతో చెబుతున్న మాట కాదు. ఆత్మాభిమానంతో చెబుతున్న మాట. చరిత్రను తిరగరాసిన జీవిత చరిత్రలోని మాట. ఇది జీవితం చరిత్రగా మారుతున్న మాట. ఇప్పుడు మా చెరువుగట్టు అంబేద్కర్ ఆశయం ప్రతిఫలించిన పూల తోట అని, ఆ విషయం మా ఊళ్లోకెళ్ళి ఎవరినడిగినా ఇష్టమున్నా, లేకున్నా చెప్పక తప్పని మాట." (పుట. 8) అని దార్ల అన్న మాటలు తప్పక రికార్డు చేయదగినవి.

ఊరు – ఆత్మీయతా కేతనం:

ఉన్న ఊరు, కన్న తల్లి మీద మమకారం ఉండని మానవుడు ఈ భూమి మీద ఉండరు కదా ! దార్ల వేంకటేశ్వర రావు గారి ఊరు 'అగ్రహారం' ప్రాశస్త్యాన్ని కొన్ని ఉపశీర్షికల కింద

పేర్కొన్నారు. ఊరు – ఊరిలోని జనులు, ఇల్లు – ఇంటిలోని వాతావరణం, వీధులు – వాడలు, పంటలు – పొలాలు అన్నింటిని ఒక్కొక్కటిగా ఆర్ద్రతతో తడుముకుంటూ వచ్చారు. కోనసీమ అందచందాలతో కూడిన ఆ ఊరి వైభవం మన కళ్ళ ముందు ఎంతో అబ్బురంగా కదలాడుతుంది. అగ్రహారం ఊరిలోని అనేక దృశ్యాలకు మాలికగా ఈ మొదటి భాగం కనిపిస్తుంది.

'చెయ్యేరు అగ్రహారం' గొప్పతనాన్ని కీర్తిస్తూ రచయిత దార్ల చెప్పిన కవితా పంక్తులు ఆత్మకథ సహజత్వానికి విశేష దీప్తిని కలిగించాయి. కోనసీమ పరిసర ప్రాంతంలో నెలవైన అగ్రహారం కొబ్బరి చెట్లతో, నదులు – కాలువలు ప్రవహించే ప్రదేశాలతో, తీయని ఫలాలను అందించే వృక్షాలతో, రంగురంగుల పూలను అందించే మొక్కలతో అందంగా తీర్చిదిద్దబడింది. కోనసీమలో అమలాపురం కేంద్రంగా చేసుకొని నిలిచిన గ్రామాలు, ఆ గ్రామాల వెలపల ప్రవహించే నదులు, పరుచుకున్న పొలాలు, పక్షుల కిలకిల రావాలు, గ్రామ గ్రామాన ఆత్మ గౌరవ ప్రతీకగా నిలిచి దారి చూపుతున్న అంబేద్కర్ విగ్రహాలు అంతటా పరుచుకొని ఉన్నాయి. గౌతమీ గోదావరి నది పరిసర పదహారు గ్రామాలకు ఒక మేజర్ పంచాయితీ గ్రామంగా నాడు చెయ్యేరు అగ్రహారం ఉండేది. ఇలా కవితాత్మక ధారతో దార్ల వర్ణిస్తూ ఉంటే గ్రామ ముఖచిత్రం పాఠకుల గుండెలో అత్యంత సుందరంగా దృశ్యమానమవుతుంది. అంతేగాక ఏ ఏ వర్ణాల వారు, ఏ ఏ వర్గాల వారు, ఏ ఏ కులాల వారు, ఏ ఏ పక్కన నివసించారనేది ఒక సమగ్ర సామాజిక వర్ణ్య చిత్రం బొమ్మ గీసినట్లుగా రూపుదిద్దుకుంటుంది.

గ్రామం ప్రశస్తిని, బ్రాహ్మణులకు రాజులు బహుమతిగా ఇచ్చిన 'అగ్రహారం' పరిణామ చరిత్రను దార్ల క్రమానుసారం తెలిపారు. ఆ తర్వాత పండితుల వశమైన వృత్తాంతాన్ని, వారి ప్రతిభా విశేషాలను కొనియాడారు. ఆయా పండితులు ఆ ఊరి చెరువు దగ్గర సంధ్యా వందనాలు ఆచరించడం, వేదాలు – పురాణాలు పఠించడం వంటి ఘట్టాలను కళ్ళకు కట్టినట్టు వర్ణించారు. వారి పాండిత్యాన్ని, ప్రావీణ్యతను, వారి నుంచి పొందిన స్ఫూర్తిదాయక అనుభూతి గల సన్నివేశాలను గుర్తుచేసుకున్నారు. ఇది ఇలా ఉండగా పాఠశాల సెలవు దినాల్లో 'హోతా' అనే బ్రాహ్మణ కుటుంబానికి చెందిన పొలాల్లో పని చేసిన స్థితిని దార్ల వివరించారు. తనతో పాటుగా తోటి స్నేహితులు కూడా పనులు చేసి తమ తమ ఇంటికి చేదోడువాదోడుగా ఉన్న విషయాలు ఇందులో ప్రస్తావనకు వచ్చాయి. పని చేయడం వల్ల హోత్రా పండితులతో దార్ల కుటుంబానికి కొంత సాన్నిహిత్యం ఏర్పడింది. వీరు పని చేసే సందర్భాలలో ఫలహారాలు, భోజనాలు తెచ్చిపెట్టడం వంటి దాతృత్వ కార్యకలాపాలను గుర్తు చేసుకున్నారు. ఆత్మకథలో ఈ విషయాలు చెబుతూనే చిన్ననాడు ఏ ఏ సందర్భాలలో తనకు గానీ, తన కుటుంబానికి గానీ, ఇతరులకు గానీ, సమాజానికి గానీ అన్యాయం, అక్రమాలు జరిగాయని భావించారో వాటిని ప్రతిఘటించారు. అదే ఘటన ఒకటి 'హోతా' పండిత కుటుంబానికి చెందిన పొలాలను ఆ ఊరి పెత్తందారులు మోసం చేసి అన్యాయంగా చేజిక్కించుకున్నారట. దీనిని ఆత్మకథలో ప్రస్తావించి ఆవేదన వ్యక్తం చేశారు దార్ల.

హోతా కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని, ఆత్మీయతను, సోదర భావంతో పిలిచిన సందర్భాన్ని గొప్పగా చెప్పుకున్నారు. నాడు నగరానికి వెళ్ళి స్త్రీలు ఉన్నత విద్య అభ్యసించే అవకాశం లేని ఆ కాలంలో ఇంటి దగ్గరే ఉండి డిగ్రీలు చేయవచ్చనే విషయాన్ని 'హోతా' కుటుంబంలోని ఒక అక్కకు ఉచిత సలహా ఇచ్చారు. డా. బి. ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అందిస్తున్న సదుపాయాన్ని ప్రచారం చేశారు. దార్లకు బాల్యం నుంచి చదువు పట్ల అపారమైన శ్రద్ధ. అదే స్థాయిలో చదువు అందరి అందుబాటులోకి రావాలనే ఒక గొప్ప సంకల్పాన్ని చిన్నప్పటి నుంచే అందిపుచ్చుకొన్నారు.

ఇల్లు – అనుబంధాల లోగిలి:

నాన్న అంటే దార్ల వెంకటేశ్వరరావు గారికి అత్యంత గౌరవం. ఆత్మకథ నిండా నాన్న అడుగుల చప్పుడు వినిపిస్తూనే ఉంటుంది. వారి విషయ ప్రస్తావన వచ్చినప్పుడల్లా కళ్ళలో మెరుపుదనం నింపుకున్నట్లుగా, కలంలో మాధుర్యం ఒంపుకున్నట్లుగా రచన సాగించారు. సగటు మానవుడు తన తండ్రి మీద చూపే ప్రేమాపాశాలకు నిదర్శనంగానే ఉన్నా ఆకాశమంత ఆనందాన్ని కనబరిచారు. నాన్న పేరు అబ్బాయి. ఆయన పనితనాన్ని దార్ల పంచుకునేటప్పుడు అబ్బురం అనిపిస్తుంది. "తెల్లవారితే ఒకరోజు పొలం పనికెళ్లేవాడు. ఇంకో రోజు కొబ్బరికాయలు దింపటానికి వెళ్లేవాడు. మరో రోజు తాటాకులు కొట్టడానికి వెళ్లేవాడు. ఇలా రోజురోజుకీ కొత్త కొత్త పనుల్ని చేసేవాడు. కొత్త కొత్తగా చేసేవాడు. నాగలి దున్నేవాడు. మూటలు మోసేవాడు. చేపలు పట్టేవాడు. చేపల వల అల్లేవాడు. చేపల బుట్టల్ని కూడా తాటాకులతో అల్లేవాడు. ఒక తాటి చెట్టు మీద నుండే ఆ చుట్టూ ఉండే రెండు మూడు చెట్లకున్న ఆకుల్ని కొట్టేవాడు." (పుట. 15) అని అనేక పనులు చేయడంలో నేర్పు, నైపుణ్యం వంటివి విశేషంగా కొనియాడారు. ఇదే సందర్భంలో రంగరాజుకోడు కాలువ వంతెనతో దార్లకు, నాన్నగారికి ఉన్న అనుబంధం అంతా ఇంతా కాదు. ఆ కాలువ మీద తండ్రి అడుగులో అడుగువేస్తూ నడిచిన పాదముద్రలను కవితాత్మకంగా వ్యక్తపరిచారు. "నువ్వు గబగబా నడుస్తుంటే / నువ్వు గమనించేవాడివో లేదో గానీ / ఆ రంగరాజుకోడు కాల్వంతా నీ అడుగుల్తో పరవశించేది / ఆ కాల్వలో ప్రవహించే నీరు కూడా / మీ స్పర్శతో పునీతమయ్యేది / ఆ గుట్ట నుంచే ముళ్ళన్నీ / నీ అడుగుల కింద మెత్తని పువ్వుల్లా మారిపోయేవి / నువ్వేమీ వాటిని గమనించే వాడివి కాదు" (పుట. 16) అంటూ గారాబం ప్రకటిస్తూనే ఆ కాలువలో తండ్రి చేపలు పట్టి గట్టు మీదకు విసిరే విన్యాసాన్ని హృద్యంగా చిత్రించారు. ప్రతి వ్యక్తికి నాన్నంటే ధైర్యం. దార్ల నాన్న గారికి ఉన్న ధైర్యం మాత్రం కొండంత. నిరంతరం ఆ కాలువ మీద విష సర్పాలు సంచరించినా వెరవకుండా, వానొచ్చినా వరదొచ్చినా చలించకుండా ముందుకు సాగిపోయేవారట. కుటుంబ భారాన్నంతా ఒంటి చేతితో మోసిన తండ్రి కష్టం దార్ల జీవితమంతా కంటి కింది చారల నిలిచిపోయింది. ఇంటి వాతావరణాన్ని బట్టి పిల్లల మనస్తత్వ నిర్మాణం జరుగుతుందంటారు. అమ్మ దైవభక్తి, నాన్న కారుణ్యం కలిపి దార్ల కుటుంబంలో

పిల్లల భవిష్యత్తుకు ఉన్నతమైన విలువలతో కూడిన వ్యక్తిత్వ సంస్కారం సమకూరింది. ఇల్లు, ఇంటి సభ్యులతో పెనవేసుకున్న అనుబంధాన్ని అత్యంత ఆత్మీయంగా ఆత్మకథలో పంచుకున్నారు.

దార్ల తన పెద్దన్నయ్యను ఒక 'హిట్లర్' గా అభివర్ణించారు. ఆయన ఆజ్ఞానుసారం ఇంటిల్లిపాది నడుచుకునేవారు. ఏదైనా చెప్పాడంటే వాళ్ళ ఇంట్లో యువరాజు ఆజ్ఞలా ఉండేదట. ఈ సందర్భంలో ఆయన వ్యవహార శైలి 'హిట్లర్'ని తలపించేదట. తినడం, తాగడం, జుట్టు కటింగ్ వంటి స్టైల్ తో మిలిటరీ, పోలీస్ శాఖలో ఉండదగినవారుగా భావించారు. చదువు, ఉద్యోగాలకు సంబంధించిన విషయాల్లో వారి పెద్దన్నయ్య అనేక సలహాలు ఇచ్చేవారు. ఇంటికి కావలసిన పనులన్నీ గ్రామ పంచాయితీ, రెవెన్యూ కార్యాలయాలకు వెళ్ళి నెరవేర్చుకొని వచ్చేవారు. దార్ల కుటుంబం ఇటుక ఇల్లు కట్టుకున్నపుడు, ఆ ఇంటి రిజిస్ట్రేషన్ కు సంబంధించి వారి పెద్దన్నయ్య పడ్డ అవస్థలను చెప్పుకొచ్చారు. వారి పెద్దన్నయ్యతో కలిసి దిగిన ఫోటోను దార్ల ఇక్కడ పొందుపరిచారు.

ఈ ఆత్మకథలో కొన్ని సున్నితమైన విషయాలను ప్రస్తావించారు రచయిత దార్ల. పేగు బంధం, ప్రేమ బంధం మధ్య దార్లకు చిన్నతనంలో కొంత అయోమయ స్థితి ఏర్పడింది. తన పెద్ద మేనత్తకు పిల్లలు లేకపోవడం, అందువల్ల తనను ఎక్కువ గారాబంగా చూసుకోవడం, మంచి బట్టలు కొనిస్తానని చెప్పి ప్రేమను పంచేది. ఆ ప్రవర్తనతో తన తల్లికి కొంత గుండెలో గుబులు పట్టుకుంది. ఎక్కడ తన కుమారుడిని తన వెంట తీసికొని పోతుందోనని తల్లికి భయం నెలకొంది. తన కుటుంబం నుంచి వేరుపడడం కూడా దార్లకు ఇష్టం ఉండేది కాదు. కొంత కాలానికి అలా ఏమీ జరగకుండా ఎవరి కుటుంబాలలో వారుండడం కథ సుఖాంతం పలికిందనే భావించాలి.

దార్ల తన తాత గారి ఇంటి ముందున్న 'నారింజ చెట్టు' మీద పెనవేసుకున్న తన అనుబంధాన్ని ఎంతో రుచికరంగా చెప్పారు. ప్రయోగ రీత్యా ఇందులో కేవలం వచనమే గాకుండా ఆయా ఆయా ఘట్టాలలో భావస్ఫూర్తితో అల్లిన కవితాత్మక పద్య రూపాలు కనిపిస్తాయి. 'మా ఇంటి కల్పవృక్షం' చోట ఈ సందర్భాలు ప్రత్యక్షమవుతాయి. దార్ల నారింజ పండ్లను తన స్నేహితుడు శాస్త్రికి ఇవ్వడం, శాస్త్రి తన ఇంటి దగ్గర నుంచి బొప్పాయి, మామిడి పండ్లను తెచ్చి దార్లకు ఇవ్వడం, ఇలా... స్నేహభావం, పంచుకొని తినే స్వభావం వంటివి రచయిత బాల్యంలోనే నేర్చుకున్నారు. ఈ నారింజ చెట్టు మీది నుంచి మరియమ్మ కింద పడిపోయిన సంఘటన, అక్కడ చోటుచేసుకున్న పరిణామాలను కొంత హాస్య ధోరణిలో వ్యక్తపరిచారు.

బడి – ప్రగతి పథ నిర్దేశం:

'ఎందుకు మా పేర్లు మా ఇష్టప్రకారం ఉండవు' అనే శీర్షికలో దార్ల వేంకటేశ్వర రావు గారు కొన్ని ఆసక్తిదాయక విషయాలను ప్రస్తావించారు. పాఠశాలలో చేరినప్పుడు ఆయా రిజిస్టర్

ISSN No.2319-3905

లలో వాళ్ల పేర్లు, వాళ్ల పుట్టిన తేదీలు ఎక్కువగా ఆ పాఠశాల పంతుళ్లు నిర్ణయించేవిగా ఉంటాయి. బడిలో చేరిన క్రమం, బడి మీద ఉన్న ఆసక్తి, బడికి వెళ్లి చదువుకోవాలన్న కుతూహలం ఈ పుస్తకంలో పంచుకున్నారు. ధాన్యపు రాశులకు కాపలా కాస్తూ తన చెల్లిని వెంటబెట్టుకొని అప్రయత్నంగానే బడిలోకి వెళ్లి, పాఠశాలలో చేరిన విషయం, ఇక అప్పటి నుంచి పాఠశాలను ఏనాడు దాటి పోలేని అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

దార్ల తాను పాఠశాలలో చదివేటప్పుడు వెంకటరెడ్డి మాస్టారు గారి ఆప్యాయతను, అనుబంధాన్ని చవిచూశారు. ఆ మాస్టారు తన క్యారియర్ లో అన్నం దార్లకు పంచిపెట్టి కడుపు నింపిన సందర్భాలను జ్ఞాపకం చేసుకున్నారు. క్లాస్ లో తాను లీడర్ గా ఉన్న సమయంలో ఒకనాడు జెండా పండుగ జరిగినది. నాటి ఒక సంఘటన దార్ల మనస్సును కలచి వేసింది. జెండా పండుగ రోజు వీధుల్లోని ప్రధాన కూడలిలో తిరుగుతూ స్వీట్స్, కరపత్రాలను పంచే సందర్భంలో అవమాన పరిచిన సందర్భాలు వారి మనస్సులో నాటుకొని పోయాయి. “మనసంతా శత్రువులు ఎవరో / పండిన పంటను కాల్చేస్తున్నంత బాధగా మూలిగింది / లేత అరిటాకు మీద / వేడి వేడి భోజనం పెట్టి / తినడానికి కూర్చున్నప్పుడు / అక్కడి నుండి లేపేసినట్లు అనిపించింది / ఆ మొవ్వ అరిటాకునెవరో / మంటల్లో తగలబెట్టినట్లో / ఆ లేత ఆకులాంటి గుండెల్నెవరో చీల్చేస్తున్నట్లు అనిపించింది” (పుట.41) పాఠశాలలో జరిగిన ఈ విషయాన్ని తన నాన్నకు చెప్పారు. మరునాడు వెంకటరెడ్డి మాస్టారుతో ఓదార్పుతో దార్ల కొంత ఊరట పొందారు. తర్వాత తాను లీడర్ గా ఉండి విద్యార్థులందరి చేత పాఠం అప్పజెప్పించుకొనే సందర్భంలో ఎదురైన ఒక సంఘటన నుంచి కూడా వెంకటరెడ్డి మాస్టారు తప్పించారు. ఈ పర్యవసానాలతో దార్లకు ఎనలేని గౌరవాభిమానాలు కలిగాయి. గురుశిష్యుల అనుబంధానికి ఇలాంటివి నిలువెత్తు సంతకాలుగా నిలిచాయి.

కాట్రేనికోనలోని పాఠశాల భూమి శ్రీ వరాహబొట్ల నారాయణమూర్తి గారిది. ఆ స్కూల్ పేరు శ్రీ వరాహబొట్ల నారాయణమూర్తి మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. ఇది చాలా పెద్దది. కాట్రేనికోన హై స్కూల్లో చదువుకుంటున్న రోజుల్లోనే దార్ల తన జీవితం మీద ఏర్పరుచుకున్న లక్ష్యాన్ని ఒక సందర్భంలో వెల్లడించారు. ఒకనాడు మాస్టారు యదాలాపనగా తరగతిలో పిల్లలందరిని భవిష్యత్తులో ఏమవుతారని అడిగిన ప్రశ్నకు ఒక్కొక్కరుగా పోలీస్, కలెక్టర్, టీచర్, డాక్టర్ అని చెప్పగా రచయిత దార్ల మాత్రమే ప్రొఫెసర్ అవుతానని చెప్పారట. భవిష్యత్తులో లక్ష్యాన్ని సాధించడానికి అనువైన భూమిక దార్లకు ఆరవ తరగతిలో పడడం శుభ పరిణామం.

హైస్కూల్లో తెలుగు పాఠాలు చెప్పే శ్రీకంఠం లక్ష్మణామూర్తి గారి వల్ల తాను పద్యాలను రాగం తీసి పాడడం దార్ల నేర్చుకున్నారు. ఆతుకూరు లక్ష్మణరావు గారి చేత సోషల్ పాఠాలు నేర్చుకొని స్థానిక సమస్యలను పత్రికల్లో రాయడం నేర్చుకున్నారు. ఆయన ప్రోత్సాహంతోనే

ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలను నిర్వహించడం వంటివి కూడా నేర్చుకున్నారు. రోజు పత్రికలు చదవడం, లైబ్రరీకి వెళ్లడం పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వంటివి వారి నుంచే నేర్చుకున్నారు. ఆయన లాగా సైకిల్ మీద బడికి రావాలనే జిజ్ఞాస దార్లకు కలిగింది. అందుకోసం సెలవు దినాల్లో పనులు చేయడం, తద్వారా ఏడవ తరగతిలోనే సైకిల్ కొనడం వంటివి జరిగాయి. ఇలా తానొక సైకిల్ కి ఓనర్ కావడం మంచి ఆనందనుభూతిని కలిగించిందని దార్ల పేర్కొన్నారు. సైన్స్ మాస్టారు సహస్రాకారం, తెలుగు మాస్టారు శ్రీకంఠం లక్షణామూర్తి గారలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తెలుగు పద్యాన్ని గట్టి శబ్దంతో పఠించడం వల్ల తెలుగు మాస్టారు దార్లను ‘బూరా రారా’ అని పిలిచేవారట. హిందీ మాస్టర్ క్లాసులోకి రేడియో తెచ్చుకొని వినడం చూసి దార్లకి కూడా రేడియోతో అనుబంధం పెరిగింది. ముఖ్యంగా ‘పప్పు సార్’ అని ఒక శీర్షిక పెట్టి పాఠశాల ఉపాధ్యాయుడి మీద తనకున్న అభిమానాన్ని దార్ల చాటుకున్నారు.

కాట్రేనికోట హైస్కూల్లో చదివే సందర్భంలో దార్ల సైకిల్ మీద నుంచి కింద పడి కాలికి గాయం అయ్యింది. అందువల్ల కొన్ని రోజుల పాటు దార్ల తల్లిదండ్రులు పాఠశాలకు దగ్గరలో ఉన్న వాళ్ళ అమ్మమ్మ ఊరిలో ఉంచి చదివించాలని నిర్ణయించారు. దార్ల కూడా అమ్మమ్మ ఇంట్లో ఉంటే తమ ఇంటి దగ్గర చేసే పనులు తప్పుతాయని, ఉదయాన్నే గేదలను మేపడం, పొలం పనులు చేయడం వంటివి చేయవలసిన అవసరం లేదని అనుకున్నారు. అదే విధంగా పాఠశాలలో పెట్టే అనేక పోటీ కార్యక్రమాలలో పాల్గొనడానికి మంచి సందర్భంగా భావించారు. కానీ రెండు, మూడు రోజులు కూడా వాళ్ళ అమ్మమ్మ గారి ఇంటిలో ఉండలేకపోయారు. గాయాల కట్లు తగ్గేంత వరకు ఇంట్లోనే ఉండి, ఆ తర్వాత పాఠశాలకు వెళ్ళారు. అదేవిధంగా ఒకరోజు తన స్నేహితుడు అంబటి సత్యనారాయణ సుబ్రహ్మణ్య శాస్త్రి అరటి బోదల్ని కత్తితో కొడుతున్న సందర్భంలో పొరపాటున ఆ గొడ్డలి దార్ల కాలుపై పడిపోయిందట. నేటికీ ఆ గాయం తాలూకు గుర్తు కాలు మీద నిలిచిపోవడం బాల్యపు జ్ఞాపకంగా చెప్పుకున్నారు. దార్లకు చెయ్యి విరిగి, కొంచెం వంకరగా అయినప్పటికీ ఆయనలోని క్రమశిక్షణను గమనించి డిగ్రీ చదివేటప్పుడు ఎన్ సి సి లో అండర్ ఆఫీసర్ గా ఎంపిక చేసిన కెప్టెన్ వర్మ గారిని గూర్చి తన ఆత్మకథలో గొప్పగా చెప్పుకున్నారు.

అదే సమయంలో కాట్రేనికోనలో విద్యార్థుల కోసం హాస్టల్ సాంక్షన్ అయ్యింది. అందుకు శ్రీమోకా శ్రీవిష్ణు వరప్రసాద రావు గారి చొరువ ఎంతగానో తోడ్పడింది. దూరం నుంచి వచ్చే వారు హాస్టల్ సీటుకు అర్హులు. దార్ల వేంకటేశ్వర రావుకు ప్రయాణ భారం తగ్గింది. హాస్టల్లో సీటు వచ్చింది. కొంతకాలం హాస్టల్ బాధ్యతను దార్ల వహించారు. హాస్టల్ తాళపు చెవి తన దగ్గరే ఉండేది. హాస్టల్ కు వచ్చే వంట సామాగ్రి, బియ్యం, పప్పు దినుసులు, కూరగాయల వివరాలు నమోదు చేసుకొనేవారు. హాస్టల్లో ఉన్న రోజుల్లోనే అభ్యుదయ పథం వంటివి దార్లకు అలవడ్డాయి.

జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ లు, పంచాయతీ మెంబర్స్, ప్రజా నాయకులు వంటి వాళ్ళతో పరిచయం ఏర్పడ్డాయి. హాస్టల్లో అంబేద్కర్ జయంతి తదితర కార్యక్రమాల నిర్వహణ, అతిథుల ఉపన్యాసాల వల్ల నవ చైతన్యాన్ని సాధించారు.

శ్రమశక్తికి ప్రాధాన్యం:

చిన్నప్పటి నుండి కష్టపడి పని చేసే మనస్తత్వం దార్ల వేంకటేశ్వర రావు గారికి ఉంది. బడికి వెళ్తూనే ఇంటిలో ఉన్న ఒంగోలు గిత్తల పోషణ, వేరుశనగ పొలానికి కాపలాగా వ్యవహరించిన విషయాలను తన ఆత్మకథలో వెల్లడించారు. వేరుశనగ పంటకు రాత్రంతా బావిలో నుంచి గుల్లలతో నీళ్లు తోడి పోయడం, ఒక్కోసారి రాత్రిపూట నిద్ర వస్తే నీళ్లతో ముఖాన్ని కడుక్కోవడం వంటి అనేక అంశాలను గుర్తు చేసుకున్నారు. పాఠశాల సెలవు దినాలలో కొడవలి, క్యారేజీ చేత పట్టి అమ్మానాన్నలతో కలిసి పొలం పనులకు వెళ్ళేవారు. ఈ సందర్భంలో వరి కోతలు కోయడం, చేపలు పట్టడం, నారు తీయడం, కట్టలు కట్టడం, మోపులు కట్టడం, ఊడుపులు వేయడం, వరి కోయడం, ధాన్యం నూర్చడం వంటి కూలి పనులు చేసిన ఘట్టాలను వర్ణించారు. పాలేరుతనం, మూటలు మోయడం, బోర్లు వేసే కూలీగా పని చేసిన దాఖలాలు దార్ల జీవిత గమనంలో ఒకింత కంటతడిని పెట్టిస్తాయి. తమకున్న ఒక గేద, రెండు మైసూర్ జాతి ఎద్దులను ప్రతి రోజు పోషించడం సవాలుగా నిలిచింది. వేళకు దానపెట్టడం, కాల్వ గట్టు మీద గడ్డిని, పొలాల్లో లేత జీలుగును మేపుకొని రావడం వంటి పనులు సంక్లిష్టంగా మారాయి. కానీ వాటి నుంచి వచ్చే ఆదాయం ఏ మాత్రం ఉండేది కాదని వాపోయారు. అదే విధంగా తుఫాన్ ప్రభావం వారి ప్రాంతాన్ని అతలాకుతలం చేసిన బీభత్స సందర్భాలను రచయిత హృదయ విదారకంగా పేర్కొన్నారు. సర్కార్ హాస్టల్ ప్రవేశం తన విద్యాభ్యాసానికి, తిండి తిప్పల నుంచి తప్పించడానికి ఏ విధంగా అనువుగా నిలిచిందో ప్రస్తావించారు. దాని ద్వారా ఆకలి మంటలు తప్పి, రెండు పూటల తిండి దొరికి జీవితాన్ని నిలబెట్టుకున్న సన్నివేశాలను గుర్తు చేసుకున్నారు. సమాచార సాధనాలు అందుబాటులో లేని ఆ రోజుల్లో దినపత్రిక చదవడానికి అవకాశం లేదు. దార్ల మూటలు మోసి సంపాదించిన పైసలతో దినపత్రికను కొని చదవడం నేర్చుకున్నారు.

కొన్ని ప్రత్యేక సందర్భాలలో రచయిత దార్ల పాలేరుతనం చేసిన సందర్భాలను ఆత్మకథలో పంచుకున్నారు. తాను పాలేరుగా ఉండి చేసిన పనులను ఒక్కొక్కటిగా విశ్లేషించారు. 'పాలేరు అంటే పొద్దున్నే వెళ్లి వాళ్ళకున్న పశువులను మేపాలి. పచ్చగడ్డి కోసి వేయాలి. పశువులను కడగాలి. పాలు పిదుకాలి. వాటితో పాటు వాళ్ళ పొలంలో పనిచేయాలి. పైగా ఖాళీ దొరికితే వాళ్ళు చెప్పిన పనులన్నీ చేయాలి. వాళ్లే పిలిచి పొద్దున్నే సద్దన్నం, మధ్యాహ్నం భోజనం పెడతారు. సాయంత్రం ఏడు గంటల వరకు వాళ్ళ పని చేసి సొంత ఇంటికి వచ్చి భోజనం చెయ్యాలి.' దార్ల చిన్నన్నయ్య నానాజీ కుటుంబంలో పాలేరు పనులు చేసేవారు. అప్పుడప్పుడు ఏవైనా సెలవు

దినాల్లో చిన్నయ్య అనారోగ్యం రీత్యా దార్ల ఆ పాలేరు పనికి వెళ్ళేవారు. పాలేరు తనంలో తాను పడిన కష్టం, నానాజీ తల్లి గారు అమ్ములతో పడిన బాధ, ఆమె అన్న మాటలు, ఆమె వేసిన పాచి అన్నం వంటి సంఘటనలు గుర్తు చేసుకున్నారు.

బోర్లు వేసే కూలీగా దార్ల తన జ్ఞాపకాలను పంచుకున్నాడు. తాను, తన స్నేహితుడు అంబటి సత్యనారాయణ సుబ్రహ్మణ్య శాస్త్రి నాన్నగారు వేసే చేతి బోర్లు పనికి వెళ్లేవారు. కోనసీమలో ఇంటికో నుయ్యి తవ్వించుకొని చేతి బోర్లు వేయించుకొనేవారు. "బతకడానికి ఎన్ని పనులు చేసుకోవచ్చో నాకవన్నీ తెలిసే కొద్దీ నాలో ఆత్మవిశ్వాసం రెట్టింపు అయినట్లనిపించేది... కానీ ఆర్థిక ఇబ్బందులు అధిగమించాలంటే ప్రభుత్వ ఉద్యోగం ఒక మార్గం. ఇది రావాలంటే కష్టపడి చదవాలి. మంచి మార్కులు సాధించాలి. మంచి ర్యాంక్ సాధించాలి. ఉత్తమ గుణాల్ని కలిగి ఉండాలి. మన శక్తి సామర్థ్యాల్ని నైపుణ్యంతో ప్రదర్శించగలగాలి. సమయస్ఫూర్తి, కలివిడితనం, నాయకత్వ లక్షణాలు, సర్దుకుపోయే తత్వం, క్రమశిక్షణ, ఓర్పు వంటివి అన్నీ ఉండాలని అప్పుడు మాత్రమే మనం ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించగలుగుతామని మా హైస్కూల్లో టీచర్లు చెప్పేవారు" (పుట. 143)

విద్య – ఉద్యోగాలలో ప్రతిబంధకాలు:

ఒక్కో సందర్భంలో ఒక్కో విధంగా విద్యా ఉద్యోగ విషయికంగా మోసపోయిన సన్నివేశాలను దార్ల వేంకటేశ్వర రావు గారు సందర్భానుసారంగా ఆత్మకథలో ప్రస్తావనకు తీసుకొచ్చారు. చిన్నప్పుడు తన చెల్లికి, రామకృష్ణ చెల్లికి మధ్య జరిగిన ఒక సంఘర్షణ బడిలో మాస్టారు వరకు వెళ్ళి, కులం పేరుతో దూషణలు ఎదుర్కోవడం దార్ల మనస్సును కలిచి వేసింది. ఆ చిన్ని వయస్సులో ఏర్పడిన ద్వేషభావం కొన్ని రోజుల పాటు సాగింది. తండ్రి అనునయించడంతో ఆ ఆవేశం ఆగిపోయింది. దార్ల పెద్దన్నయ్యకు చదువు విషయంలో జరిగిన అన్యాయం ఒకటి ఉంది. ఐదవ తరగతి పరీక్షల్లో పాసైన తన పెద్దన్నయ్యకు ఊరికి దగ్గరలో ఉన్న పాఠశాలలో సీటు రాకపోవడం ఆశ్చర్యానికి గురి చేసింది. దార్లకు కూడా ఆ పాఠశాలలో సీటు రాలేదు. వీరిద్దరు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కాట్రేనికోన హైస్కూల్లో చేరి చదువుకున్నారు. దళితుల్లో అనేక ఉపకులాలు ఉన్న నేపథ్యంలో దార్ల కుటుంబానికి చెందిన ఉపకులం వారికి పాఠశాలలో సీట్లు రాని పరిస్థితి నెలకొంది. ఇతర ఉపకులాల పిల్లలకు మాత్రం ఏ ఆటంకం లేకుండా వచ్చేవి. దళిత ఉపకులాల మధ్య ఉన్న వ్యత్యాసం ఈ సంఘటనల్లో ప్రత్యక్షమవుతుంది. అప్పటి వరకు కులం పరంగా పడిన అవమానాలకు మాఫీగా 'కుల ధ్రువీకరణ పత్రం' తీసుకోవడం ఎంత ప్రత్యేకమో వారికి తెలిసొచ్చింది. కులం నమోదు చేసుకోవడం వల్ల విద్య, ఉద్యోగ రాయితీల పరంగా ప్రభుత్వం కల్పించే సదుపాయాలను పొందవచ్చనే సామాజిక అవగాహనను కొంత కొంత ఏర్పర్చుకున్నారు. కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ ద్వారా స్కూల్లో ప్రవేశం పొందే విషయాల్లో ఎంతో సహనాన్ని ప్రదర్శించేవారు. కరణం, రివెన్యూ

ఇన్స్ పెక్టర్, తహసీల్దార్ల సంతకాల తర్వాత ఆర్టీవో నుండి సర్టిఫికెట్ పొందడంలో ఎదుర్కొన్న అనేక సమస్యలను వివరించారు.

ఉద్యోగాల వేటలో నిరుద్యోగుల సమస్యలు వర్ణనాతీతం. ముఖ్యంగా ఆనాటి కాలంలో చదువుకున్నవారు తక్కువే అయినా ఉద్యోగాలు మరీ తక్కువగా ఉండేవి. నిరుద్యోగ సమస్య మితిమీరి పోయింది. ఆ కాలంలో ఉద్యోగాల వేట ఎలా ఉండేదో ప్రత్యక్షంగా వారి కుటుంబంలో జరిగిన సంఘటనను తెలియజేశారు. దార్ల పెద్దన్నయ్య పదవ తరగతి ఫస్ట్ క్లాస్ లో పాసై కూడా, టైప్ మిషన్ నైపుణ్యాన్ని సాధించి కూడా ఉద్యోగ వేటలో వెనకబడి పోయారు. అందుకు కారణం అవినీతి, లంచగొండితనం. కుమ్మనరాజు అనే ఒక భూస్వామి మోసపూరిత కుట్ర వల్ల వారి కుటుంబం అన్యాయానికి గురైన విధానం వివరించారు. కుమ్మనరాజు దగ్గర పొలం పనులు చేస్తూ నమ్మకంగా ఉంటే కుటుంబ సభ్యులలో ఎవరికైనా ఉద్యోగం ఇప్పిస్తారని ఆశను కల్పించారట. అలా నమ్మకంగా పనిచేసి ఉద్యోగం పొందాలనే సంకల్పంతో కుమ్మనరాజు కొబ్బరి తోటకు ఎల్లవేళలా కాలువలు తీసి, నీరు కట్టి, రాత్రింబవళ్ళు కంటికి రెప్పలా కాపాడుతూ సేవ చేశారట. చివరకు కొబ్బరి తోట ఏపుగా పెరిగింది గాని వాళ్ళ పెద్దన్నయ్యకు మాత్రం ఉద్యోగం రాలేదని దార్ల వాపోయారు. ఈ సందర్భంలోనే మనుషుల మధ్య పెరిగిపోయిన స్వార్థపూరిత ఆలోచనను కవితాత్మకంగా వ్యక్తపరిచారు. “వలస పక్షికి ఇప్పుడేదో విరిగిన చప్పుడు / చెట్టు నిండా పండ్లు / అయినా కొమ్మల్ని రెమ్మల్ని అలుముకున్న ఏకాకులు! / పండిన వెలితి / ఎంత తీయని బంధం / నోట్లో ఊరుతున్న కాకరకాయ రసం! / పొద్దున్నే భుజాన్నెక్కుతున్న సూర్యుడు / రైలు దిగినప్పుడు / వెన్నెలవుతాడు!” (పుట. 24)

సమాజం – వేదనాభరితం:

పంట పొలాలన్ని అగ్రవర్ణాల వారికే ఎందుకు ఉంటాయి? ఆయా పొలాల్లో దళితులు కూలీ పనులు ఎందుకు చేస్తుంటారు? దళితుల ఇండ్లు ఊరి చివరనే ఎందుకు ఉంటాయి? ఇతర సామాజిక వర్గాలతో ఎందుకు కలిసి ఉండరు? అప్పుడప్పుడే డా. బి. ఆర్. అంబేద్కర్ భావజాలం ప్రభావంతో గ్రామాల్లో చైతన్యం కలుగుతున్న నేపథ్యంలో ఇటువంటి సామాజిక వ్యవస్థ మీద దార్లకు సందేహాలు, ప్రశ్నలు ఉదయించేవి. కానీ ఇలాంటి విషయాలను ప్రస్తావించే సందర్భంలో అతి సున్నితమైన నేర్పు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారి రచనలో కనిపిస్తుంది. మచ్చుకు.. “మా ఊరి మధ్య శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ కనకదుర్గ, శ్రీ రామచంద్రమూర్తి స్వామి ఆలయాలు ఉన్నాయి... ఆ దేవాలయాల్లోకి దళితులకు ప్రవేశం లేదని చెప్పలేం. కానీ దళితులెవరు ఆ దేవాలయాల్లోకి వెళ్లి, అందరితో కలిసి కళ్యాణోత్సవాలు, పూజలు చేస్తారని మాత్రం గట్టిగా చెప్పలేం.” (పుట. 12) అని చెబుతారు.

పండుగలు, ఉత్సవాలు జరుపుకొనే కొన్ని కొన్ని సందర్భాలలో ఆయనను కలవరపెట్టి, కలతపరిచి, హృదయాన్ని సంవేదనపరిచిన విషయాలు ఈ ఆత్మకథలో అప్రయత్నంగానే స్మరణకు వచ్చాయి. బాల్యంలో జరిగిన సన్నివేశాలు జీవితాంతం చెరగని ముద్ర వేస్తాయనడానికి పూసగుచ్చినట్లు చెప్పిన అనేక విశేషాలు నిదర్శనంగా నిలుస్తాయి. అట్టడుగు వర్గం పరంగా, అణగారిన వర్ణం పరంగా ఎదుర్కొన్న అనేక దుర్భర సమస్యలకు ఇది ఒక ఆత్మ కథనాత్మక దృశ్యమానంగా మనకు దర్శనమిస్తుంది.

ఒకే కుటుంబంగా కలిసిమెలసి ఉండి కులవృత్తి ఉత్పాదక వస్తువులను పంచుకోవడం అనేది సమగ్ర గ్రామ వ్యవస్థకు ఒక చిత్రిక పడుతుంది. కానీ ఇతర సామాజిక వర్గాలతో కూడి లేకపోవడం, తమ వర్గం వారు వేరుగా తమ పనులు తామే చేసుకోవడం వంటి సున్నితమైన విషయాలు దార్ల బాల్యపు మనసులో అంతుచిక్కని అంశంగా మిగిలిపోయింది. కొన్ని కొన్ని పరిస్థితుల్లో రజకులను తనకు ఆదర్శంగా నిలుపుకొని ఇంటి కష్టసుఖాలను పంచుకున్న సందర్భాలను వెల్లడించారు. రజకుల కృషి, వారికి వృత్తి మీద ఉన్న గౌరవం, వృత్తికి సరిపడే వేతనం దొరకక పడుతున్న వేదనాభరిత జీవితాన్ని వర్ణించారు. చాకలి రాములు కుటుంబంతో ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని ప్రస్తావించారు. “నాలో జ్ఞానబీజాల్ని మొనకెత్తించిన / ఆ రజకులంటే నాకు గౌరవం మొదలైంది / నాలో నిత్యం జీవితమంటే యుద్ధమన్నట్లు / విజయభేరీ మోగించే శబ్ద ధ్వనులేవో వినిపించిన / ఆ రజకులంటే / నిలువెత్తు శ్రమ సంకేతాలన్నట్లు అనిపించింది / వాళ్లు పని పట్ల చూపిన అంకితభావం / నాలో గొప్ప ఆత్మవిశ్వాసానికి ప్రేరణ కలిగించింది / పొద్దున్నే పొద్దుని లేపే / వాళ్ళ సమయపాలన నాకు ఆదర్శాన్నిచ్చింది.” (పుట. 83)

సంస్కృతి – కళారాధనం:

కోనసీమ ప్రాంతంలో సాంస్కృతిక అభినివేశం ఎక్కువ. వినాయక చవితి, విజయదశమి ఉత్సవాల సందర్భంగా ప్రదర్శించే నాటకాలు దార్ల వేంకటేశ్వర రావు గారిని ఎంతగానో ప్రభావితం చేశాయి. పాండవోద్యోగ విజయం, గయోపాఖ్యానం, శ్రీకృష్ణతులాభారం, సత్యహరిశ్చంద్ర నాటకం, శ్రీరామాంజనేయ యుద్ధం, చింతామణి నాటకాలను తన ఆత్మకథలో ప్రస్తావించారు. చింతామణి నాటకంలో తాను సుబ్బిశెట్టి పాత్రను పోషించిన ఘట్టాలను గుర్తు చేసుకున్నారు. చిన్న చిన్న నాటకాలలో ఆయా పాత్రలను ధరించిన సన్నివేశాలను చెప్పారు. కుటుంబం మొత్తం కలిసి బొబ్బిలి యుద్ధం, అంబేద్కర్ బుర్రకథలు తదితర ప్రదర్శనలు తిలకించడం వంటివి రచయిత కళాత్మకంగా వ్యక్తపరిచారు.

కీర్తిదాయకంగా, భక్తిపూర్వకంగా ఈ ఆత్మకథలో రచయిత దార్ల ప్రస్తావించిన విషయం ‘అరుంధతిదేవి’ని తమ ఇంటి ఆడపడుచుగా చెప్పుకోవడం. ‘మహాభారతం రాసింది మీ తాతగారే’ అని ఎవరో పెద్దవాళ్లు చెప్పిన విషయాన్ని గుర్తు చేసుకోవడం. నక్షత్రాలన్నింటిలోకెల్లా పెద్దది

అరుంధతి నక్షత్రం. ఆకాశంలో చుక్కలను చూస్తూ ఆరుబయట నిద్రించినప్పుడు రచయిత పొందిన ఆత్మానుభూతి ఎంతో గొప్పది. నక్షత్రాలలో ఎక్కువ కాంతితో ప్రకాశించే సప్త ఋషులకు దగ్గరగా ఉన్న నక్షత్రాన్ని అరుణ్ జ్యోతి నక్షత్రంగా తల్లి ద్వారా దార్ల తెలుసుకున్నారు. అంతేగాక 'ఆ అరుణ్ జ్యోతి మనింటి పిల్లే' అలా నక్షత్రంగా మారిపోయిందని చిన్నతనంలో తల్లి ద్వారా ఆ కథంతా విని ఆశ్చర్యం పోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా గవరపాలెంలోని అరుంధతి దేవి విగ్రహాన్ని ఈ పుస్తకంలో పొందుపరిచారు.

7

తెలుగు భాషా ప్రయోగ రంగాలు – ఆధునీకరణ

– డా.పి.విజయ్ కుమార్

సమాజం ఆధునికత సంతరించుకుంది అంటే భాష కూడా ఆధునికమవుతోందని భావించాలి. సమాజగత మార్పులు భాషలో మార్పులకు దోహదకారి అవుతాయి. సాంస్కృతిక పునరుజ్జీవనం, పారిశ్రామిక విప్లవం సమాజంలో ప్రధానంగా మానవ జీవన వైఖరిని మార్చివేశాయి. భాషా ప్రయోగరంగాలు విస్తృతమవుతున్న నేపథ్యంలో భాషలు ఆధునీకరణ చెందుతూ ఉన్నాయి.

మూడువేల వసంతాలకు పైగా జాతిచరిత్ర, రెండువేల వసంతాలకుపైగా భాషాచరిత్ర, వెయ్యి వసంతాలకు పైగా సాహిత్య చరిత్ర కలిగి, అత్యధిక ధ్వనులు, వర్ణమాల కలిగిన భాషగా ప్రాశస్త్యం పొంది, ప్రపంచంలోనే రెండో ఉత్తమ లిపిగా పేరొందిన అజంత భాష మన తెలుగుభాష. తెలుగు భాషపై ప్రపంచీకరణ ప్రభావం చాలా స్పష్టంగా కన్పిస్తుంది. ఎన్నో ప్రాంతీయ భాషలు ప్రపంచీకరణ ప్రభావానికి గురవుతున్న నేపథ్యమిది. యునెస్కో, ప్రపంచ బ్యాంకులు ముఖ్యంగా మాతృభాష ఔన్నత్యాన్ని, దశాబ్దాలుగా వినిపిస్తూ; పొంచిఉన్న ప్రమాదాన్ని హెచ్చరిస్తూనే వస్తున్నాయి. అంతరించిపోయే భాషల జాబితాలో తెలుగుభాష కూడా చేరింది. ప్రపంచంలో అత్యధికులు వ్యవహరించే భాషల్లో మొదటి 15 స్థానాలలో ఒకటిగా పేరొందిన 'తెలుగు భాష' భవిష్యత్తులో భాష మనుగడ పరిణామాలు ఎలా ఉంటాయో అని మేధోమథనం చేస్తున్న తరుణమిది. తెలుగుభాష మనుగడ ప్రశ్నార్థకంగా మారినా, ఇటీవల కొన్ని పరిణామాలు ఆశాజనకంగా కన్పిస్తున్నాయి. నూతన జాతీయ విద్యావిధానంలో మాతృభాషా మాధ్యమానికి పెద్దపీట వేయడం జరిగింది. భారతీయ భాషల్లో డిగ్రీస్థాయి వరకు పాఠ్యపుస్తకాలు తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శుభపరిణామంగా భావించాలి. విద్యార్థి మాతృభాషలో విద్యాబోధన, అభ్యసనం చేస్తే సృజనాత్మకత విరాజిల్లుతుంది. "మాతృభాష తల్లి వంటిది. పరభాష పోతపాలు వంటిది" అంటారు కొమర్రాజు లక్ష్మణరావు పంతులు. "పరభాష ద్వారా నేర్చుకొనే విద్య సోపానాలు లేని సౌధం వంటిది" అని రవీంద్రనాథ ఠాగూర్ పేర్కొన్నారు. మాతృభాషకి ఎన్నో కమీషన్లు ప్రాధాన్యత నివ్వడం జరిగింది. శాస్త్ర, సాంకేతిక తదితర రంగాలలో విజ్ఞానాభివృద్ధి దినదిన ప్రవర్ధమానమవుతూ

ఉంది. భాషను ఆధునీకరించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. పరిభాషా పదాల రూపకల్పన చేసుకోవలసిన అవసరం తప్పనిసరిగా ఉంది. శాస్త్ర, సాంకేతిక తదితర రంగాలకు సంబంధించిన విజ్ఞానం తెలుగు భాషలోకి అనువదించుకుంటేనే ఆ విజ్ఞానం మనవారికి అందుతుంది. సంబంధిత కృషి జరుగుతుంది.

తెలుగు భాష 19వ శతాబ్దంలో గ్రాంధిక భాషాస్వరూపం నుంచి విడివడి, ప్రజల వ్యావహారిక భాషగా పరిణమించి, అన్ని అవసరాలకు ఉపయోగపడే ఆధునిక ప్రసార సాధనంగా తెలుగుభాష రూపొందింది. గ్రాంథిక భాషా సంప్రదాయం నుండి వ్యావహార భాషా పరిణామక్రమంలో తెలుగుభాషాభివృద్ధికి పాటుపడిన వారిలో సి.పి.బ్రౌన్, గిడుగు రామమూర్తి పంతులు, గురజాడ అప్పారావు పంతులు లాంటి ఎందరో మహానుభావులున్నారు.

భాషాయోజన – ఆవశ్యకత :

ఆధునిక కాలంలో తెలుగుభాష సృజనాత్మక రంగంలో అనేక ప్రక్రియల్లో విరాణ్మూర్తిగా వర్ధిల్లుతూనే ఉంది. ప్రధానంగా ప్రసార మాధ్యమాల్లో రేడియో, టెలివిజన్, సినిమా, పత్రికల్లో రాసే, మాట్లాడే భాష వినియోగం విస్తృతంగా కొనసాగుతుంది. బోధన, అభ్యసన, వినియోగం తదితర రంగాలలో కూడా తెలుగు భాషోపయోగం జరుగుతున్నా, పూర్తిస్థాయిలో వినియోగం జరగాల్సిన అవసరం ఉంది. అన్ని రంగాలలో ఆయాస్థాయిలలో ప్రణాళికాబద్ధంగా తెలుగుభాష అభివృద్ధి సాధించగలిగితే తెలుగు సర్వసమర్థమైన స్వతంత్ర భాషగా అత్యున్నత స్థాయికి చేరుతుంది. భాషాభివృద్ధికి తప్పనిసరిగా నిర్దిష్టమైన ప్రణాళిక రూపొందించాలి. భాషాభివృద్ధిలో ప్రాధాన్య రంగాలను గుర్తించి ప్రత్యేక ప్రాతినిధ్యం నిచ్చి విధానపరమైన నిర్ణయాలు తీసుకొని, లక్ష్యసాధన దిశగా పయనిస్తే తప్ప భాషాభివృద్ధి సమగ్రం కాదు, సార్థకమూ కాదు.

మన దేశంలో బహుభాషాస్థితి ఉంది. భాషా ప్రాతిపదికనే రాష్ట్రాల విభజన జరిగింది. ప్రామాణికతను పాటించి, విభిన్న రంగాలలో తెలుగు భాషోపయోగాన్ని విస్తృతపరచాల్సిన సమష్టి బాధ్యత అటు ప్రభుత్వం, ఇటు ప్రజలపైనా ఎంతైనా ఉంది. ఇలా చేయడం ద్వారానే ఆయారంగాలలో వినూత్న పదసృష్టి, భావవ్యక్తీకరణా సామర్థ్యం గల ఆధునికభాషగా తెలుగు వర్ధిల్లుతుంది.

భాషాయోజన లక్ష్యాలు :

1. భాషాప్రయోగరంగాలలో ఆధునీకరణకు ప్రణాళిక రూపొందించడం.
2. విద్య, పరిపాలన, రెవెన్యూ, న్యాయ, ప్రసార మాధ్యమ, శాస్త్రసాంకేతిక మొదలగు విభిన్న రంగాలకు సంబంధించిన పరిభాషాపదాల రూపకల్పన చేయాలి.
3. ఆయారంగాలలో విశేష పదాలను ప్రామాణీకరించాలి.

4. విభిన్న రంగాలకు చెందిన విభాగాలలో భాగంగా తెలుగుభాష అమలుకు విధానపరమైన నిర్ణయాలు రూపొందించాలి.
5. ఆధునిక రచనాశైలికి ప్రాచుర్యాన్ని కల్గించి వ్యాప్తికి శ్రీకారం చుట్టాలి.
6. అనువాదాలకు ప్రోత్సాహాన్నిచ్చి విశేషమైన రచనలు అన్నీ తెలుగుభాషలోకి అనువాదం జరిగేలా రచయితలను ప్రోత్సహించాలి.
7. సృజనాత్మకరంగంలో రచనలకు ప్రోత్సాహాన్నివ్వాలి.
8. మాట్లాడేభాష, రాసే భాషల వినియోగంలో ఏకరూపత, ప్రామాణికతలను పెంపొందించేందుకు నిర్దుష్ట మార్గాలకు రూపొందించాలి.

భాష ఆధునీకరణ:

తెలుగుభాష ఆధునీకరణ కావడానికి, సకల సమాచార అభివ్యక్తి సాధనంగా పురోగమనం చెందడానికి, ప్రసార మాధ్యమాల రంగంలో జరిగిన కృషి ప్రధాన కారణంగా భావించాలి. సమాచార, భావప్రసారానికి మాట్లాడే భాషని, రాసే భాషని ప్రసారమాధ్యమాలు సమర్థవంతంగా వినియోగించుకుంటున్నాయి. భాష కాలానుగుణంగా పరిణామం చెందుతూనే ఉంది. తెలుగుభాషలో ఎన్నో నూతన పదబంధాలు, పదకల్పనలు, పారిభాషిక పదాలు, విశేషపదాలు ఎన్నో రూపాంతరాలు చెంది వర్తమాన వాగ్వ్యవహారంలోకి ప్రవేశిస్తున్నాయి. ఈనాడు నెట్టింట తెలుగు భాషావ్యాప్తి ఆధునీకరణకు ప్రయత్నాలు విస్తృతంగా జరుగుతున్నాయి. ఇటు భాషా, అటు సాహిత్యరంగాల లోనూ ఇంకా అనువాదరంగంలో విశేషంగా కృషి జరుగుతూ ఉంది. 'వీకీపీడియా'లో విశేషంగా కృషి జరిగింది, జరుగుతూనే ఉంది. అనేక బ్లాగుల్లో 'భాష' అనేక రంగాలలో దినదిన ప్రవర్ధమానమవుతూనే ఉంది. ఆదాన ప్రదానాలు విరివిగా చోటు చేసుకుంటున్నాయి. భాషలో ధ్వని విపరిణామం అర్థవిపరిణాలం సంతరించుకుంటూనే ఉంది. అనువర్తిత భాషాశాస్త్రంలో ధ్వని విజ్ఞానం, వర్ణవిజ్ఞానం, క్రియానిర్మాణం, ధాతువిభజన గురించి పరిశోధన జరుగుతూనే ఉంది. ద్రావిడభాషలపై తులనాత్మక పరిశోధన జరుగుతూనే ఉంది. అనేక భాషా ప్రయోగ విశేషాలు వెలుగులోకి వస్తున్నాయి. భాషాపరిణామ వికాసంలో భాగంగా భాష ఆధునీకరణకు నిరంతర కృషి జరగాలి.

భాషాభివృద్ధి ప్రణాళిక (భాషాయోజన) – రంగాలు :

భాషాభివృద్ధి ప్రణాళికలను రూపొందించాల్సిన భిన్న భాషా ప్రయోగ రంగాలను ముందుగా గుర్తించడం అవసరం. ఆధునిక సమాజంలో భాషను ప్రయోగించే సందర్భాలు ఎక్కువవుతున్నాయి. తదనుగుణంగా భాష కూడా అవసరమైన మార్పులను పొందుతూ వస్తోంది. మాట్లాడే భాషను, రాసే భాషను వినియోగించే భాషాప్రయోగ రంగాలు కొన్నింటిని గురించి స్థూలంగా పరిశీలిద్దాం.

మాట్లాడే భాష – ప్రయోగరంగాలు :

మాట్లాడే భాషను ఉపయోగించుకునే అనేక సందర్భాలు మనకు తెలుసు. వాటిలో కొన్నింటిని పరిశీలించడం ద్వారా మాట్లాడే భాష ఎలా అభివృద్ధి చెందుతుందో తెలుసుకోవచ్చు.

అ. దైనందిన వ్యవహారం :

దైనందిన వ్యవహారంలో భాషను మనం ఉపయోగించేప్పుడు భిన్నమైన శైలీ భేదాలను గమనించవచ్చు. సందర్భాన్ని బట్టి, అవతలి వ్యక్తిని బట్టి, సామాజిక స్థాయిని బట్టి, మనం మాట్లాడే భాష మారిపోతూ ఉంటుంది. రోజువారీ జీవితంలో మనం ఈ మార్పులను సులభంగానే గుర్తించవచ్చు. మనం మిత్రులతో చాలా స్వేచ్ఛగా, ఆత్మీయంగా, అరమరికలు లేకుండా, సంకోచాలు లేకుండా మాట్లాడుతాం. అంటే ఇక్కడ ప్రయోగించే భాష ఒక శైలిలో ఉంటుంది. అదే మనం అపరిచిత వ్యక్తితో మాట్లాడుతున్నామనుకోండి. చాలా క్లుప్తంగా, అవసరమైనంత మేరకు, సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడమే లక్ష్యంగా మాటలు ప్రయోగించడం మనం గుర్తించవచ్చు. సమావేశాల్లో, తరగతి గదిలో, చర్చలో భాషను ఉపయోగించే పద్ధతిలో ఒక క్రమం ఉన్నట్లు, కొన్ని సామాన్య సూత్రాలున్నట్లు మనం గ్రహించవచ్చు. వక్త లేదా మాట్లాడే వ్యక్తి అనుభవాన్ని బట్టి ఈ పద్ధతిలో మార్పులుంటాయి. ఔచిత్యం, ప్రామాణికత, స్పష్టత, సరళత, విశ్వసనీయత ఉట్టిపడే పద్ధతిలో భిన్న సామాజిక సందర్భాలలో మాట్లాడడం అన్నది ఒక సామాజిక చర్య. ఈ రంగంలో భాషా వ్యవహర్తల అనుభవంపై పదును తేలుతుంది. ప్రభావవంతంగా రూపొందుతుంది. వ్యవహర్తల సామాజిక సాంస్కృతిక స్థాయి, విద్యార్హతలు, మనస్తత్వం ఈ రంగంలో భాషా ప్రయోగాన్ని ప్రభావితం చేసే అంశాలు.

ఆ. రేడియో, టీవీ, సినిమా :

మాట్లాడే భాషనూ, రాసే భాషనూ ఉపయోగించే రంగం రేడియో, టీవీ, సినిమా రంగం. భిన్న మాండలికాలకు దగ్గరగా ఉండే ప్రమాణ భాషలోనే ఈ రంగంలో కార్యక్రమాలు రూపొందుతాయి, ప్రసారమవుతాయి. రేడియో శ్రవ్య ప్రధానమైతే; టీవీ, సినిమాలు శ్రవ్య, దృశ్య ప్రధానాలు. రేడియోలో మాండలిక శైలిలో భాషను కొన్ని కార్యక్రమాలలో ఉపయోగించడం గమనార్హం. కాని ప్రధానమైన కార్యక్రమాలన్నీ అందరూ మాట్లాడే ఆధునిక ప్రామాణిక భాషలోనే ఉంటాయి. టీవీ, సినిమాలో ప్రయోగించే భాష కూడా సామాజిక సందర్భాలకు ఉచితమైన రీతిలో అందరికీ అర్థమయ్యే ప్రమాణ భాషలోనే ఉండటం గుర్తించవచ్చు.

ఇ. పరిపాలన, ఇతర రంగాలు :

పరిపాలన, న్యాయ, రెవెన్యూ రంగాలలో, సేవారంగాలలో, బోధనా రంగాలలో మనం మాట్లాడే భాష కూడా ఆయా పరిభాషలను కలిగి ఉండడం గమనార్హం. తెలుగులో ఇంకా చాలా

భావనలకు ఆదాన పదాలతోనే సరిపెట్టుకున్నాం. ఉదాహరణకు రెవెన్యూ రంగంలో విస్తారంగా అరబిక్, పర్షియన్, ఉర్దూ పదాలున్నాయి. వాటిని వ్యవహారంలో యథాతథంగానే వాడుకుంటున్నారు. అలా వాడుకోవడంలో పొరబాటు లేదు కాని ఈ రంగాలలో పారిభాషిక పదాలను, వాటి వాడుకను ప్రామాణీకరించటానికి, వ్యవహర్తలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికా బద్ధమైన చర్యల్ని చేపట్టాలి.

ఈ. రాసే భాష ప్రయోగ రంగాలు :

రాసే భాషను అంటే లిఖిత భాషను ప్రయోగించే సందర్భాలను చాలా వాటిని మనం గుర్తించవచ్చు. వాటిలో ప్రధానంగా కనిపించేవి సృజనాత్మక రంగం, ప్రసార సాధన రంగం (ప్రముఖంగా పత్రికలు) పరిపాలన, న్యాయ, రెవెన్యూ తదితర రంగాలు, విద్యారంగం, వీటిలో భాషాభివృద్ధిని సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా, వ్యూహాత్మకంగా ప్రయత్నించడం చాలా అవసరం.

ఉ. సృజనాత్మక రంగం :

సృజనాత్మక రంగంలో తెలుగు భాష వివిధ శైలీ భేదాలతో విన్యాసాలతో వికసిస్తూ వచ్చింది. నేటి ఆధునిక వచనం ఈ స్వరూపంతో, ఇంత వైవిధ్యంతో విలసిల్లడానికి కారకులైన మహనీయులు చాలామందిని మనం స్మరించుకోవాలి. గిడుగు నుండి కొడవటిగంటి, చలం, బుచ్చిబాబు, గోపీచంద్, లత, రంగనాయకమ్మ వరకూ ఎందరో రచయితలు సృజనాత్మక వచనాన్ని తీర్చిదిద్దటంలో భాగస్వాములుగా కనిపిస్తారు.

ప్రధానంగా వచన సాహిత్యం శాఖోపశాఖలుగా అనేక ప్రక్రియలలో అభివృద్ధి చెందింది. నవల, కథానిక, నాటకం, గల్పిక, వ్యాసం, మ్యూజింగ్స్, ఆత్మకథ, యాత్రాచరిత్ర, లేఖారచన వంటి అనేక రూపాలు ఈనాటి సాహిత్యంలో మనం చూస్తున్నాం. వీటిలో ఉపయోగించే భాష సాధారణంగా ఆధునిక ప్రామాణిక భాషే, కొన్ని పాత్రల చేత రచయితలు మాండలికంలోనే పలికించే వారూ లేకపోలేదు. మనం ఇంతకు ముందు శైలిలో ఏకరూపత గురించి ఒక భాగంలో చర్చించాం. రచయితలు శైలిలో ఏకరూపత కోసం సాధారణంగా జాగ్రత్తలు తీసుకుంటారు. అయితే ఇటీవల మాండలిక శైలికి. సన్నిహితంగా ఉన్న వచన శైలినే ఆయా ప్రాంతాల రచయితలు రాస్తున్నారు. రాయలసీమ, తెలంగాణా, కళింగాంధ్ర, కోస్తా ప్రాంతాలకు సంబంధించిన ప్రాంతీయ మాండలిక శైలీ ముద్ర కలిగిన రచనలు చేయడానికి ఆయా ప్రాంత రచయితలు ఉత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారు.

ఊ. అనువాద రంగం :

ఇతర భాషల నుండి జరిగే అనువాదం ద్వారా భాష వ్యక్తీకరణ సామర్థ్యం పెరుగుతుంది. భాషాభివృద్ధికి అనువాదాలు చాలా దోహదం చేస్తాయి. నూతన పదాలు, భావనల సంకేతాలను సరి అయిన విశేష పదకల్పనలు భాషలో అనువాదం మూలంగానే పెరుగుతాయి. అనువదించుకునే

సామర్థ్యం తెలుగు భాష కలిగి ఉందంటే అది ఆధునీకరణ సంకేతం, అభివృద్ధి చిహ్నం ఇలాంటి అనువాదాలను విరివిగా తీసుకురావటానికి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలి. దీని ప్రాతిపదికగా భాషకు అవసరమైన నిఘంటువులు, పారిభాషిక పదకోశాలు తయారవుతాయి. భాష అభివృద్ధికి ఇవి చాలా ఉపకరిస్తాయి.

ఋ. ప్రచురణ రంగం :

సృజనాత్మక రంగంలో తెలుగు భాషాభివృద్ధి పూర్తిగా కొన్ని సంస్థలు, సృజనాత్మక రచయితలు అన్నిటికన్నా మించి ఉత్తమాభిరుచి ఉన్న పాఠకుల మీద ఆధారపడి జరుగుతున్న వ్యవహారం. పత్రికలు, కొన్ని ప్రచురణ సంస్థలు ఒక క్రమంలో రచనల్ని ముద్రిస్తున్నాయి. ఉత్తమ సాహిత్యాన్ని ఆదరించే వాతావరణాన్ని కల్పిస్తున్నాయి. వీటి పనితీరు ప్రణాళికాబద్ధంగా ఉండడం అవసరం. ఇదే పద్ధతిలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు భారతీయ భాషలలో సృజనాత్మక సాహిత్యాన్ని ఒక నిర్దిష్ట క్రమంలో వెలువరించేందుకు కృషి చేస్తున్నాయి. కేంద్ర సాహిత్య అకాడమీ 22 భారతీయ భాషల్లో సృజనాత్మక సాహిత్యానికి ప్రోత్సాహకాలను ప్రకటిస్తోంది. ప్రచురణ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అనేక రచయితల సంఘాలు, రచయితల సహకార ప్రచురణ సంఘాలు తమ లక్ష్యాల మేరకు నిర్దిష్ట ప్రణాళికతో సృజనాత్మక సాహిత్యాన్ని ప్రచురిస్తున్నాయి.

ప్రచురణ సంస్థలు కూడా తమ లక్ష్యాలకనుగుణంగా నిర్ణీత కాలవ్యవధిలో ఆశించిన మేరకు రచనలను వెలువరిస్తున్నాయి. ఒక సంవత్సర కాలాన్ని పరిగణలోకి తీసుకుని ప్రచురణల సంఖ్యను బట్టి ప్రచురణ ప్రణాళిక – ఆచరణను మనం గుర్తించవచ్చు.

ౠ. పత్రికలు, ప్రసార సాధనాలు :

ఆధునిక వచనానికి ఒక ప్రామాణికతను కలిగించడంలో పత్రికలు చాలా ఎక్కువ దోహదపడతాయని చెప్పాలి. ప్రసార మాధ్యమాల్లో పత్రికలే ఆధునిక వచన వ్యాప్తికి, విస్తృతికి, వైవిధ్యానికి ప్రధాన కారణం అని కూడా చెప్పవచ్చు. పత్రికలన్నీ తెలుగు భాషాభివృద్ధికి ప్రత్యేకంగా ప్రణాళికలను రచించి తదనుగుణంగా తెలుగులో ప్రామాణిక వచనాన్ని, ఏకరూపత ఉన్న శైలిని ఏర్పరచుకుంటూ వచ్చాయని చెప్పలేము. కానీ పత్రికలు వేటికవి తమ శైలీ పత్రాల ఆధారంగా, ఆధునిక వచనాన్ని ప్రామాణీకరించేందుకు భాషను అభివృద్ధి పరచేందుకు తగిన చర్యలు తీసుకుంటూ వస్తున్నాయన్నది మాత్రం వాస్తవం. ఈ చర్యల సమాహారాన్ని స్థూలంగా మనం అప్రకటిత భాషాయోజనగా పేర్కొనవచ్చు. ఆదానపదాలు, నూతన పదబంధాలు (నల్లడబ్బు, శ్వేతపత్రం, భూమితనఖా పారిభాషిక పదాలు (పట్వారీ, వీలునామా) మొదలైన వాటి ఉపయోగంలో, వార్తాకథనాలు, ప్రత్యేక శీర్షికలు, సంపాదకీయాలు మొదలైన వాటి శైలీ నిర్వహణల్లో పత్రికలు చేస్తున్న కృషి తెలుగు భాష ఆధునీకరణకు దారితీస్తోంది. మాట్లాడే భాషతో బాటు రాసే భాషను కూడా ఉపయోగించుకున్న రేడియో. టెలివిజన్, సినిమా రంగాల్లోనూ ఆధునిక ప్రమాణ భాషే

వాడుకలో ఉండడం మనం గమనించవచ్చు. పత్రికల్లోలాగే వీటిల్లోను మాండలికశైలి ఉపయోగం కొన్ని ప్రత్యేక సందర్భాల్లో కనిపిస్తుంది. ఆయా ప్రాంతాలకు సంబంధించిన ప్రత్యేక కార్యక్రమాల్లో ఆధునిక ప్రామాణిక భాషకు భిన్నంగా మాండలిక శైలిని సహజత్వం కోసం, శ్రోతల్తో / ప్రేక్షకుల్తో మరింత సాన్నిహిత్యాన్ని పొందటం కోసం వాడుకోవడం మనం గమనించవచ్చు. రేడియో టెలివిజన్, సినిమాల్లో భాషా ప్రయోగం ఒక నిర్దిష్టమైన ప్రామాణిక పద్ధతిలో, ప్రజలందరికీ ఆమోదయోగ్యమైన ఒరవడిలో సాగుతున్నట్లు మనం గుర్తించవచ్చు. అయితే రేడియో, సినిమాలలో సృజనాత్మక రూపాలున్నప్పుడు వీటిలో కథా వస్తువులోని పాత్రభేదాలననుసరించి శైలీ భేదాలుండవచ్చు. ప్రామాణిక మాండలిక శైలీ మిశ్రమం ఉండవచ్చు. ఈ రంగంలో తెలుగు భాషాభివృద్ధిలో ఆయా సంస్థలు ఏర్పరచుకునే శైలీపత్రాలే నిర్ణాయక పాత్ర నిర్వహిస్తాయని వేరే చెప్పనక్కరలేదు.

ఎ. పరిపాలన, న్యాయ, రెవెన్యూ, రంగాలు :

భాషాయోజన చేయాల్సిన రంగాల్లో పరిపాలన, న్యాయ, రెవెన్యూ రంగాలు ఉన్నాయి. ప్రజల భాషలోనే పరిపాలన జరగడం వల్ల ప్రజలు పరిపాలనలో పాల్గొనగలుగుతారు. విధాన నిర్ణయాలను, చట్టాల తీరుతెన్నులను అవగాహన చేసుకోగలుగుతారు. వాటిని అమలుపరచడంలో తమవంతు పాత్రను సక్రమంగా నిర్వహించగలుగుతారు. అయితే వలసపాలన నుంచి విముక్తి అయిన తర్వాత కూడా భారతదేశంలో ఈ రంగాలలో భారతీయ భాషల్లో ఉపయోగం అమలుకాలేదు. ప్రభుత్వ ప్రత్యక్ష జోక్యం లేనిదే ఈ రంగాల్లో ప్రాంతీయ భాషల అమలు సాధ్యం కాదన్న విషయం అందరికీ స్పష్టమైన తర్వాత వీటిపైకి దృష్టి సారించారు. పరిపాలన, న్యాయ, రెవెన్యూ వ్యవహారాలలో ప్రాంతీయ భాషలను అవసరమైనంత మేరకు అమల్లోకి తేవాలని విధాన నిర్ణయాలు జరిగాయి. ఇందుకనుగుణమైన భాషాభివృద్ధి ప్రణాళికను ఒకదానిని తయారుచేశారు. అధికార భాషా సంఘం తెలుగు భాషాభివృద్ధికి తీసుకుంటున్న చర్యల్ని పర్యవేక్షిస్తుంది. పరిభాషా పదాల కల్పన ఈ రంగంలో నిరంతరం జరగాలి. అధికారులు ఉపయోగించే భాష ప్రజలకు అందుబాటులోకి రావాలి.

ఏ. విద్యారంగం :

విద్యారంగంలో తెలుగు భాషాభివృద్ధికి ప్రయత్నాలు చాలా జరిగాయి. స్వాతంత్ర్యానికి పూర్వమే మనదేశంలో మిషనరీలు ప్రాంతీయ భాషల్లో ప్రాథమిక విద్యాబోధన చేసే పాఠశాలలను ప్రారంభించి నడిపారు. ప్రాథమిక స్థాయి వరకు తెలుగులో బోధన చెప్పుకోదగ్గ స్థాయిలోనే జరిగిందనే చెప్పాలి. ఆరేడు దశాబ్దాల అనుభవంతో ఈ వ్యవస్థ క్రమబద్ధమైంది, పటిష్టమైంది. అయితే 1968 నుంచే తెలుగులో ఇంటర్మీడియెట్ స్థాయిలో బోధన ప్రారంభించారు. దీనికి సంబంధించిన పాఠ్యప్రణాళిక తయారీని తెలుగు అకాడమి నిర్వహించింది. డిగ్రీ స్థాయి వరకూ కళాశాలల్లోనూ తెలుగులో బోధన సాధ్యం అయ్యింది.

ISSN No.2319-3905

తెలుగు భాషా స్వరూపంలో చాలా సారళ్యం ఉంది. అది ఇతర భాషల నుంచి పదాలను ఆదానంగా స్వీకరించగలుగుతోంది. వైజ్ఞానిక సంకేతాలను, భావనలను సులభంగా తనలో ఇముడ్చుకోగలదు. ఆధునీకరణ క్రమంలో తెలుగు భాష పదసంపదను, అర్థసామర్థ్యాన్ని, విశేషపదకల్పనా పాటవాన్ని పెంపొందించుకుంటున్న విషయం అందరికీ తెలుసు. ఈ దశలో ఉన్నత విద్యాస్థాయిలో బోధనా మాధ్యమంగా తెలుగును అభివృద్ధి చేయటానికి కేవలం విధాన నిర్ణయాలు సరిపోవు. సమాజంలో భిన్న రంగాలలో తెలుగు మాధ్యమంలో చదివిన వారికి ఉద్యోగావకాశాలు విరివిగా కల్పించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. స్నాతకోత్తర స్థాయిలో తెలుగును బోధనామాధ్యమంగా ప్రవేశపెట్టేందుకు ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపట్టాలి. ఈ విషయంలో ప్రత్యేకించి సమాజాభివృద్ధికి ప్రణాళికలు రచించుకున్నట్లే, తెలుగు భాష ఆధునీకరణకు కూడా ప్రణాళిక పొందుపరచుకోవాలి. భాషా ప్రయోగ రంగాలలో, ప్రభుత్వం, విశ్వవిద్యాలయాలు, అకాడమీలు, భాషాభివృద్ధి సంస్థలు, ప్రజలు సమష్టిగా ఆచరణాత్మకంగా కృషి చేసినట్లయితే తెలుగు భాష దినదిన ప్రవర్ధమానమై దేదీప్యమానంగా విరాజిల్లుతోంది.

ఉపయుక్తగ్రంథసూచి :

1. ఆంధ్రభాషా చరిత్రము – చిలుకూరి నారాయణరావు
2. తెలుగుభాషా చరిత్ర (సం) – భద్రిరాజు కృష్ణమూర్తి
3. తెలుగుభాషా వికాసం (ప్ర) – డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
4. వ్యావహారిక భాషా వికాసం – బూదరాజు రాధాకృష్ణ

8

తెలుగు భాషా పరిరక్షణ ఉద్యమం – కార్యాచరణ

– డా.వి.గోపాల్

రెండువేల సంవత్సరాల పై చిలుకు చరిత్ర కలిగిన జాతి మన జాతి. ప్రపంచ సంస్కృతుల సరసన తెలుగు సంస్కృతికి ఒక విశిష్టమైన స్థానం వుంది. మనదైన కట్టు బొట్టు, ఆచార వ్యవహారాలు, సంగీతం, నృత్యం, నాటకం, శిల్పం, చిత్రలేఖనం వంటి కళలు మన తెలుగు సంస్కృతికి ఒక విలక్షణతను సంతరించి పెట్టాయి. జానపదకళలు మన ప్రాచీనతను, జాతి మూలాలను చాటి చెబుతున్నాయి. తొలి తెలుగు రాజులుగా చెప్పబడుతున్న శాతవాహనుల కాలం నుంచి తెలుగు జాతి క్రమవికాసం చెందుతూ వచ్చింది. వివిధ రాజవంశాల పాలనలలో ఆంధ్రదేశం అన్ని రంగాలలో విస్తరించి అతి ప్రాచీన కాలం నుంచే విదేశాలతో వర్తక వాణిజ్యాలు కొనసాగిస్తూ ప్రపంచ పరివ్యాప్తంగా తన అస్తిత్వాన్ని, వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకుంటూ వచ్చింది. క్రీస్తు పూర్వం 500 సంవత్సరం నాటిదిగా భావించబడుతున్న ఐతరేయ బ్రాహ్మణంలో తెలుగు జాతి ప్రస్తావన వుంది.

“భాష” అని అంటే అది ఒక బంధం లాంటిది. ఒక ఆయుధం కూడా. కోపమొచ్చినా, ఆనందపడినా, ఇష్టపడ్డా, కష్టపడ్డా అనుభూతులనేవి కట్టలు తెంచుకొని పొంగుకొస్తున్నప్పుడు రెండు మనసులను కలబోసి, మనిషి మనిషిని కలిపి ఒక సమూహంలా, ఒక సమాజంలా పట్టి వుంచే ఒకే ఒక మహత్తరమైన సాధనం భాష. భాష ఒక సహజ ప్రవాహం లాంటిది. మదిలో ఆలోచనలు ముసురుకున్నప్పుడు మన నోటి నుంచి అప్రయత్నంగా వెలువడే అత్యంత సహజమైన పలుకు అది. అందుకే భాష విషయంలో సహజత్వానికి మాటలోకాని, రాతలోకాని మరో ప్రత్యామ్నాయం ఉండదు.

మనిషి తాను పుట్టి పెరిగిన వాతావరణంలో మాట్లాడడానికి, తన భావాల్ని, ఆలోచనల్ని, అభిప్రాయాల్ని వెలిబుచ్చడానికి తల్లి పాలతోబాటు వంటబట్టించుకునే భాష మాతృభాష. మనుషుల మధ్య భావప్రసరణకు ప్రధాన వారధిగా ఉపయోగపడుతుంది మాతృభాష. అలాగే మాతృభాషతోనే

ISSN No.2319-3905

మనిషి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించగలుగుతాడనేది చారిత్రక నగ్న సత్యం. మాతృభాషను సహజంగా శిక్షణ ద్వారా వీలైనంత ఎక్కువకాలం గ్రహిస్తూ, అభ్యసించడం వల్ల మనిషి అనేక వైజ్ఞానిక, సామాజిక, సాంస్కృతిక కల్పనలకు భూమిక అయిన సృజనాత్మకతను పొందగలుగుతాడు. అందుకే భాషాశాస్త్రజ్ఞులు "విద్యా బోధన మాతృభాషలోనే జరగడం అత్యవసరం" అని గుర్తించారు.

తెలుగు అక్షరాలకు నాభి, కంఠం, దవడలు, దంతాలు, నాసిక ఇలా ఎన్నో ఆధారపీఠాలు, మాతృస్థానాలు. అందుకే కాబోలు గుంటూరు శేషేంద్రశర్మ గారు "నేనంతా పిడికెడు మట్టే కావచ్చు కానీ కలం ఎత్తితే ఒక దేశపు జెండాకున్నంత పొగరుంది" అన్నారు. పొగరే లేకుంటే "ఏనుగునెక్కినాము, ధరణీశులు మొక్కగ నిక్కినాము" అనడం తిరుపతి వేంకటకవులకు ఎలా చెల్లుబాటు అవుతుంది. ఆ పొగరే లేకుంటే పిల్లల మర్రి పినవీరభద్రుడు "వాణి నారాణి" అనగలిగేవాడా? నా అక్షరం వెన్నెల్లో ఆడుకునే అందమైన ఆడ పిల్లలు" అని అన్నాడు బాలగంగాధర్ తిలక్. అవును నిజమే అక్షరాలు చాలా అందమైనవి. ఎంత అందమైనవి కాకుంటే మహాకవి శ్రీశ్రీ "అందని అందానివిగా, నీకై బతుకే ఒక తపమై" అని జీవితకాలం నిరీక్షిస్తాడు. నిరంతరం ఆరాధిస్తాడు. నిత్యం ఉపాసిస్తాడు. "తేనెకన్నా మధురం రా తెలుగు, ఆ తెలుగుదనం మా కంటికి వెలుగురా" అన్నాడు ఆరుద్ర. "అన్య భాషలు నేర్చి ఆంధ్రమ్మురాదంచు సకిలించు ఆంధ్రుడా చావులెందుకురా" అని మందలించారు ప్రజాకవి కాళోజి. తెలుగు పులుగు చేరలేని దేశం లేదు. తెలుగు వెలుగు దూరలేని కోశంలేదు అని తేల్చి చెప్పారు దాశరథి గారు. కర్ణాటక శాస్త్రీయ సంగీత విధ్వాంసుడు త్యాగయ్య తెలుగు భాషకు ఇచ్చిన గౌరవం మరొకరు ఇవ్వలేరు. కన్నడరాయుడైన శ్రీకృష్ణదేవరాయలు తన భువన విజయమనే సభాభవనంలో అష్టదిగ్గజ కవులచే చర్చాగోష్టులు నిర్వహించి, వారిచే ప్రబంధాలను రచింపజేసి, తానుకూడా "ఆముక్త మాల్యద" అనే ప్రబంధాన్ని రచించి తెలుగు గొప్పదనాన్ని నలుదిశలా చాటాడు. తెలుగుకు ఆయన యుగం స్వర్ణయుగం.

భారతదేశంలో భాషాప్రయుక్త రాష్ట్ర నిర్మాణోద్యమానికి నాంది పలికిన వారు ఆంధ్రులు. పరిపాలన, విద్యాబోధన ప్రజల భాషలో జరగాలన్న ఆశయంతో, తెలుగును అధికార భాషగా స్వీకరించాలని వావిలాల వారు 1955వ సంవత్సరం నుండి సుమారు 9 సార్లు ప్రతిపాదించారు. చివరికి 1964వ సంవత్సరంలో తెలుగును అధికార భాషగా ఆమోదించడానికి ప్రతిపాదనా బిల్లును ఆచ్చువేయడానికి ప్రభుత్వం అంగీకరించింది. అది 1966వ సంవత్సరంలో శాసనం అయింది. 1966వ సంవత్సరంలో 8వ చట్టం అధికార భాషా చట్టం. దీని ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార కార్యాలకు, రాష్ట్ర శాసన మండలిలో వ్యవహార నిర్వహణకు తెలుగు భాషను స్వీకరించాలనీ, మిగిలిన వాటికి ఏదైనా ఇతర భాషను ఉపయోగించవచ్చని నిర్ణయించారు.

అధికార భాషా చట్టం ఏర్పడి 5 సంవత్సరాలు గడిచిన మీదట ఒక అధ్యక్షుడు, నలుగురు సభ్యులు గల అధికార భాషా కమీషను ఏర్పాటు చేయాలని ఆ చట్టంలోని 5వ విభాగం

తెలుపుతుంది. దీని ప్రకారం 1974వ సంవత్సరంలో సాధారణ పరిపాలనలో అధికార భాషా విభాగాన్ని ఏర్పాటు చేస్తూ వావిలాల గోపాలకృష్ణయ్య గారి అధ్యక్షతన, శ్రీ పి.వి.రాఘవాచారి, శ్రీమతి టి.ఎన్.అనసూయమ్మ, శ్రీ ఎన్.శ్రీనువాసులు రెడ్డి, శ్రీ తులాబందుల నాగేశ్వరరావు సభ్యులుగా మొట్టమొదటి "ఆంధ్రప్రదేశ్ అధికార భాషా కమీషను" ఏర్పడింది. అలాంటిది ఈ రోజుల్లో అది నీరుగారిపోయింది.

ప్రపంచంలో అత్యధికులు మాట్లాడే భాషల జాబితాలో తెలుగు 14వ స్థానంలో, భారతదేశం హిందీ, బెంగాలీ, మరాఠీ తర్వాత నాలుగో స్థానంలో ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో 8 కోట్ల మంది తెలుగు మాట్లాడుతున్నారు. అదే ప్రపంచంలో అతి పురాతనమైన సుమేరియన్, ఈజిప్షియన్, అకాడియన్ భాషలు ప్రస్తుతం మనుగడలో లేవు. తెలుగుకు ఈ పరిస్థితి తలెత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై వుంది.

తెలుగు కార్యాచరణ:

- తెలుగు పది కాలాల పాటు విలసిల్లాలంటే ప్రాథమిక స్థాయిలో తెలుగు బోధనలో మార్పులు వచ్చి తీరాలి. ఉపాధ్యాయుల శిక్షణ కట్టుదిట్టంగా ఉండాలి. దీంతో పాటు తెలుగు భాషపై మమకారం పెంచే విషయ సంపన్నతను పాఠ్యాంశాల్లో చేర్చాలి.
- తెలుగు భాష భవిష్యత్తుపైనే మన తెలుగు భవిష్యత్తు ఆధారపడి వుంటుంది. ఈ రెండు పరస్పరం ముడిపడి వున్న అంశాలు. భాష అనేది మనందరినీ కలిపి వుంచే బంధం.
- తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 5 శాతం రిజర్వేషన్‌ను కల్పించాలి.
- ఇంటా, బయటా, సామాజిక జీవన వ్యవహారాల్లో తెలుగు వినియోగాన్ని పెంచాలి.
- డిగ్రీ స్థాయిలో అన్ని సెమిస్టర్లలో తెలుగును ఒక పాఠ్యాంశంగా బోధించాలి.
- ఇంజనీరింగ్, మెడిసిన్, తదితర కోర్సులను కూడా మాతృభాషలోనే బోధించాలనే కేంద్ర ప్రభుత్వ విధానం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
- పాలనా వ్యవహారాలు, ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులోనే జారీ చేసేందుకు గట్టి చర్యలు తీసుకోవాలి.
- తెలుగు అకాడమీని "తెలుగు – సంస్కృత అకాడమీ"గా మార్చడం వల్ల ప్రాథమిక లక్ష్యం దెబ్బతింది. తెలుగు అకాడమీ పూర్వ వైభవానికి కృషి చేయాలి.
- ఆంగ్ల పదాలకు సమానమైన, సహజమైన తెలుగు పదాలు సృష్టించాలి.
- వృత్తులు, జీవన విధానాల్లో కనుమరుగైపోతున్న తెలుగు పదాలను వెలికితీసి, ప్రాచుర్యం కల్పించాలి. తెలుగు భాషాభిమానాన్ని కలిగించే రచనలను ప్రోత్సహించాలి.

ISSN No.2319-3905

- హైకోర్టులో మాతృభాషలోనే వాద ప్రతివాదనలను, తీర్పులు ఉండాలి. ఉభయ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ మేరకు స్పందించాలి.
- సమగ్ర లక్ష్యాలు, నిధులతో వివిధ అకాడమీలను పటిష్టపరచాలి. కళల పరిరక్షణ, పరిశోధన, పరివ్యాప్తికి సాంస్కృతిక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలి.
- తెలుగు కళారూపాలను, దృశ్యకళలను కాపాడేందుకు భాషా విధానాన్ని, సాంస్కృతిక విధానాన్ని రూపొందించి రెండు తెలుగు రాష్ట్రాలు ప్రకటించాలి.
- తమిళ భాషకు ప్రాచీన హోదా దక్కాక అక్కడి ప్రభుత్వం 100 కోట్లు వెచ్చించి గ్రంథాలయం ఏర్పాటు చేసింది. అదేవిధంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గ్రంథాలయ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

అలాగే తెలుగు భాషా ప్రాధికార సంస్థ తెలుగునాట ప్రతి నగరంలో, ప్రతి పట్టణంలో, ప్రతి గ్రామంలో "తెలుగు"ను గౌరవించి తర్వాత ఏ భాషనైనా గుర్తించాలి. దానికి తగిన ప్రణాళికను రూపొందించుకోవాలి. మన వారసత్వ గ్రామం, తెలుగు భాషా సంస్కృతుల వారసత్వాన్ని ప్రతిబింబించేలా రూపొందించుకోవాలి.

మనం వేల సంవత్సరాల నుండి గడించుకున్న వారసత్వ సంపదన అందరికీ అర్థమయ్యేట్టు, ఆధ్యాత్మిక అవగాహనతో పాటు తెలుగు వారి కళలు, భాష, పుస్తక సంపద, జానపద జీవితం, మాండలికాలు, చరిత్ర, రాజవంశాలు, పర్యాటక స్థలాలు మొదలైన అన్ని విషయాలకు సంబంధించిన సమాచారం ఒకేచోట లభించేట్టు చూసుకోవాలి.

మాతృభాషలోనే విద్యాభ్యాసం చేసి, శాస్త్రసాంకేతిక రంగంలో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపుతెచ్చుకొన్న తెలుగు శాస్త్రవేత్తలు ఎందరో వున్నారు. మాతృభాషలో విద్యాభ్యాసం చేసినా గొప్పగా రాణిస్తారనడానికి వీళ్లంతా ప్రత్యక్ష నిదర్శనం. శాస్త్రసాంకేతిక విజ్ఞానాన్ని తెలుగులోని వాడుక భాషలో సరళమైన పదాలతో బోధించేలా మార్పులు తీసుకువస్తే మాతృభాషకు జనసత్వాలను నింపడంతో పాటు ఎక్కువ మందికి చేరవేసేందుకు అవకాశం వుంటుంది.

ఆధార గ్రంథాలు:

1. తెలుగు భాషా చరిత్ర – భద్రిరాజు కృష్ణమూర్తి
2. తెలుగు భాషా నిర్మాణం – చలుకూరి నారాయణరావు
3. తెలుగు వాణి – అయిదవ అఖిల భారత తెలుగు మహా సభల ప్రత్యేక సంచిక, చెన్నై
4. మిసిమి మాసపత్రిక, ఫిబ్రవరి, 2017
5. తెలుగు భాష – డా.వి.లక్ష్మణ రెడ్డి

9

రైతు కష్టాలను కళ్ళ ముందు పరిచిన సింగమనేని నారాయణ 'ఒక పయనం' కథ

– డా.యమ్.ఆదిశేషయ్య

ప్రపంచీకరణలో రైతులు ఎన్ని కష్టనష్టాలను ఎదుర్కొంటున్నారో తెలిపే కథ 'ఒక పయనం'. ఈ కథా రచయిత సింగమనేని నారాయణ.

అనంతపురం అంటేనే కరవుకు మారుపేరు. ఇలాంటి ప్రాంతంలోని ఒక గ్రామంలో రైతు కుటుంబం ఆర్థికంగా బాగా చితికిపోయి ఉంటుంది. మొత్తం ఆరుగురు కుటుంబ సభ్యులు. రైతు గంగన్న, అతని భార్య నరసమ్మ. పెద్ద కొడుకు నారాయణ, కోడలు వెంకటలక్ష్మితోపాటు తల్లి, చిన్న కొడుకు ఉంటారు. ఐదారేళ్ళ నుంచీ వరుస కరువులు వచ్చి ఉంటాయి. దీంతో పంటకు పెట్టుబడులు పెట్టి బాగా నష్టపోతారు. అంతా మెట్టపంట కావడంతో చివరికి బోర్లువేసి పంట పండిద్దామని అప్పులు చేస్తాడు. బతకడంకోసం భార్య మెడలోని బంగారం అమ్ముతాడు. ఇంట్లో ఉన్న పశువులను కబేళాలకు విక్రయిస్తాడు. ఇంతా చేసి ఏదైనా పంట చేతికి వస్తుందేమో అని ఆశిస్తాడు. పొలంలో వేసిన విత్తనాల ఖర్చు చేతికి రాదు. ఒకసారి సరైన సమయంలో వర్షాలు కురవక, మరోసారి వరుసగా పదిరోజుల పాటు కురిసిన భారీ వర్షానికి పంట అంతా కుళ్ళిపోతే పొలంలోనే వదిలేస్తాడు.

కుటుంబ పోషణ కష్టమైపోతుంది. తనకు చేదోడు వాదోడుగా పక్కింటిలో ఉండే వెంకటస్వామికి ఒక సందర్భంలో గంగన్న తన పరిస్థితినంతా చెబుతాడు. వెంకటస్వామి బంధువు రామప్ప నాయుడు బళ్ళారి దగ్గర కంపిలి కొట్టాలలో పెద్ద రైతు. ముప్పై ఎకరాల మాగాణి సాగుచేస్తూ పత్తి పండిస్తుంటాడు. 'అతడికి చెబుతాను, మీ జీవనానికి ఏమీ కష్టం ఉండదు, అక్కడికి వెళ్ళడం మంచిదని' వెంకటస్వామి సూచిస్తాడు. దారి ఖర్చులను వెంకటస్వామి దగ్గర నుంచే తీసుకొని ఎవరికీ తెలియకుండా కుటుంబంతోపాటు వలసబోతాడు గంగన్న. ఉన్న ఊరి నుంచి వెళ్ళిపోవడానికి గంగన్న చాలా బాధపడుతాడు. ఒకసారి మహబూబ్‌నగర్‌లో కరవు

ISSN No.2319-3905

పరిస్థితులేర్పడి ఒక మనిషి గంగన్న వద్దకు వస్తే తనవద్దే పనిలో పెట్టుకొని ఆదరించాడు. అలాంటిది తానే మరొకరి వద్ద పనిలోకి చేరడం గంగన్న బాధకు కారణమౌతుంది. అయితే ఎలాగైనా కుటుంబాన్ని పోషించు కోడానికి, ఎక్కడో ఒకచోట కూలి పనులకు చేరడానికి గంగన్న కుటుంబం ఊరిని వదిలిపోయింది. కంపిలి కొట్టాలలో రామప్ప నాయుడు దగ్గరకు వెళతారు. రామప్ప నాయుడు వారికి ఒక ఇళ్ళు, పనీ చూపించి గౌరవంగా చూస్తాడు. అనంతపురం నుంచీ కంపిలి వైపు చాలామంది వలస వచ్చారనీ, 'మీ ప్రాంత పరిస్థితులు నాకు తెలుసుననీ, మీరు మీ ఊరిలో, మీ ఇంట్లో ఉన్నట్టే ఉండండి. మీకు ఏమీ ఇబ్బంది ఉండదు' అని రామప్ప నాయుడు వారికి భరోసా ఇస్తాడు. 'పరిస్థితులు చక్కబడినప్పుడు వెళ్ళాలని అనుకుంటే ఎప్పుడైనా వెళ్ళండి' అని కూడా వారితో చెప్పాడు.

'నలభై ఏళ్ళనుంచీ సేద్యం చేస్తున్నాను. రాను రాను పరిస్థితులు ఘోరంగా మారుతున్నాయి. సేద్యం అంటేనే విరక్తి పుడుతుంది' అని నిర్వేదంతో గంగన్న సమాధానంగా రామప్ప నాయుడుతో అంటాడు. పచ్చని పంటపొలాలవైపు పనుల కోసం గంగన్న కుటుంబం నడిచి వెళుతుంటే తమ గ్రామ పరిస్థితులూ, కరవూ గుర్తుకు వచ్చి బాధపడతారు. అలాంటి సందర్భంలో "కాలమెప్పుడూ ఇట్లాగే వుంటుందా? రెండేళ్ళు మంచి శనక్కాయ పంట పండాలేగాని మన అప్పులు తీరేది ఎంతసేపు? మళ్ళీ వానలు రాకపోతాయా? మన ఊరి చెరువుకు నీళ్ళు ఇవ్వకపోతారా? నువ్విట్లా యదారు పెట్టుకోవద్దు. పాండవుల్లాంటి వాళ్ళు పదమూడేళ్ళు వనవాసం చేసినారంట! మనమనగా ఎంత? ఊరుకో..." అంటూ గంగన్నను ఓదార్చింది భార్య నరసమ్మ.

మళ్ళీ తమ వూరివేపు తమ పాదాలు పయనిస్తాయని గంగన్న కుటుంబంలో ఆశలు రేకెత్తడంతో ఈ కథ ముగుస్తుంది.

ఒక ప్రాంతంలోని ప్రజలు మరో ప్రాంతానికి వలసపోవడమేనేది సాధారణ అంశమే. అయితే ఒక ఉద్యోగీ, వ్యాపారి వలసపోవడమూ; రైతులూ, కూలీ రైతులు వలసపోవడమూ ఒక్కటిగా పరిగణించే అవకాశం లేదు. సగటు మనిషి మరింత సదుపాయాలతో మెరుగైన జీవనంకోసం ఉద్యోగం చేయడానికి మరో చోటకు వెళ్ళవచ్చు. ఒక వ్యాపారి లాభాలు గడించడం కోసం మరో చోటకు వెళ్ళవచ్చు. కానీ వీరితో రైతులనూ, రైతు కూలీలను పోల్చి చూడలేం. చూడకూడదు కూడా. ఎందుకంటే రైతు తాను జీవించడం కోసం మాత్రమే కాదు, ప్రపంచానికి నాలుగు మెతుకులను అందించడం కోసం కృషి చేస్తాడు. వీరు ఉన్నచోట మాత్రమే జీవన భద్రత పొందగలుగుతారు. మరోచోట జీవించేందుకు అవసరమైన జ్ఞానమూ, వనరులూ, భద్రతా వీరికి ఉండదు.

ఏ ప్రాంతానికి వలసపోయినప్పటికీ రైతులకు తమ ఊరితో, తమ సాగుచేసే భూమితో ఉన్న అనుబంధాన్ని అంత సులభంగా తుంచివేసుకోలేరు. ఇది మట్టితో పెనవేసుకున్న బంధం.

తప్పనిసరి పరిస్థితుల్లో ఉన్న ఊరినీ, సాగుచేసే భూమినీ వదిలి వెళ్ళినా; రైతుకూ, వారి కుటుంబానికీ ఉన్న మానసిక అనుబంధమూ అంత సులభంగా తెగిపోదు. అనంతపురం నుంచీ కర్నాటకకు వలసపోయిన రైతు గంగన్న, అతని కుటుంబం కూడా ఈ బంధాన్ని తెంచుకోలేకపడిన సంఘర్షణ ఈ కథకు అంతస్సారం.

ఒకప్పుడు ధాన్యాన్ని పండించే రైతు రాబోయే పంటకు విత్తనాలను తీసి పెట్టుకునేవాడు. ఇప్పుడు కొన్ని పంటలు విత్తన రహిత సంకర జాతి వంగడాలు రూపొందించి వాటిని రైతుల నెత్తిపై రుద్దుతున్నారు. అంతకుమించి మరో గత్యంతరం లేని పరిస్థితుల్లోకి నెట్టిందెవరు? వ్యవసాయ రంగంపైన ప్రపంచీకరణ విధానాలు అనేక పర్యవసానాలకు దారి తీస్తున్నాయి. ఇంతవరకూ ఈ నేలపై, ఈ పంటలకు సోకని కొత్త కొత్త తెగుళ్ళు, పురుగులు సోకుతున్నాయి. విత్తనం వేసే సమయంలోనే విత్తనశుద్ధి, రసాయనిక ఎరువులు, తెగుళ్ళు, పురుగు నివారణ మందులు, ఇవన్నీ బరువైనా అధిగమించి మంచి దిగుబడిని సాధించినా సరైన గిట్టుబాటు ధర ఉండదు. ఇలా రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఈ కథలో రైతు గంగన్న కూడా. ఎరువులు, విత్తనాలు, మందులు, ధరలూ రైతు చేతుల్లోకి రానంతవరకూ రైతు జీవితం బాగుపడదంటాడు. 'ఈరోజు కాకపోతే రేపైనా మన రైతు తన చేతుల్లోకి అన్నీ తెచ్చుకుంటాడు' అని గంగన్నతో రామప్ప నాయుడు పలికిన మాట కూడా ఆలోచనాత్మకమైనది.

వ్యవసాయ రంగానికి సాగునీటి కేటాయింపుల విషయంలో ఒక స్పష్టమైన విధానం లేదు. దీనివల్ల రైతులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. వ్యవసాయంలో ఏ సమస్యనైనా అధిగమించవచ్చు. కానీ నీటిసమస్యను అధిగమించడం అంత సులువు కాదు. సాగుభూములే కాదు, మిగతా భూమి అంతా బీటలు బారిపోవడం కనిపిస్తూ ఉంటుంది. నీటి కేటాయింపులూ, సరఫరా విషయంలో స్పష్టమైన విధానం లేకపోవడం వల్ల కరవు పీడిత ప్రాంతాల్లోని రైతులు ఎక్కువ ఇబ్బందులు పడుతున్నారు. ఈ కథలో కూడా మెట్టసాగులో వేరుశనగ సాగు చేయడం, సమయానికి వర్షంరాక పంట చేతికి రాకపోవడం, అప్పులు చేసి బోర్లు వేసినా దాన్నుంచీ ఎలాంటి నీటి సదుపాయం కలగక సేద్యంలో నష్టపోవడాన్ని గమనించవచ్చు.

వ్యవసాయరంగ సమస్యల్ని గుర్తించినా, ఆ సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించేందుకు ప్రయత్నించకపోవడం అనేది ప్రపంచీకరణ విధానాల్లో భాగం. ఎందుకంటే వ్యవసాయరంగానికి ప్రోత్సాహకాలు, రుణాలూ, సబ్సిడీలూ, పంట నష్టపరిహారాలూ, విత్తనాలూ, ఎరువులూ, పురుగు మందులూ రైతులకు అందించాలనేది ప్రభుత్వ ప్రాధాన్యాల్లో లేకపోవడాన్ని ప్రపంచీకరణలో భాగంగా చూడాలి. విదేశీ బహుళజాతి కంపెనీల కోసం భూములను కేటాయించడం, ఆ కంపెనీలకు భూమీ, నీళ్ళూ, రుణాలూ, సదుపాయాలూ కేటాయించి వాటి లాభాలకోసం ప్రభుత్వాలు పని చేయడం విచిత్రంగా అనిపిస్తుంది. బహుళజాతి కంపెనీలకు ఇచ్చిన ప్రాధాన్యం విలువా

దేశీయ వ్యవసాయరంగానికీ, రైతులకూ కల్పించి ఉంటే మనదేశం అద్వితీయమైన గ్రామీణాభివృద్ధిని సాధించి ఉండేది. గ్రామీణాభివృద్ధి అనేది దేశాభివృద్ధికి ప్రధాన మార్గమని పాలకుల అనుభవంలోకి వచ్చి ఉండేది.

కష్టాన్ని నమ్ముకొని బతికే గంగన్న సేద్యంద్వారా ఎంతగా నష్టపోయాడో ఈ కథలో తెలుస్తుంది. కరవు, నీటిలేమి కరవు ప్రాంతాల్లో వ్యవసాయ రంగాన్ని ఎంత సంక్షోభంలోకి నెడతాయో ఈ కథ ద్వారా అర్థం చేసుకోవచ్చు. అప్పులున్నప్పటికీ గ్రామంలో కష్టజీవిగా, మంచి మనిషిగా పేరు సంపాదించడం రైతుగా గంగన్న సాధించిన కీర్తి. దీన్ని గుర్తించే గంగన్న తనకు అప్పు పడినప్పటికీ అతని వాస్తవ పరిస్థితులను గమనించి వెంకటస్వామి వలస పరిష్కారమని సూచిస్తాడు. ఈ మాత్రం కూడా ప్రభుత్వం కల్పించుకొని రైతులకు కరవు ప్రాంతాల్లో ఊరట కల్పించే చర్యలు చేపట్టదు. ఇలాంటి సమయంలో ప్రత్యామ్నాయ నీటిసరఫరాకు ప్రభుత్వపు అధికార యంత్రాంగం ప్రయత్నం చేయదు. రైతుల సమస్యలను గుర్తించి పరిష్కరించడం ప్రభుత్వానికి ప్రాధాన్యం కాకపోవడాన్ని ప్రపంచీకరణ విధానంగా అర్థం చేసుకోవచ్చు. ఇది సామ్రాజ్యవాద ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) వంటి సంస్థలతో చేసుకున్న అవగాహనా ఒప్పందంలో భాగంగానే ప్రభుత్వం ఇలాంటి నిర్లక్ష్యం వహిస్తుందని వ్యవసాయ, ఆర్థిక రంగ నిపుణులు భావిస్తున్నారు.

"యాభై సంవత్సరాల అనుభవం చెప్పేదేమిటంటే ప్రభుత్వ విధానాలు వ్యవసాయాభివృద్ధికి అనుకున్నంతగా దోహదం చేయలేదు. సమూలమైన, సమగ్రమైన మార్పులు రానిదే ఇది సాధ్యం కాదు. సాగునీటి సరఫరాలో ప్రాంతీయ దురభిమానాలు, అసమానతలు పెరిగిపోయాయి. క్షామపీడిత ప్రాంతాలకు, వెనుకబడిన ప్రాంతాలకు కాలువల ద్వారా, ఎత్తిపోతల ద్వారా నీరు అందించాలి. పాలకవర్గాల చేతిలో చిక్కి శల్యమైన సహకార పరపతి సంఘాలకు జీవంపోసి, రైతాంగానికి రుణసదుపాయం కల్పించాలి. ప్రభుత్వ పెట్టుబడులు, నిధుల కేటాయింపు ఈ రంగానికి పెంచాలి. వ్యవసాయం అంటే కేవలం పంటలే కాదు, నిర్లక్ష్యం చేయబడిన పశుపోషణకు అన్నివిధాలా ప్రోత్సాహమివ్వాలి. చిన్నరైతులకు ప్రత్యేక ప్యాకేజీలు అవసరం. వ్యవసాయ పద్ధతుల్లో సేంద్రీయ పద్ధతులకు ప్రాముఖ్యత నివ్వాలి. ప్రపంచీకరణ కబంధహస్తాల్లోకి పోకుండా నివారించుకోగలగాలి" అని వ్యవసాయ ఆర్థికరంగంలో దేశంలో ఎంతో గొప్ప మేధావిగా గుర్తింపు పొందిన కె.ఆర్. చౌదరి అభిప్రాయపడ్డారు.

ఇలాంటి మేధావుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని నూతన వ్యవసాయ విధానాలకు రూపకల్పన చేయడం ద్వారా దేశంలో కరవు పీడిత ప్రాంతాల్లో రైతాంగాన్ని కాపాడుకోవచ్చు. అప్పుడు సింగమనేని ఒక పయనం కథలోని గంగన్న పరిస్థితి ఏ రైతుకూ ఎదురుకాదు.

ఆధార గ్రంథాలు :

1. ప్రజా సాహితి గ్రామీణ జీవన విధ్వంసం – రైతాంగ ఉద్యమం ప్రత్యేక సంచిక, నవంబరు, 2005.
2. రాబందు వాలిన నేల (20 ఏళ్ల ప్రపంచీకరణ) – ఎన్. వేణుగోపాల్
3. వ్యవసాయం – ప్రపంచీకరణ, కె.ఆర్. చౌదరి.

ISSN No.2319-3905

10

దాశరథి శతకము – పరిశీలన

– డా॥ తోట వెంకటస్వామి

భక్తి శతకాలలో బహుళ ప్రాచుర్యం పొందిన శతకం దాశరథి శతకం. భాగవత పద్యాల తర్వాత తెలుగువారు అత్యంతాదరణ చూపిన పద్యాలు దాశరథి శతక పద్యాలే.

దాశరథి శతక కర్త కంచర్ల గోపన్న. అనన్య సామాన్యమైన రామభక్తుడు కావడం వల్ల ఈయన రామదాసుగా ప్రసిద్ధుడయ్యాడు. గోపన్న తండ్రి లింగన. ఈయన మంత్రి. అంతే కాక గోపన్న మేనమామలు అక్కన మాదన్నలు. వీరు గోల్కొండ నవాబు తానీషాకు మంత్రులు.

గోపన్న రఘునాథ భట్టాచార్యులు శిష్యుడయి తిరుమంత్రోపదేశం పొందాడు.

అక్కన్న మాదన్నలు తమ పలుకుబడితో గోపన్నను భద్రాచలం తాసిల్దారుగా నియమింప జేశారు. తాసిల్దారుగా వుంటూ రామదాసు రామాలయం, రాముడికి నగలు. సీతమ్మకు 'చింతాకుపతకం', లక్ష్మణుడికి లక్షల పతకం మొదలయినవన్నీ చేయించాడు. దానివల్ల కష్టాలపాలై తానీషా విధించిన కారాగార వాసం అనుభవించవలసి వచ్చింది. అయినా భగవంతుడి పరీక్షలలో నిగ్గుతేరి, మోక్షసాధనకు భక్తిరేవ గరీయసీ అని నిరూపించినవాడు రామదాసు. భాగవతం మొదలయిన పురాణాల్లోని భక్తి మార్గాలను ఆకళింపుచేసుకొని త్రికరణ శుద్ధిగా అనుసరించి దాశరథి శతకంలో చూపించినవాడు గోపన్న.

దాశరథి శతకంలో పద్యాల సంఖ్య నూట రెండు. ఇవి ప్రసిద్ధార్థ పదాలతో ప్రసాదగుణ శోభితంగా వుండే పద్యాలు.

గోపన్న రామాంకితంగా 'ఎల్లకవుల్ నుతింప' రచన చేశానని పేర్కొన్నాడు. ఈ రచనలో చంపకోత్పల మాలల్నే పూజారచనకు వినియోగించాడు.

"శ్రీరఘురామ చారుతులసీదళ దామ శమక్షమాది శృం
గార గుణాభిరామ త్రిజగన్నుత శౌర్యరమా లలామ దు
ర్వార కబంధ రాక్షస విరామ జగజ్జనకల్మషార్ణవో
త్తారక నామ భద్రగిరి దాశరథీ! కరుణాపయోనిధీ!" (దా.శ. 1)

అని ప్రారంభించి మొత్తం అయిదు పద్యాలలో రాముణ్ణి స్తుతించి ఆరో పద్యంలో తన గురువయిన రఘునాథ భట్టాచార్యులకు నమస్కరించాడు. కవులకు నమస్కరించి తాను రాస్తున్న ఈ శతకాన్ని ఆసక్తితో స్వీకరించమని రాముణ్ణి వేడుకున్నాడు. అంతేకాక తన నాలుకకు పవిత్రత కలిగేటట్లు ప్రవర్తించవలసిందని కూడ వేడుకున్నాడు. దాశరథిశతకాన్ని రచించిన రామదాసుగా ప్రఖ్యాతిని పొందిన కంచెర్ల గోపన్న తనశతకాన్ని శ్రీఅనే అక్షరంతో ప్రారంభించినాడు. కావ్యప్రారంభం శ్రీకారంతో చేయడం తెలుగు కవి సంప్రదాయం. తెలుగుసాహిత్యంలో ఆదికవి నన్నయభట్టు తన ఆంధ్రమహాభారతాన్ని 'శ్రీవాణీగిరిజాశ్చిరాయ దధతో వక్షోముఖాంగేషు యే' అని ప్రారంభించినాడు. నన్నయకు దీటైన తిక్కన సోమయాజి 'శ్రీయన గౌరినాఁ బరఁగు చెల్వకుఁ జిత్తము పల్లవింప' అని శ్రీకారంతోనే ప్రారంభించాడు. శ్రీ అంటే సంపద, లక్ష్మి, సమృద్ధి, శుభము మొదలైన అర్థాలున్నాయి. 'అనిర్వేదః శ్రియో మూలమ్' అని రామాయణంలో ఉంది. తెలుగువారు సామాన్యంగా 'శ్రీరాముడు' అనే వ్యవహరిస్తుంటారు. మహాకావ్యాలను గురించి చెప్పేటప్పుడుకూడా 'శ్రీ' ని ఉపయోగించడం ఉంది. శ్రీమద్రామాయణం, శ్రీమద్భాగవతం మొదలైనవి. సూర్యవంశంలో ప్రఖ్యాతుడైన మహారాజు రఘువు. ఇతడు దిలీపునికుమారుడు. అజమహారాజుతండ్రి పాండిత్యంలోను, పరాక్రమంలోను అఖండుడని భావించాడట. దానికి తగినట్లుగానే, రఘుమహారాజు సర్వదిగ్విజయాలు చేశాడు. ఇతడు ప్రపంచం చివరిదాక జయించడమే గాక విశ్వజిత్తు అనే యాగాన్ని నిర్వహించాడు. ఆ యాగంలో తన సర్వస్వాన్ని బ్రాహ్మణులకు దానం చేశాడు. అప్పుడు తనకుమారునికి – అజునికి – యువరాజ్యపట్టాభిషేకం చేశాడు. శ్రీరాముడు అటువంటి రఘువంశంలో జన్మించినాడు.

భారతీయులు తులసిని పవిత్ర ఔషధంగా పరిగణిస్తారు. విష్ణుమూర్తి తులసీమాలను ధరిస్తాడని వైష్ణవుల విశ్వాసం. శ్రీరాముడు, విష్ణుమూర్తి అవతారమే కనుక ఆయన తులసిదళ మాలికను ధరించినట్లుగా కవి వర్ణించినాడు. తెలుగుదేశంలోనివారు కార్తికశుద్ధద్వాదశినాడు తులసీవివాహం చేయడం సంప్రదాయంగా వస్తూ ఉన్నది. శమము అంటే శాంతము, క్షమ అంటే ఓర్పు. ఈ రెండు చాల ఉత్తమగుణాలు. ఇటువంటి సుగుణాలైన శాంతి క్షమాగుణాలను శ్రీరాముడు కలిగివున్నాడు. శ్రీరామ లక్ష్మణులు, సీతాన్వేషణ చేస్తూ అడవిలో సంచరిస్తున్నప్పుడు కబంధుడనే రాక్షసుడు తన దీర్ఘబాహువులతో వారిని బంధిస్తాడు. కబంధుడు మహాబలవంతుడు. అయినా, రామలక్ష్మణులు పరస్పరం సంప్రదించుకొని, అతని రెండుబాహువులను తమ భుజశక్తితో ఖండిస్తారు. కబంధునికి శాపవిమోచనం కలుగుతుంది. అతడు రామలక్ష్మణులను కొనియాడుతాడు. రామాయణంలోని అరణ్యకాండలో ఈ వృత్తాంతం ఉంది. కవి ఈ కథను సూచన ప్రాయంగా పేర్కొన్నాడు.

 ISSN No.2319-3905

ప్రపంచంలోని జనం తమ నిత్యజీవిత వ్యవహారంలో అనేక పాప కర్మలకులోనవుతుంటారు. క్రమంగా వారి పాపాలు సముద్రం లాగ అపారమైపోతాయి. ఈ పాపాలను తొలగించుకోవడానికి ఈ పాపాల నుండి విముక్తి పొందడానికి 'శ్రీరామ' నామం తప్ప మరొకటి లేదని కవి సూచించాడు.

"చరితం రఘునాథస్య, శతకోటిప్రవిస్తరమ్

ఏకైకమక్షరం ప్రోక్తం, మహాపాతకనాశనమ్॥"

భద్రాచలం, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లోని శ్రీరాముని పుణ్యక్షేత్రం. శ్రీరాముడు అరణ్యవాసం చేస్తున్నప్పుడు ఇక్కడ, గోదావరీ తీరంలో కొంతకాలం నివసించినాడని విశ్వసిస్తారు. రామదాసు అనే కంచర్ల గోపన్న వలన భద్రాచలక్షేత్రం లోకంలో ప్రసిద్ధి చెందింది. దశరథుని కుమారుడైన శ్రీరాముడు ఈ నాటికీ భద్రాచల క్షేత్రంలో నివసించి తెలుగువారి నిత్యసేవలను అందుకొని తెలుగు ప్రజలను కటాక్షిస్తున్నాడని, శ్రీరాముడు దయాగుణానికి సముద్రమంతటి విస్తృతి కలిగినవాడు అంటుంటారు.

దాశరథి శతకం అనే ఈ స్తుతికావ్యానికి నాయకుడు శ్రీరాముడు. ప్రారంభంలోని ఈ పద్యంలో ఈ నాయకుడు ఎటువంటివాడో, కవి చెప్పడానికి ప్రయత్నంచేసినాడు.

అతడు రఘువంశంలో పుట్టినవాడని, క్షమాదిసుగుణాలు కలవాడని, మూడు లోకాలలో ప్రస్తుతింపబడేవాడని, రాక్షససంహారం చేసినవాడని, జనులపాపాలను తొలగించేవాడని, దయాగుణానికి నిలయమని ప్రస్తుతం భద్రాచలక్షేత్రంలో నివసించి ఉన్నాడని కవి వర్ణించినాడు.

కావ్యప్రారంభంలో ఆశీస్సు, నమస్కారము, వస్తునిర్దేశం అనేవి వ్రాయడం కవిసంప్రదాయం. ఈ మూడు లక్షణాలుండవచ్చు. లేదా అందులో కొన్నయినా ఉండవచ్చు. ప్రారంభంలో రఘురాముని పేర్కొనడం చేత, ఇది అతనికి చెందిన శతకం అనే సూచన. ఆయన గుణాలు వర్ణించడంచేత ఈ కావ్యానికి తగిన నాయకుడనే ప్రస్తావన. రాక్షససంహారం చేసినాడనడంచేత ఇటువంటి కథలు ముందు రాగలవని చెప్పడం. ఈ ప్రారంభపద్యం సంబోధనాత్మకంగా ఉంది. స్తుతికావ్యాలు సంబోధనాత్మకంగా ఉండడం సంప్రదాయం. శ్రీమద్భాగవతంలో 'శ్రీకృష్ణా యదుభూషణా, నరసఖా, శృంగారరత్నాకరా' మొదలైన పద్యాలు ఇలాంటివే. కృష్ణమాచార్యులు మొదలైన భక్తులు తమ కావ్యాలను, 'అఖిలాండకోటిబ్రహ్మాండనాయకా, ఆదిమధ్యాంతరహితా' వంటి సంబోధనలతో ప్రారంభిస్తారు.

కంచెర్ల గోపన్న శతకలక్షణాలను అనుసరించి 'దాశరథీ కరుణాపయోనిధీ' అనే సంబోధనతో తన శతకపద్యాలను ముగిస్తాడు. దాన్ని లక్షణకారులు మకుటం అని పేర్కొంటారు. తెలుగు శతకాల్లో సుమతీ, కృష్ణా, భాస్కరా వంటి శబ్దాలు మకుటంగా ఉపయోగింపబడడం అందరకు తెలిసిందే. అలాగే –

చ॥ **గురుతరమైన కావ్యరసగుంభన కబ్బురమంది ముష్కరుల్**
సరసుల మాడ్కి సంతసిలఁజాల రదెట్లు శశాంక చంద్రికాం
కురముల కింద కాంత మణికోటి స్రవించిన భంగి వింధ్య భూ
ధరమున జాఱునే శిలలు? దాశరథీ! కరుణాపయోనిధీ! (దా.శ. 12)

అంటూ గొప్పదయిన రసవత్కావ్యరచనకు ఆశ్చర్యపడి రసగ్రహణశక్తిలేనివారు రసహృదయుల లాగ ఆనందింపలేరని వెన్నెల మొలకలకు చంద్రకాంత మణులు ద్రవించినట్లుగా వింధ్య పర్వత శిలలు ద్రవించవని దృష్టాంతం చూపాడు.

గోపన్న ఈ శతకంలో దుర్వారకకబంధ రాక్షసవిరామ, సురారిదోర్బలోద్దామ విరామ, నిశాచరబ్జమాతంగ, ఖరదూషణాది కాననవీతిహోత్ర అంటూ కబంధుడు, ఖరదూషణులు మొదలయిన వారి పేర్లు మాత్రమే చెప్పాడు. తాటక, మారీచ సుబాహులను పేర్కొన్నట్లుగా కనిపించదు. రాముడి పరాక్రమాన్ని వర్ణిస్తూ విక్రమ వీర పరాజిత భార్గవ రామ అని సంబోధించాడు.

రామనామ మహిమను వర్ణిస్తూ తన నాలుకపై రామనామం నిరంతరం నర్తింపచేయమని

చ॥ **హరునకు నవ్వి భీషణున, కద్రిజకున్ దిరుమంత్రరాజమై,**
కరికి, నహల్యకున్, ద్రుపదకన్యకు నార్తి హరించు చుట్టమై,
పరఁగినయట్టి నీ పతిత పావననామము జిహ్వపై నిరం
తరము నటింపఁజేయు మిఁక దాశరథీ! కరుణాపయోనిధీ! (దా.శ.15)

అని వేడుకున్నాడు. అంతేకాక 'ముప్పున కాలకింకరులు ముంగిట వచ్చిన వేళ మీ స్మరణ కలుగుతుందో కలగదో ఇప్పుడే తప్పక చేస్తా'నని విన్నవించుకున్నాడు.

యమధర్మరాజు తన భటులను రామభక్తులజోలికి వెళ్ళవద్దని చెప్తాడంటూ

'పరమదయానిధే! పతితపావన నామ! హరే యటంచు ను
స్థిరమతులై సదా భజనసేయు మహాత్ముల పాదధూళి నా
శిరమునఁదాల్తు. మీ రటకుఁజేరకుఁడంచు యముండు కింకరో
త్కరముల కానఁబెట్టు నఁట! దాశరథీ! కరుణాపయోనిధీ! (దా.శ. 17)

అంటాడు. విశిష్టాద్వైత సంప్రదాయంలో భాగవతసేవ అనేది ఓ ముఖ్యభాగం. భగవద్భక్తులైనవారిని సేవిస్తే, నారాయణుని సేవించినట్లే అని వైష్ణవులు భావిస్తారు. మహేశ్వరుడు ప్రథమ భాగవతోత్తముడని ప్రతీతి. అటువంటి మహేశ్వరుని సదా ధ్యానించే మార్కండేయుడు మృత్యువును తప్పించుకొన్న కథ జగత్ప్రసిద్ధమైంది. విష్ణుభక్తులను సేవచేసినవారిని యమకింకరులు సమీపించరని కవి చెప్పడం ఇటువంటి ఐతిహ్యాన్ని మనసులో పెట్టుకొనే. మోక్ష ప్రదాత రాముడే కాని ఇతరులెవ్వరూ కారని అంటూ గోపన్న –

 ISSN No.2319-3905

ఉ॥ **చక్కెఱ మాని వేముఁ దినఁ జాలిన కైవడి మానవాధముల్**
పెక్కురు బక్కదైవముల వేమఱుఁ గొల్చెద రట్లు కాదయా
మ్రొక్కిన నీకె మ్రొక్కవలె మోక్ష మొసంగిన నీవ యీ వలెం
దక్కిన మాట లేమిటికి? దాశరథీ! కరుణాపయోనిధీ! (దా.శ. 25)

అంటాడు. విశిష్టాద్వైత సంప్రదాయంలో విష్ణుమూర్తి తప్ప ఇతర దైవములు మోక్షాన్ని ప్రసాదించలేరని చాలాచోట్ల చెప్పబడింది. కృష్ణుడు భగవద్గీతలో ఇదే విషయాన్ని అర్జునునికి ఉపదేశించాడు. సాధువులంటే సజ్జనులు, మంచివారు, పండితులు, మునులు, ఋషులు మొదలైనవారు. రామాయణంలో శ్రీరాముడు చేసినపని సాధువులందరినీ కాపాడటమే. శ్రీ రామావతార ఉద్దేశ్యమే శిష్టరక్షణ దుష్టశిక్షణ కదా.

ఈ శతకంలో దశావతార వర్ణన ప్రత్యేకంగా చేసినా అంతకు ముందే ముప్పయి మూడో పద్యంలో కూడ అవతార వర్ణన చేశాడు ఆ పద్యం ఇది.

చ॥ **జలనిధిలోనఁ దూఱి, కులశైలము మీటి; ధరిత్రిఁ గొమ్మునన్**
దలపడ మీటి, రక్కసుని యంగము గీటి, బలీంద్రునిన్ రసా
తలమున మాటి, పార్థివకదంబముఁ గూల్చిన మేటి రామ! నా
తలఁపున నాటి రాఁగదవె? దాశరథీ! కరుణాపయోనిధీ! (దా.శ.33)

ఇందులో మత్స్య, కూర్మ, వరాహ, వామన, పరశురామావతారాలను గూర్చి చెప్పాడు. దాశరథీ శతకం కనుక రామావతారాన్ని ప్రత్యేకించి చెప్పలేదు.

దశావతార వర్ణనలో బలరామ, బుద్ధావతారాలను కూడ పేర్కొన్నాడు.

రామనామ మహిమను ప్రపంచంలో వ్యాప్తి చేస్తానంటూ –

ఉ॥ **భండన భీముఁ డార్తజన బాంధవుఁడుజ్జ్వల బాణ తూణ కో**
దండ కళా ప్రచండ భుజతాండవకీర్తికి రామమూర్తికిన్
రెండవ సాటి దైవ మిఁక లేఁడనుచున్ గడకట్టి భేరికా
డాండ డడాండ డాండ నినదంబు లజాండము నింద మత్తవే
దండము నెక్కి చాటెదను దాశరథీ! కరుణాపయోనిధీ! (దా.శ. 34)

అంటాడు గోపన్న. శ్రీరాముడు భండనభీముడు– అంటే యుద్ధంలో భయంకరమైనవాడు. అనేది సామాన్యార్థం. భీముడు అంటే శివుడు అనే అర్థం కూడ ఉంది. శివుడు తన యుద్ధంలో సర్వ శత్రువులను ఏ విధంగా నాశనం చేస్తాడో శ్రీరాముడు కూడ అంతటి భీకరయుద్ధంచేసి శత్రుసంహారం చేస్తాడని కవిసూచన.

శ్రీరాముడు తన జీవితంలో శరణువేడిన వారిని ఎంతమందిని రక్షించాడో లెక్కలేదు. ఉదాహరణకు అహల్యాదేవి శాపం నుండి విముక్తురాలిని జేశాడు. సుగ్రీవుని కాపాడి ఆయనకు రాజ్యాన్ని అప్పగించాడు. అన్నచేత అవమానాలపాలై దేశబహిష్కారం పొందిన విభీషణునికి లంకారాజ్యం ధారాదత్తం చేశాడు. చివరకు ఆర్తుడైన గోపన్నను చెరసాల నుండి విడిపించాడు. అందుకే ఆయన ఆర్తజన బాంధవుడయ్యాడు.

దండకారణ్యంలో శ్రీరామునికి ఖరునితో యుద్ధం చేయవలసి వచ్చింది. అతడు అసంఖ్యాక సైన్యంతో వచ్చి శ్రీరామునిపై అస్త్రశస్త్రాలు ఖడ్గాలు కురిపిస్తాడు. శ్రీరాముని శరీరం రక్తసిక్తం అవుతుంది. అయినా శ్రీరామునిలో శక్తి క్షీణించదు. రాముడు తన ధనుస్సును వలయాకారంగా లాగి వేలకొలది బాణాలను ఒక్కసారిగా ప్రయోగించాడు. ప్రజ్వలితవహ్నికణాల్లాగా ఆ బాణాలు శత్రుసైన్యాన్ని క్షణంలో సంహరించి ఆకాశంలో ప్రకాశించాయి. ఏనుగులు, గుర్రాలు, రథాలు, సారథులు, యోధులు సైన్యాధిపతులు ఛిన్నాభిన్నమై క్షతగాత్రులైనారు. రక్తసిక్తమై రణరంగంలో పడిపోయినారు. ఈ యుద్ధంలో చూపించిన రాముని ధనుర్విద్య అనన్యమైంది. లక్ష్మణుడు సీతాదేవికి రక్షకుడుగా ఉన్నాడు. కాబట్టి ఇది శ్రీరాముని ఒంటరి యుద్ధమే. కంచెర్ల గోపన్న ఇటువంటి యుద్ధాన్ని స్మరించి శ్రీరామునికి 'ఉజ్జ్వల బాణతూణకోదండకళాప్రచండభుజ తాండవకీర్తి' అనే బిరుదును ప్రదానం చేసి ధన్యుడనిపించుకున్నాడు. గోపన్న తాను చేసిన పాపాలు ఎన్నో వున్నాయనీ రామనామం తన నాలుకకు పానకమనీ తనను రక్షించమని వేడుకుంటాడు.

చ॥ **చేసితి ఘోరకృత్యములు చేసితి భాగవతాపచారముల్**
చేసితి నన్యదైవములఁజేరి భజించినవారి పొందు, నేఁ
జేసిన నేరముల్ దలఁచి చిక్కులఁబెట్టకు మయ్య! యయ్య! నీ
దాసుఁడనయ్య, భద్రగిరి దాశరథీ! కరుణాపయోనిధీ! (దా.శ.49)

రామ భక్తుడైన కవి తను చేసిన అపరాధాలను మన్నింపమని దైవాన్ని ప్రార్థిస్తున్నాడు. భాగవతులు అంటే, భగవంతుని సేవించేవారు. విష్ణుమూర్తిని కొలిచేవారు. భక్తులు. వీరు సాత్త్వికులు. ఇతరులకు హాని చేయనివారు. వీరికి హానిచేయడమే భాగవతాపచారం. కవి భాగవతాపచారం చేశానని ఈ పద్యంలో చెప్పాడు. విష్ణుభక్తులు, విష్ణువును తప్ప ఇతర దైవాల్ని సేవించరు. అంతేకాదు, ఇతర దైవాలను సేవించేవారి సహవాసం కూడ చేయరు. అయినా, ఈ పద్యంలో కవి 'అన్యదైవముల చేరి భజించినవారి పొందు చేసితిని' అంటున్నాడు. 'నీవే తప్ప ఇతః పరంబెఱుఁగ మన్నంపందగున్ దీనునిన్' అని భావించడమే విష్ణుభక్తుల లక్షణం. కవి ఇతర దైవాలను అనుసరించేవారి సహవాసం చేసి ఈ నియమాన్ని కూడ అతిక్రమించానని అంటున్నాడు. ఈ దోషాలన్ని శ్రీరాముని, విష్ణుమూర్తిని ఆశ్రయించి, అతనికి దాసుడైనప్పుడు తొలగిపోతాయని భక్తుని విశ్వాసం. పరమాత్ముడు భక్తులను కాపాడేవాడు, భక్తులపక్షపాతి కదా!

భక్తుడు తనదోషాలను, తాను చేసిన అపరాధాలను ఎరుకపరచి, తనను క్షమింపుమని, భగవంతుణ్ణి ప్రార్థించడాన్ని వైష్ణవులు నైచ్యానుసంధానమంటారు. ఇది వైష్ణవోచిత స్వభావసులభ వినయగుణ సంపన్నత్వముగా, స్వాహంకార పరిత్యాగంగా గ్రహించవాలి. ఎన్నో జన్మలు గడచాయి. ఎన్ని ఆపరాధాలు చేశామో మనకేం తెలుసు? ఈ అపరాధాలు పరిహరింపబడడం వలననే ఈ జన్మలో హరిభక్తి సంక్రమించింది అని వేదుకున్నా ఇంకా అనేక రకాల విన్నవించుకున్నా ప్రయోజనంలేక –

ఉ|| **దాసిన చుట్టమా శబరి? దాని దయామతి నేలినావు, నీ**
దాసుని దాసుఁడా గుహుఁడు? తావక దాస్య మొసంగినావు, నేఁ
జేసిన పాపమా? వినుతిఁజేసినఁ గానవు, కావవుమయ్య నీ
దాసులలోన నేనొకఁడ, దాశరథీ! కరుణాపయోనిధీ! (దా.శ. 54)

శ్రీరామసందర్శనం కాగానే, పరమపదం చేరుకోవలెనని శబరి సంకల్పించి దానికి రాముని అనుమతిని కోరడం అతనికి ఆశ్చర్యాన్ని కలిగించింది. శబరి కోరికను అనుసరించి శ్రీరాముడు శబరికి ఆత్మసాయుజ్యాన్ని అనుగ్రహించినాడు.

శబరి చితి పేర్చుకొని జీర్ణ శరీరాన్ని విసర్జించి తన చైతన్యంలో లీనమైపోతుంది. ఆ సమయంలో ఆమె దివ్య శరీరం దివ్యహారాలతో, దివ్యవస్త్రాలతో, దివ్యచందన లేపనాలతో దేదీప్యమానంగా విద్యుత్కాంతిని వెలయిస్తుంది. పుణ్యాత్ములైన మతంగమహామునులు విహరించే వియల్లోకాలను శబరి చేరుకొంటుంది. అరణ్యవాసానికి శ్రీసీతారామలక్ష్మణులు, సుమంత్రుని రథసారథ్యంలో బయలుదేరారు. కోసల దాటిన తరువాత గంగాతీరంలో శృంగవీరపురం కనిపించింది. ఆదేశానికి అధిపతి గుహుడు. మునివేషంలో ఉన్న రాముని చూచి చింతించాడు. ఆత్మసఖుడైన గుహుడు తన రాజ్యాన్ని శ్రీరామునికి అర్పించడానికి సిద్ధమయ్యాడు. గుహుడు ఏర్పాటు చేసిన పడవలో రాముడు గంగానదిని దాటాడు. శ్రీరాముడు గుహునికి ఆలింగన సౌఖ్యం కలిగించాడు. ఇదిసామాన్యమైన విషయంకాదు.

ఆ గుహుడు నీదాసులకు దాసుడుకాదు కదా! అతనికి ఆలింగన సౌఖ్యం ప్రసాదించడమేకాక, గంగానదిని దాటడానికి చేసే ఏర్పాటును కూడ అనుగ్రహించావని కవి శ్రీరామునికి వివేదించినాడు. ఇక కవి తాను, స్వయంగా స్తుతిపూర్వకమైన రామదాసుకీర్తనలను వ్రాసి ఉన్నాడు. దాశరథీశతకాన్ని రచించినాడు. ఆ విధంగా నన్ను కూడ కాపాడి శబరికి గుహునికి అనుగ్రహించిన సాయుజ్యం నాకుకూడ అనుగ్రహించి 'కావుమయ్య' అని వేదుకొంటూ కొంచెం ఎత్తిపొడిచాడు.

ఇక శతక రచన ప్రారంభంలోనే ఇందులో తప్పులుంటే అవి నీ నామంతో కూడినవి కనుక రాసిన కావ్యం పవిత్రమైనదంటాడు గోపన్న. అలాగే సరసుడి మానసంబు రసజ్ఞుడే తెలుసుకుంటాడు. పువ్వులలోని మకరందం రుచి తుమ్మెదకు తెలిసినట్లు కప్పకు తెలియదంటాడు.

పాండిత్యం, భక్తి, సంప్రదాయ పరిజ్ఞానం వేద పురాణ వేదాంత విజ్ఞానం, ఆర్తీ, ఆత్మనివేదనం ఇహ పరాలు తొణికిసలాడేటట్లుగా సర్వజనామోదంగా ఉత్పల, చంపక మాలల శతకంతో శ్రీరామార్చన చేసి తరించినవాడు రామదాసు.

ఆధార గ్రంథాలు:

1) కులశేఖరరావు, ఎం. (వ్యాఖ్య) – దాశరథి శతకము.

2) నాగయ్య, జి. – తెలుగు సాహిత్య సమీక్ష (రెండో సంపుటం).

3) మహదేవశాస్త్రి, కోరాడ – ఆంధ్రవాఙ్మయ పరిచయము.

4) మృత్యుంజయరావు, జొన్నలగడ్డ (వ్యాఖ్య) – దాశరథి శతకం.

5) శ్రీరామమూర్తి, కొర్లపాటి – తెలుగు సాహిత్య చరిత్ర.

ISSN No.2319-3905

11

డా. బోయి భీమన్న – గుడిసెలు కాలిపోతున్నై సామాజిక సందేశం

–మరపట్ల రాజు

పరిచయం:

సామాన్య నిరుపేద దళిత కుటుంబంలో జన్మించి, కష్ట నష్టాలకు ఓర్చి పాలేరు నుండి పద్మ భూషణ్ వరకూ ఎదిగిన ప్రముఖ కవితామూర్తి డా.బోయి భీమన్న. ఈయన తన కలాన్ని పదును పెట్టి గొప్ప రచనలు చేశారు. తనదైన శైలిలో వివిధ సాహితీ ప్రక్రియలలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి రచనలు చేసిన గొప్ప చైతన్యశీలి. తనకు ఎదురైన అవమానాలను తుడుచుకుంటూ ఆధరాభిమానాలను దాచుకుంటూ కులమనే కుష్ఠుకి మతం పేరున జరిగే దోపిడీకి వ్యతిరేకంగా పోరాడారు. మతము, భక్తి నిర్మూలించబడితే తప్ప మానవ జాతికి ముక్తి లేదని భీమన్న గారంటారు. మతానికి, దేవునికి, భక్తికి కట్టుబడి ఉన్నంత కాలం ప్రజలు మేలుకోరని, ప్రజల్ని అంధకారంలో ఉంచేవి ఈ మూడే అని అంటారు. వీటి నుండి విముక్తి పొందాలని ప్రజలకు సందేశాన్ని ఇచ్చారు. తన కవితా లక్ష్యాన్ని ఈ క్రింది విధంగా తెలియజేసారు.

"నా కవితా లక్ష్యం
చీకట్లో బ్రతికే వాళ్ళను మెప్పించడం కాదు
వాళ్ళను తిట్టైనా కొట్టైనా సరే
అక్కడి నుండి లేపటం అరుణోదయం కేసి తరమడం" అని భీమన్న అన్నారు.

జీవిత విశేషాలు:

డా॥ బోయి భీమన్న గారు డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు గ్రామంలో పుల్లయ్య, నాగమ్మ దంపతులకు 1911 సెప్టెంబర్ 19న జన్మించారు. అంటరానితనం పెనుభూతంలా దళిత సమాజాన్ని పీక్కొని తింటున్నా వాటిని ఏ మాత్రం లెక్క చేయక పట్టుదలతో

చదువుకున్నారు. ఈయన తన 11వ ఏట 9వ తరగతి చదువుతున్న సమయంలో "నిషా వస్తువులు నిషేదించాలి" అనే వ్యాసం వ్రాసి కవిగా తన జీవితాన్ని ప్రారంభించారు. డా.బాబాసాహెబ్ అంబేద్కర్, మహాత్మగాంధీ బోధలతో ఉత్తేజం పొంది అస్పృశ్యత అనే పిశాచాన్ని రూపుమాపాలని రచనలు చేసిన గొప్ప మేధావి భీమన్న. కొంతకాలం పాత్రికేయునిగా, 1940–45 వరకు ఉపాధ్యాయ వృత్తిలో పనిచేసారు. వీరు 1978 నుండి 1984 వరకు రాష్ట్ర శాసన మండలి సభ్యునిగా పనిచేశారు.

భీమన్న గారు వ్రాసిన రచనల విషయానికొస్తే పాలేరు నాటకం ఎంతో మంది హృదయాలను దోచుకుందని చెప్పాలి. దీనిని చదివిన పాఠకులు తమ పిల్లలను బాగా చదివించినవారు లేకపోలేదు. ఇదే కాక కూలిరాజు, రాగ వాశిష్టం, పైరుపాట, మానవుని మరో మజిలీ, ఆదికవి వాల్మికి, పడిపోతున్న అడ్డుగోడలు వంటి నాటకాలు వ్రాశారు. రాగ వైశాఖి, జానపదుని జాబు, ధర్మంకోసం పోరాటం, ఉశారులు, పిల్లి శతకం, అసూయ, ఓయి కవి కవిత్వం వ్రాయి, ప్రగతి, జన్మాంతర వైరం, అంబేద్కర్ సుప్రభాతం, అంబేద్కరిజం, బాలయోగీయం, మోక్షం నాజన్మ హక్కు, భీమన్న పాటలతోట, ఇదిగో ఇది భగవద్గీత, పాటలలో అంబేద్కర్, పురాణాలలో హరిగిరిజన మనీషులు, ధర్మవ్యాధుడు, గిల్లి చెబుతున్నా, నాకు తెలిసిన జాషువా, నా ఊహలలో వాల్మీకి, చివరి మెట్టు మీద శివుడు, పంచమ స్వరం, వేదవ్యాసుడు, భీమన్న శంఖారావం, ఒంటరి గొంతు మొదలైన రచనలు చేశారు. తెలుగు సాహిత్యంలోనే కాక ఆంగ్లంలో కూడా రచనలు చేసిన ప్రసిద్ధ కవి డా.బోయి భీమన్న. ది సెవెంత్ సీజన్, గాడ్ ద డ్రగ్, పరమాత్మ ది సూపర్ అనే రచనలు చేశారు.

పాలేరు నుంచి పద్మశ్రీ వరకు ఎదిగిన భీమన్న గారు ఎన్నో గౌరవ పురస్కారాలు అందుకున్నారు. భారత ప్రభుత్వంచే 1973 లో అప్పటి రాష్ట్రపతి శ్రీ వి.వి. గిరి గారి చేతుల మీదుగా "పద్మశ్రీ" 2001 పద్మవిభూషణ్ బిరుదులు పొందారు. కాకినాడ కవులు భీమన్న గారికి "మహాకవి" అనే బిరుదు ప్రధానం చేశారు. బంధువులు 1971లో "సాహితీ వసంత" అనే బిరుదు ఇచ్చారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు కళాప్రపూర్ణ బిరుదు అందుకున్నారు. 1976లో వారణాసిలోని కాశీ విద్యాపీఠంచే గౌరవ డాక్టరేట్ (డి.లిట్) ను ప్రధానం చేసారు. ఇవే కాక విశ్వనాథ వారు, జాషువా గారు, దివాకర్ల వారు, ధాశరధి గారు, యస్వీ జోగారావు వంటి ప్రముఖులచే ప్రశంసలందుకున్నారు. భీమన్న గారు 2005 డిసెంబరు 16న మరణించారు.

భీమన్న – సామాజిక సందేశం:

భీమన్న గారు వ్రాసిన "గుడిసెలు కాలిపోతున్నై" రచనకు 1975 సం॥రంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఈ గ్రంధాన్ని భీమన్న గారు శ్రీ జి.వెంకట స్వామి గారికి అంకితమిచ్చారు. ఈ కావ్యంలో దళితులు గుడిసెలు ఎందుకు కాలిపోతున్నాయో, వాటి స్థానంలో

కొత్త గుడిసెలే ఎందుకు వస్తాయో మనం ఎన్నుకున్న నాయకులను నిలదీసే చైతన్యం ప్రతి పేదవాడికి కలగాలని భీమన్న గారు తాపత్రయపడ్డారు. ఈ విషవలయం సాగడం ఎంతవరకు ఆ రహస్యాన్ని గుడిసెల్లో ఉన్న వారు కనిపెట్టే వరకు అని అంటారు.

"మీరొక్కరు
మేం లక్షా పదివేల వోటు కాగితాలం
మా వోట్లన్నీ మీకే నండి
మా గుడెసెలన్నీ మీవేనండి
మా వాళ్ళకు తిక్క రేగాలే గాని
ఒకే గుద్దు గుద్ది పారేస్తారు" అని అంటారు.

నేటి సమాజంలో రాజకీయ చదరంగంలో నలిగిపోతున్న పేదలను గురించి భీమన్న గారు ఇలా అంటారు. "బానిసల జాబితా" అనే శీర్షికతో అక్షర సత్యాలను తెలియజేసారు. ఓటు పేదల పాలిట శని అన్నారు. భీమన్న ఒక పక్క రంగురంగుల జెండాల వాళ్ళు, మరొపక్క కామాందులు ఈ ఓటు అనే అమ్మోరు కోసం ప్రాణాలు తీసేస్తున్నారని, మా పేదల గుడిసెలు తగులబెట్టెస్తున్నారని పైగా బానిసలకుండే సుఖశాంతులు, మా పేద ఓటర్లకు లేవు మహాప్రభో అంటూ వాపోయారు.

"ఈ దేశంలో పేదలకు ఓటుండటం
పక్కలో పాముండటమే" అంటాడు భీమన్న.

నేడు ఉద్యోగం లేని స్థితిలో ఉన్న యువకులను ఉద్దేశించి భీమన్న గారు ఆ రోజుల్లోనే తెలియజేసారు.

"పేదరికం పోవాలి, ఉద్యోగం రావాలి అంటూ
ఊరేగింపులు జరిపినంత మాత్రానా
విప్లవ పరిణామం వచ్చేస్తుందా యువకులారా!

మంత్రాలకు చింతకాయలు రాలవనేది ఎంత సత్యమో అలాగే నినాదాలతో విప్లవం రానేరాదని అంటారు భీమన్న. సొమ్మసిల్లిన సమయంలో నా కావ్యాన్ని జ్ఞాపకం చేసుకొండి. నా కావ్యాలను తెరచి చూడండి ఏ పేజీ తిరగేసినా గంటెడు ఓదార్పైనా లభించక పోదు అని వ్రాశారు. అంతే కాదు ప్రస్తుతం సమాజం గురించి లంచం, మంచం, భిక్ష, కక్ష ఇది ప్రస్తుతం మన గుణకర్మల వ్యవస్థ అని అంటారు. ఇలాంటి వాటినీ చూసి నిరాశ పడవొద్దని యువకులకు ధైర్యం చెప్పారు.

"నిరాశ పడకండి
సోదర భారత యువకుల్లారా!

మనకున్న శక్తులు మనకున్నాయి
కొత్త నీతులు సృష్టించండి
క్రొత్త పుంతలు తొక్కండి అని యువకులకు సందేశాన్ని ఇచ్చారు.

అంతేకాక భావ విప్లవం, జాతి సమైక్యం, కుల నిర్మూలన, సమసమాజ స్థాపన, శ్రేయో రాజ్యసిద్ధి సాధించాలంటే అది యువకుల ద్వారా సాధ్యం అని అంటాడు. మంచి చేయటానికి విప్లవాలను లేవనెత్తాలని యువతకు జ్ఞాన బోధ చేశారు భీమన్న. చదువుకున్న పేద విద్యార్థుల కష్టాలను తన కవిత్వంలో సూటిగా తేటగా తెలియజేసారు. భవిష్యత్తు అంధకారంగా కనిసిస్తున్న ఫస్టుక్లాసు గ్రాడ్యుయేట్లం, లంచాలు పోసి ఉద్యోగాలు పొందలేని పేద విద్యావంతులం అని, లక్షలతో పదవులు కోనుక్కొలేని నిజాయితీ గల సంఘ సేవకులం అంటూ వ్రాశారు. కుల, మత, రాజకీయ చదరంగం పేరుతో ప్రతిచోట మోసగించబడుతున్న వారు పేద ప్రజలే అని అంటాడు. విత్తనాల మడి అనే కవితలో వర్తమానం, భవిష్యత్తులను గూర్చి ఈ క్రింది విధంగా వ్రాశారు.

"కాల ప్రవాహంలో
ప్రతిక్షణమూ ఒక అల!
బ్రహ్మ క్షేత్రంలో
ప్రతి క్షణమూ ఒక బీజం!
అది వికసించటమే జీవితం
కాల గర్భంలో
గతం ఎలా ప్రసుప్తమో
భవిష్యత్తూ అలాగే ప్రసుప్తం" అని అంటాడు భీమన్న.

దుక్కిటెద్దువుకాదు అనే కవితలో రైతును గురించి, రైతు పడుతున్న కష్టాలను తెలియజేసారు. అన్నం పండించే రైతు జాతికి వెన్నుముక అని, అతడు తన రోజంతటిలో ఎలా కష్టించి సమాజానికి సహాయపడతాడో తెలిపాడు. నిరంతరం తనకు తాను త్యాగం చేసుకుంటూ విత్తనానికి వెలిగిస్తున్న జీవ జ్యోతి రైతు అని అన్నాడు అంతేకాక రైతు కష్టాన్ని తన కవిత్వంలో ఈ క్రింది విధంగా వివరించారు.

"విశ్వ సంక్షేమం కోసం యాచిస్తూ
నిన్ను నీవు యజించుకొంటూ
నిర్వికారంగా, నిష్కామ యోగివై
శ్రమిస్తున్న అన్నా! రైతన్నా
సృష్టి స్థితి దేవతవు నీవు

సాక్షాత్తు నీవే జీవ జగత్తువు" అని రైతన్నను గురించి కొనియాడారు.

ఒక జాతి గురించే కాక, నానా జాతుల కోసం విశ్రాంతి లేకుండా మోస్తున్న భారం గొప్పది అంటారు భీమన్న. "సృష్టి కర్తనే మార్చాలి" అనే కవితలో సమాజం గురించి, కార్మికుల గురించి, మధ్య తరగతి వాళ్ళను గురించి, రాజకీయ నాయకులను గూర్చి చక్కగా వివరించారు. పూరి గుడిసెల్లో ప్రజలు అలసిపోతున్నారని, మధ్యతరగతి వాళ్ళు గ్రామ పొలిమేరల్లో ఉద్యోగాలు వెతుక్కుంటున్నారని, ప్రజానాయకుల చేతుల్లో ప్రజలు బలైపోతున్నారని, పేద ప్రజలకు నిరాశలే మిగులుతున్నాయని తెలియజేసారు. రాజకీయ నాయకుల, ధనికుల స్వార్థాలకు పేద, మధ్య తరగతి కుటుంబాలు బలి అవుతున్నారని చింతించారు. మేడల్లో ఉన్న వాళ్ళు పూరి గుడిసెల్ని ఎలా అణచి వేస్తున్నారో తన కవిత్వం ద్వారా ఈ విధంగా తెలియజేసారు.

"పూరి గుడిసెల్ని సృష్టించింది మేడలైతే

మేడల్ని నిర్మించింది పూరి గుడిసెలే! అని అంటాడు భీమన్న

మేడలు కూలినా ప్రమాదం గుడిసెకేనా!

తప్పు యజమానిదైనా శిక్ష బానిసకేనా!

మార్చవలసింది సృష్టిని కదా!

అసలు సృష్టి కర్తనే మార్చవలసి ఉన్నదా? అని ప్రశ్నించాడు. అంతేకాక ప్రార్థనలు, భజనలతో రాదు ముక్తి, మతము, భక్తి నశించినవాడే మనిషికి భుక్తి అంటారు. ఇలా గుడిసెలు కాలిపోతున్నాయ్ రచన ద్వారా అభ్యుదయ భావాలను పెంచే ప్రయత్నం చేశాడు భీమన్న కవి.

ముగింపు :

తెలుగు సాహిత్య చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న ప్రముఖ కవి పద్మభూషణ్ డా.బోయి భీమన్న. ఈ పేరు తెలియని తెలుగువాడంటూ ఉండరు. భీమన్న గారు పద్యకావ్యాలు, గేయ కావ్యాలు, వచన సాహిత్యం, నాటకాలు మొదలైన ప్రక్రియల్లో గొప్ప రచనలు వ్రాసి పాఠకుల హృదయాలలో గొప్ప స్థానాన్ని సంపాదించుకున్నారు. హేతువాద దృష్టితో, సామాజిక స్పృహతో, తాత్త్విక చింతనతో అనేక తత్త్వాలను బోధించిన కవి బోయి భీమన్న. గుడిసెలు కాలిపోతున్నై అనే కవితా సంపుటిని చదివిన పాఠకులకు రచయిత ఒక్కొక్కరిని ఒక్కో విధంగా కనిపిస్తారు. మత ప్రవక్తలు, నీతిబోధకులు, ధర్మ శాస్త్ర కర్తలు మొదలైన వాళ్ళు ప్రజలను నిద్రపుచ్చుతూ వస్తున్నారని ఈ నిద్ర ఇలాగే కొనసాగితే మానవ జాతే దీర్ఘ నిద్రలోకి పోయే ప్రమాదం వుందని అంటారు భీమన్న. ఈ ప్రజల్ని మేల్కొల్పే ప్రయత్నమే అభ్యుదయ భావాలతో రచించిన కావ్యం "గుడిసెలు కాలిపోతున్నై" అని చెప్పాలి.

ఆధార గ్రంథాలు :

1. గుడిసెలు కాలిపోతున్నై – డా.బోయి భీమన్న – ప్రగతి ఆర్ట్ ప్రింటర్స్ – హైదరాబాద్ 1977
2. భీమన్న వచన కవితా సంపుటాలు – పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం – హైదరాబాద్ 2010
3. బోయి భీమన్న రూపకాలు – తాత్త్విక చింతన డా॥ తక్కళ్ళ బాలరాజు, చైతన్య సాహితి – వరంగల్ 1996
4. సామాజిక విలువల నేపథ్యంలో డా॥ బోయి భీమన్న రూపకాలు – విశ్లేషణాత్మక విమర్శ – డా. మరపట్ల భాస్కరరావు – ఆంధ్రా విశ్వవిద్యాలయం సిద్ధాంత వ్యాసం 2001.

ISSN No.2319-3905

12

నాలుగు దశాబ్దాల రాయలసీమ సాహిత్యం

– ఆచార్య కె.శ్రీదేవి & పి. శివశంకర్

ఆధునిక సాహితీ వికాసానికి మూలకారణమైన నూతన చారిత్రక శక్తులు, కోస్తాంధ్ర – ప్రాంతంలో ముందుగా తలయెత్తటం వల్లనే అక్కడ ఆధునిక కథానిక ముందుగా ఆవిర్భవించింది. ప్రజాజీవితంలో విప్లవాత్మకమైన పరిణామాలు ఆ జిల్లాలలో ప్రారంభమై నందువల్లనే సాహిత్యంలో కూడా నూతన పరిణామాలు ముందుగా ప్రారంభమైనాయి. ఆధునిక వర్తక వాణిజ్యాలూ, పరిశ్రమలూ, స్కూళ్ళూ, కాలేజీలూ, ఆ ప్రాంతంలో, రాయలసీమలో కంటే ముందుగా అందుబాటులోకి రావటం వల్లనే వాళ్ళు ఆధునిక జీవితానికి, ముందుగానే అలవాటు పడినారుసంఘ సంస్కరణోద్యమాలలోగాని, జాతీయోద్యమంలోగాని, సోషలిస్టు కమ్యూనిస్టు ఉద్యమాలలోగాని, కోస్తా జిల్లాల వాళ్ళు. రాయలసీమ వాసుల కంటే అగ్రగాములు కావటంవల్లనే ఈ వ్యత్యాసం ఏర్పడింది. గిడుగు, గురజాడల వ్యావహారిక భాషోద్యమాన్ని నడుపుతున్న కాలంలో రాయలసీమ వాసులకు. వ్యావహారిక భాష అంటే ఏమిటో తెలియదు. గురజాడ కన్యాశుల్యం రాసే నాటికి, రాయలసీమలో ఇంకా సంప్రదాయ కవితే రాజ్యమేలుతోంది. గురజాడ ముత్యాలసరాలు కూర్చే నాటికి రాయలసీమ కవులకు మాత్రబద్ధ ఛందస్సులో గేయకవితా ప్రక్రియే తెలియదు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాతనే పత్రికలూ, ఆధునికవిద్య బాగా అందుబాటులోకి రావటంవల్ల రాయలసీమ ప్రాంతంలో ఆధునిక సాహిత్య సంచలనం మెల్లగా ప్రారంభమైంది.

రాయలసీమ రచయితలు భాష విషయంలో ఎదుర్కొన్న అసౌకర్యం కూడా ఇందుకు ఒక కారణం! అంతవరకూ సాహిత్య ప్రయోజనాలకు ఉపకరిస్తున్న గ్రాంథిక భాష ఆధునిక కథానికకు బొత్తిగా ఉపయోగపడదు. తమ ప్రాంతపు మాండలిక భాష పట్ల తమకే అనుమానం. దీనికి సాహిత్య గౌరవం లభింపదేమోనన్న భయం! ఇక కథ రాయటానికి కొత్తగా ఒకభాషను నేర్చుకోవాల్సిన విచిత్ర పరిస్థితి ఏర్పడింది. అప్పటికే పత్రికా భాషగా, రచనా భాషగా స్థిరపడి వున్న కోస్తాంధ్ర భాషను నేర్చుకొని కథలు రాయాల్సి రావటం వల్ల కూడా, రాయలసీమలో కథావేగం కొంత మందగించింది. అందువల్ల చలం, శ్రీపాద, దీక్షితులు, కుటుంబరావు, గోపీచంద్,

బుచ్చిబాబు, పద్మరాజులాంటి కథకులు ఆయాప్రాంతాలలో విరివిగా కథలు రాస్తున్న కాలంలో రాయలసీమలో చెప్పుకోదగ్గ రచయిత ఒక్కడైనా లేడు. స్వాతంత్ర్యానికి పూర్వం రాయలసీమలో ఆధునిక కథానిక దాదాపు లేనట్టే. స్వాతంత్ర్యానంతరమే రాయలసీమలో కథానిక ఒక స్పష్టమైన రూపాన్ని సంతరించుకుందని మనం భావించవచ్చు.

ఆలస్యమైనప్పటికీ రాయలసీమలో కథానిక విషయంలో మంచి ప్రారంభమే జరిగింది. కె.సభాగారిని రాయలసీమలో తొలి తెలుగు కథకుడిగా గుర్తించవచ్చు! మధురాంతకం గారి మాటల్లో చెప్పాలంటే, "రెండు బండల మధ్య గల నెరియలో నుంచి అంకురించి తన ఉనికి కోసం, మనుగడ కోసం ప్రకృతితో పోరాడే రావి మొక్కలా ఎదిగి శాఖోపశాఖలు మహావృక్షంగా విస్తరిల్లిన రచయిత కె. సభాగారు."

సభాగారి గొప్పతనం ఎక్కడుందీ అంటే, రాయలసీమ ప్రత్యేక సామాజిక, భౌగోళిక లక్షణాలను తన కథా రచన ప్రారంభదినాలలోనే ఆయన గుర్తించగల్గటంలో వుంది! రాయలసీమ వాసులను పీల్చి పిప్పి చేస్తున్న కరువు విరాట్ స్వరూపాన్ని ఆయన కథాబద్ధం చేయటంలో వుంది. రాయలసీమ ప్రజల జానపద సంస్కృతీ విలాసాలకు వాళ్ళ పలుకుబళ్ళకు సాహిత్య గౌరవం కల్గించటంలో వుంది. రాయలసీమలో ఒకటి రెండు సంవత్సరాలు సరిగ్గా వర్షాలు రాకపోతే తాగటానికి సైతం నీళ్ళుండవు. చెరువులు ఎండిపోతాయి. బావులు అడుగంటుతాయి. చెట్లు వాడిపోతాయి. పశువులకు గడ్డి వుండదు. చేయటానికి పనులు దొరకవు. జన తట్టా బుట్టా ఎత్తుకొని వలసలు పోతారు. సభాగారు ప్రత్యక్షసాక్షిగా ఈ దృశ్యాలన్నింటినీ తన కథల్లో చాలా వాస్తవికంగా ఎత్తి చూపించారు. ఆయన రాసిన పాతాళ గంగ, అంతరంగం, ఎండమావుల్లో తిమింగలాల వేట లాంటి కథలు చదివితే ఈ విషయాలు స్పష్టమవుతాయి. రాయలసీమ రైతు నీళ్ళకోసం బావి తవ్వటంలోని అనితరసాధ్యమైన కష్టాన్ని 'పాతాళగంగ' కథలో చదివి ఎవరైనా నివ్వెరపోతారు. ఆ కథలోని రైతు బేటప్ప, తొమ్మిదిమెట్ల బావిని త్రవ్విన వైనం, రాయలసీమ రైతు జీవిత విషాదానికి పరాకాష్టగా భావించవచ్చుపాఠకుడు తానే బావిని తవ్వుతున్నంత కష్టాన్ని అనుభూతి చెందేలా ఆయన ఆ కథ రాశారు. సభాగారు తనకథల్లో ప్రామాణిక పత్రికా భాషే వాడినప్పటికీ, తమ ప్రాంతంలోని ప్రజల పలుకుబళ్ళను విరివిగా ఉపయోగించి, వాటికి సాహిత్య గౌరవం కలిగించారు. తమ ప్రాంతపు జానపదుల ఆచార వ్యవహారాలను జీవన విన్యాసాలనెన్నింటినో తమ కథల్లో రికార్డు చేశారు. ప్రాంతీయ ముద్రగల కథలను రాయలసీమ తొలి కథకుడు సభాగారు రాయటం అరుదైన విశేషంగా భావించవచ్చు. సభాగారు చిత్తూరు జిల్లాలో కథలు ప్రారంభించే కాలం నాటికి అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల నుండి కథలు పుట్టుకొచ్చిన దాఖలాలు లేవు. సభాగారి వారసత్వాన్ని స్వీకరించి, చిత్తూరు జిల్లాలో కథారచన సాగించిన వారు మధురాంతకం రాజారాంగారు.

ISSN No.2319-3905

రాజారాంగారు తన కథలకు ఒక సొంపైన భాషను తయారు చేసుకున్నారు. కొంత గ్రాంథిక వాసన, కొంత శిష్ట వ్యావహారికం, కొంత మాండలికం కలగలిసిన సుందరమైన భాష రాజారాం గారిది. ఆయన కథలు రాసే కాలంనాటికి రాయలసీమలో ఆయనకు మార్గదర్శకులైన రచయిత ఒక్క సభాగారు మాత్రమే! ఆయనంత విరివిగా కథలు రాసిన రచయితలు ఇప్పటికీ రాయలసీమలో లేరు. గ్రామ సీమల గురించి రాజారాంగారు రాసినన్ని కథలు బహుశా తెలుగులో ఏ రచయితా రాయలేదేమో! రాయలసీమ ప్రాంతీయ జీవితవాసన వారి కథల్లో గుబాళిస్తూ వుంటుంది. చిత్తూరు జిల్లా ప్రాంతీయ విలక్షణతను ఆయన కథల్లో మనం దర్శించవచ్చు. ఆయన రాసిన ఎడారికోయిల, కూనలమ్మ కోస, సర్కస్ దేరా, జీవన్ముక్తుడు, జీవన ప్రహసనం లాంటి అనేకానేక కథల్లో స్పష్టమైన ప్రాంతీయ ముద్రను గమనించవచ్చు. ఆయన కథన శైలి మౌఖికశైలిలా ఉండటం ఒక ప్రత్యేకత. ఈ శైలితో ప్రభావితులై రచనలు చేసిన వారిలో కేశవరెడ్డిగారిని చెప్పుకోవచ్చు.

రాయలసీమలో కథలు రాస్తున్న వారిని సౌలభ్యం కోసం స్థూలంగా రెండు తరాలుగా మనం విభజించుకోవచ్చు. 1950–65 దశకంలో కథలు రాయటం ప్రారంభించిన వారు మొదటి తరం రచయితలైతే, 1975–85 దశకం నుంచీ కథలు రాస్తున్నవారు రెండవ తరం రచయితలు ఇది ఒక చిన్న రేఖావిభజన మాత్రమే. మొదటి తరం రచయితల్లో కె. సభా, మధురాంతకం రాజారాం, కలువకొలను సదానంద, పులికంటి, ఆర్.ఎస్. సుదర్శనం, వల్లంపాటి, ఆర్. వసుంధరా దేవి. బి. నాదమునిరాజు, రా.రా., సోదుం జయరాం, కేతు విశ్వనాథరెడ్డి, పి. రామకృష్ణారెడ్డి.. వై.సి.వి రెడ్డి మొదలగు వారు చేరుతారు.

రెండవ తరం రచయితల్లో డా. కేశవరెడ్డి, డా.లంకిపల్లె, మధురాంతకం నరేంద్ర, మహేంద్ర, నామిని వీరపల్లె వీణావాణి, వి.ఆర్.రాసాని, సింగమనేని, దేవపుత్ర, స్వామి, శాంతినారాయణ, సన్నపురెడ్డి, పాలగిరి విశ్వప్రసాద్, , కుప్పిరెడ్డి, చిదంబరరెడ్డి, జి.ఆర్. మహర్షి, శ్రీనివాసమూర్తి, తుమ్మల రామకృష్ణ, రాప్తాడు గోపాలకృష్ణ, సుందరరాజు మొదలగు వారు వస్తారు. వీరిలో ఇటీవల కథా రచన ప్రారంభించిన వారు కూడా కొందరు లేకపోలేదు.

అనంతపురం, కర్నూలు జిల్లాల్లో మొదటి తరం రచయితలు దాదాపు లేరనే చెప్పవచ్చు. అనంతపురం జిల్లాలో జి. రామకృష్ణగారు అన్న జర్నలిస్టు 1943 ప్రాంతంలో చిరంజీవి అన్న చిన్న కథనూ, 1952 ప్రాంతంలో గంజి కోసరం అన్న ఒక వాస్తవిక జీవన కథను రాశారు. అయితే ఆయన ఆ తర్వాత, ఒకటి రెండు కథలు మాత్రమే రాసి విరమించుకున్నారు. విచిత్రమేమిటంటే, రాయలసీమలో కథలు రాస్తున్న వాళ్లంతా బ్రాహ్మణేతరులు కావటం! (ఒక్క వల్లంపాటి గారిని మినహాయిస్తే) గ్రామీణ ప్రాంతాలనుండీ, శ్రమజీవన కుటుంబాల నుండీ వచ్చినవాళ్ళు కావటం. రాయలసీమలో తరతరాలుగా సంప్రదాయ సాహిత్యాన్ని సృష్టించిన బ్రాహ్మణులు ఆధునిక సాహిత్య ప్రక్రియల్లో ప్రవేశించకపోవటం! కోస్తాంధ్రలో కథా

రచయితలందరూ గురజాడ మొదలుకొని పురాణం వరకూ, ఏ కొద్దిమందినో మినహాయిస్తే, అందరూ బ్రాహ్మణులు కావటం, రాయలసీమలో కథారచయితలందరూ బ్రాహ్మణేతరులు కావటం, ఇదొక విచిత్ర సన్నివేశం! ఇందుకు కారణాలు పరిశోధకులు అన్వేషించాల్సి వుంది.

రాయలసీమలో మొదటితరం కథారచయితలు కథలు రాయటం ప్రారంభించిన కాలంలో, రాయలసీమ ముఖచిత్రాన్ని పరిశీలిస్తే కొన్ని సంగతులు స్పష్టమవుతాయి. అప్పట్లో రాయలసీమ రైతులంతా కపిలబానలతో బావులనుండి నీళ్ళుతోడి వ్యవసాయం చేసేవాళ్ళేవిస్తారంగా మెట్టభూములున్నప్పటికీ అందులో సాగు అంతంత మాత్రమే! పట్టా భూముల కంటే శివాయిసాగు భూములే ఎక్కువ! వ్యవసాయం ప్రధానంగా అగ్రకులాల (రెడ్డి, కమ్మ) అధీనంలో ఉండేది. వర్షాధార పంటల పట్ల ఆసక్తి చాలా తక్కువగా ఉండేది. భూములు విస్తారంగా ఉన్నప్పటికీ భూస్వాములు చాలాతక్కువ. వర్షపాతం తక్కువగా వున్నప్పటికీ బావుల్లో నీటిమట్టం కొద్దో గొప్పో వుండేది. రెండుమూడేళ్ళకొకసారి కరువులు వస్తున్నప్పటికీ ప్రజలు నిశ్శబ్దంగా కరువును అనుభవించేవాళ్ళు. ఏ పల్లెకూ కరెంటు లేదు. కాస్త సంపన్న మధ్యతరగతి వర్గం ఆయిల్ ఇంజన్లు ఉపయోగించి బావుల నుండి నీళ్ళు తోడేవాళ్లు. అప్పట్లో అయిల్ ఇంజనే గొప్ప అద్భుతం! బావులకింద సేద్యం నిరాఘాటంగా సాగుతూండటం వల్ల వర్షాలు రాక మెట్ట పంటలు అదృశ్యమైనా తిండిగింజలు ఓ మేరకు పండిస్తూ జీవనం ఈడ్చేవాళ్లు. వర్షాలు కూడా అప్పట్లో ఇప్పుడంతగా అన్యాయం చెయ్యలేదు. అందువల్ల ఇప్పుడున్నంత నీటి స్పృహ అప్పట్లో రైతుకు వుండేది కాదు. వాణిజ్య పంటలు ఇంకా రైతు దృష్టిని ఆకర్షించటం లేదు. భూమికి చెప్పుకోదగ్గ విలువ లేదు.

పల్లెల్లోకి హైస్కూల్ విద్య ఇంకా ప్రవేశించలేదు. అప్పుడప్పుడే స్వాతంత్ర్యం వచ్చిన దశ గాబట్టి ప్రభుత్వం పట్ల, కాంగ్రెస్ నాయకులపట్ల ప్రజలకు నమ్మకం, గౌరవం వుండేవి. దేశానికేదో అద్భుతం జరుగుతుందని ఆశగా వుండేది. ప్రభుత్వ వ్యతిరేకత చాలా తక్కువ. పల్లెల్లో రాజకీయాలు అస్సలు తెలియవు. అసెంబ్లీ అంటే ఏమిటో, పార్లమెంట్ అంటే ఏమిటో, ఏ ఎన్నికలు ఎందుకో తెలీని అజ్ఞానంలో పల్లెలు వుండేవి. గ్రామ పెద్దలో, నాయకులో చెప్పిన వారికి ఓట్లు వేసే పరిస్థితి వుండేది. పల్లెల్లో ఇంకా పాలూ, పెరుగూ, కూరగాయలూ ఉచితంగానే ఇచ్చే సంప్రదాయం ఉండేది. మాల మాదిగలపట్ల అస్పృశ్యత పాటిస్తున్నప్పటికీ, వావి వరసలుపెట్టి పిల్చుకునే సంబంధాలు వుండేవి. ఏ కొద్ది ప్రాంతాల్లోనో తప్ప వాళ్ళపై దాడులూ, పీడనా వుండేవి కావు. ఫ్యూడల్ సంప్రదాయాలూ, ఆచార వ్యవహారాలు బలంగా వుండేవి. పట్టణాలకు పెద్ద అవసరముంటే తప్ప పల్లె ప్రజలు వెళ్లే వాళ్లు కారు. పట్టణ, మధ్య తరగతి వర్గానికి పత్రికలూ, సాహిత్యమూ అందుబాటులోకి వచ్చాయి. కమ్యూనిస్టు సిద్ధాంతాలూ, పత్రికలూ, సభలూ, సమావేశాలు మేధావి వర్గాన్ని ప్రభావితం చేయడం ప్రారంభమైంది. మధ్య తరగతి యువకుల్లో అప్పుడప్పుడే ఆదర్శభావాలు మొలకెత్తుతున్నాయి. ఆడపిల్లల పెళ్లి అప్పుడప్పుడే సమస్యగా తలెత్తుతోంది. చాలా కొద్దిమొత్తంలోనైనా

ISSN No.2319-3905

కట్నాలు ఇచ్చుకొనే పరిస్థితి ఏర్పడుతోంది. ఉద్యోగమే పరమావధిగా గల చదువులకు తగిన ఉద్యోగాలు లభించటం కోసం దేవులాట ప్రారంభమైంది. ఉన్నత విద్య మధ్యతరగతి వర్గానికి పెనుభారంగా ఉండేది. సంపన్నులకు మాత్రమే ఉన్నత విద్య అందుబాటులో ఉండేది. పల్లెకు ఏ పదిమంది మాత్రమే పట్టణాలకు వెళ్లి చదువుకొనేవారు.

ఈ సామాజిక నేపథ్యంలో అప్పటి రచయితలు, తమ కథా రచనను ప్రారంభించారు. రచయితలందరూ గ్రామీణ కుటుంబాల నుంచీ వచ్చినవాళ్లు కావటం వల్ల వాళ్ల కథల్లో గ్రామీణ మధ్య తరగతి జీవితం ప్రధానంగా చోటు చేసుకొనింది. మధ్య తరగతి జీవితమే వాళ్ల కథలకు ప్రధాన ఇతివృత్తమై పోయింది. మధ్య తరగతి ప్రజల నిత్య నైమిత్తిక కర్మలూ, పంటలూ, పబ్బాలూ, పిల్లల చదువులూ, ప్రేమలూ, పెళ్లిళ్లూ, ఉద్యోగాలూ, కుటుంబ కలహాలూ, సమిష్టి కుటుంబాలు విచ్ఛిత్తి, గ్రామ రాజకీయాలూ, ఆదర్శాలూ, పట్టణ నాగరికత, ఇలాంటి వస్తువులతో రచయితలు కథలు రాశారు. రా.రా. సోదుం జయరాం, కేతు విశ్వనాథరెడ్డి లాంటి రచయితలు మధ్య తరగతిని ప్రధానంగా ఆర్థిక దృష్టి నుండి పరిశీలించారు. మారిస్ట్ భావజాలంలో ప్రభావితులైనవాళ్లు కావటం వల్ల వారి కథల్లో బౌద్ధికమైన సంఘర్షణ కూడా చోటుచేసుకుంది. మధురాంతకం, కలువకొలను లాంటి రచయితలు, భిన్న సామాజిక వ్యక్తిత్వాల గురించి, వైయక్తిక దృష్టితో జీవన వైవిధ్యాలను తమ కథల్లో ప్రతిబింబించారు. ప్రాంతీయమైన, భౌగోళికమైన విలక్షణతను, రాయలసీమవే అయిన ప్రత్యేక సమస్యలను, సభా, కేతు విశ్వనాథరెడ్డి గార్లు తప్ప, ఎక్కువ మంది కథకులు అప్పట్లో పట్టించుకోలేదు. మధ్య తరగతి కోసమే పుట్టిన కథ మధ్య తరగతి చుట్టూ పరిభ్రమించటం వల్ల, వాళ్ల కష్టాలూ, కన్నీళ్లూ, ఆశనిరాశలూ, రాగద్వేషాలు, ఆదర్శాలూ, బలహీనతలూ కథల్లో బలంగా చోటు చేసుకున్నాయి. సామాజిక సంఘర్షణలూ, వివిధ భావజాలాల మధ్యగల వైరుధ్యాలూ, సామాజిక వాదాలూ అప్పటికింకా కథల్లో తొంగి చూడలేదు.

రాయలసీమ తొలితరం రచయితలు, వస్తువుతోపాటు, కథా నిర్మాణంలో కూడా చాలా జాగ్రత్తను కనబరిచారు. కొడవటిగంటితో ప్రభావితులైన రా.రా., సోదుం జయరాం, కేతు విశ్వనాథరెడ్డి లాంటి కథకులు నిరాడంబరమైన, నిరలంకారమైన శైలిలో కథలు రాశారు. అనవసరమైన వర్ణనల జోలికి పోకుండా, అనవసరమైన నాటకీయతను చొప్పించకుండా, కథలో పెద్ద మలుపులు లేకుండా, సూటిగా చెప్పడం వీరి కథాశిల్పంలోని ప్రత్యేకత. పాత్రల స్వభావాలను రచయితలే పనిగట్టుకొని చెప్పకుండా, వారి ప్రవర్తన సంభాషణలద్వారా వ్యక్తీకరించటం, కథా రచనలో వీరు పాటించిన సంయమనం. చిత్తూరు జిల్లా కథకుల శైలి వీరి శైలి కంటే భిన్నమైనది.

సుందరమైన, లలితమైన పదాల పోహళింపుతో మనోజ్ఞమైన వర్ణనలతో పొందికైన వాతావరణం మధ్య వయ్యారంగా నడుస్తుంది వీరి రచనా శైలి. అయితే వస్తువును మింగివేసే శైలీ వైధగ్యాన్ని వీళ్లెవ్వరూ ప్రదర్శించలేదు. రాయలసీమ వాసులకు సహజమైన బోళాతనం వీరి

శిల్పంలో కన్పిస్తుంది. నుడికారాలూ, సామెతలూ, లోకోక్తులూ, వీళ్ళ కథల్లో విరివిగా చోటు చేసుకున్నాయి. ఈ తరం రచయితలెవ్వరూ తమ కథల్లో మాండలిక భాష పట్ల ప్రత్యేకశ్రద్ధను కనబరచకపోవటం గమనార్హం. కొందరైతే మాండలిక భాషాచ్ఛాయలు అసలు కన్పించకుండా జాగ్రత్త పడటం కూడా కనిపిస్తుంది. అందుకు కారణం తమ భాష పట్ల తమకే ఎక్కడో న్యూనతా భావం ఉండటం. పత్రికా భాషను నూటికి నూరుపాళ్లూ ప్రామాణిక భాషగా ఆమోదించటం.

రెండవ తరం రచయితలు కథలు రాసేనాటికి, రాయలసీమలో చెప్పుకోదగ్గ మార్పులు చాలానే వచ్చాయి. స్కూళ్ళూ, కాలేజీలూ, బహుళ సంఖ్యలో పెరిగాయి. సెకెండరీ స్థాయి వరకూ ఉచిత విద్య లభించటం వల్ల మధ్య తరగతికి విద్య అందుబాటులోకి వచ్చింది. ప్రతి పల్లెకూ కరెంటు వచ్చింది. పల్లె పల్లెకూ రవాణా సౌకర్యాలు ఏర్పడ్డాయి. కపిల మోటల స్థానంలో కరెంటింజన్లు వచ్చాయి. కొంతకాలం గడిచేసరికి గొట్టం బావులు వచ్చాయి. ఇంతకు మునుపు శ్రమను పెట్టుబడిగా మార్చి పంటలు పండించే రైతులు ఇప్పుడు డబ్బును పెట్టుబడిగా చేసి వ్యవసాయం చేయటం వల్ల క్రమంగా చితికిపోతున్నారు. డబ్బు చేతిలో వుంటే తప్ప సేద్యం చేయటం సాధ్యం కాని పరిస్థితి వచ్చింది. ఈ దశలోనే రైతులకు వాణిజ్య పంటల పట్ల ఆసక్తి పెరిగింది. భూమికి విలువ పెరుగుతూ వచ్చింది. బీడుగా వున్న వేల ఎకరాలు కొత్తగా సాగులోకి వచ్చాయి. చిరకాలంగా ఉన్న వ్యవసాయేతర కులాలు. వ్యవసాయ రంగంలోకి అడుగుపెట్టాయి. భూమి చేతులు మారింది ఈ దశలోనే. ఉత్పత్తి పెరిగింది. అయితే ఉత్పత్తి చేసే రైతు పరిస్థితి రాను రాను దయనీయంగా మారటం జరుగుతున్న పరిణామం! ఇందుకుతోడు ప్రతి రెండు, మూడు సంవత్సరాలకూ ఇక్కడ కరువు కరాళనృత్యం చేస్తూనే వుంది. బావులు ఎండి పోయాయి. బోరింగులూ, గొట్టపు బావులు లేని రైతే ఇప్పుడు లేడు. తాగు నీటికి అంతటా ఎద్దడి ఏర్పడింది. రైతులు బ్యాంకుల చుట్టూ, ఆఫీసుల చుట్టూ తిరిగే పరిస్థితి ఏర్పడింది.

ఈ పరిస్థితులు ఇట్లా వుండగా పల్లెల్లో ఓట్ల రాజకీయాల జోరు క్రమంగా పెరిగింది. ఓట్ల కోసం రాజకీయ నాయకులు అమాయకపు పల్లెల్ని రెండు వర్గాలుగా చీల్చటం ప్రారంభించారు. కులం మునుపెన్నడూ లేనంతగా పడగ విప్పిందిఫ్యాక్షన్ పెరిగింది. ముఠాలు పెరిగాయి. వ్యక్తిగతంగా సైన్యాన్ని నడుపుకొనే ఫ్యాక్షన్ రాజకీయ వేత్తలు పుట్టుకొచ్చారు. ఫ్యాక్షన్ రాజకీయాలలో పల్లెలు అగ్ని గుండాల్లా మారిపోసాగాయి. బాంబుల పేరే తెలియని మారుమూల పల్లెటూళ్ళలో కూడా దీపావళి బాణసంచాల్లా బాంబులు పేలుతున్నాయి. ఫ్యాక్షన్ రాజకీయాల్లో చిక్కుకుని చాలా కుటుంబాలు ధ్వంసమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లోనయితే ఊళ్లకు ఊళ్ళు బూడిదయ్యాయి. ఈ ఫ్యాక్షన్ నాయకులకు అండగా ఒక లంఫెన్ కిరాయి గూండావర్గం పెరగసాగింది. మద్యం చాలా సహజమైన పానీయమైపోయింది.

కమ్యూనిస్టు భావజాలం ప్రజలపై ప్రభావాన్ని చూపటం తగ్గిపోసాగింది. కమ్యూనిస్టు పార్టీలు ఎన్నికల స్టంటులో మునిగి, ఓట్ల రాజకీయాల్లో కూరుకుపోవటం వల్ల వాళ్ళుసాగించే పోరాటాల్లో

ISSN No.2319-3905

చిత్తశుద్ధి లోపించింది. ప్రజలు కమ్యూనిస్టులను ఓట్ల రాజకీయాలలో భాగంగానే చూస్తున్నారు. ఇదే దశలో, ఎం.ఎల్. పార్టీ గ్రూపులు కూడా అసంఖ్యాకంగా పుట్టగొడుగుల్లా ఇక్కడ పుట్టుకొస్తున్నాయి. నాలుగు బాంబులూ, రెండు నాటు తుపాకీలూ, పదిమంది అనుచరులూ ఉన్న వాడల్లా ఇక్కడ ఒక దళనాయకుడూ, ఒక గ్రూపుకు అధిపతీ అయిపోతున్నాడు. పల్లెల్లోని కక్షల్ని వుపయోగించుకొని గ్రామీణ జీవితాన్ని వీళ్లు హింసామయం చేస్తూ వస్తున్నారు. ఏ సిద్ధాంత బలములేని, ఏ తాత్విక దృక్పథమూ లేని ఇలాంటి గ్రూపులు కొన్ని రాజకీయ పార్టీలకు వత్తాసుగా మారి గ్రామీణ ప్రజల్లో భయాందోళనలు ఇక రైతాంగ సమస్యల్ని, కరువు తీవ్రతనూ పాలకవర్గాలు పట్టించుకోవడం లేదు. కరెంటు రేట్లు, ఎరువుల ధరలూ, మందుల ధరలూ ఎప్పటికప్పుడు విపరీతంగా పెరిగిపోవటంతో ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకత రైతాంగంలో పెరిగింది. పాలక పక్షాలకు వ్యతిరేకంగా ఓటువేసి ప్రభుత్వాన్ని కసిగా మార్చేస్థితికి ప్రజల చైతన్యం చేరుకుంది. తాగునీటి కోసం, సాగునీటి కోసం కొద్దిగానైనా సంచలనం ప్రారంభమైంది.

పల్లెల్లో బతకటం కష్టమైపోయి పట్టణాలకు వలస వచ్చే రైతు కూలీల సంఖ్య పెరిగింది. చిన్న కారు రైతులు భూముల్ని అమ్ముకొని కూలీలుగా మారిపొయ్యారు. 20, 30 ఎకరాలు వున్న రైతులకు కూడా రెండు సంవత్సరాలు వర్షాలు రాకపోతే బతుకు తెరువు కష్టమైపోయింది. ఈ దశలోనే పట్టణీకరణ ఎక్కువైపోయింది. ఒక కొత్త నడమంత్రపు సిరి వర్గం (కాంట్రాక్టర్లు, రియల్ ఎస్టేటార్లు, కార్పోరేషన్లు నడిపే వాళ్లు) సమాజంలో వేళ్లూనుకుంది.. ఈ వర్గానికి నీతి, సామాజికవిలువలు ఇలాంటివేవీ తెలియవు. డబ్బు సంపాదనే ధ్యేయం. ఇది ఇలా వుండగా విద్య చాలా వేగంగా వ్యాపారరంగంగా స్థిరపడి పోయింది. ఆంగ్లభాషపై అలవిగాని వ్యామోహాన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు పెంచి పోషించాయి. ఉన్నతవిద్య అంటే, ఇంజనీరింగ్, మెడిసిన్ అన్న మిథ్యావిలువలు మధ్య తరగతి వర్గంలో పాతుకుపోయాయి. ఎంత చదువు చదివినా, ఉద్యోగాల విషయానికి వచ్చేసరికి అవి ఎండమావుల్లా దూరదూరంగా పరుగులెత్తుతున్నాయి. యువతలో భవిష్యత్తు పట్ల భయం, నైరాశ్యం పాదుకుంటున్నాయి. ఉన్నత ఆదర్శాలు పెంచుకున్న యువకుల్లో కూడా స్తబ్ధత పెరిగిపోయింది.

ఆడపిల్లల పెళ్లి భయంకరమైన సమస్యగా తీవ్రరూపం దాల్చింది. వస్తువ్యామోహ సంస్కృతి కారణంగా ఒకప్పుడు వేలలో వున్న కట్నాల రేట్లు లక్షలు దాటాయి. పెళ్ళికి ముందూ పెళ్ళి తర్వాత కూడా ఆడపిల్లల జీవితం డబ్బుతోనే ముడిపడిపోయింది. ఆడపిల్లల్ని పెద్ద పెద్ద చదువులు చదివించాలంటే, కట్నం కారణంగా తండ్రులు భయపడి పోతున్నారు. ఆడపిల్లల చదువూ, ఉద్యోగాలూ గణనీయంగా పెరిగినా అభద్రతా భావం అంతకంతకూ పెరిగిపోసాగింది. దళితుల పట్ల అసహనం పెరిగింది. దళిత ఉద్యమాలు క్రమంగా చోటు చేసు కుంటున్నాయి. దళితులలో కులస్పృహ పెరిగింది. కళాశాలల్లో విశ్వవిద్యాలయాల్లో కులవివక్ష బలపడింది.

ఈ రాయలసీమ సామాజిక చిత్రాన్ని రెండవ తరం కథా రచయితలు, తొలితరం కథకులతోపాటుగా, ఒక క్రమ పరిణామంలో తమ కథల్లో చిత్రించుకుంటూ వస్తున్నారు. మారుతున్న రాయలసీమ సామాజిక సంక్లిష్ట పరిస్థితులు మధ్య కొన్ని కొత్త వస్తువులను ఈ కథకులు తమ కథల్లో తీసుకు వచ్చారు. ప్రాకృతికంగా, రాయలసీమ అనుభవిస్తున్న భౌగోళిక దురన్యాయాన్ని తమ కథల్లో చిత్రించటం ప్రారంభించారు. కరువు, తాగునీటి సమస్య, సాగునీటి సమస్య, పంటలు పండకపోవడం, పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించకపోవటం, దళారీల దోపిడీ ఇవన్నీ కథా వస్తువులయ్యాయి. రాయలసీమ ప్రత్యేక సామాజిక, సాంస్కృతిక లక్షణాలను ఈ తరం రచయితలు స్పష్టంగా గుర్తించారు.

నాగరికతకు మూలాధారం నీళ్లు! రాయలసీమలో లేనివి నీళ్లే! నీళ్లున్న ప్రాంతాల వాళ్లకు నీళ్లలేని ప్రాంతాల వాళ్ల ఈతిబాధలు చెబితే తప్ప అర్థం కావు. ఒక కడవెడు నీళ్ల కోసం మైళ్ళకు మైళ్లు నడవాల్సి రావటం, వర్షాలు కురవక భూములు బీళ్లుగా ఉండిపోవటం, కళ్లారా చూస్తే తప్ప ఆ విషాదం హృదయాన్ని తాకదు. కుటుంబ జీవనం మొదలుకొని, దేశజీవనసంపద వరకూ, ఆర్థికాన్ని శాసించేది, నాగరికతను తీర్చిదిద్దేది నీళ్లే! తరతరాలుగా రాయలసీమవాసులు నీళ్ళకోసం తపించిపోవటాన్ని సంఘసంస్కర్తలూ గుర్తించలేదు. రాజకీయనాయకులూ చలించలేదు. నీళ్లు భూమికగా ఈ తరం రచయితలు శరీరం గగుర్పొడిచే, హృదయాలు కంపించే ఎన్నో కథలు రాశారు.

స్వామి రాసిన ‘నీళ్లు’, ‘వానరాలే’ కథలు, దాదాహయత్ రాసిన గుక్కెడు నీళ్లు, సన్నపురెడ్డి రాసిన ‘తడి’, కేతు విశ్వనాథరెడ్డి రాసిన ‘వానకురిస్తే’, ‘నమ్ముకున్న నేల’, సింగమనేని రాసిన ‘బి’, ‘విముక్తి’, చక్రవేణు రాసిన ‘కసాయి కరవు’, శాంతి నారాయణ రాసిన ‘కల్లమయిపాయ’, మహేంద్ర రాసిన ‘ప్రతిజ్ఞ’ లాంటి ఎన్నో కథలు ఈ పరిస్థితులను ప్రతిబింబిస్తాయి.

కుటుంబంలోని ప్రేమ సంబంధాలలో కూడా నీళ్ళు వహించే పాత్రను, ఎంతో వాస్తవికంగా, చక్కని శిల్పంతో, స్వామి తన ‘నీళ్లు’ కథలో చిత్రించాడు. ఒక మధ్య తరగతి ఉద్యోగి కుటుంబం కేంద్రంగా స్వామి ఈ కథను నడిపాడు. వాళ్ళు నివసించే చిన్నపట్టణంలో తాగే నీళ్లు, వచ్చేది రోజుకు ఓ గంట సేపు మాత్రమే! అవి ఏ సాయంత్రమో, ఏ అర్ధరాత్రో, తెల్లవారు జామునో వస్తాయి. ఇంట్లో ఆడవాళ్ల జీవన దృష్టి అంతా ఆ నీళ్లరాక మీదనే! అది వచ్చినపుడు కూడా తమ భాగానికి ఏ రెండు మూడు బిందెలు మాత్రమే లభిస్తాయి. వాటికోసం వీధిలో పడిగాపులు. ఆ నీళ్ళనే రోజంతా ఎంతో పొదుపుగా వాడుకోవాలి. భోజనాలకు కూచొనేటప్పుడు తట్టముందు, తాగేనీళ్లు ఒక చెంబులో వుంచుకుంటారు ఆ కుటుంబీకులు. చేతులూ తట్టలూ కడుక్కొనేందుకు ఉప్పునీళ్లు (బోరింగునీళ్లు) మరో చెంబులో వుంచు కుంటారు. పొరపాటున తాగే నీళ్లతో, చేతులూ, మూతి కడుక్కున్నారో, చేసేది ఒక చిన్న సైజు యుద్ధమే. ఒక పూట వాళ్ల పిల్లాడు పొరపాటున

తాగేనీళ్లతో ఆ ఇంటి ఇల్లాలు వాళ్లతో చేయి కడుక్కోవటం తల్లి చూసింది. ఇంకేముంది..."ఎడం చేత్తో ధనాధనా వాని చెంపల్నీ, వీపునీ, తలనీ, ఎక్కడబడితే అక్కడ ఉతికేసింది. ఆ పిల్లాడు

"అమ్మా! లేదమ్మా! ఇంక ఒలకపోయనమ్మా" అంటూ నోరంతా వెళ్లబెట్టి ఏడుస్తావుంటే, ఆ తల్లి కూడా వాణ్ణి కౌగలించుకొని, భోరున ఏడ్చేసింది. ఈ దృశ్యాన్ని ఏ ప్రాంతం రచయిత రాయగలడు? ఇదంతా ఒక ఎత్తయితే నీళ్ళకోసం, నీళ్లపేరుతో ఓట్ల కోసం నడిపే రాజకీయాలు ఒక ఎత్తు. వీధి కుళాయి దగ్గర తలలు పగులగొట్టుకునే వాతావరణం మరో ఎత్తు. ఆ కథ ముగింపు వాక్యం గమనించండి. "ఎవరు ఎన్ని నీళ్లు వాడతారో తెలిస్తే, వాళ్ళ నాగరికత ఏ పాటిదో చెప్పెయ్యవచ్చు! తాగేదానికి ఒక కడవ నీళ్లు నోచుకోనివారికి ఏం నాగరికత వుంటుంది?".

దాదాహయత్ రాసిన గుక్కెడు నీళ్లు కథ గమనించండి. ఒక ముసలిదాని దాహార్తి తీర్చటానికి ఒకపదేళ్ళ పసిపిల్ల, చెంబుడు నీళ్ళకోసం, రెండు మైళ్ళనడిచి, నడిచి ఒక కోనేరులో చెంబు ముంచబోయి జారిపడి, ఆ కోనేరులో చచ్చిపోయిన దారుణ దృశ్యం గుండెల మీద గుండు ఎత్తుతుంది. ఆకథలో వినిపించే ఒక వీధి పాటగాడి తంబురా పాటను పరిశీలించండి. "గుక్కెడు నీళ్లకోసం బొక్కేవులేరా సిద్ధా!..... దక్కేనా నీరూ సిద్దా!...." ఇలాంటి పాటను తంబూరా మీద పాడే పాటగాళ్లు, వేరే ఏ ప్రాంతంలోనైనా ఎందుకుంటారు?

సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి రాసిన "తడి" కథ ఇదే సమస్యను మరికొంత దూరం తీసుకుపోతుంది. ఈ కథలోని సమస్య సాగునీటి సమస్య! అయితే ఈ కథ నీటి సమస్య దగ్గరే ఆగిపోదు. ఎంతో సన్నిహితంగా, ఆత్మీయంగా ఉండాల్సిన అన్నదమ్ముల మధ్య, వాళ్ల కుటుంబాల మధ్యగల సహజమైన ప్రేమ సంబంధాలను నీటి సమస్య ఎలా ఛిద్రం చేస్తుందో ఈ కథ చూపెడుతుంది.

రాయలసీమ రైతు, అనేకానేకంగా ఈ సమస్యల్ని ఎలా అనుభవిస్తున్నాడో, ఎలా సతమత మవుతున్నాడో తెలియచెప్పే కథలు ఈ దశలో అనంతంగా వచ్చాయి. "ఒక్క వానకురిస్తే చాలు తండ్రీ! బతికి బయటపడతాము" అనుకుంటూ ఆకాశంలో మబ్బుల కేసి చూసే అమాయకపు రైతు ఎదురు చూపులను "వానకురిస్తే" కథలోనూ, వానలు కురవక, పంటలు పండక, అప్పుల భారం భరింపలేక, తాను నమ్ముకున్న నేల తన్ను దగాచేస్తే దాన్ని తెగ నమ్ముకున్న నిస్సహాయ రైతు వేదనను, 'నమ్ముకున్న నేల' కథలోనూ చూడవచ్చు. మడికి తడిపెట్టడానికి నీళ్లుచాలక, అత్యవసర పరిస్థితుల్లో అప్పటికప్పుడు అప్పుచేసి, బోరు వేయిస్తే నీళ్లకు బదులు బండపడి, విలవిలలాడిపోయిన, చిన్నకారు రైతు దయనీయ స్థితిని సింగమనేని నారాయణ రాసిన 'బి' కథలో గమనించవచ్చు. కరవు కరాళ దంష్ట్రలకు చిక్కి, మేపటానికి గడ్డి లేక పశువులను కసాయి వాళ్లకు అమ్ముకున్న బీభత్సాన్ని చక్రవేణు 'కసాయి కరువు' లో దర్శించవచ్చు.

రాయలసీమ రైతుకు పండే పంటలు అంతంతమాత్రం! తీరా దాన్ని అమ్మబోతే ఎలాంటి మోసానికి, దోపిడీకి గురౌతున్నాడో తెలియచెప్పే కథలు కూడా ఈ దశలోనే వచ్చాయి.

శాంతినారాయణ రాసిన 'దళారీ', సింగమనేని రాసిన అడుసులాంటివి ఇందుకు మంచి ఉదాహరణలు.

శాంతి నారాయణ "దళారీ" కథలో ఒక మధ్య తరగతి రైతు తాను పండించిన ఉల్లిగడ్డలను మార్కెట్ కు తోలితే మార్కెట్ వ్యాపారులు, లారీబ్రోకర్ ఆఫీసువాళ్లు, ఒక పద్ధతి ప్రకారం ఎలా దగాచేస్తారో "ఔరా! ఎంతమోసం" అనిపించే తీరులో చాలా సహజంగా చెబుతాడు. పండించిన చీనీకాయలకు గిట్టుబాటు ధర లభించకపోగా మార్కెట్ మాయాజాలంలో చిక్కుకుపోయిన రైతు నిరాశానిస్పృహలకు లోనై, తాను పెంచి పోషించిన చీనా చెట్లను తానే నరికి వేసుకున్న రైతు ఆత్మవిధ్వంస గాథను సింగమనేని 'అడుసు' కథలో అక్షరీకరిస్తాడు.

ఇంకా రాయలసీమ రైతు అంతరంగాన్నీ, అతనికి భూమితోగల అనుబంధాన్నీ, అతడి జీవనవిన్యాసాన్నీ, ఆలోచనావిధానాన్ని ఆవిష్కరించిన కథలు వర్తమాన దశాబ్దంలో చాలానే వచ్చాయి. దేవపుత్ర 'మన్నుతిన్న మనిషి' పులికంటి 'బంగారు సంకెళ్ళు', డా. లంకిపల్లె 'జీవనం', కేతు విశ్వనాథరెడ్డి 'గడ్డి', సన్నపురెడ్డి 'కొత్తదుప్పటి', స్వామి 'వానరాలే' – ఇలా ఎన్నయిన ఉదాహరించవచ్చురాయలసీమ రైతు జీవన సంచలనాల్ని చిత్రించిన 18 మంది కథకుల కథలు గల 'సీమకథలు' సంకలనం ఈ దశలోనే వెలువడింది. రాయలసీమ కథకులలో రచనా వ్యాసంగం చేబట్టిన ప్రారంభదినాల నుండీ, రాయలసీమ సామాజిక మూలాల్ని ప్రత్యేక సాంస్కృతిక లక్షణాలనూ, విడవకుండా తన కథల్లో చిత్రిస్తూ వస్తున్న కథకుడు కేతు విశ్వనాథరెడ్డి. గడ్డుజీవన వాస్తవికతలను తన కథల్లో ప్రతిభావంతంగా ఆవిష్కరించటం ఆయన ప్రత్యేకత! పల్లెపట్టులను గురించి రాసినా, పట్టణ జీవితాన్ని గురించి రాసినా, నగర నాగరికతల్ని గురించి రాసినా వాటి మూలాలు, వేర్లు పల్లెపట్టుల్లోనూ దాగి వుండటం విశ్వనాథరెడ్డి కథల్లోని విశిష్టత! గ్రామీణ జీవనం పట్ల, రైతాంగం పట్ల, ఆర్తితో, అనుకంపనతో రాసిన ఎందరో కథకులు ఈ దశలో పుట్టుకు రావటం విచిత్రం! రైతాంగం గ్రామీణ జీవనం, వస్తువుగా అసంఖ్యాకమైన కథలు రాయలసీమ నుండే ఎక్కువగా రావటంలోని వర్తమాన చారిత్రక సందర్భాన్ని ప్రత్యేకంగా గమనించాల్సి వుంది.

ఈ చిత్రణంతా ఒక కోణం అయితే, మరోకోణం రాయలసీమలోని ముఠాకక్షలూ, ఫ్యాక్షనిజం, హింసా రాజకీయాలు! అవి జనజీవితంలో సృష్టిస్తున్న అలజడీ, సంక్షోభమూ! వీటిని కథల్లో చిత్రించటానికి సామాన్యమైన అనుభవమూ, ప్రతిభా చాలదు. రాయలసీమ రచయితలు చాలామంది పల్లెపట్టుల నుండీ వచ్చినవాళ్లు! ముఖ్యంగా శ్రమజీవన సంస్కృతితో సంబంధం వున్నవాళ్లు! గ్రామీణ జీవనమూలాలు వాళ్లకు తెలుసు! చాపకింద నీరులా పరుచుకుంటున్న ఫ్యాక్షనిజం గ్రామీణ జీవితాన్ని ఎలా కల్లోల పరుస్తున్నదీ, జాగ్రత్తగా అధ్యయనం చేసినవాళ్లు! దీనికి తోడు ఒక స్పష్టమైన ప్రాపంచిక దృక్పథం వాళ్లకుంది. అందుకే వర్తమాన దశాబ్దంలో ఈ సామాజిక చిత్రాన్ని ప్రదర్శించే చక్కటి కథలు రాసి తమ ఆందోళనను వ్యక్తం చేయగలిగారు. చాలావాస్తవికంగా,

ISSN No.2319-3905

ఎక్కడా మెలో్ద్రామా లాంటిది కన్పించకుండా రాయలసీమ ముఠా కక్షల్నీ, అందుకు గల కారణాల్నీ, తమ కథల్లో నేర్పుగా విశ్లేషించ గలిగారు.

తొలితరం కథకులైన వై.సి.వి.రెడ్డి, కేతు విశ్వనాథరెడ్డి గార్లు రెండు దశాబ్దాల కిందటే రాయలసీమ ముఠాకక్షల నేపథ్యంలో రాసిన కథలు గమనించదగ్గవి. వై.సి.వి.రెడ్డి 'ఐదు రూపాయలు' కథలోనూ, విశ్వనాథరెడ్డి 'కూలిన బురుజుకథలోనూ ఈ ఛాయలు మనం చూడవచ్చు.

ముఖ్యంగా కడపజిల్లా ఈ ఫ్యాక్షన్కు పెట్టింది పేరు. కడప అంటేనే రాష్ట్రంలో చాలా ప్రాంతాల వాళ్ళకు బాంబులే గుర్తుకు వస్తాయి. ఒక కుటీర పరిశ్రమగా బాంబుల తయారీ కడపజిల్లాలో విస్తరించిందంటే అతిశయోక్తి మాత్రం కాదు. సామాజిక ఆధిపత్యం కోసం జరిగే పోరులో ఒక కులం ఆ జిల్లాలో ఫ్యాక్షన్కు కేంద్రమైంది. కడపజిల్లా కథకులు ఈ ముఠా కక్షల్ని కేవలం ఒక స్టంటు కథగా చిత్రించిన వాళ్ళుకాదు. అందుకు గల ఆర్థిక, రాజకీయ సామాజిక కారణాలను కూడా తమ కథల్లో వివరించే ప్రయత్నం చేయటం ఆ కథకుల విశిష్టత.

పాలగిరి విశ్వప్రసాద్ రాసిన "కరువూ వచ్చె – కచ్చులూ వచ్చె" కథ కడప– జిల్లాలోని గ్రామ కక్షలకు సాక్ష్యమిచ్చే కథ! వర్షాలు లేక ఒక పక్క పైర్లు ఎండిపోతూ వుంటే, ఆ ఎండిన పైరును మరో ప్రక్క దొంగగొడ్లు మేయటానికి ప్రయత్నిస్తూ వుంటాయి. కనీసం ఆపైరునైనా రక్షించుకోవటానికి గ్రామస్తులు కాపలా ఏర్పాటు చేసుకోవాలను కుంటారు. అందుకోసం ఒక సమావేశం ఏర్పాటు చేసుకుంటారు. గ్రామస్థులు. ఆగ్రామం మొదటి నుండీ కక్షలకు నిలయం! అందరూ కలిసి ఏర్పాటు చేసుకున్న ఆ సమావేశంలో మాటా మాటా పెరిగి పాతకక్షలు భగ్గుమంటాయి. బాంబులు పేలుతాయి. హత్యలు జరుగుతాయి. కేసులౌతాయి. అసలు సమస్య గాలికిపోయి ఒకర్ని ఒకరు చంపుకోవటమే లక్ష్యంగా చెలరేగుతారు. కక్షలకూ కరువుకూ గల సంబంధాన్ని ఈ కథలో కథకుడు వివరించే ప్రయత్నం చేస్తాడు. ఈ కథ చివర రామిరెడ్డి భార్య వీళ్ల కక్షా రాజకీయాలను అసహ్యించు కుంటూ వేసిన ప్రశ్నల్లో రచయిత కంఠస్వరం వినిపిస్తుంది. జాగ్రత్తగా అధ్యయనం చేయాల్సిన మంచి కథ ఇది

దాదాహయత్ రాసిన "సెగమంటలు" పట్టణ జీవితంలోకి విస్తరించిన ముఠా కక్షల్ని చిత్రించిన కథ. ఫ్యాక్టరీ కక్షలు, రాజకీయ కక్షలుగా మారటం, వాటి మధ్య సామాన్య పౌరులు నలిగిపోవటం ఇందులోని ఇతివృత్తం! ఇదే రచయిత రాసిన "ఏటి ఒడ్డున చేపలు" కథలో, పెన్నేటి ఒడ్డున కాపురముంటూ, పెన్నేటిలో కరిబుజ కాయలు పండించుకునే ఒక పేద కుటుంబం, ఆ గ్రామంలోని కక్షల మధ్య అన్యాయంగా ఇరుక్కుపోయి. అక్కడినుండి పారిపోయిన దీన దృశ్యం కనిపిస్తుంది. "వారసత్వం" కథ, తండ్రులనుండీ పిల్లలకు బాంబుల సంస్కృతి వారసత్వంగా ఎలా సంక్రమిస్తుందో చూపెడుతుంది. ఈ మూడు కథల్లో ఫ్యాక్షన్ కారణంగా, అందులో సంబంధమేలేని సామాన్యుల జీవితాలు ఎలా ఛిద్రమైపోతాయో రచయిత చిత్రించాడు. ఇంకా డి.

రామచంద్రరాజు రాసిన "ఏటి దరిమాను" కథలో కూడా ఇలాంటి వాతావరణాన్నే గమనించవచ్చు. పి. రామకృష్ణారెడ్డి రాసిన "ఎలిగే పెద్దోళ్లు– నలిగే సన్నోళ్లు" కథ చాలా స్పష్టంగా కడపజిల్లా ముఠాకక్షల్ని, అందులో బలియైపోతున్న బలహీనవర్గాల ఆక్రోశాన్ని ప్రతిబింబించింది.

అనంతపురం జిల్లాలో ఇటీవలికాలంలో ఫ్యాక్షనిస్టులు సామాజిక శాసనకర్తలుగా మారుతున్న వైనం ఆ జిల్లా జీవితాన్ని జాగ్రత్తగా పరిశీలించిన వారికి అర్థమౌతుంది. ఈ ఫ్యాక్షనిస్టులు తమకు సైన్యంగా ఎలాంటి వర్గాన్ని చేరదీస్తున్నారో స్వామి రాసిన "నడక" కథ హేతుబద్ధంగా వివరిస్తుంది. సోమరితనమూ, వ్యసనాలూ వున్న ఒక వర్గం, ఈ ఫ్యాక్షన్ వలయంలోకి ఎలా ఆకర్షింపబడుతున్నారో ఈ కథ వివరిస్తుంది. ఈ ఫ్యాక్షనిస్టుల్లో ఒక ముఠా తమ కార్యకలాపాలకు విప్లవం రంగు పులుముకోవటం మరీ ఆశ్చర్యమనిపిస్తుంది.

ఫ్యాక్షనిస్టుల వల్ల, వాళ్ల స్వంత కుటుంబాల్లోని స్త్రీలు సైతం ఎలాంటి మానసిక అశాంతికి, సాంఘిక అసౌకర్యానికి గురౌతున్నారో శాంతి నారాయణ రాసిన "గర్భస్రావం" కథలో గమనించవచ్చు. ఈ మధ్యనే కర్నూలు జిల్లా నుండి "ఫ్యాక్షన్ కథలు" అన్న పేరుతో, మూడు కథల చిన్న సంకలనం వచ్చింది. తుమ్మల రామకృష్ణ, శ్రీనివాసమూర్తి, రాప్తాడు గోపాలకృష్ణ రాసిన ఈ కథల్లో, గ్రామీణ వాతావరణంలో కుటుంబ సంబంధాలలో ఎలాంటి అవాంఛనీయ ధోరణులు, ఈ ఫ్యాక్షనిజం కారణంగా విస్తరిస్తున్నాయో మనం చూడవచ్చు. ఇటీవలే వచ్చిన మధురాంతకం రాజారాంగారి "గాలివీడు నుండీ న్యూయార్క్ దాకా" అన్న కథ చిత్తూరు జిల్లా ఫ్యాక్షనిజం నేపథ్యంలో రమణీయంగా నడచిన కథ.

రాయలసీమ ప్రత్యేక సామాజిక అంశాలతో కథలు రాసిన వారిలో ప్రత్యేకించి చెప్పుకోదగ్గ మంచి రచయిత "నామిని". ఆత్మకథా మాలికలుగా నామిని ఈ కథాచిత్రాలు చిత్రించినప్పటికీ, కథా శిల్పానికి అతని కథలు ఒదగక పోయినప్పటికీ, చిత్తూరు జిల్లా గ్రామీణ జీవనంలోని, శ్రమజీవన సౌందర్యమూ, ఆ ప్రాంతపు విశిష్ట జానపద సంస్కృతీ సౌరభమూ, కళాత్మకమైన నిర్మాణంలో, పాఠకుణ్ణి ముగ్ధుణ్ణి చేస్తాయి. ఇంకా పులికంటి కృష్ణారెడ్డి, వీరపల్లె వీణావాణి, మహేంద్ర, నరేంద్ర, వి.ఆర్.రాసాని, డా. లంకిపల్లె రాసిన కథల్లో స్థలకాలాల చైతన్యాల్ని మనం గమనించవచ్చు. నరేంద్ర రాసిన 'అత్యాచారం, కాకులూ గ్రద్దలూ, నాలుగు కాళ్ళ మంటపం' కథలూ, మహేంద్ర రాసిన 'ముసలమ్మ మరణం, జర్తె కథలూ', ఆ ప్రాంతపు జీవితాన్ని పాఠకుడి ముందు పరుస్తాయి. డా. లంకిపల్లె రాసిన కథలన్నీ కూడా వ్యావసాయిక జీవితానికి సంబంధించినవే కావటం ఒక విశేషం.

దళిత వాదం తెలుగు కథా సాహిత్యంలో వేరూనుకుంటున్న ఈ దశలోనే, రాయలసీమ నుండి ఈ ధోరణితో ప్రత్యేక ప్రాదేశిక లక్షణాల నేపథ్యంలో, మంచి దళిత కథలు పుట్టుకొచ్చాయి. కేవలం వాదం కోసం అల్లిన కథలుగా కాకుండా సామాజిక మూలాల నుండి త్రవ్వి తీసిన

కథలు గావటం వీటి ప్రత్యేకత. మాల మాదిగల శ్రమ జీవన మూలాల నుండే, అగ్రవర్ణాల ఆస్తులూ, ఆరోగ్యమూ అభివృద్ధి చెందుతున్నాయని సన్నపురెడ్డి 'చనుబాలు' కథలో, వర్తమాన గ్రామజీవిత నేపథ్యంలో వివరిస్తాడు. బి.సి.లను కూడా దళితులుగా సంభావించటంలోని ఔచిత్యాన్ని ధ్వని పూర్వకంగా ప్రశ్నిస్తుంది స్వామి రాసిన 'ప్రశాంతం' కథ... ఒక హరిజనుడు మంత్రి అయినప్పటికీ అగ్రవర్ణాల చెప్పుచేతల్లో ఉండటంలోని అనివార్యతను నిరూపిస్తుంది. 'శాంతినారాయణ 'ఉక్కుపాదం' కథ... రాయలసీమ పల్లెల్లో హరిజనులకు ఇప్పటికీ దేవాలయ ప్రవేశం జరగటంలో అస్పృశ్యతను అగ్రవర్ణాలు పాటించటాన్ని వివరిస్తుంది. సింగమనేని 'మకర ముఖం' కథ. ఇంకా దేవపుత్ర రాసిన 'విలోమం, ఔషధం, సమిధలు' కథలూ, స్వామి రాసిన 'తల్లిమట్టి, ఒక హెచ్. సరస్వతి' కథలూ, సన్నపురెడ్డి అంటు, పాలగిరి విశ్వప్రసాద్ 'చెప్పుకింద పూలు', దాదాహయత్ 'ఎల్లువ' పేర్కొన దగ్గ మంచి కథలు. ఈ మధ్యనే వచ్చిన నాగప్పగారి సుందరరాజు రాసిన 'మాదిగోడు' కథలు ప్రత్యేకంగా పరిశీలించాల్సిన చక్కని కథలు. కర్నూలు జిల్లాలోని ఒక గ్రామీణ ప్రాంతపు మాదిగల జీవితాల్నిఆత్మీయంగా, కళాత్మకంగా ఆవిష్కరించిన ఆత్మకథా చిత్రమాలికలు అవి! రాయలసీమ నుండి వచ్చిన దళిత కథలన్నీ కూడా నిర్దిష్ట స్థల కాలాలతో ముడిపడి వుండటం గమనార్హం.... ఒక వాదం పట్ల ప్రచార దృష్టిలేకుండా, వాస్తవికతా పునాదులతో, కళాత్మకతకు భంగం కలుగకుండా ఈ కథలు వుండటం వాటి గొప్పతనం.

రాయలసీమ కథలకు నేడు తెలుగు కథాసాహిత్యంలో ఒక ఆమోదయోగ్యమైన విశిష్ట స్థానం ఉన్నది. రాయలసీమ కథకులందరూ మట్టి వాసనను అనుభవించిన వారు. నేలమీద పాదాలు మోపి నడుస్తున్నవాళ్లు, అతివాద ధోరణులకూ అవాస్తవిక చిత్రణలకూ, కేవల కాల్పనిక సృజనకూ అలవాటుపడినవాళ్లుకారు. ఇక్కడ కథారచన వ్యాపారమయం కాలేదు. ఏ పత్రిక స్వభావానికి తగిన విధంగా ఆ పత్రికకు కథలు రాసి పంపే వెర్రిపీనుగులు కారు. సామాజిక సంస్కారతృష్ణ కలిగినవారు. వస్తువువల్ల మాత్రమేకాదు, కళాత్మకంగా, విశ్వసనీయత లోపించకుండా, క్లుప్తత పాటిస్తూ, సంయమనంగా, కథలు రాయటం వల్లనే రాయలసీమ కథను పాఠకులూ, విమర్శకులూ ఆహ్వానిస్తున్నారు.

రాయలసీమ కథకులు స్పృశింపని సామాజిక రంగాలు కొన్ని మిగిలి వున్నాయి. పారిశ్రామిక రంగం గురించీ, రాజకీయరంగం గురించీ ఇక్కడి కథకులు కథా రచనను ఇంకా ప్రారంభించవలసి ఉంది. ఇంకా స్పష్టమైన కంఠస్వరాన్ని వర్తమానంలో రాస్తున్న యువకథకులు సాధించాల్సి వుంది. సామాజిక వాస్తవికతకు దూరం కాకుండా తెలుగు కథాసాహిత్యాన్ని సుసంపన్నం చేయటంలో రాయలసీమ కథకుల పాత్ర ఎంతో విస్పష్టమైనదీ, విశాలమైనదీ!

ఆధార గ్రంధాలు

సంప్రదించిన వ్యాసాలు:

1. ఈనాటి కడప జిల్లా సాహిత్యం – స్థూల రేఖలు – రాచమల్లు రామచంద్రారెడ్డి
2. రాయలసీమ సాహిత్యం–సామాజిక ఆర్థిక విశ్లేషణ – వల్లంపాటి వెంకట సుబ్బయ్య

13

సాంప్రదాయిక – ఆధునిక కవితా రూప సమ్మేళనం "మణిపూసలు"

– డా.ఎం.మంజుశ్రీ

పరిచయం:

తెలుగు కవిత్వ చరిత్రలో ఎప్పటికప్పుడు నూతన కవితా రూపాలు, ప్రక్రియలు ఆవిష్కృతమవుతూనే ఉన్నాయి. తెలుగులో 'మినీ కవిత' అనేది ఒక స్వేచ్ఛాయుతమైన లఘు కవితా రూపం (short poetry form). హైకూ (Haiku): మూడు పాదాలలో ఉండే జపాన్ కవితా రూపం తెలుగులోకి వచ్చింది. నానీలు, రెక్కలు, నానోలు మొదలైనవన్నీ ఈ లఘుకవితారూపాలకు ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. ఈ లఘు కవితా రూపాలకు కొన్ని లక్షణాలున్నాయి. లఘు కవితా రూపం ఏదైనా దానికి సంక్షిప్తత (Conciseness) ముఖ్యం. మణిపూసలు కవితా రూపంలో సంప్రదాయ ఛందో పద్యంలా కాకుండా లయ ప్రధానంగా కనిపిస్తుంది. అయితే మాత్రా ఛందస్సులో ఉండాలి. అవి సంప్రదాయ, ఆధునిక కవితాలక్షణాల సమ్మేళనంగా కనిపిస్తుంది. తక్కువ పాదాలలో అంటే నాలుగు పాదాలలో (సాధారణంగా 4 నుండి 10 లైన్ల లోపు) ఒక భావాన్ని, ఆలోచనను లేదా సంఘటనను సూటిగా, స్పష్టంగా వ్యక్తం చేయడం. స్పష్టత, సూటిదనం (Clarity and Directness) చెప్పాలి. చెప్పదలుచుకున్న విషయాన్ని ఎలాంటి సంక్లిష్టత లేకుండా సూటిగా చెప్పడం. వ్యంగ్యం లేదా గాఢమైన భావం (Satire or Deep Meaning) అంటే, చాలాసార్లు సామాజిక సమస్యలను, అన్యాయాలను వ్యంగ్యంగా లేదా హృదయాన్ని తాకే గాఢమైన భావంతో వ్యక్తం చేయడానికి దీనిని ఉపయోగిస్తారు. ఈ ప్రయోగాలలో భాగంగా, కవి వడిచర్ల సత్యం గారు 2018 ఏప్రిల్ 26న 'మణిపూసలు' అనే ఒక నూతన కవితా రూపానికి శ్రీకారం చుట్టారు. అయితే గతంలో (1976) నాటికే 'మణిపూసలు' పేరుతో ఒక పుస్తకం వెలువడింది. దానిలో 'ఏర్చి కూర్చిన సూక్తులు, లోకోక్తుల'ను మణిపూసలు పేరుతో మన్నవ గిరిధరరావుగారు 1976లో ఒక సంకలనంగా తీసుకొచ్చారు. కానీ వడిచర్ల

సత్యం గారు రూపొందించిన 'మణిపూసలు' ఒక ఆధునిక వచనకవితారూపం. ఇది ప్రవేశపెట్టిన కొద్ది కాలంలోనే వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వంటి వాటిలో స్థానం సంపాదించి, విస్తృతమైన కవిసమూహాన్ని ఆకర్షించడం ఈ ప్రక్రియ సాధించిన అపూర్వ విజయాన్ని సూచిస్తుంది. ఈ పరిశోధన పత్రం మణిపూసల కవితా రూపం యొక్క నిర్మాణ శిల్పం (Form and Structure), దానిలోని భావ వైచిత్ర్యం (Thematic Diversity), వడిచర్ల సత్యం గారి కవిత్వ తత్వం (PoeticPhilosophy)పైదృష్టి సారిస్తుంది.

మణిపూసల నిర్మాణ శిల్పం:

వడిచర్ల సత్యం గారు రూపొందించిన మణిపూసలు ప్రక్రియ, సంప్రదాయ ఛందస్సు, ఆధునిక వచన కవిత్వం రెండింటి లక్షణాలను సమన్వయపరిచిన 'లఘు కావ్య రూపం'గా నిలుస్తుంది. మణిపూసలు నాలుగు పాదాలు (వాక్యాలు) కలిగిన చిన్న ఖండిక.

ప్రాస మరియు లయ నియమం:

1, 2, మరియు 4వ పాదాలకు అంత్యానుప్రాస తప్పనిసరి. ఇది కవిత్వానికి ఒక శ్రావ్యమైన లయబద్ధతను (Rhythm) అందించి, పాఠకుడికి సులభంగా గుర్తుండేలా చేస్తుంది.? 3వ పాదానికి అంత్యానుప్రాస నియమం లేదు.

మాత్రా నియమం (Metrical Rule):

1, 2, మరియు 4వ పాదాలలో 10 నుండి 12 మాత్రల సంఖ్యను కవి ఎంచుకోవాలి. లఘువు (l) ను ఒక మాత్రగా, గురువు (^{U}) ను రెండు మాత్రలుగా లెక్కిస్తారు. 3వ పాదంలో మాత్రల సంఖ్య 10–12 మధ్య ఎన్నైనా ఉండవచ్చు (కొంత వెసులుబాటు ఉంది).

భావ లక్షణం (Thematic Feature):

చివరి రెండు పాదాల్లో (3, 4) ఒక చమత్కారం లేదా 'కవితా మెరుపు' ఉండటం దీని ప్రధాన లక్షణం. ఈ లక్షణం మణిపూసలను కేవలం నాలుగు వాక్యాల కూర్పుగా కాకుండా, ఒక ముక్తకంగా, సూక్తిగా నిలబెడుతుంది. పైన పేర్కొన్న నియమాల వల్ల మణిపూసలు గురజాడ ముత్యాల సరాల మాదిరిగా సాంప్రదాయిక – ఆధునిక కవితా రూప సమ్మేళనంగా పరిగణించవచ్చు.

'వెయ్యి మణిపూసలు' కావ్యం పేరుతో సత్యంగారు ఒక బృహద్గ్రంథాన్ని ప్రచురించారు. దీనిలో భావ వైవిధ్యాన్ని ఈ వ్యాసంలో వివరిస్తాను. వడిచర్ల సత్యం గారి 'వెయ్యి మణిపూసలు' కావ్యం కేవలం కవితా సంపుటిలో వివిధ సామాజిక, తాత్విక అంశాలను స్పృశించిన ఒక బహుముఖ దృక్కోణ కావ్యంగా దర్శనమిస్తుంది.

1. భారతీయ కుటుంబ వ్యవస్థ, నైతిక విలువలు

మాతృత్వ ఔన్నత్యం: 'అమ్మ' గురించి రాసిన మణిపూసల్లో మాతృత్వాన్ని విశ్వప్రేమకు చిహ్నంగా, భూమిపైన అత్యున్నతమైన బంధంగా కవి ప్రతిష్ఠించాడు:

భూమి మీద మిన్నగా

యేది లేదు యెన్నగా

కనిపించేవన్ని గూడ

అమ్మ ముందు చిన్నగా

ఈ నాలుగు పాదాల కవిత మాతృమూర్తి గొప్పదనాన్ని తెలియజేస్తుంది. ఈ భూమిపై వెలకట్టలేనిది, అత్యంత విలువైనది ఏదీ లేదు కనిపించే గొప్ప విషయాలన్నీ కూడా 'అమ్మ' ముందు చిన్నబోతాయి అని కవి స్పష్టం చేస్తున్నారు. కవితలో ఉపయోగించిన పదాలు చాలా సులభంగా, తేలికగా అర్థమవుతాయి. అమ్మ గొప్పదనాన్ని సూటిగా చెప్పడం ద్వారా పాఠకుల హృదయాలను వెంటనే తాకుతుంది.ప్రతి పాదం చివర ఒకే విధమైన ప్రాస (మిన్నగా, యెన్నగా, గూడ, చిన్నగా) ఉండటం వల్ల చదవడానికి ఒక చక్కటి లయ ఏర్పడింది. ఇది మినీ కవితకు ఒక ఆకర్షణను ఇస్తుంది.తల్లి ప్రేమ అనేది దేశ, కాలాలతో సంబంధం లేకుండా ప్రపంచం మొత్తం ఒకే విధంగా ఉంటుంది. ఈ కవిత ఆ సార్వజనీన సత్యాన్ని చాటి చెబుతుంది. ఇటువంటి లక్షణాలే మిగతా మణిపూసలులో కూడా కనిపిస్తున్నాయి.

పితృప్రేమ: 'నాన్న' పై వర్ణించిన 42 మణిపూసలు ఆయన శ్రమ, బాధ్యతలను ఒక "లఘు కావ్యం"లా ఏకసూత్రతతో వ్యక్తం చేస్తాయి. ఇక్కడ తండ్రి జననం బిడ్డ కోసమే అనే భావోద్వేగ సత్యాన్ని కవి ప్రదర్శించాడు.

తన కలలే నా కోసం

ఊహలన్నీ నా కోసం

నా కన్న ముందు

నాన్న పుట్టిందే నా కోసం!

ఈ మినీ కవిత తండ్రి త్యాగం, ప్రేమపై కేంద్రీకృతమై ఉంది.కవి తన తండ్రి జీవితంలో చూసిన కలలు, అల్లిన ఊహలు అన్నీ కేవలం తన బిడ్డ భవిష్యత్తు కోసమేనని ఉద్వేగంగా ప్రకటిస్తున్నారు.తండ్రి తన ఆశలు, వ్యక్తిగత కోరికల కంటే బిడ్డ క్షేమానికే ప్రథమ స్థానం ఇచ్చాడనే గాఢమైన భావాన్ని ఇది సూచిస్తుంది. "నా కన్న ముందు నాన్న పుట్టిందే నా కోసం!" అనే వాక్యం ద్వారా, తండ్రి ఉనికి, జీవిత లక్ష్యం మొత్తం బిడ్డ జీవితానికి మార్గం సుగమం చేయడం కోసమే అనే అద్వితీయమైన భావనను కవి శక్తిమంతంగా వ్యక్తం చేశారు.

"పెళ్లంటే శుభకార్యం

నవసృష్టికి యనివార్యం

దంపతుల మధ్య నెపుడు

జరుగకూడదే చౌర్యం! " (భార్యాభర్తల బంధం)

పెళ్లి అనేది కేవలం ఒక వేడుక మాత్రమే కాదని, అది కొత్త జీవితం (నవసృష్టి) ఆరంభానికి, మానవ సమాజ పురోగతికి తప్పనిసరి (అనివార్యం) అయిన శుభకార్యమని మొదటి రెండు పాదాలు పేర్కొంటున్నాయి.మూడవ, నాల్గవ పాదాలలో కవి వివాహ బంధం యొక్క నైతిక విలువను స్పృశించారు. భార్యాభర్తల మధ్య ఎప్పుడూ చౌర్యం (దొంగతనం) జరగకూడదని సందేశం ఇచ్చారు.ఇక్కడ 'చౌర్యం' అంటే కేవలం వస్తువుల దొంగతనం కాదు, నమ్మకాన్ని, ప్రేమను, విధేయతను, వ్యక్తిగత స్వేచ్ఛను దొంగిలించడం (లేదా ద్రోహం చేయడం) అని లోతైన అర్థం స్ఫురిస్తుంది. ఈ కవిత వివాహం అనేది పరస్పర నమ్మకం (Trust) విశ్వసనీయత (Fidelity)పై ఆధారపడి ఉండాలని, అదే ఆ బంధానికి నిజమైన పునాది అని నొక్కి చెబుతుంది.

"గురువంటే సూర్యుడు

సిరివెన్నెల చంద్రుడు

వేదాలను జగతికిడిన

దైవరూప – వ్యాసుడు!"

కవిత యొక్క వస్తువు గురువు యొక్క అపారమైన గొప్పదనం మరియు సమాజంలో వారి అత్యున్నత స్థానం. గురువును జ్ఞాన ప్రదాతగా, అంధకారాన్ని తొలగించే శక్తిగా వర్ణించారు.గురువును సూర్యుడు (తేజస్సు, జ్ఞానం), సిరివెన్నెల చంద్రుడు (శీతలం, ప్రశాంతత, అజ్ఞాన తిమిరాన్ని పోగొట్టేవాడు) వంటి అద్భుతమైన ఉపమానాలతో పోల్చడం ద్వారా శిల్పాన్ని తీర్చిదిద్దారు. గురు స్థానాన్ని వేదాలను ప్రపంచానికి అందించిన వేదవ్యాసుడు వంటి దైవ స్వరూపంతో పోల్చడం ద్వారా, జ్ఞానదానం చేసే ప్రతి గురువు కూడా దైవంతో సమానమే అనే శక్తివంతమైన సందేశాన్ని ఇచ్చారు.సులభమైన పదాలు, చక్కటి అంత్యప్రాస (సూర్యుడు, చంద్రుడు, వ్యాసుడు) ఉపయోగించడం వలన కవితకు ఒక ఆకర్షణీయమైన లయ, గేయతత్వం (Musicality) ఏర్పడింది.భారతీయ ధార్మిక విలువలకు మూలస్తంభాలైన అమ్మ, నాన్న, గురువు మరియు దాంపత్య బంధాలపై రాసిన ఈ కవితలు, త్యాగం, విశ్వాసం, గౌరవం వంటి పవిత్రమైన బంధాల ప్రాధాన్యతను చాటి చెబుతున్నాయి. తల్లి ప్రేమను భూమిపై దేనితో పోల్చలేనంత గొప్పదిగా, తండ్రి తన జీవిత లక్ష్యాన్ని బిడ్డ భవిష్యత్తుకే అంకితం చేసే నిస్వార్థ ధర్మాన్ని ఇవి ప్రస్ఫుటం చేస్తాయి. గురువును జ్ఞాన ప్రదాతగా, అజ్ఞాన తిమిరాన్ని తొలగించే దైవ స్వరూపంగా అత్యున్నత స్థానంలో ఉంచడం, మరియు దాంపత్యంలో నమ్మకాన్ని దొంగిలించకుండా (చౌర్యం) పవిత్రతను కాపాడుకోవడం ఈ ధార్మిక జీవన విధానంలో భాగం. ఈ మినీ కవితలు ఆధునిక రూపంలో ఉన్నా, వాటిలో ప్రతిబింబించే నైతిక, కుటుంబ విలువలే భారతీయ సంస్కృతికి వెన్నెముకగా నిలుస్తాయి. గురువును జ్ఞాన ప్రదాతగా, సూర్యుడు, చంద్రుడు, వ్యాసుడు వంటి దివ్య ప్రతీకలుగా

అభివర్ణించడం భారతీయ సంస్కృతికి కవి ఇచ్చిన గౌరవాన్ని తెలుపుతుంది. పుస్తకాలను జ్ఞానదేవతగా, విజయ శిఖరానికి నడిపించే నిజదేవతగా కీర్తించాడు.

2. సామాజిక స్పృహ మరియు దేశభక్తి:

దేశభక్తి అంటే కేవలం జాతీయ పండుగల రోజున జెండా ఎగరేయడం లేదా యుద్ధంలో పాల్గొనడం మాత్రమే కాదు ఇది ఒక భావన (Emotion) బాధ్యత (Responsibility). దేశభక్తిని ఈ విధంగా నిర్వచించవచ్చు: తన దేశం యొక్క సంస్కృతి, చరిత్ర, ప్రజలు మరియు వారసత్వం పట్ల లోతైన ప్రేమ, గౌరవం కలిగి ఉండటం. దేశాభివృద్ధికి, శ్రేయస్సుకు, పురోగతికి తన వంతుగా కృషి చేయాలనే నిబద్ధత కలిగి ఉండటం దేశభక్తిలో భాగం అవుతుంది. దేశ చట్టాలను గౌరవించడం, పన్నులు సక్రమంగా చెల్లించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, సామాజిక బాధ్యతతో మెలగడం, దేశం కష్టాల్లో ఉన్నప్పుడు, అవసరమైతే, తన వ్యక్తిగత ఆసక్తులు, సుఖాలు లేదా జీవితాన్ని కూడా త్యాగం చేయడానికి సిద్ధంగా ఉండటం కూడా దేశభక్తిని నిదర్శనంగానే భావించాలి. సాధారణంగా, దేశభక్తి అనేది "నా దేశాన్ని నేను ప్రేమిస్తున్నాను" అనే భావన నుండి "నా దేశం కోసం నేను ఏమి చేయగలను" అనే ఆచరణాత్మక కార్యాచరణ వైపు మారుతుంది.

"జైజవానె మన రాముడు

జైజవానె మన కృష్ణుడు

దేశాన్ని రక్షించే

జై జవాన్ మన ఈశుడు!"

' దేశం కోసం జవాన్'లో కవి దేశభక్తిని మానవ సేవతో సమానంగా భావించాడు. రాముడు, కృష్ణుడు, ఈశుడు వంటి చిహ్నాల ద్వారా జవాన్‌కి దైవత్వాన్ని ఇచ్చాడు.

'మానవత్వం' ఖండికలో నిజాయితీ, ప్రేమ, సాయ భావం వంటి నైతిక మూల్యాలను మానవతా ధర్మంగా ప్రతిపాదించాడు.

"ప్రేమసుధను పంచడం

నిజమును మాట్లాడడం

మానవత్వమౌను కదా

సాయమునందించడం!" ఈ కవితా ఖండికలు ('దేశం కోసం జవాన్' మరియు 'మానవత్వం') ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉన్న భారతీయ దేశభక్తి యొక్క విస్తృతమైన, ఉన్నతమైన కోణాన్ని తెలియజేస్తుంది.

భిన్నత్వంలో ఏకత్వం – భాష– సంస్కృతి:

తన తెలుగు భాష గొప్పదనాన్ని చెబుతూనే ఇతర భాషలలో సంస్కృతిని గౌరవించాలని కోరాడు.

కంటివెలుగు తెలుగు భాష

కథలవెలుగు తెలుగు భాష

కవిరాజులు కీర్తించిన

కవితవెలుగు తెలుగు భాష (మధురమైనది మాతృభాష)

తెలుగు భాష గొప్పదనాన్ని కవి కీర్తించినప్పటికీ, "ఇతర భాషలలో సంస్కృతిని గౌరవించాలని" కోరారు. ఇది భారతదేశంలో ఉన్న భాషా భిన్నత్వాన్ని (Linguistic Diversity) అంగీకరించి, ప్రతి సంస్కృతిని, భాషను గౌరవించాలని చెప్పే సమైక్యతా సూత్రం (Principle of Unity). అన్ని భాషలూ సమాన గౌరవాన్ని, ప్రాధాన్యతను కలిగి ఉండటం భిన్నత్వంలో ఏకత్వానికి చిహ్నం. "కులమతాలు కావు గొప్ప, విజ్ఞానమె యిలను గొప్ప" అనే వాక్యం, మన దేశంలోని కుల, మత భిన్నత్వాల కంటే విజ్ఞానం (Knowledge) మరియు నైతికత (Moral Values) అనేవి అత్యంత ముఖ్యమని చెబుతోంది. భారతదేశంలో వేల సంఖ్యలో ఉన్న మతాలు, కులాలకు అతీతంగా, పౌరులందరినీ కలిపే మానవత్వం (Humanity) అనే ఏకైక బంధం ఉండాలని ఇది ప్రబోధిస్తుంది.

మహిళను చెరబట్టుదేంది?

నగ్నంగా తిప్పుదేంది?

ఆటవికపు చేష్టలకు

ఆజ్యమింక పోసుదేంది? (మణిపూ(ర్)లు)

4.5.2023 న మణిపూర్ లో ఇద్దరు మహిళలను వివస్త్రలను చేసిన చర్యను ఖండిస్తూ కొన్ని మణిపూసలు వర్ణించాడు కవి. దీని ద్వారా, జాతులు లేదా ప్రాంతాల మధ్య ఎన్ని భిన్నభిప్రాయాలు, ఘర్షణలు ఉన్నప్పటికీ... మహిళల పట్ల గౌరవం మరియు శాంతిభద్రతలు అనేవి ఏ జాతికీ, ఏ ప్రాంతానికీ పరిమితం కాని జాతీయ విలువలు అని కవి స్పష్టం చేశారు. ఆటవిక చర్యలను ఖండించడం, మానవతా ధర్మాన్ని కాపాడడమే దేశంలోని అన్ని భిన్న వర్గాల ఉమ్మడి లక్ష్యం కావాలని తెలియజేస్తుంది. భారతీయ సమైక్యత అనేది కేవలం రాజకీయ సరిహద్దులకే పరిమితం కాదు. ప్రేమ, నిజాయితీ, సాయం (మానవత్వం) అనే అంతర్గత విలువలతో, ప్రతి భాష, సంస్కృతిని గౌరవించడం ద్వారానే భిన్నత్వంలో ఏకత్వం బలంగా నిలబడుతుంది. సంఘర్షణలు (మణిపూర్) ఉన్నప్పుడు కూడా, మానవతా విలువలు మనుగడ సాగించాలనే తపన ఈ కవితలలో స్పష్టంగా కనిపిస్తుంది. మానవత్వం, నీతి: నిజాయితీ, ప్రేమ, సాయ భావం

ISSN No.2319-3905

వంటి నైతిక విలువలను మానవతా ధర్మంగా ప్రతిపాదించారు. దేవుణ్ణి మనిషి హృదయంలో, మమతలో చూడాలని సందేశమిచ్చారు. మణిపూర్ సంఘటనపై స్పందిస్తూ, మహిళపై జరిగిన అరాచకాన్ని ఖండించడం ద్వారా కవి సామాజిక సంఘర్షణలకుబాధ్యతాయుతంగా ప్రతిస్పందించారు.

మహిళను చెరబట్టుడేంది?

నగ్నంగా తిప్పుడేంది?

ఆటవికపు చేష్టలకు

ఆజ్యమింక పోసుడేంది?

'ఓటరన్న తెలుసుకో' ఖండికలో ఓటు విలువను, ప్రజాస్వామ్య చైతన్యాన్ని పునరుద్ఘాటించి, ఓటును అభివృద్ధి సాధనంగా చూడాలని పిలుపునిచ్చారు.

3. తెలంగాణ సాంస్కృతిక ప్రతీకలు

తెలంగాణ వైభవం: బతుకమ్మ పండుగను 'తెలంగాణ కోవెలలో వెలిసిన' చైతన్యానికి, సంస్కృతికి చిహ్నంగా కీర్తించారు.

నాయకుల స్మరణ: సురవరం ప్రతాపరెడ్డి, దాశరథి, కాళోజీ, జయశంకర్, పీవీ నరసింహారావు వంటి తెలంగాణ దిగ్గజాలను కేవలం వ్యక్తులుగా కాకుండా, తెలంగాణ ఆత్మగౌరవానికి, సాహిత్య శక్తికి ప్రతీకలుగా చిత్రించారు.

మణిపూసల కవిత్వ తత్వం:

భారతీయ, పాశ్చాత్య లాక్షణికులు కవిత్వం ఎలా ఉండాలో తెలిపేఅనేక గ్రంథాలను రచించారు. కవిత్వం కేవలం పదాల కూర్పుగా కాకుండా, పాశ్చాత్యులు చెప్పినట్లుగా సహజమైన భావోద్వేగాల ప్రవాహంగా ఉంటూ, భారతీయుల సిద్ధాంతం ప్రకారం పాఠకుడి హృదయంలో రసానందాన్ని (Aesthetic Emotion) కలిగించే ఆత్మగా ఉండాలి. కవిత్వం జీవిత సత్యాన్ని సూటిగా కాకుండా, ధ్వని (Suggested Meaning) ద్వారా లేదా వక్రోక్తి (Oblique Expression) ద్వారా వ్యక్తపరుస్తూ, కల్పనా శక్తితో కూడిన అద్భుతమైన సత్యాన్ని ఆవిష్కరించాలి. అది ఛందస్సు, అలంకారాల ద్వారా గానీ, లయాత్మకంగా గానీ శిల్ప సౌందర్యాన్ని సంతరించుకుని, వినసొంపైన శబ్దంతో గానయోగ్యమైన లయను కలిగి ఉండి, రూపంలోనూ పరిపూర్ణంగా ఉండాలి. కవిత్వం తాత్కాలిక ఆనందాన్ని ఇవ్వడమే కాకుండా, ధర్మ మార్గాన్ని బోధించి, చివరకు పాఠకుడికి జీవిత పరమార్థాన్ని తెలిపే ప్రయోజనాన్ని సాధించాలని ఎన్నో రకాలుగా కవిత్వం గురించి లాక్షణికులు, కవులు తమతమ అభిప్రాయాలను చెప్పారు. అయినా ప్రతి కవిత నా

కవిత్వం గురించి తనకొని లక్షణాలను చెప్తాడు. అలాగే, సత్యం గారు కూడా "కవిత్వమనిపించాలి" పేరుతోకొన్ని లక్షణాలను చెప్పాడు.

'అంతరాత్మ పలికినట్లు

అణువుగుండె పేలినట్లు

కవిత్వ మనిపించాలి

అమృతంప్రవహించినట్లు!" కవిత్వం పట్ల తన అభిప్రాయాలను సుమారు 55 మణిపూసలలో చెప్పాడు కవిత్వం కేవలం పదాల కలయిక మాత్రమే కాదు, అది అనుభూతి, సత్యం మరియు సౌందర్యం యొక్క సమ్మేళనం కావాలని కవి ఈ మణిపూసల ద్వారా తమ ప్రగాఢ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. కవిత్వానికి ఉండాల్సిన అంతర్గత శక్తి, బాహ్య సౌందర్యం అనే రెండు ముఖ్య లక్షణాలను ఈ మణిపూసలు వివరిస్తున్నాయి. ఒక రచనను నిజమైన కవిత్వంగా నిలబెట్టాలంటే, అది సత్యం, శక్తి, మరియు ఆనందం అనే త్రిగుణాలను కలిగి ఉండాలని కవి గట్టిగా విశ్వసిస్తున్నాడు కవి. కవిత్వం కచ్చితంగా "అంతరాత్మ పలికినట్లు" ఉండాలని, అంటే అది కవి హృదయం నుండి నిజాయితీగా, నిష్కపటంగా వెలువడాలని ఆకాంక్షించారు. ఆ కవిత్వం చదివేవారిపై తీవ్రమైన భావోద్వేగ ప్రభావాన్ని చూపాలని, అది "అణువుగుండె పేలినట్లు" ఒక గొప్ప చలనాన్ని, శక్తిని సృష్టించే విధంగా ఉండాలని పేర్కొన్నారు. కవిత్వం "అంతరాత్మ పలికినట్లు" నిజాయితీగా ఉండాలి. "అణువుగుండె పేలినట్లు" శక్తివంతమైన భావోద్వేగ చలనాన్ని సృష్టించాలి. దీన్ని అంతరంగ శక్తి (Sincerity) అంటారు. అంతిమంగా, కవిత్వం మనిషికి తాత్కాలిక సంతోషాన్ని కాక, మానసిక పోషణను అందించాలని, "అమృతం ప్రవహించినట్లు" అది జీవితానికి శాశ్వతమైన విలువను, స్వచ్ఛమైన ఆనందాన్ని ఇవ్వాలని కవిత్వ లక్షణాన్ని నిర్దేశించారు. ఈ లక్షణాలు ఉంటేనే అది నిజమైన కవిత్వంగా నిలుస్తుందని వారి అభిప్రాయం.

కవి సత్యం గారు తన మణిపూసలలో కవిత్వం ఎలా ఉండాలో కొన్ని మణిపూసలలో స్పష్టం చేశారు. ఈ అభిప్రాయాలు ఆయన కవిత్వ సిద్ధాంతాన్ని సూచిస్తాయి.

"వెన్నెలార బోసినట్లు

కోయిలమ్మ కూసినట్లు

కవిత్వ మనిపించాలి

చైత్రమాస మొచ్చినట్లు!" కవిత్వం అందించే బాహ్య సౌందర్యాన్ని, ఆనందాన్ని ప్రకృతిలోని అద్భుత దృశ్యాలతో పోల్చారు. కవిత్వం "వెన్నెలార బోసినట్లు" స్వచ్ఛంగా, "కోయిలమ్మ కూసినట్లు" మధురంగా ఉండాలి. ఇది పాఠకుడిలో "చైత్రమాస మొచ్చినట్లు" నూతన ఉల్లాసాన్ని నింపాలి. బాహ్య సౌందర్యం (Aestheticism) అంటారు.

కవిత్వం కేవలం ఆనందం కోసమే కాకుండా, "అమృతం ప్రవహించినట్లు" పాఠకుడికి శాశ్వతమైన విలువను, మానసిక పోషణను అందించాలి. కవిత్వానికి ప్రయోజనం (Purpose) ఉండాలని చెప్తారు. మణిపూసలు పాటించాల్సిన భవిష్యత్ ఆకాంక్షలను కవి 'మణిపూసలె(లి)ట్లుండాలి' అని కొన్ని ఖండికల్లో చెప్పారు.

గుండెకు హత్తుకోవాలి

కండకు హత్తుకోవాలి

మణిపూసలు పడివున్న

బండకు హత్తుకోవాలి! (మణిపూసలె(లి)ట్లుండాలి)

మణిపూసలు ఎలా ఉండాలో పద్దెనిమిది మణిపూసల్లో వర్ణించడం విశేషం. ***"గుండెకు హత్తుకోవాలి / కండకు హత్తుకోవాలి":*** భావోద్వేగ (హృదయ) స్థాయి నుండి కార్యాచరణ (కండ) స్థాయి వరకు ప్రభావితం చేయాలని కవి ఆకాంక్షించారు. ***"మణిపూసలు పడివున్న / బండకు హత్తుకోవాలి"*** నిస్సత్తువతో, చైతన్యరాహిత్యంతో ఉన్న బండలాంటి సమాజంలోకి చొచ్చుకుపోయి, చైతన్యాన్ని నింపాలని ఆయన ఉద్దేశం.

తెలంగాణ కవులు, ఉద్యమకారులకు నీరాజనం:

కొన్ని మణిపూసల ద్వారా తెలంగాణ నాయకులను, కవులను, రాజకీయ ధురంధరులను కవి వర్ణించిన తీరు అద్భుతం. తల్లి తెలంగాణ పట్ల కవికున్న ఆత్మీయతను మణిపూసలలో వర్ణించి తన ఋణం తీర్చుకున్నాడు కవి. ఈ మణిపూసల్లో కవి తెలంగాణ నాయకులను, కవులను "వ్యక్తి చిత్రాలు"గా కాక "ఆలోచనల ప్రతీకలు"గా వర్ణించాడు. ప్రతి మణిపూసలో ఒక నాయకుని చరిత్ర, సిద్ధాంతం, తెలంగాణ ఆత్మగౌరవం సంక్షిప్తంగా స్ఫురిస్తుంది.

తెలంగాణ ప్రాంతమందు

"కవులు లేరు" మాటలెందు

సరికావని "సురవరం"

చేసినట్టి పని పసందు!(సురవరం మనవరం)

తెలంగాణాలో "కవులు లేరు" అన్న అవమానకరమైన వాదనకు గోల్కొండ కవుల సంచికలో 354 మంది కవుల్ని సేకరించి సమాధానం చెప్పిన ప్రయత్నాన్ని కవి "పని పసందు"గా చెప్పాడు. అంటే తెలంగాణ వాళ్లందరికీ ఆనందం కలిగించిందనే అర్థంలో చెబుతున్నాడు. సురవరం ద్వారా తెలంగాణకు సాహిత్య స్వరూపం, సాంస్కృతిక చరిత్ర, ఆత్మసాక్షాత్కారం కలిసిన "మనవరం"గా రూపకల్పన జరిగింది అని ఈ మణిపూస సూచిస్తుంది.

ఉషోదయపు కిరణమతడు

తెలంగాణ వీరుడతడు

మహాకవి దాశరథి

సాహిత్యపు శక్తి యతడు!(కవి సింహం)

"ఉషోదయపు కిరణం" అనడం ద్వారా దాశరథిని చీకటి పాలనలో వెలుగునిచ్చిన కవి–వీరుడిగా నిలబెడుతుంది."సాహిత్యపు శక్తి"గా పేర్కొనడం ఆయన కవిత్వం పోరాట స్ఫూర్తి, ప్రజాస్వామ్య విలువలు, తెలంగాణ పీడిత జీవితం ప్రతిబింబించిన శక్తివంతమైన రూపాన్ని సంకేతిస్తుంది.

బడి పలుకులు వద్దన్నడు

పలుకుబడులు ముద్దన్నడు

సహజమైన తెలంగాణ

భాష మనకు హద్దన్నడు!(మహా కవి కాళోజీ)

దీనిలో "*బడి పలుకులు వద్దన్నడు / పలుకుబడులు ముద్దన్నడు*' అన్న పంక్తుల్లో పాఠశాల ప్రమాణ భాషకన్నా సహజ తెలంగాణ మాండలికానికే గౌరవం ఇవ్వాలని కాళోజీ చేసిన పోరాటాన్ని కవి కుదిస్తూ చూపించాడు కవి. '*భాష మనకు హద్దన్నడు*" అన్న మాటతో తెలంగాణ భాషే మన సరిహద్దు, మన గుర్తింపు, మన హక్కుల ప్రాతిపదిక అన్న ఆత్మగౌరవ దృక్పథాన్ని కాళోజీ లోకంలో నుండి తీసుకుని చూపించాడు.

"తెలంగాణ సిద్ధాంతం"

మంచిచెడుల రాద్ధాంతం

జయశంకర్ కలలనుండి

జన్మించిన వేదాంతం! (తెలంగాణ జాతిపిత అంటూ తెలంగాణ వేర్పాటును శాస్త్రీయంగా, చారిత్రకంగా, ఆర్థికంగా విశదీకరించిన జయశంకర్ పాత్రను కవి సంక్షిప్తంగా చేర్చాడు కవి."కలలనుండి జన్మించిన వేదాంతం" అని చెప్పడం ద్వారా ఆయన ఆలోచనలు కలలు మాత్రమే కాకుండా, తెలంగాణ ప్రజల ఆకాంక్షలే సిద్ధాంతమై, ఉద్యమ కార్యాచరణకు మార్గసూచిగా నిలిచాయని, అందుకే "తెలంగాణ జాతిపిత"గా మణిపూసలో నిలబెట్టాడు కవి.

"చాణక్యుడి నీతిచరుడు

తాత్విక భావాల పరుడు

భారతరత్న మన పీ వి

సర్వేజన శుభంకరుడు!' (తెలుగు వెలుగు పీవి)

పీవీ నరసింహారావు యొక్క రాజకీయ దూరదృష్టి, ఆర్థిక సంస్కరణల వెనుక ఉన్న వ్యూహాత్మక చాతుర్యాన్ని గుర్తు చేస్తాడు కవి. ఆయనను కేవలం తెలంగాణ నేతగానే కాకుండా, దేశవ్యాప్తంగా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే తాత్విక-రాజకీయ నాయకునిగా అభివర్ణించే ప్రయత్నం స్పష్టమవుతుంది.

ఈ మణిపూసలన్నిటిలో వ్యక్తుల బయోగ్రఫీ కన్నా, తెలంగాణ చరిత్రలో వారి "స్ఫూర్తిదాయక పాత్ర"నే కవి మన ముందుకు తెచ్చాడు. రూపకోపమలు, శక్తివంతమైన విశేషణాలతో ప్రతీ వ్యక్తిని ఒక మిశ్రమభావ ప్రతీకగా మలిచాడు. ఒకే గుచ్ఛంగా వీరందర్నీ కూర్చడం ద్వారా తెలంగాణ సాహిత్యం, భాష, రాజకీయ చైతన్యం, ఆత్మగౌరవం, జాతీయ స్థాయి నాయకత్వం గొప్ప తనాన్ని కీర్తిస్తున్నాడు. ఇవన్నీ కలసి ఉన్న సమగ్ర తెలంగాణ రూపాన్ని కవి సంక్షిప్తంగా, సగౌరవంగా తన మణిపూసల్లో ప్రతిష్ఠించాడు. తెలంగాణ సంస్కృతి పట్ల కూడా అనేకమైన మణిపూసలను అక్కడక్కడా వర్ణించాడు కవి.

"పూలలోన చేరినావు

చైతన్యము నింపినావు

తెలంగాణ కోవెలలో

బతుకమ్మై వెలిసినావు!"

బతుకమ్మ పండుగ తెలంగాణ స్త్రీల ఆత్మగౌరవానికి, తెలంగాణ సంస్కృతికి సజీవ చిహ్నంగా నిలిచిన పూల జాతర. వర్షాకాలం అయిపోయిన తర్వాత పుష్కలమైన అడవి పూలతో ప్రజలందరినీ అమ్మవారిని బతికించమని వేడుకునే ప్రజల జీవనానికీ ప్రకృతికీ ఉన్న సంబంధాన్ని గొప్పగా తెలియజేస్తుంది. ఊరి స్త్రీలు, పిల్లలంతా కలసి పాటలు పాడుతూ, వలయంలో నృత్యం చేస్తూ ఆడే ఈ పండుగ గ్రామీణ, పట్టణ తెలంగాణలో సామూహిక ఉత్సాహానికి, సామాజిక ఐక్యతకు వేదిక. నేటి తెలంగాణలో బతుకమ్మను రాష్ట్ర సాంస్కృతిక గుర్తింపు చిహ్నంగా అధికారికంగా స్వీకరించడం కూడా దాని గొప్పదనాన్ని మరింతగా ప్రపంచానికి తెలియజేస్తుంది. దీన్ని వర్ణిస్తూ కొన్ని మణి పూసలు వర్ణించాడుకవి.

తెలంగాణ ఉద్యమ - ప్రజల ఆకాంక్షలు:

సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలు, నీళ్ళు, నిధులు, నియామకాల విషయంలో జరిగిన అన్యాయమే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ప్రధాన అవసరంగా మారింది. తమ ప్రాంతీయ గుర్తింపును, సంస్కృతిని, భాషను కాపాడుకోవడం, తమ ప్రాంత అభివృద్ధిని, ఉద్యోగ అవకాశాలను మెరుగుపరుచుకోవడం తెలంగాణ ప్రజల ముఖ్య ఆకాంక్షలు. ఉద్యమ

విజయానంతరం: దశాబ్దాల పోరాటం, త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడటంతో ప్రజల్లో అపారమైన సంతోషం, ఆనందం వెల్లివిరిసింది. ఈ కొత్త రాష్ట్రం తమ ఆకాంక్షలను నెరవేర్చి, అన్ని వర్గాల ప్రజలకు సమానమైన, స్వావలంబనతో కూడిన జీవితాన్ని అందిస్తుందనే దృఢమైన ఆశ ప్రజల్లో ఏర్పడింది.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత (జూన్ 2, 2014), తెలంగాణ కవిత్వం సరికొత్త గొంతుకను, దిశను సంతరించుకుంది. దశాబ్దాల పోరాటం, త్యాగాల తర్వాత స్వరాష్ట్రం సిద్ధించిన ఈ సందర్భాన్ని కవులు ప్రధానంగా రెండు కోణాల్లో వర్ణించారు:

ఆకాంక్షల సాకారం & ఆనందం (సాధనానందం):

రాష్ట్ర విభజన తర్వాత కవులు తమ రచనల్లో ముందుగా చారిత్రక విజయాన్ని, ప్రజల ఆనందాన్ని, పోరాట ఫలితాన్ని కీర్తించారు. దశాబ్దాల 'నీళ్లు, నిధులు, నియామకాలు' అనే ప్రధాన ఆకాంక్షతో పాటు, సాంస్కృతిక అస్తిత్వం కోసం సాగిన పోరాటం నెరవేరిందనే సంతోషం కవిత్వంలో ప్రధానంగా కనిపించింది. తెలంగాణ భాష, సంస్కృతి పట్ల గతంలో ఉన్న వివక్షను పారద్రోలి, తమ మాతృభాషకు, ప్రాంతీయ అస్తిత్వానికి పట్టం కట్టాలనే కవిత్వం బలంగా వచ్చింది. కవులు తమ ప్రాంత వీరులను, సాహితీ సంపదను గురించి గొప్పగా చాటారు. ఉద్యమంలో ప్రజల భాగస్వామ్యాన్ని, ముఖ్యంగా విద్యార్థులు, మేధావులు, కళాకారుల త్యాగాలను స్మరిస్తూ, ఆ స్ఫూర్తిని 'బంగారు తెలంగాణ' నిర్మాణం వైపు మళ్లించాలనే పిలుపునిచ్చారు.

కొత్త ఆకాంక్షలు & నిలదీత (ప్రశ్నించే గొంతుక):

రాష్ట్రం ఏర్పడిన తర్వాత, ఉద్యమంలోని లక్ష్యాలు పూర్తిగా నెరవేరాయా లేదా అనే కోణంలో కవులు ప్రశ్నించడం మొదలుపెట్టారు. రాష్ట్ర సాధన వెనుక ఉన్న సామాజిక తెలంగాణ, పేదరిక నిర్మూలన, నిరుద్యోగ సమస్యల పరిష్కారం వంటి ప్రాథమిక లక్ష్యాలను పాలకులు ఎంతవరకు చేరుకున్నారని ప్రశ్నించారు. కవిత్వం కేవలం పొగడ్తలకు పరిమితం కాకుండా, ప్రజల్లో రాజకీయ చైతన్యాన్ని, పాలకులపై నిరంతర నిఘాను పెంచే సాధనంగా కొనసాగాలని కవులు ఆకాంక్షించారు. కవి సత్యం గారు కూడా తన మణి పూసలలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రతిఫలించేలా కవిత్వీకరించాడు.

ప్రజలందరి ఆరాటం

ఆరుపదుల పోరాటం

జూను రెండు రాగానే

ప్రతియెదలో ఉబలాటం! (మణిపూసల దండ)

తెలంగాణ రాష్ట్రం కోసం త్యాగాలు చేసిన వారందరినీ స్మరించుకుంటూ సంతోషంతో తన వంతుగా ఒక మణిపూసల దండను తెలంగాణ తల్లి మెడలో వేశాడు కవి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చిన 10 సంవత్సరాల తర్వాత ఒకసారి తన నూతన రాష్ట్రం ఏర్పడ్డాక ఆ పరిస్థితులను సమీక్షించుకున్నాడు కవి.

కష్టాలు తీరలేదు
కన్నీళ్లు నాగలేదు
రాష్ట్రమొచ్చినా కూడా
కలుషమతి తగ్గలేదు! (దశాబ్ది తెలంగాణ)

రాజకీయ మెక్కువాయె
దోచుకొనడ మెక్కువాయె
తెలంగాణలోన నేడు
నిరుద్యోగ మెక్కువాయె! (దశాబ్ది తెలంగాణ)

ఉద్యమ కవిత్వంలో ముందు నుంచీ ఉన్న ప్రజాకవి కాళోజీ నారాయణరావు స్ఫూర్తిని కొనసాగిస్తూ, *“ప్రాంతేతరుడు మోసం చేస్తే పొలిమేర దాకా తరిమికొడతాం/ ప్రాంతం వాడే మోసం చేస్తే ప్రాంతంలోనే పాతర వేస్తాం”* అనే భావనను కవులు పదేపదే గుర్తుచేశారు. అంటే, స్వపాలకుల్లో లోపాలున్నా వాటిని ప్రశ్నించడానికి సిద్ధంగా ఉండాలనే నిబద్ధతను ప్రకటించారు. దీనిలో భాగంగానే సత్యంగారి మణిపూసలు కవిత్వాన్ని కూడా పరిగణించాలి.

ముగింపు (Conclusion)

వడిచర్ల సత్యం గారి ‘మణిపూసలు’ అనే నూతన కవితా ప్రక్రియ ఆధునిక తెలుగు కవిత్వానికి ఒక కొత్త శిల్ప సౌందర్యాన్ని అందించింది. నాలుగు పాదాల సంక్షిప్త రూపంలో, లయబద్ధమైన శిల్పంలో మాత్రల నియమాన్ని అనుసరిస్తూనే, ఆధునిక కవిత్వంలోని భావ విస్తృతిని, సామాజిక చైతన్యాన్ని సమర్థవంతంగా మిళితం చేసింది. ఈ కవితా రూపాన్ని పలువురు సాహితీ ప్రముఖులు కూడా కొనియాడారు. ఏనుగు నరసింహారెడ్డి దీనిని “పద్యానికి తమ్ముడు, వచన కవితకు అన్న” అని వర్ణించగా, శతావధాని మలుగ అంజయ్య “తెలుగు సాహిత్యానికి వెన్నుపూసలు” అని చమత్కరించారు. ‘పద్యం రాయలేని వారికి ఇది పరమాన్నం’ అని శ్రీనాటి శ్రీనాథ్, ‘సంక్షిప్తతే దీని బలమని’ ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. పండితులనే కాక కొత్తవారిని ఆకర్షిస్తుందని అమ్మంగి వేణుగోపాల్, పిల్లలకు కూడా నచ్చుతుందని పత్తిపాక మోహన్ తెలిపారు. ఈ కవితారూపం సాహిత్యానికి లాభదాయకమని దోరవేటి చెన్నయ్య తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ఈ కవితారూపం తెలుగుకే పరిమితం కాకుండా కె.పాండురంగ విఠల్ (హిందీ), డి.హనుమంతరావు (ఆంగ్లం), సయ్యద్ యూసుఫ్ (ఉర్దూ), వి.జలంధర్ (మరాఠీ) తదితరుల ద్వారా ఇతర భాషల్లోకి అనువదించబడింది. వడిచెర్ల సృష్టించిన ఈ బాటలో సుధాకర్ గౌడ్, ఆశీర్వాదం, గణపురం పరమేశ్వర్ వంటి ఎందరో కవులు పయనిస్తూ మణిపూసలు రాస్తున్నారు. సాంప్రదాయిక పునాదులపై నవతరానికి ఇది ఒక వరంలా మారింది. మణిపూసలు లఘు కవితా రూపంలో ’వెయ్యి మణిపూసలు’ కావ్యం ద్వారా కవి, కుటుంబ బంధాలు, నైతిక విలువలు, జాతీయత, సామాజిక విమర్శ, తెలంగాణ అస్తిత్వం వంటి ఐదు ప్రధాన దృక్కోణాలను ప్రతిబింబించారు. కవిత్వం ద్వారా కేవలం కవిత్వాన్ని చెప్పడమే కాకుండా, దాని లక్షణాన్ని, ప్రయోజనాన్ని కూడా నిర్దేశించిన వడిచర్ల సత్యం గారి ‘మణిపూసలు’ తెలుగు కవిత్వ పరిణామంలో రూపనవీనతను సాధించిన విశిష్ట ప్రయత్నంగా నిలుస్తుందని భావించవచ్చు.

సాంప్రదాయికత:

కవితారూపం ఆధునికమైనా, సంప్రదాయ భావాలను, దేశభక్తి, దైవం వంటి భావనలను మణిపూసలు కవిత్వం వర్ణించడం ద్వారా సాంప్రదాయకతకు అవకాశం ఇచ్చినట్లయ్యింది. అంతేకాకుండా, మూడు పాదాలు ప్రాస, లయలు పాటించాలనే నియమాలు కూడా కొనసాగించేలక్షణాలుగా కనిపిస్తున్నాయి. సంప్రదాయ ఛందోబద్ధ పద్యాల్లో కూడా ఇటువంటి నియమాలు కనిపిస్తాయి. అందువల నిర్మాణపరంగా చూసినా మణిపూసలు సాంప్రదాయికత కనిపిస్తుంది.

ఆధారగ్రంథాలు:

1. వడిచర్ల సత్యం గారి వేయిమణిపూసలు గ్రంథం– 2025
2. కావ్యాలంకార సంగ్రహం : రామరాజభూషణుడు

14
శ్రీకైవారం యోగినారేయణ తాత మహిమలు

-డా. ఎల్. కస్తూరి

శ్రీయోగినారేయణ తాత కర్ణాటక రాష్ట్రంలోని కైవారం క్షేత్రంలో వెలసిన అమర నారేయణ స్వామి అనుగ్రహంతో క్రీ.శ. 1726లో జన్మించారు. తల్లి ముద్దమ్మ తండ్రి కొండప్ప.

నారేయణ తాత కులవృత్తి అయిన గాజుల వ్యాపారాన్ని ధర్మపద్ధతిలో నిర్వహించేవారు. చిత్తూరు జిల్లా మొగిలి వెంకటగిరి కనుమ ప్రాంతంలో దైవికంగా తారసిల్లిన పరదేశస్వాముల వారి ప్రబోధంతో సంసారిక జీవితానికి స్వస్తి పలికారు. కైవారం క్షేత్రానికి సమీపంలో వున్న యోగ నృసింహస్వామి గుహాలయంలో తపస్సాధనలు సాగించారు తత్ఫలితంగా స్వామి అనుగ్రహంతో అనతికాలంలోనే కవితాకళ అత్యంత సహజరీతిలో అలవడింది. అప్పటి నుంచి తెలుగు, కన్నడ, భాషల్లో తత్వాలు, కీర్తనలు, శతకాలు పద్యాలను ఆశువుగా రచించారు.

కుండలినీ యోగసాధన విధానాన్ని, భక్తియోగాన్ని చక్కగా అనుసంధానించి దానికి "పవనయోగ మార్గమని" పేరు పెట్టడం విశేషం. నిరంతరం జపయజ్ఞశీలురైన ఈ వాగ్గేయకారునికి పరమాత్ముడే ఘంటాముద్రికను, తాళ పత్రాలను ప్రసాధించి కాలజ్ఞానాన్ని రాయించారని ప్రతీత. వీరి "ఓమ్నమోనారేయణాయ" అనే అష్టాక్షరీ మంత్రం భక్తులచేత నాటి నుంచి నేటికీ భజన పద్ధతుల్లో విరాజిల్లుతూంది.

శ్రీయోగి నారేయణ తాత మహిమలైన-తరలివచ్చిన గంగాభవాని, వేడివేడి బెల్లం, గగనమందలి గరుడపక్షి, వడిగేపురంలో వర్షధార, ఇసుకదిబ్బ మొదలైన వాటి గురించి చెప్పడం ఈ పత్ర ముఖ్య ఉద్దేశ్యం.

తరలివచ్చిన గంగాభవాని

శ్రీతాతయ్య అమరనారేయణస్వామి పూజాకైంకర్యాల కోసం తులసీవనాన్ని పెంచాలనుకున్నారు. దీనికి భక్తులిచ్చిన విరాళాలతోపాటు కొంత ధనాన్ని అప్పుగా తీసుకొని బావిని తవ్వించారు. చుక్కనీళ్ళైనా పడలేదు. అందుకని బావి గట్టుపై కూర్చుని గంగాభవానిని ఈ విధంగా ప్రార్థించారు.

"ఏమమ్మా గంగాభవానీ నిను నమ్మితి శంకరురాణి, కన్నతల్లి
కరుణ జూపవే! కపటమెందుకు తలచినావె సమ్మతముగా రావె
ఇచటకు! సర్వకాలము నిలిచి యుండవే" (పు. 122 శ్రీయో.నా.జీ.చ)

అమ్మా! గంగాభవానీ నా వల్ల తప్పేమైన జరిగిందా తల్లీ! నారేయణ స్వామి పాదపూజకై తులసీవనాన్ని పెంచాలని అప్పుజేసి బావిని తవ్వించాను. ఓ కరుణామయీ! నాపై దయదలచి నీవు ఈ బావిలో నిత్యం కొలువై వుండాలి అని భక్తితో ప్రార్థించారు. ఆయన కోరికమేరకు గంగాదేవి ఎగసిపడుతూ బావిలోకి వచ్చి చేరింది. దీన్ని ప్రత్యక్షంగా చూసిన భక్తులు తాతయ్య అనుగ్రహమని జయజయ ధ్వానాలతో కొనియాడారు. నేటికీ ఎంత కరువు వచ్చినా జలకళతో నిండుకుండలా తొణికిసలాడుతుందంటే అది తాతయ్య మహిమేనని భక్తులు కీర్తిస్తూ ఉండడం విశేషం.

వేడివేడి బెల్లం

తాతయ్య ఒకసారి దుబ్బకుంట గ్రామం దారిలో ప్రయాణం చేస్తున్నారు. అక్కడ పొలాల్లో చెరుకురసంతో బెల్లం కాస్తున్నారు. బెల్లం పక్వానికి వచ్చిన సమయంలో కొంతమంది పిల్లలు తాతయ్య చుట్టూ చేరి "తాతయ్య ఇక్కడున్న ఈ రైతును మేము కాస్త బెల్లమివ్వమని అడిగితే కాదని ఉదయం నుంచి కసిరికొడుతున్నాడు. కనుక తాతయ్య నీవడిగితే ఎవ్వరూ కాదనరు. మాకు కొంచెం బెల్లమిప్పించమని" (పు. 126 శ్రీ యో.నా.జీ.చ) బ్రతిమలాడారు. వెంటనే ఆయన సలసల కాగుతున్న పెనంలోని పాకాన్ని అవలీలగా చేత్తో ఎత్తి పిల్లలందరికీ పంచిపెట్టారు. చేతులకి వేడి తగలలేదు మూతులు కాలనూలేదు. పంచభూతాల్లో ఒకటైన అగ్నితత్వంపై వారు సాధించిన విజయానికి నిదర్శనం.

ఉన్నచోటనే తిరుపతి

కైవారానికి చెందిన శ్యామయ్య తన కోడలు చెన్నమ్మను ఇంటి వద్ద కాపలా వుంచి, కుటుంబ సభ్యులంతా తిరుమల తిరుపతి యాత్ర వెళ్ళారు. చెన్నమ్మకి తిరుమలలోని పాపనాశనంలో స్నానం చేసి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవాలని చిరకాల కోరిక. అది తీరకపోవడంతో ఏడుస్తూ తాతయ్య దగ్గరికి వెళ్ళి జరిగినదంతా చెబుతుంది. ఆమెను ఓదారుస్తూ "పిచ్చితల్లీ! ఏడుస్తావెందుకు? నీవిప్పుడు తిరుమల వెళ్ళి పాపనాశనంలో స్నానం చేసి స్వామిని దర్శించుకోవాలి అంతేకదా!" ఏదీ ఒకసారి నీ రెండు కన్నులు మూసుకో అని తన చేతులతో ఆమె తలను తాకారు. (పు. 128 శ్రీయో.నా.జీ.చ). అంతే చెన్నమ్మ పాపనాశనంలో స్నానం చేస్తుంటే కొంతదూరంలో తన అత్తమామలు స్నానం ఆచరిస్తుంటారు. ఆ సమయంలో తన అత్త ముక్కుకున్న ముక్కెర జారి నీళ్లలో పడిపోతుంది. దాన్ని గమనించిన చెన్నమ్మ పరిగెత్తుకుంటూ వెళ్ళిదాన్ని తీసుకుని కొంగుకు మూటగట్టుకుని వెళ్ళి స్వామిని దర్శనం చేసుకుంటుంది.

 ISSN No.2319-3905

కొంత సమయం తర్వాత తాతయ్య చెన్నమ్మ! ఇప్పుడు కళ్ళు తెరువమ్మా! అనగానే కళ్ళు తెరచి చూస్తుంది. ఇది కలా నిజమా అని ఆశ్చర్యపోయింది. కానీ తన కొంగుకు మూటగట్టుకున్న ముక్కెరను చూసి ఇదంతా నిజమేనని అర్థమవుతుంది. ముక్కెరను పోగొట్టుకుని ఉత్తముక్కుతో వచ్చిన అత్తకు జరిగిన విషయమంతా చెప్పి ముక్కెరను ఇచ్చి ఆశ్చర్యపరుస్తుంది. నారేయణ తాత యోగి అయినందున చెన్నమ్మకు ఉన్నచోట నుంచే తిరుమల తిమ్మప్ప దర్శనం చేయించి తన మహిమను చాటుకున్నారు.

గగనమండలి గరుడపక్షి

మహావిష్ణువు వాహనమైన గరుడపక్షి ప్రతిరోజూ సూర్యోదయమవ్వగానే తాతయ్య పర్ణకుటీరానికి దగ్గరలోనున్న ఒక చెట్టుకొమ్మపై వచ్చి కూర్చునేది. స్వామి దర్శనానంతరం పటపటమని రెక్కలు ఆర్చుకుంటూ వెళ్ళిపోయేది. "ఆ పిచ్చి పట్టిన జోగి గూబగద్దులకు నమస్కరిస్తాడు." (పు.132 శ్రీయో.నా.జీ.చ) అని కొందరు ముస్లీం బాలకులు ఒకరోజు గుంపుగాచేరి మట్టితో గరుడపక్షి ఆకారాన్ని తయారుచేశారు. దాన్ని గరుడపక్షి నిత్యం నిలబడే చెట్టుకొమ్మకు కట్టేసి హేళన చెయ్యాలని పొదలచాటున దాక్కుంటారు. ఇంతలో సూర్యోదయమవుతుంది. తాతయ్య చెట్టుకొమ్మపైనున్న మట్టిబొమ్మను చూసి మూర్ఖులపనేనని భావించి నవ్వుకున్నారు. అక్కడే దాక్కున్న పోకిరీలు "తాతయ్య వెర్రివాడే" అని అనుకుంటూ చేతులుతట్టి గేళి చెయ్యాలనుకుంటారు. అప్పుడు కొమ్మపై నుంచి పటపటమని రెక్కల శబ్ధం వినపడుతుంది. ఏమిటా అని చూసేసరికి తాము పెట్టిన మట్టిబొమ్మకు ప్రాణంవచ్చి గరుడపక్షిగా మారి ఆకాశంలోకి ఎగిరిపోతుంది. దీన్ని చూసి ఆశ్చర్యపోయి బాలకులు భయంతో గడగడవణుకుతూ తాతయ్య పాదాలపై పడి దుఃఖిస్తారు. వాళ్ళ తల్లిదండ్రులు పిల్లల తప్పిదాన్ని మన్నించమని ప్రాధేయపడతారు.

వడిగేపురంలో వర్షధార

విజయపురం పట్టణమే నాటి వడిగేపురం. ఇది దేవనహళ్ళి తాలూకాలో వుంది. ఈ పట్టణ వాసి పువ్వప్ప తాతయ్య ముఖ్యశిష్యుడు ఇతను ధనవంతుడు, ధార్మిక గుణవంతుడు, పరోపకారశీలి. తాతయ్యంటే ఎనలేని భక్తి. పువ్వప్ప ఒకసారి కైవారం గురువు దగ్గరకు వచ్చి గురుదేవా రేపు శ్రావణమాసం చివరి శనివారం. కనుక మా గ్రామంలోని భక్తులందరూ మీ బోధనలు వినాలని ఆశపడుతున్నారు. కనుక మా మీద దయయుంచి మీరు మా ఊరికి రావాలని విన్నవించుకున్నాడు. పువ్వప్ప ఆహ్వానం మేరకు శిష్యసమేతంగా సాయంత్రానికి వడిగేపురం చేరుకున్నారు. ఇంతలో గురప్ప కొత్తగా నిర్మించిన తన మఠానికి రమ్మని ఆహ్వానించారు. వేదాంత చర్చ మొదలు పెడదామంటే పక్షుల శబ్ధాలు అధికంగా వుంటాయి. అందుకని "ష్ అరవకండి" అని పక్షుల్ని అదిలిస్తాడు. శబ్దాలు ఆపలేదు. కోపంతో "పక్షులకు నోరు పడిపోవుగాక" అని శపిస్తాడు. పక్షులకు

నోర్లుపోయి శబ్దాలు చెయ్యవు. దీన్ని గమనించిన తాతయ్య "గురప్ప గారూ!" ఆ పక్షులు తమ పిల్లలను వదిలి మేతలకై ఎక్కడెక్కడికో వెళ్ళి మేతను సేకరించుకుని ఇంటికొచ్చాయి. ఉదయం నుంచి తల్లిదండ్రులను విడిచి బిక్కుబిక్కుమని వున్న ఆ పక్షులు, కూనలు ఆపాయ్యంగా పలకరించుకుంటుంటే వాటి ఉత్సాహాన్ని అడ్డుకుంటావా (పు.139 శ్రీయో.నా.జీ.చ) మనం మాట్లాడుకోవడానికి ఆ నోరులేని పక్షుల నోర్లని కట్టేస్తావా? భావ్యంకాదు. వాటికి మాటలు ప్రసాదించండి అని చెప్పగానే గురప్ప "ఓ పక్షుల్లారా ఇక మాట్లాడండి మీకు గొంతునిస్తున్నాను" అని ఎన్నిసార్లు చెప్పినా అవి శబ్ధం చెయ్యవు. గురప్ప తన అజ్ఞానానికి సిగ్గుపడి తాతయ్య పాదాలపై పడి మన్నించమని వేడుకొంటాడు. అప్పుడు కరుణించి పక్షులకు నోరు ప్రసాదించారు. అప్పటి నుంచి గురప్ప ఆయనకు శిష్యుడైనాడు.

వడిగేపురంలోని చెన్నకేశవస్వామిని యోగీంద్రులు దర్శించుకుంటారు. గుడి దగ్గర వున్న భక్త సమూహానికి తత్వోపదేశం చేస్తారు. గ్రామ ప్రజల క్షేమ సమాచారాలు అడిగినప్పుడు పువ్వప్ప లేచి ఓస్వామీ ఏడు సంవత్సరాలుగా అరకొర వర్షాలతో పంటలు పండక ఆహార కొరత ఏర్పడుతుంది. పశుపక్ష్యాదులకు మేత దొరకడం లేదు. దీనివల్ల ప్రజలు ఇతర దేశాలకు వలస వెళ్తున్నారు. దయచేసి వర్షం కురుపించవలసినదిగా ప్రార్థిస్తున్నాను అని విన్నవించుకుంటాడు. అప్పుడు తాతయ్య వర్షం పడకపోవడడానికి అష్టదిక్పాలకులే కారణం అని తెలుసుకుని కోపంతో

వానరాకున్న బహుకీడు వచ్చుమీకు
ఉరుము మెరుపులు పుట్టించి వున్నతముగ
గొప్ప చెరువులు నిండవలె ఘడియలోనా
గురుడు నారేయణ స్వామి కృపను యిపుడా (పు.142 శ్రీయో.నా.జీ.చ)

అని గద్దించి తాతయ్య యోగ నిద్రలోకి వెళ్ళి లేచేలోపు సుమారు మూడు గంటల సేపు ఉరుములు మెరుపులతో ధారాపాతంగా వర్షం కురిసింది. బావులు, చెరువులు, కుంటలు నిండిపోయాయి. ప్రజల ఆనందానికి అవధుల్లేవు. ఇదంతా తాతయ్య మహిమేనని వేనోళ్ళ కొనియాడారు.

ఇసుక దిబ్బ

దేవనహళ్లి మార్గ మధ్యలో తాతయ్య శిష్యులతో కలిసి వెళ్తున్నారు. మార్గం మధ్యలో ఒక వ్యాపారి చెక్కర మూటల్ని నాలుగు బండ్లమీద తరలిస్తున్నారు. దాన్ని చూసిన భక్త బృందం చెక్కర తినాలని ఆశపడ్డారు. దీన్ని గమనించిన తాతయ్య వ్యాపారిని "నాయన ఈ బండ్లలో వున్నదేమిటి?" అని అడిగారు. చెక్కర అని చెప్తే అందరికీ ఇవ్వాలని స్వార్థంతో "బండిలో వున్నది ఇసుక స్వామీ" అని అంటాడు. "ఔనా అలాగే కానిలే నాయనా" అని యోగీంద్రులు అనగానే

చెక్కర మూటలన్నీ ఇసుక మూటలుగా మారిపోతాయి. ఎద్దులు లాగలేకపోతాయి. ఆ వ్యాపారి ఎద్దులను చూసి ఇంతసేపు బాగానేలాగాయి. ఇప్పుడెందుకు లాగలేక మొరాయిస్తున్నాయనుకుంటాడు. మూటల్ని విప్పిచూస్తే ఇసుక. వాటిని కింద పోస్తే అంతా ఒక దిబ్బలాగా పోగవుతుంది. అందువల్ల ఆ ప్రదేశాన్ని ఇప్పటికీ ఇసుక దిబ్బ అని పిలుస్తారు.

సమాజాన్ని పట్టిపీడిస్తున్న జాతి, కుల, మత, మూఢాచారాలను ఖండించారు. సమస్త మానవులంతా ధర్మార్థమోక్ష నిరతులై మానవజన్మకు సార్థకతను పొందాలని తన బోధనల ద్వారా తెల్పిన మహిమాన్వితులు. కాలజ్ఞానాన్ని బోధించిన నాటి నుంచి నేటికీ యోగిపుంగవులుగా విరాజిల్లుతున్న పరమాత్మ స్వరూపులే శ్రీకైవారం యోగి నారేయణ తాతయ్య.

ఆధారగ్రంథాలు

1. గంగరాజు చంద్రశేఖర్ భాగవతార్ ఒ వానరాశి బాలకృష్ణ భాగవతార్–సద్గురు శ్రీయోగి నారేయణ తాతయ్య గారి జీవిత చరిత్ర, శ్రీయోగి నారేయణ మఠం, శ్రీక్షేత్ర కైవారం, చింతామణి తాలుకా, చిక్బళ్లాపుర్ జిల్లా, కర్ణాటక–563 128.
2. శ్రీఅమర నారేయణ వేదాంత సారావళి (కాలజ్ఞానము)–శ్రీయోగి నారేయణ యతీంద్ర ఆశ్రమం ట్రస్టు, కైవారం–563128.

15

రాయలసీమ కథా పరిణామం– పరిశీలన

– *డా.ఎం.హరికృష్ణ*

'కథ'... ఇది ఏనాటి ప్రక్రియ? నిన్నటిదా..! మొన్నటిదా..! లేక అమ్మమ్మదా..! నాయనమ్మదా..!.... కాదు కాదనే అనిపిస్తోంది. కథా ప్రక్రియ నిన్నటిదో.. మొన్నటిదో.. అంతకుముందు నాటిదో అస్సలు కాదు. ఇది ఎప్పటిదో.. బహుశా భూమి పుట్టి, మనిషి పుట్టి, మనిషికి కాస్తంత జ్ఞానం అబ్బినప్పటి నుంచీ కథా ప్రక్రియ వుందనే అనిపిస్తోంది. ప్రపంచమంతటా... భారతదేశంలో కూడా... అత్యంత ప్రాచీన సాహిత్యం అయిన వేదాలు, మహాభారతం దీనికి సాక్ష్యాలు. వేదాల్లో కూడా చిన్న చిన్న కథలను శ్లోకరూపంలో పొందుపర్చారు. భారతంలో అయితే చెప్పనవసరమే లేదు. చిన్న చిన్న నదులన్నీ కలిసి మహాసంద్రంగా మారినట్లు చిన్న చిన్న కథలన్నీ కలిసి 'జయ సంహిత'ను మహా భారతంగా మార్చాయి. అయితే ఇవన్నీ కూడా రచనలు కావు. వాగ్రూపంలో ఒక తరం నుంచీ మరో తరానికి అందిన సాహితీ రత్నాలు.

అయితే ఇవన్నీ కూడా శృంగార, వీరరసాలనే ఎక్కువగా ప్రస్తావించాయి. సామాన్య ప్రజల జీవితాలను తడమడంలో వెనుకబడ్డాయి.

కాగా, కథకు పట్టాభిషేకం జరిగింది మాత్రం 19 శతాబ్దంలోనే అనడంలో ఏమాత్రం సందేహం లేదు. జాన్ గుటెన్ బర్గ్ కనిపెట్టిన ముద్రణా యంత్రం వినియోగం 19వ శతాబ్దానికల్లా ఊపందుకుంది. దీంతో పత్రికల సంఖ్య పెరిగింది. ఒక విషయాన్ని ఆకర్షణీయంగా, క్లుప్తంగా చెప్పాల్సిన ఆవశ్యకత పెరిగింది. ఇదే కథారచనకు ప్రాణంపోసి పై స్థాయిలో నిలబెట్టిందని చెప్పవచ్చు.

'నవలను బూర్జువా సమాజం ప్రపంచ సంస్కృతికిచ్చిన మహత్తరమైన కానుకగా నవలా సాహిత్య విమర్శకులు అభివర్ణిస్తారు. ఆ పద్ధతిలోనే మనం కథను పారిశ్రామిక నాగరికత ప్రపంచ సంస్కృతికిచ్చిన మహత్తరమైన కానుకగా అభివర్ణించవచ్చు.' అంటారు వల్లంపాటి వెంకటసుబ్బయ్య.

"కథకు ప్రధాన లక్షణమైన క్లుప్తత కేవలం రూపానికి సంబంధించిన అంశం మాత్రమే కాదు. అది 19 శతాబ్దపు జీవిత దృక్పథానికి సాహిత్య రూపం. జీవితంలోని ఒక ముక్కను

తీసుకుని దానికి వ్యక్తిత్వం ఇవ్వాలన్న ఆకాంక్షలోంచి కథకు రూపం వచ్చింది" అంటారు క్యు.డి. లూయిస్.

ఇక తెలుగు కథకు విషయానికి వస్తే తొలి తెలుగు కథ ఏదన్న విషయం ఇప్పటికీ చర్చనీయాంశంగా వుంది. కొందరు ఆచంట వేంకట సాంఖ్యాయన శర్మ 1903లో రాసిన 'లలిత'ను తొలి తెలుగు కథగా చెబుతుండగా, మరి కొందరు 1904లో భండారు అచ్చమాంబ రాసిన 'స్త్రీ విద్య'ను తొలి తెలుగు కథగా పేర్కొంటున్నారు. అయితే మరికొందరు కథకు వుండవలసిన లక్షణాలను బట్టి గురజాడ అప్పారావు రాసిన 'దిద్దుబాటు'ను తొలి తెలుగు కథ అంటున్నారు.

1904లో తొలి తెలుగు కథ వెలువడిందనుకుంటే రాయలసీమలో తొలికథ రావడానికి దాదాపు 40 సంవత్సరాల కాలం పట్టినట్లు తెలుస్తోంది. రాయలసీమలో కథా ప్రారంభానికి ఇంతకాలం పట్టడానికి ఇక్కడి వైవిధ్యమైన జీవన విధానం, రాజకీయ, ఆర్థిక పరిస్థితులు ఒక కారణంకాగా, ఈ ప్రాంతపు మాండలికంతో కూడిన కథలను ప్రచురించడానికి, ఈ ప్రాంతపు రచయితలను ప్రోత్సహించడానికి ప్రచురణకర్తలు పెద్దగా ఆసక్తి చూపకపోవడం కూడా ఒక కారణమని మనకు అనిపిస్తుంది.

దాదాపు 40 ఏళ్ళ తరువాత 1941లో రామకృష్ణ రాసిన 'చిరంజీవి' రాయలసీమ తొలికథగా వచ్చింది. అయినప్పటికీ రాయలసీమ ప్రాంతానికి చెందిన ఏ విషయాన్నీ కూడా ఈ కథ తడమలేదు. రామకృష్ణ 1941 నుంచీ పది కథలు రాశారు. అయితే సీమ మాండలికం తప్ప ఆయన రాయలసీమ కథకు వేసిన ప్రత్యేక దారి అంటూ ఏదీ లేదు.

చిత్తూరు జిల్లా కథ:

1944లో కె. సభా తన రచనలతో రాయలసీమ రచయితలకు ఒక కొత్త ఊపు తెచ్చారు. ఆయన రాసిన 'కడగండ్లు' రాయలసీమ స్థితిగతులను తెలియజేసే కథగా చెప్పవచ్చు. 1944 నుంచీ 1980 మధ్యకాలంలో కె. సభా దాదాపు 300 కథలు రాశారు. సీమలోని తొలితరం కథకులందరిపైనా సభా ప్రభావం ఎక్కువగా వుంది. కె. సభా చిత్తూరు జిల్లా మధ్య ప్రాంతపు జీవితాన్ని చిత్రించారు.

సభా రాసిన 'పాతాళగంగ' బోర్లు వేసి చితికిపోయిన బేలప్ప అనే రైతు వ్యధను గురించి తెలియజేస్తుంది. చిత్తూరు మధ్య ప్రాంతంలో కరువు నెలకొని వుంది. బోర్లు వేసినా నీరు పడక ఎందరో రైతులు అప్పుల పాలైపోయారు. ఈ కష్టాలనే సభా తన కథలో చూపించారు. 'ఎండమావుల్లో తిమింగలం వేట' కరువు నివారణ పనుల పేరుతో ప్రభుత్వం చేసే వంచనను వ్యంగ్యంగా ఎత్తి చూపింది. కరువు నివారణ విషయంలో చిత్తశుద్ధి లేని ప్రభుత్వ వ్యవహారం ఇలాగే వుంటుందని ఆయన చూపారు.

1952 నుంచీ 1999 మధ్యకాలంలో రచనలు చేసిన మధురాంతకం రాజారాం కె. సభా ప్రేరణతో తాను కథలు రాశానని చెప్పుకున్నారు. 'సభా కథలు చదివాక నాబోటి సామాన్యుడు కూడా కథలు రాయవచ్చని గ్రహించానని' చెప్పుకున్నారు.

మధురాంతకం రాజారాం కథల్లో చిత్తూరు జిల్లా భౌగోళిక ప్రాంతాల ప్రస్తావన ఎక్కువగా వుంటుంది. 1958 నాటి 'సర్కస్‌డేరా' కథ రాయలసీమ ప్రజా జీవన పోరాటాన్ని తెలుపుతోంది. 1975లో వచ్చిన 'ఇక్కడ మేమంతా క్షేమం' కథలో ఈరయ్య పేదవాడు. అతని కొడుకు చెంగల్రాయుడు బాటపనికోసం దూర ప్రాంతాలకు వెళ్లాడు. ఈరయ్య కొడుక్కు రాయించిన జాబే ఈ కథ. ఇందులో ఈరయ్య తమ ప్రాంతంలోని కరువు కష్టాలను కొడుక్కు జాబులో వివరిస్తాడు.

1986లో రాసిన 'ఎడారికోయిల' కథ అమెరికానుంచీ సొంతవూరికి వచ్చిన ఒక యాత్రికుడి ప్రయాణం. తిరుపతి నుంచీ మహల్ దాకా, అక్కడి నుంచీ రాగుల పాడుదాకా భౌగోళిక పరిస్థితుల వర్ణన ఇందులో వుంది. 'గుట్టల నడుమ ఏటవాలుగా పడివున్న ఎర్రటి బీటి నేలలు' అక్కడి జీవితమని రచయిత చెబుతారు.

1958లో ఆయన రాసిన 'సర్కస్ డేరా' కథలో చేదబావిలో బండపడితే నాటు బాంబు పెట్టి వత్తి వెలిగించి పేలేలోగా తాడుతో పైకి ఎగబాకే పనివాడికి జారితే కింద కాపాడడానికి వలలేదు. సర్కస్‌లో వలైనా వుంది. డేరాలోపల ప్రదర్శన కన్నా బయట ప్రదర్శన నిజమైన సర్కస్ అని రాజారాం చెబుతారు.

1958–60 మధ్యకాలంలో కథా రచన ప్రారంభించిన వల్లంపాటి వెంకట సుబ్బయ్య, కలువకొలను సదానంద, పులికంటి కృష్ణారెడ్డి, సి.వేణు, ముంగర శంకరరాజులు కూడా సీమలోని గ్రామీణ జీవితాన్ని అద్భుతంగా చిత్రించారు. వల్లంపాటి 1972లో రాసిన 'గాయపడిన దేవత' కథ రెండు ఫ్యాక్షన్ కుటుంబాలు పదవుల కోసం రాజీకి సిద్ధం కావడాన్ని చూపుతుంది. అందులో ఒక ఫ్యాక్షనిస్టు కూతుర్ని మరో ఫ్యాక్షనిస్టు కొడుక్కి ఇచ్చి వివాహం చెయ్యాలనుకోవడం ద్వారా రాజీ ఒప్పందానికి వస్తారు. ఇందుకు కూతురు జానకి అంగీకరించదు. ఇది త్యాగం కాదు బలి అని చెబుతుంది. గుడిలోని సీతాకళ్యాణం నేపథ్యంగా ఈ కథ సాగుతుంది. 1991లో వల్లంపాటే రాసిన 'బండి కదిలింది' కథ సీమ కరువు మూలాలను వెతికి చెప్పిన కథ.

కాగా, మరో ప్రఖ్యాత సీమ రచయిత పులికంటి కృష్ణారెడ్డి రాయలసీమ జీవితం, సమస్యలు, భాషవ్యుత్పత్తి సంబంధాలలో వచ్చిన మార్పులవల్ల మానవసంబంధాల్లో వచ్చిన మార్పును వెల్లడించే కథలు రాశారు. 1974లో వచ్చిన 'మరపురాని మా వూరు' కథ నుంచీ, 1996లో వచ్చిన 'మండుతున్న మా వూరు' దాకా ఈ ప్రాంతంలో వచ్చిన మార్పును చిత్రించారు. 'బోడెద్దు' కథలో ముసలిదైన బోడెద్దును కసాయికి అమ్మి వదిలించుకోవచ్చు, ముసలివాడిని ఏం చెయ్యాలి? అన్న కుటుంబ సమస్యను ప్రస్తావించారు.

1960లో సి.వేణు రాసిన 'నవ్విన ధాన్యరాశి' ముంగర శంకరరాజు 'కోడి కూసింది. కుక్క చచ్చింది' అనే కథ లు కూడా రాయలసీమలో నెలకొని వున్న పరిస్థితులను తెలిపాయి.

అనంతపురం జిల్లా కథలు:

అనంతపురం జిల్లాలో 1941లోనే కథారచన ప్రారంభమైంది. సీమ మొదటి కథకుడుగా గుర్తించిన జి. రామకృష్ణ 1941లో 'చిరంజీవి' కథను రాశారు. అయితే ఈ కథ సీమ జీవితాన్ని ప్రస్తావించలేదు.

1970వ దశకంలో రాయడం మొదలెట్టిన సింగమనేని నారాయణ తన కథలో సీమ జీవన వైరుధ్యాన్ని విస్తృతంగా చిత్రించారు. 1978లో ఆయన రాసిన 'జూదం'లో ప్రకృతి రైతుతో ఆడిన జూదాన్ని చూపారు. ఆయనే రాసిన 'అడుసు' చీనీ తోటలను స్వయంగా నరికేసుకున్న ఓ రైతు కథ. 'ఊబి'లో బోర్లువేసి చితికిపోయిన రైతు జీవితం కనిపిస్తుంది.

సింగమనేని రాసిన 'ఫిరంగిలో జ్వరం' కథలో వెంకట్రాయుడు ఓ ఫ్యాక్షనిస్టు. అతని చీనీ తోటను ఎవరో నరికేశారు. గణనాయక్ సుగాలీ. ఇతను నరికేశాడని ప్రతీకారం తీర్చుకుంటానని వెంకట్రాయుడు ఆగ్రహం వ్యక్తం చేశాడు. తన శత్రువు వీరారెడ్డి ఇపుడు బలహీనుడని దాడి చేసే స్థితిలో లేడని అంటాడు. డబ్ల్యుటీవో దాడిని ఈ కథ గుర్తు చేస్తుంది. అమెరికా వెంకట్రాయుడు అయితే రష్యా వీరారెడ్డి. బిన్ లాడెన్ గణనాయక్. పెట్రోలు బావులు కాపుసారా.

అనంతపురం జిల్లాకే చెందిన మరో రచయిత చిలుకూరి దేవపుత్ర 'సమిధలు', 'ఆయుధం' లాంటి కథలను రాశారు. 1979లో ఆయన దళిత చైతన్యంతో కథలు రాశారు. ఫ్యాక్షన్‌లో దళితులు ఆయుధాలుగా, సమిధలుగా మారిపోతున్న తీరును ఆయన తన కథల్లో చెప్పుకొచ్చారు. 'ఊడల మర్రి'లో రాజకీయ రిజర్వేషన్ల బండారాన్ని, 'విలోమ' కథలో రిజర్వేషన్లలో మోసాలను ఆవిష్కరించారు. 'మన్ను తిన్న మనిషి'లో భూమికి రైతుకు మధ్య వున్న ఆత్మీయ బంధాన్ని చెప్పారు. 'ఏకాకి నౌక చప్పుడు' కథలో చావు సమయంలో కూడా తండ్రి దగ్గర వుండలేని కొడుకు దౌర్భాగ్య స్థితిని తెలిపారు. దేవపుత్ర తన కథల్లో సీమ భౌగోళిక పరిస్థితులను పెద్దగా వివరించలేదు. కానీ సీమ జీవితాన్ని పైపైనే తడిమారు. ఆయన కథల్లో దళితవాదానికి పెద్దపీట వేశారు.

మరో రచయిత శాంతి నారాయణ కూడా సీమ జీవితాన్ని ప్రతిబింబిస్తూ కథలు రాశారు. ఆయన రాసిన 'కల్లమయిపాయ' నిత్యం దగాకు గురవుతున్న రాయలసీమను పరిచయం చేసే కథ. ఆయన కథల్లో రైతులను ప్రకృతి చేసే మోసం, ప్రభుత్వం చేసే మోసం, దళారీ వ్యవస్థ దగాను చూపారు.

'గర్భశోకం' కథలో ఫ్యాక్షన్ కుటుంబాల్లో స్త్రీలు పడే మానసిక క్షోభ, ఎదుర్కొనే శారీరక హింసను ఆయన కనులకు కట్టినట్లుగా చూపించారు.

'ఈ పయనం ఎక్కడికి?' కథలో కోస్తా ప్రాంతానికి వెళ్లి వచ్చిన ఓ రాయలసీమ వ్యక్తి మానసిక సంఘర్షణను చూపింది.

అనంతపురం జిల్లాకే చెందిన బండి నారాయణస్వామి 1987 తర్వాత తరం వారు. కథా వస్తు వైవిధ్యం, శిల్ప వైవిధ్యం వున్న రచయిత ఆయన. 'ఒక బిందె నీళ్లకోసం ఇద్దరు ఆడవాళ్ల మధ్య మొదలైన గొడవ మగవాళ్ల మధ్య, కుటుంబాల మధ్య ఘర్షణగా మారుతుంది. బుర్రలు పగులుతాయి. నాగరికత లేని ఆ ఇద్దరూ జైలు పాలవుతారు. తాగే దానికి కడవ నీళ్లు నోచుకోలేని వాళ్లకు ఏం నాగరికత వుంటుంది? అనేది రచయిత ప్రశ్న.

జిల్లాకే చెందిన స్వామి రాసిన 'సావుకూడు' కథలో చనిపోయిన పెద్దప్పయ్య భార్య పొగిలిపొగిలి ఏడుస్తుంటుంది. ఆమె ఏడుపు చచ్చిపోయిన మొగుడికోసం కాదు. 'నా మొగానికి నీళ్లు కలిపిన పులుసు పోస్తిరి కదరా.. నా ఇస్తరాకులోకి మాత్రం నాలుగు తునకలు ఎయ్యకపోతిరి కదరా' అని ఏడుపు. చావును అధిగమించిన దు:ఖం వెనుక ఆర్థిక, సామాజిక కారణాలను ఈ కథ తెలుపుతుంది.

ఆయనే రాసినన 'తెల్లదయ్యం' ప్రపంచీకరణ విధ్వంస ప్రభావం వ్యవసాయం మీద ఎలా వుందో వివరిస్తుంది. భూస్వామ్య వర్గం పెట్టుబడిదారులుగా మారిన తీరును ఈ కథ వివరిస్తుంది.

జిల్లాకే చెందిన రచయిత్రి ఎ. నాయకి రాసిన 'జాడలేని మనిషి' ఫ్యాక్షన్‌లోని క్రూరత్వాన్ని చూపే కథ. ఇది బీభత్స ప్రధానమైనది. రెడ్డి దాష్టీకంతో బలైన నారాయణ కుటుంబం కథ. నారాయణ భార్య కాన్సర్‌తో చనిపోయాక నలుగురు పిల్లల్ని తీసుకుని భార్య చెల్లెలి వూరు చేరతాడు. పెద్ద కొడుకు గోవింద్‌ను బలవంతంగా ప్రభాకర్ రెడ్డి పనికి పిలిపించుకుంటాడు. బాంబులెయ్యడం, కాపలా కాయడం, నరకడం, గోవిందు పని. ఈ పనులకు భయపడి గోవిందు పారిపోతాడు. రెండవ కొడుకుని పనికి పంపమని రెడ్డి ఆదేశం. రామప్ప వచ్చి నారాయణకు నచ్చజెపుతాడు. జోరున వాన కురుస్తోన్న రాత్రి జీపు తునాతునకలైంది. ప్రభాకరరెడ్డి ముఖ్య అనుచరుడు నాగిరెడ్డి, మరో నలుగురు మాంసం ముద్దలయ్యారు. నారాయణ మిగిలిన కొడుకులను తీసుకుని సొంతవూరికి పారిపోయాడు. గోవిందు చనిపోయాడని అతనికి తెలీదు. ఒకరోజు రెండువేల రూపాయల మనియార్డరు, కోర్టు నోటీసు వచ్చాయి. గోవిందును దౌర్జన్యంగా తీసుకుపోయినందున గోవిందును అప్పగించాలని అందులో వుంటుంది. ఫ్యాక్షన్ క్రౌర్యానికి పరాకాష్ట ఈ కథ.

కడపజిల్లా కథలు:

కడపజిల్లాలో 1960లో సొదుం జయరాం, కేతు విశ్వనాథరెడ్డి, పి. రామకృష్ణారెడ్డి కథారచనకు నాంది పలికారు. వారి సమకాలీనులైన రాచమల్లు రామచంద్రారెడ్డి 1957–60 మధ్య దాదాపు 12కథలు రాశారు. 'అలసిన గుండెలు' అనే కథా సంపుటిని కూడా ఆయన ప్రచురించారు. ఆయన కథల్లో మధ్యతరగతి జీవితాన్ని, వారి కష్టనష్టాలను ప్రస్తావించారు.

ISSN No.2319-3905

కాగా, 1962 నుంచీ కథలు రాయడం మొదలు పెట్టిన కేతు విశ్వనాథరెడ్డి రాయలసీమను కొత్త కోణంలో చూపారు. ఆయన రాయల సీమ జీవిత చిత్రణకే పరిమితం కాకుండా సమస్య ఎందుకు ఏర్పడిందో కూడా వివరించే ప్రయత్నం చేశారు. ఆయన రాసిన 'నమ్ముకున్న నేల' అనే కథలో రైతుకీ భూమికీ మధ్య సంబంధం శిథిలమైన తీరును వివరించారు. ఈ కథలో ప్రధాన పాత్ర కథకుడు, పల్లెలోని రెండెకరాలు అమ్మేసి భూమితో బంధం తెంచుకోవాలనుకుంటాడు. రెండవ పాత్ర వీరన్న పొలాన్ని కొంటానని అడ్వాన్సు ఇచ్చి కొనలేకపోతాడు. అతనిది ఆర్థికంగానూ, నైతికంగానూ పతనమైన పాత్ర. మూడవ పాత్ర అంగడి సుబ్బరాయుడు. ఇతను వ్యాపారి. కరువు ఇతనికి వ్యాపారంగా వుంటుంది. రైతు అవసరాలతో ఆడుకునే వ్యాపారి. మునిరెడ్డి కథకుడి బంధువు. మోతుబరి రైతు. కథకుడికీ, మునిరెడ్డికీ మధ్య కరువు నేపథ్యంలో జరిగే నిశ్శబ్ద పోరాటం ఈ కథ.

నేలను నమ్ముకుంటే బతుకే లేదు. పారిశ్రామికీకరణ తప్పదు అనే సూచన ఒక పాత్ర చేస్తుంది. ఉత్తర భారత దేశం నుంచీ వచ్చి కొందరు పరిశ్రమలు పెట్టడంతో ఈ ప్రాంత జీవితం మారిపోయింది. అంగళ్లలో బీడీల బదులు సిగరెట్లు, ఎద్దుల బళ్లు తిరిగే బాటల్లో జీపులు తిరుగుతున్నాయి. ఇంతకీ ఇది అభివృద్ధేనా? అని ప్రశ్న మనకు ఎదురవుతుంది. ఇలా ముగుస్తుంది ఈ కథ.

అలాగే 'కూలిన బురుజు' కథ రాయలసీమ కక్షల నేపథ్యంలో వుంటుంది. ఈ కథలో కథకుడు హింసను నేరుగా చూపించడు. హింస భయాన్ని చూపుతాడు.

కేతు విశ్వనాథరెడ్డి రాసిన 'గడ్డి' కరువుకు సంబంధించిన కథ. కరువుతో తిండి సమస్య వచ్చి పడింది. పశువులకూ మేత సమస్య. గడ్డిని ప్రభుత్వం తెప్పించి పంపేది. అయితే దానిని పంచకుండా మునసబు దాచుకున్నాడు. అతనిపై ప్రజలు తిరుగుబాటు చేస్తారు. ఈ కథలో సమస్యకు పరిష్కారం కూడా ఆయన చూపారు.

1988లో ఆయన రాసిన 'కూలిన బురుజు'లో పట్టణం నుంచీ కడప పల్లెలోకి అడుగుపెట్టిన కిష్టుడు కక్షల వాతావరణాన్ని వివరిస్తాడు. పుట్ట చెండాట మాదిరిగా నాటు బాంబులతో ఆడుకున్న గ్రామ పార్టీల ప్రపంచంలోకి అడుగుపెడుతున్నాను అంటాడు. లక్ష్మక్క కిష్టుడితో మీ బావని చంపినోడు కుక్కచావు చచ్చేదాకా ఈ గాజులు పగలగొట్టుకోను, ఈ బొట్టు చెరుపుకోను అని ప్రతినబూనుతుంది. కేతు విశ్వనాథరెడ్డి రాయలసీమ జీవితాన్ని తన కథల్లో ప్రతిబింబించారు. మాండలికాన్ని మాత్రం పరిమితంగా వాడారు.

కాగా, పి. రామకృష్ణారెడ్డి తన 'పెన్నేటి కథలు'లో పెన్నాతీరంలోని ప్రజా జీవనాన్ని చిత్రించాడు. వాటిలో 'కుర్రోడు చచ్చిపోయినాడు' ఫ్యూడలిజం క్రౌర్యం వెనుక దాగివుండే పిరికితనం గుట్టును విప్పే కథ ఇది.

'పూజ' అనే కథలో ఆయన ఒక పెద్ద ప్రశ్న వేశారు. కరువు– మేత లేదు– తన దగ్గర వున్న ఆవునేం చెయ్యాలి? కరువు కాలంలో తిండి లేక మలమలా మాడుతున్న మాదిగ మారెప్పకు కోతకివ్వాలా? లేదా అందరి ఆస్తులనూ వడ్డీ పేరుతో స్వాధీనం చేసుకుంటున్న వడ్డీ వ్యాపారి నర్సప్పకు పూజకు ఇవ్వాలా? అనే ప్రశ్నను ఆయన వేస్తారు.

2003లో రాసిన 'కరువు పీల్చిన మనుషులు' కరువు కథ కాగా, 'ఎలిగే పెద్దోళ్లు నలిగే చిన్నోళ్లు' ఫ్యాక్షన్ కథ. ఈ కథలో వర్గాలను నడిపేది రెడ్లు, భూస్వాములు. బలయ్యేది పేదలు. బోయలు, మాదిగలు, మాలలు అన్న విషయాన్ని ఆయన తెలుపుతారు. ఈ విషయాన్నే కింది వర్గాల వాళ్లు గనక ప్రశ్నిస్తే ఫ్యాక్షన్ ముఠాలు నడిపే పెద్దలంతా ఒక్కటైపోతారు. అలాంటి పెద్దవాళ్ల కోసం కిందవాళ్లు కత్తితో నరుక్కుని చస్తారు. ఇది ఫ్యాక్షన్ లోగుట్టు పట్టుకున్న కథ.

మరో సీమ కథకులు వైసీవీ రెడ్డి 1980–82 మధ్య కాలంలో రాసిన కథలను 'గట్టిగింజలు' పేరుతో కథా సంపుటిగా తీసుకొచ్చారు. 'గట్టిగింజలు' ఫ్యాక్షన్, కరువు కలబోసిన కథ ఇది. కాగా, కథా నిర్మాణం సంపూర్ణంగా లేని స్కెచ్‌లలా ఈ కథలు వున్నాయిని మరో ప్రముఖ రచయిత వల్లంపాటి ఈ సంపుటిపై వ్యాఖ్యానించారు.

కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి 1982లో 'కుట్ర' అనే సంపుటని వెలువరించారు. కుప్పిరెడ్డి తన కథల్లో వ్యవస్థ మీద వ్యంగ్యధోరణిలో వ్యాఖ్యానించారు. అయితే ఆయన కరువు, ఫ్యాక్షన్, భూస్వాములపై రచనలు చేయలేదు.

ఇదిలా వుండగా మరో సీమ కథకులు, విమర్శకులు, అనువాదకులు ఎం.వీ రమణారెడ్డి 1988–93 మధ్యకాలంలో రాసిన తొమ్మిది కథలతో 'పరిష్కారం' అనే సంపుటిని వెలువరించారు. ఈ కథలన్నీ రాయలసీమ పెత్తందారీతనంపై చమత్కారాలను రువ్వాయి.

ఇదిలా వుండగా 2013లో చిట్వేలి జడ్పీ హైస్కూల్‌లో 7వతరగతి చదువుతున్న టి. నాగమణి 'బహుమతి' అనే కథలో తండ్రి కువైట్‌లో వుంటే వారి పిల్లలు తండ్రికోసం, తండ్రి మాటకోసం, తండ్రి ఓదార్పు కోసం, తండ్రి అభినందన కోసం ఎంత తహతహలాడతారో కంటికి కట్టినట్లు చెప్పడం అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. కువైట్‌లో ఎడారిలో పడే కష్టాన్ని ఇతరుల ద్వారా విన్న కుమార్తె తండ్రి ఎన్ని కష్టాలు పడుతున్నాడో అని కన్నీరు పెడుతుంది. తండ్రితో ఫోనులో మాట్లాడుతూ 'నిన్ను తల్చుకుంటేనే భయం వేస్తాంది. తొందరగా ఇంటికి రా నాయనా నాకు ఏడుపొస్తాంది' అంటూ అందరి కంటా నీరు పెట్టించింది.

కడపజిల్లాలో 1955–60 దాకా కథా సాహిత్యం అంత విస్తృతంగా రాలేదనే చెప్పవచ్చు. అయితే ఇదే సమయంలో సమయంలో కడపజిల్లాకు చెందినవారే అద్భుతమైన సినిమాలు తీశారు. కడపజిల్లాకు చెందిన బిఎన్ రెడ్డి 1939లో 'వందేమాతరం', 1940లో 'సుమంగళి', 1941లో 'దేవత', 1945లో 'స్వర్గసీమ', 1947లో 'యోగి వేమన', 1951లో 'మల్లీశ్వరి' వంటి సినిమాలు తీశారు.

అదేవిధంగా 1954లో ఇదే ప్రాంతానికి చెందిన కెవి రెడ్డి 'పెద్దమనుషులు' అనే చిత్రాన్ని తీశారు. అయితే ఈ సినిమాలు వేటిట్లో కూడా కడప స్థానికత ఎక్కడా కనిపించదు. ఈ సినిమాలు కథా సంబంధమైనవి అయినప్పటికీ కడప కథను ఇవి ప్రభావితం చెయ్యలేదు.

కర్నూలు జిల్లా కథలు:

కర్నూలు జిల్లా కథా రచనలో కొంత వెనుకబడిందనే చెప్పవచ్చు. 1990 దాకా కర్నూలు జిల్లాలో కథలేవీ రాలేదు. అనంతర కాలంలో సామాజిక వైరుధ్యాలు వేగవంతం కావడం చేత ఇక్కడ మంచి కథ పుట్టింది. 1996లో 'పల్లె మంగలి కథలు', 1998లో 'ఫ్యాక్షన్ కథలు', 2001లో 'కథా సమయం', 2013లో 'హంద్రీ కథలు' ఇక్కడి నుంచి పుట్టాయి.

ఇది ఇలా వుంటే 1921 ప్రాంతంలో చింతా దీక్షితులు 'సుగాలీ కుటుంబము' గురించి కథ రాశారు. కర్నూలు జిల్లాలోని శ్రీశైలానికి వెళ్లిన ఆయన అక్కడి అడవుల్లో నివశించే చెంచుల జీవితాలను ఈ కథలో చిత్రించారు. దీక్షితులు సీమ జీవితాన్ని చిత్రించారు కానీ ఆయన సీమ కథకులు కాదు. దీనిని తెలుగులో వచ్చిన మొట్టమొదటి తెలుగు కథగా చెబుతారు. ఆయన రాసిన ఈ కథలో రూపక్ నాయక్, అతని భార్య చంద్రి కూలీలు. కరువు కారణంగా కూలిపనులు లేకపోవడంతో అడవికి వెళ్లి ఈతగింజలు ఏరుకుని వచ్చి వాటి పొట్టుతో గంజి తాగేవారు. అవికూడా దొరక్కపోవడంతో చింతగింజలు ఏరుకుని వచ్చి పిండిచేసి రొట్టెలు చేసుకుని తినేవారు. తర్వాత అవి కూడా దొరక్క చింత చిగురు, బూడిద ఉడికించుకుని తినేవారు. అవికూడా కరువవడంతో అడవికి దేవదారు ఆకులకోసం వెళ్ళిన రూపక్‌నాయక్‌పై కొమ్మలు నరికేశాడని ఫారెస్టు వాళ్లు కేసు పెట్టి జైలుకు పంపారు. దీంతో అతని కుటుంబం విచ్ఛిన్నం అవుతుంది. ఇది కరువు చేసిన గాయం. కాగా ఆయన 'దాసరి పాట', 'పెద్ద వేట', 'చెంచురాణి' అనే కథలను కూడా ఈ నేపథ్యంలోనే రాశారు.

కాగా, జిల్లాకు చెందిన జి. వెంకటకృష్ణ రాసిన 'గరుడ స్తంభం', 'పడగనీడ', శ్రీనివాసమూర్తి రాసిన 'దేవుని మాన్యం', 'మెడమీద వేలాడే కత్తి', తుమ్మల రామకృష్ణ రాసిన 'మట్టిపొయ్యి', 'ఊరు మద్దిస్తం' ఎం. హరికిషన్ రాసిన 'నయా ఫత్వా', ఇనయతుల్లా 'వలస', 'నిచ్చెన', నాగప్పగారి సుందరరాజు 'మాదిగోడు', పాణి 'ప్యాపిలి వచ్చింది' సంపుటాలు 1990 తర్వాతే ఇక్కడి నుంచీ వెలువడ్డాయి. ఇవన్నీ కూడా సీమ జీవిత ప్రతిబింబాలుగా వుండడంతో పాటు సమస్యలను ప్రస్తావించడం, సమస్యలకు కారణాలపై గొంతెత్తి ప్రశ్నించడం చేశాయి.

2016లో వెంకటకృష్ణ రాసిన 'వర్తమానం'లో ప్రత్యేక రాయలసీమను కోరుకుంటున్న సమయంలోనే సీమలోని శ్రామికులకు జరుగుతున్న దోపిడీని చూపుతుంది. పీఎంఆర్ సార్ ఇంట్లో జరుగుతున్న సమావేశం సీమకు జరిగిన ద్రోహాన్ని, సీమ నాయకులు కీలుబొమ్మలైన వైనాన్ని, సీమ భాష, ఆహారాలకు జరుగుతున్న అవమానాన్ని ప్రస్తావిస్తుంది. మరో వైపు ఇదే

సమయంలో దుబ్బన్న ఇంటికి నీరు మోసే బక్క నల్లన్న సమస్యను రచయిత ప్రస్తావిస్తాడు. తనకు నీరు మోసినందుకు జీతం ఇవ్వాలని నల్లన్న దుబ్బన్నను అడుగుతాడు. ఈ మధ్యస్తానికి ఇద్దరూ పీఎంఆర్ సార్ ఇంటికి చేరతారు. అక్కడా సీమ నీటిపై చర్చ జరుగుతూ వుంటుంది. తనను అన్నదమ్ముడిగా చూసినట్లయితే ఆస్తిలో వాటా ఇవ్వవా అని, జీతగాడిగా చూస్తే జీతం ఇవ్వవా అని నల్లన్న ప్రశ్నిస్తాడు. ఇది సీమ ప్రశ్న అని కథకుడు అంటాడు.

రాయలసీమ కథా రచయితలు ప్రస్తుతం రచనకే పరిమితం కాలేదు. సీమ కన్నీటి పరిస్థితులకు కారణాలు గ్రహించి ఆగ్రహంతో కథతో ప్రశ్నిస్తున్నారు, నిలదీస్తున్నారు. అంతటితో ఆగక కార్యకర్తలుగానూ మారుతున్నారు. ఉద్యమాల్లో భాగం అవుతున్నారు. అనంతపురంలో బండి నారాయణ స్వామి బీసీ ఉద్యమ కార్యకర్తగా వున్నారు. శాంతి నారాయణ బీసీ సామాజిక ఉద్యమాల్లో పనిచేస్తున్నారు. శశికళ మహిళా ఉద్యమాల్లో క్రియాశీలంగా వున్నారు. కర్నూలుజిల్లాలో పాణి విరసం నాయకుడుగా వుంటే, వెంకటకృష్ణ, సుభాషిణి విరసంలో క్రియాశీలంగా వుంటూ అస్తిత్వ ఉద్యమాల్లో పాల్గొంటున్నారు. చిత్తూరు జిల్లాలో యండవల్లి భారతి సామాజిక సమస్యల మీద ప్రశ్నించే కార్యకర్తగా వున్నారు.

కాగా తరాలు మారే కొద్దీ సీమ కథకుల ఇతివృత్తాలు కూడా మారాయి. 1941–70ల మధ్యకాలంలో రాసిన తొలితరం కథకులు మధ్యతరగతి జీవితాన్ని, వారి సమస్యలను, కుటుంబ కల్లోలాలను ఇతివృత్తంగా తీసుకున్నారు. వీరిలో గుత్తి రామకృష్ణ, కె. సభా, మధురాంతకం రాజారాం, కలువకొలను సదానంద, పులికంటి కృష్ణారెడ్డి, ఆర్ఎస్ సుదర్శనం, రాచమల్లు రామచంద్రారెడ్డి, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, ముంగర శంకర్రాజు, సొదుం జయరాం, వైసీవీ రెడ్డి వున్నారు.

1970–95 కాలానికి చెందిన రెండవ తరం కథకులైన కేశవరెడ్డి, చక్రవేణు, నామిని, నరేంద్ర, మహేంద్ర, పి. రామకృష్ణ, సింగమనేని నారాయణ, బండి నారాయణస్వామి, శాంతి నారాయణ, చిలుకూరి దేవపుత్ర, కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి, దాదాహయత్, ఎంవి రమణారెడ్డి కరువు, ఫ్యాక్షనిజంలను తమ ఇతివృత్తాలుగా తీసుకున్నారు.

1995 నుంచీ ప్రారంభమైన మూడవతరం కథకులు మాత్రం తమ ప్రపంచాన్ని విస్తృత పరచుకున్నారు. వారు కరువు, ఫ్యాక్షన్, నీటి సమస్య, సీమకు జరుగుతున్న ద్రోహం, దళితవాదం, స్త్రీవాదం, ముస్లింవాదం, ప్రపంచీకరణ ప్రభావాలను తమ ఇతివృత్తాలుగా చేసుకున్నారు.

వారిలో పాలగిరి విశ్వప్రసాద్, సన్నపురెడ్డి వెంకటరామారెడ్డి, ఇబ్రహీం, ఇనయతుల్లా, గోపిని కరుణాకర్, తవ్వా ఓబుల్ రెడ్డి, వేంపల్లి గంగాధర్, జి. వెంకటకృష్ణ, సుభాషిణి, తుమ్మల రామకృష్ణ, పాణి, హరికిషన్, జి. ఉమా మహేశ్వర్, నిర్మలా రాణి, శశికళ, నాయకి, సుంకోజి దేవేంద్రాచారి, యండవల్లి భారతి వున్నారు.

ఇలా సీమ కథ రూపు మార్చుకుంటోంది. అయితే సీమ అస్తిత్వ వాదాన్ని నేటితరం రచయితలు మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం చాలా వుంది. సీమ మాండలికాలను, జీవన వైరుధ్యాలను, ఆహార, ఆచార వ్యవహారాలను మరింతగా ప్రస్తావించాల్సి వుంది. దీనితో పాటు సీమ కరువుకు, సమస్యలకు కారణాలను అన్వేషించడంతో పాటు వాటి పరిష్కారానికి సూచనలను ఇస్తూ, సీమ ప్రజలను మోసం చేస్తున్న, తప్పుదారి పట్టిస్తున్న వ్యవస్థను, నేతలను తమ కథల ద్వారా నిలదీయాల్సిన అవసరం వుంది.

ఆధార గ్రంథాలు

1. రాయలసీమలో ఆధునిక సాహిత్యం, సామాజిక సాంస్కృతిక విశ్లేషణ, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, మార్చి, 2006
2. ఫిక్షన్ అండ్ ది రీడింగ్ పబ్లిక్, క్యు.డి. లెవీస్, 1932
3. వివిన మూర్తి, దిద్దుబాటలు, తానా ప్రచురణలు, అమెరికా, 2015

రచయితల చిరునామాలు

1. **ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు,** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ, హైదరాబాద్, తెలంగాణ
2. **డా. ఎన్. ఈశ్వర రెడ్డి,** అధ్యక్షులు, పాఠ్య ప్రణాళికా సంఘం, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం
3. **ఆచార్య డి.వి.శ్రవణ్‌కుమార్,** సంచాలకులు, ప్రచురణల విభాగం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం
4. **ఆచార్య పి.సి.వెంకటేశ్వర్లు,** సంచాలకులు, ప్రాచ్యపరిశోధనసంస్థ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి
5. **డా. శ్రీమతి రాజ్వంతి దాలయ్య,** తెలుగు విభాగం, మహాత్మాగాంధీ సంస్థ, మారిషస్
6. **ఆచార్య త్రివేణి వంగరి,** తెలుగు శాఖ, హైదరాబాద్ యూనివర్శిటీ, గచ్చిబౌలి
7. **డా.పి.విజయ్ కుమార్,** అసోసియేట్ ప్రొఫెసర్– తెలుగుశాఖ – యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్.
8. **డా.వి.గోపాల్,** అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రచురణల విభాగం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం
9. **డా.యమ్.ఆదిశేషయ్య,** అతిథి అధ్యాపకులు, తెలుగు అధ్యయన శాఖ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం
10. **డా॥ తోట వెంకటస్వామి**, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రచురణల విభాగం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం
11. **మరపట్ల రాజు,** పరిశోధక విద్యార్థి, మద్రాసు క్రైస్తవ కళాశాల, తాంబరం, చెన్నై
12. **పి. శివశంకర్,** పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం & ఆచార్య **కె.శ్రీదేవి,** తెలుగు శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం
13. **డా.ఎం.మంజుశ్రీ,** అసిస్టెంటు ప్రొఫెసర్, తెలుగుశాఖ, డా.ఏపిజె అబ్దుల్ కలామ్ ప్రభుత్వ డిగ్రీకళాశాల, పటాన్ చెరువు, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ.
14. **డా.ఎల్.కస్తూరి,** తెలుగు అధ్యాపకురాలు, శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల, తిరుపతి
15. **డా.ఎం.హరికృష్ణ,** అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రచురణల విభాగం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం

ద్రావిడి

(అర్ధ వార్షిక తెలుగు పరిశోధన పత్రిక)

శైలీ పత్రం

- వ్యాసాలు ద్రావిడ భాషాసాహిత్యాలు, చరిత్ర, సంస్కృతి, జానపదవిజ్ఞానం, తత్త్వశాస్త్రం, మానవశాస్త్రం, ఇతర ఏ మానవీయ శాస్త్రాలకు చెందినదైనా ద్రావిడ సంబంధమైన పరిశోధన వ్యాసాలు రాయవచ్చు. కాని విషయం ఏ శాఖకు చెందినదైనా వ్యాసం తెలుగులోనే ఉండాలి.
- ఇతర ద్రావిడ భాషల పరిశోధన పత్రికలలోని ఉత్తమ వ్యాసాలను మూల రచయితల, ఆ పత్రికల యాజమాన్యాల అనుమతితో తెలుగులోకి అనువదించి పంపవచ్చు. కాని మూలభాషలోని మూల ప్రతిని కూడా పంపాలి.
- వ్యాసాలు తప్పనిసరిగా సరికొత్త పరిశోధనాంశాలతో ఆ శాఖాంశాలపై సరికొత్త ప్రతిపాదనలు కాని సరికొత్త విజ్ఞానదృష్టిని కాని అందించేవై ఉండాలి. ఏ ప్రాచీన సాహిత్యం సరికొత్త సాహిత్య ధోరణుల గురించి రాసినా పరిశోధనలో కొత్తదనం తప్పనిసరి. గతానుగతికమైన వాదనలను ఇప్పటికే చాలా మంది చెప్పిన విషయాలపైన తిరిగి రాసే వ్యాసాలను పత్రిక అనుమతించకపోవచ్చు.
- వ్యాసాల పరిమాణం మరీ చిన్నదిగా ఉండకూడదు. అచ్చులో కనీసం ఐదు పుటల వ్యాసాలు చిన్నవిగా ఉండవచ్చు. మరీ ఎక్కువ పుటలలో ఉంటే పరిశోధన గురుత్వాన్ని బట్టి అంగీకరించవచ్చు.
- వ్యాసాలు ఆధునిక ప్రామాణిక భాషలో ఉండాలి. మాండలిక కథలపైన, ఇతర మాండలిక భాషాధారిత ప్రక్రియలపైన వ్యాసాలు రాసినా వ్యాసం ఆధునిక ప్రామాణిక భాషలోనే ఉండాలి.
- పులుముడు వాక్యాల శైలి దూరాన్వయం దురన్వయం ఉన్న వాక్యాల శైలి కాక సూటిగా క్లుప్తంగా ఉండే వాక్యాలతో విషయాన్ని సూటిగా చెప్పే శైలిని పాటించాలి.
- ఇప్పటికే విస్తృతంగా జరిగిన పరిశోధనాంశాలపైన కొత్త ప్రతిపాదనలు చేసే వ్యాసాలలో తిరిగి ఉపోద్ఘాతాలు చేయకుండా తిన్నగా విషయాంశానికి వెళ్ళి చర్చించవచ్చు. ఉదాహరణకు జానపద గేయాలపై కొత్త వ్యాసం రాయదలచుకున్నప్పుడు. తిరిగి నిర్వచనాలను గురించి చెప్పడం గేయలక్షణాలు వగైరా రాయనవసరం లేదు. భావకవిత్వంపైన సరికొత్త ప్రతిపాదనలు వివాదాలు రాయదలచుకున్న వారు తిన్నగా విషయంలోనికి వెళ్ళవచ్చు. కాని తిరిగి భావకవిత్వ నిర్వచనాలను గురించి ఉపోద్ఘాతాలు అవసరంలేదు.
- విసంధులు పాటించవచ్చు. అందంగా ఉన్నంత వరకూ వైరి సమాసాలను పాటించవచ్చు. పాలాభిషేకం, మెట్లోత్సవం, ఫిల్మోత్సవ్ వంటి మామూలు పాపులర్ భాషలోని దుష్టసంధులు వర్జించాలి. వ్యావహారికమైన పాపులర్ పత్రిక భాషను వాడకూడదు.

- థ-ధ, శ-ష-స భేదాన్ని తప్పక పాటించవలసి ఉంది. శకట రేఫ అవసరమైన చోట అంటే భాషాశాస్త్ర సంబంధి వ్యాసాలలో ప్రాచీన సాహిత్య చర్చకు సంబంధించిన వ్యాసాల్లో వినియోగించవచ్చు.
- వ్యాసానికి పాదసూచికలు/అంత్యసూచికలు ఇవ్వండి. సూచికలో స్పష్టమైన అవసరమైన సమాచారం ఉంటేనే ఇవ్వండి. చర్చలో అధికంగా ఇవ్వవలసిన సమాచారం ఉన్నా ఇవ్వండి. అతి ముఖ్యమైన విషయమైతేనే వ్యాసంలో ఉండాలి.
- ఉపయుక్త గ్రంథాల పట్టీ ఇచ్చేటప్పుడు వ్యాసంలో చర్చలో వినియోగించిన గ్రంథాలను మాత్రమే ఇవ్వాలి. దీనికి సంబంధం ఉన్నా ఇతర పుస్తకాలు జాబితాలో చేరవలసిన పనిలేదు.
- ఉపయుక్త గ్రంథాల జాబితా ఆధునికంగా అంతర్జాతీయంగా ఉపయోగించే పద్ధతిలో ఉండాలి. కింద ఉదాహరణ చూడవచ్చు.

  కృష్ణకుమారి నాయని, 1979. **జానపద గేయగాథలు,** తెలుగు అకాడమీ, హైదరాబాదు.
- జాబితాలో రచయితల పేరు పక్కన వారి బిరుదులు, హోదాలు రాయనవసరం లేదు. వ్యాసాన్ని కోట్ చేసినప్పుడు వ్యాసం ఉన్న పుస్తకాన్ని పై విధంగా రాయాలి. గ్రంథాల జాబితా గ్రంథకర్తల పేర్లతో అకారాది క్రమంలో ఉండాలి. జాబితాకు వరుస సంఖ్య అవసరం లేదు.
- అముద్రిత గ్రంథాలను, అముద్రిత సిద్ధాంత గ్రంథాలను కూడా ఉపయుక్త గ్రంథాల జాబితాలో అకారాది క్రమంలోనే రాయాలి. కాని (అముద్రితం) అని కుండలీకరణంలో, చివరిలో చెప్పాలి.
- Ibid, et.al. Op. Cit, వంటి వాటిని యథాతథంగా వాడుకోవచ్చు.
- ఉపశీర్షికలు వ్యాసరచనలో మరింత స్పష్టతనిస్తాయి. కాబట్టి వాడుకోవచ్చు.
- ఉటంకించే పాఠ్యం చిన్నది అయితే కొటేషన్ మార్కులలో ఉంచండి. లేదా ఒక పేరా అంత పరిమాణం ఉంటే దాన్ని ప్రత్యేకంగా మార్జిన్ పెట్టి వేరే చిన్న ఫాంట్‌లో రాయాలి.
- వ్యాసకర్తలే డి.టి.పి చేయించి పంపే పక్షంలో అను (version-7) కు కన్వర్ట్ కాగలిగిన ఫాంట్‌లనే వాడాలి. ఏ సాఫ్ట్‌వేర్ వాడింది ఏ ఫాంట్ వాడింది స్పష్టంగా రాసి పంపాలి. సాఫ్ట్ కాపీ ఇ-మెయిల్‌లో పంపవచ్చు.

  E-mail - dravididu@gmail.com
- మూలరచయిత అనుమతి పత్రం అనువాదానికి తప్పక జతచేయాలి.

ఈ పత్రికను ప్రాంతీయ భాష అయిన తెలుగులో వెలువరిస్తున్నా అంతర్జాతీయంగా వెలువడుతున్న పరిశోధన పత్రికల స్థాయిలో ప్రచురించాలనే మా అభిలాషను అర్థం చేసుకుని పరిశోధకులు సహకరించవలసిందిగా మనవి. ఇందుకు మీరూ తగిన సూచనలు చేయవచ్చు. మరిన్ని వివరాలకు సంపాదక మండలిని సంప్రదించవచ్చు. మీ రచనలు అందించి పత్రికను ఉత్తమ ప్రామాణిక పత్రికగా దిద్దితీర్చడంలో సహకారం అందించాలని మనవి.

సంపాదకమండలి